# సరదా సిన్మాయణం

సినిమా కబుర్లు

- లలితా టి.ఎస్






శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౧౨౨



కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి డిసెంబర్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా సరదా కబుర్లు

*చిన్నప్పుడు చూసిన సినిమా అల్లా కథలుకథలుగా చెప్పుకోవడం అలవాటు - చెల్లెళ్ళతో, నెచ్చెళ్ళతో. మళ్ళీ ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి ఆ సరదా పుట్టింది. ఇదో రకంగా ఎప్పుడో వచ్చిన సినిమాల్ని ఇప్పుడు చూస్తూ రాస్తున్న ఇంకోసా-రివ్యూ ఈ సరదా సిన్మాయణం. అన్నట్టు ఓ విషయం చెప్పాలి నేను... పాలు, ఆవాలు ఎలా నిత్యబహువచనాలో, సినిమాలో కనిపించి అలరించే ఎన్టీరామారావు, నాగేశ్వర్రావ్, కృష్ణ, శోభన్‌బాబు, వాణిశ్రీ, జయప్రద, ఎస్వీరంగారావు, సూరేకాంతం, రేలంగి, రాజబాబు - ఎవ్వరైనా సరే, మన సినీ-మా-చుట్టాలే, నిత్యప్రియవచనాలే! అందుకని వాళ్ళ పేర్ల చివర గార్లు, బూర్లు అతికించలేదని నన్ను చీవాట్లెట్టకండేం!*

*ముందుగా ఈ సరదా సిన్మాయణం గురించి ఓ చిన్న మాట.*

*చిన్నప్పట్నుంచీ ఎన్నో సినిమాలు చూశాను. కొన్ని సినిమాలు హిట్లూ, సూపర్ హిట్లూ అంటూ పేర్లు వినడమే కానీ వాటిని ఎప్పుడూ చూడలేదు. ఆ సినిమాల పేర్లు వెతుకుతూ వుంటే కనిపించిన వాటన్నిటికీ ఒక కామన్ కారక్టరిస్టిక్ ఏంటంటే అవన్నీ దర్శకరత్న దాసరి నారాయణరావు సినిమాలు. "హన్నా! పండగొచ్చినా, ఫ్రెండు వచ్చినా, పరీక్షల ముందు ఆందోళన తగ్గడానికి, పరీక్షలయ్యాక అలసట తగ్గడానికి, ఇలా రకరకాల కారణాలతో నన్ను బోల్డన్ని సినిమాలకి తీసుకెళ్ళిన మా అమ్మ చాలా జాగ్రత్తగా నాకు దాసరి సినిమాలు చూపించకుండా తప్పించేసింది" అనేసుకుని ఇప్పుడు దొరికిందే ఛాన్సు అనుకుని వరస పెట్టి దాసరి సినిమాలు చూడడం మొదలు పెట్టాను. ఒకటో రెండో చూసిన తర్వాత లాజిక్కులందు దాసరి లాజిక్కు వేరయా అనిపించసాగింది.*

*అలా చూసీ చూడగానే నాకు కాల్చేసినవాలికీ, నేను కాల్చేసినవాలికీ ఆ కథలు పంచసాగాను. నే చెప్పిన కథలన్నీ విన్నవాలి నుంచి ఏకగ్రీవంగా ఒకటే మాట..."నువ్విలా వీటిని మాకు మాత్రమే పంచుటతో ఆగిపోకూడదు. నీలా చిన్నప్పుడు అమ్మ చూపించలేదని, నాన్న తీసుకెళ్ళలేదని ఈ సరి లేని సరదా(సరి) సినిమాలు చూడక ఎంతో వినోదాన్ని, సినీవిజ్ఞానాన్ని కోల్పోయిన వాళ్ళకి ఆరారా అందించడానికి ఈ సినిమాల గురించి రాయాల్సిందే!" అని పట్టుబట్టడంతో ఆ శ్రోతల ప్రోత్సాహంతో నా సినీ-గాథా-అల్లరి మొదలెట్టాను.*

**దాదాపు** అన్నిటిల్లోనూ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం, ఒకటో రెండో పాటలు, మిగిలిన పాటల్లో కొన్ని మాటలు + భావాలు, పైగా నటన ...వెరసి వెర్సటైల్ దాసరి.

**శ్రీ దాసరి తీయుటచేతను**
**నారూఢిగ సకల జనుల టైంపాసవ్వగ**
**ధారాళమై సినీతులు**
**ఆరారగ హడలుబుట్ట నుడివెద సిన్మతీ...!**

ఆ ప్రకారంగా నాదైన ఓ సిన్మతీ–గిద్యాన్ని దర్శకరత్నకి అంకితమిస్తూ నా మొదటి సరదాసిన్మాయణం ఆయన దర్శకత్వం వహించిన సినిమాతో మొదలుపెడ్తున్నాను.

ఇంకా ఎన్నో దాసరి సినిమాలుండగా అసలింతకీ ఈ స్వయంవరం సినిమానే ఎందుకు ఎంచుకున్నానంటే ...సీన్ సీన్ పర్ లిఖా హై దేఖ్‌నేవాలే కా నామ్... అన్నట్లు ఈసారికి ఇది సరి అనిపించింది ఈ దాసరి వారి దర్శకత్వవరం, స్వయంవరం.

మొదలెట్టేస్తున్నా మరి... లాభం, రెండూ, మూడూ...రెడీ!

రాజశేఖర వరం — చంద్రశేఖర ప్రియ స్వయంవరం

అసలీ సినిమాలో ఏమేం వున్నాయి? ఎంతెంత వున్నాయి? అంటూ లెక్కెట్టటం అంటూ మొదలెడితే ...

జయప్రద అందం 20% – మొదటి సగంలో అక్కడక్కడా చిలకరించిన మొలకనవ్వులు, కలికి సిగ్గులకూ మాత్రమే ఈ మార్కులు. రెండో సగం అంతా దాసరి గూటి చిలకే – ఓ పుంజీడు పేజీల డైలాగులు, ఓ చెంబీడు – లోటాల కన్నీళ్ళు!

రమాప్రభ అయోమయం 5% – అంత ప్రేమించుకున్న జయప్రద, శోభన్‌బాబు అసలు ముందే ఎందుకు పెళ్ళి చేసుకోలేదూ అన్న సంగతి ఈవిడకో పట్టాన అర్థం కాదే!

అంజలీదేవి అభావం 5% – కోడలిని చూసి ఏడవడం తప్ప ఈవిడ ప్రభావమేమీ లేదు.

శోభన్‌బాబు ఆక్రోశం 20% – చనిపోయిన నాన్నని మర్చిపోయి, ఎక్కడో వుండిపోయిన అమ్మని వదిలేసి గాలివానలో కాయితం పడవల ప్రయణం గురించి ఏడవడంలోనే తీరం దాటిపోయింది ఈ హీరో గారి శోకం.

దాసరి నారాయణబాబు ఆల్‌రౌండరిత్వం 50% – ఈ సినిమాలో ఈయన కూడా ఒక బాబే మరి! అప్పటిదాకా మిలమిల్లాడిన శోభన్‌బాబు కూడా జమిందారు రాజశేఖరంగా ఈయన పాత్ర ప్రవేశంతో విమ్మూతో తోమని పాత్రలా వెలవెల్లాడిపోతాడు. అందుకే ఈయన ఈ సినిమా వరకూ దాసరి నారాయణబాబు. సినిమా అంతటా, సెకండాఫ్ అంతా – ఎందెందు కుదిరితే అందందే అందె వేసిన చెయ్యట! అందుకే ఈయన శాతం సైతం ఏభయ్యట!

సరే! ఏదెంత, ఎవరెంత, ఎవరికెంత అంటూ లెక్కలు చూడడం అయిపోయింది. ఇంక అసలీ సిన్మా కథేంటో చదివేలోగా ఇంకో మాట. సిన్మాలో నటించిన వాళ్ళందరికీ వాళ్ళ వాళ్ళ సిన్మాపేర్లు వుంటాయి కానీ సిన్మాకథ చెప్పేటప్పుడు మాత్రం నేనవేమీ పట్టించుకోను. వాళ్ళ అసలు పేర్లతోనే చెప్తాను. సరేనా మరి?!

పేర్లడిపోయి సినిమా మొదలయీ అవగానే...

ఇళ్ళు కాలిపోతూ ఉంటాయి. అరుపులు, కేకలు, ఉరుకులు, పరుగులు.

రావుగోపాలరావు భార్య అయిన ఒకానొక కనిపించనిలక్ష్మి, నిప్పంటుకున్న ఇళ్ళల్లో ఒకదాంట్లో చిక్కుకుపోయి కాలిపోతుంది. (ఈవిడ సినిమా పేరు లక్ష్మి, కానీ ఎక్కడా దండేసిన ఫోటోలో కూడా కనిపించదు – అందుమూలముగా కనిపించనిలక్ష్మి). అప్పుడేమో రావుగోపాలరావు "బావా! నా లక్ష్మి మంటల్లో ఉండిపోయింది బావా!నేనూ కాలిపోతాను" అని వెళ్ళబోతూ ఉంటే గుమ్మడి "బావా!" అని గట్టిగా అరిచి "నువ్వు పాప కోసమైనా బ్రతకాలి" అని ఇవతలికి తీసుకొస్తాడు. గుమ్మడి, రావుగోపాలరావు కలిసి వ్యాపారం చేసి పెద్ద ఫేక్టరీకి ఓనర్లవుతారు.

గుమ్మడి, పుష్పలతలకి ఓ కొడుకు. రావుగోపాలరావుకి ఓ కూతురు. ఆ కూతురు చిన్నప్పుడెవరంటే మీనా. ఎంత బొద్దుగా, బుజ్జిగా, ముద్దుగా ఉంటుందో మీనా ఈ సినిమాలో! ఆ ఇద్దరు పిల్లలూ పుష్పలత పెట్టే గోరుముద్దలు తింటూ, బడికి వెళ్ళి చదువుకుంటూ, బడి లేనప్పుడు ఆడుకుంటూ ఎప్పుడూ కలిసే ఉంటూ వుంటారు. అంతటితో ఆగకుండా ఎవరిదో పెళ్ళి చూసి వీళ్ళిద్దరూ కూడా మెళ్ళో దండలేసుకుని పెళ్ళి చేసేసుకుంటారు.

బొమ్మలపెళ్ళి చేసుకున్న పిల్లలిద్దరూ మెళ్ళో మల్లెపూల దండలతో పరిగెత్తుకుంటూ వెళ్ళి పార్కులో పాడుకోవడం మొదలు పెడతారు. అదేం పాటంటే...

**హరివిల్లూ... పొదరిల్లూ... చుక్కలు... ఆకాశం – అన్నీ అందరి కోసం**

**నువ్వున్నది నా కోసం – నేనున్నది నీకోసం**

అలా మొదలెట్టిన పాట దాదాపు ఓ పది-పదిహేనేళ్ళు పాడుకుంటూనే వుంటారేమో మరి! పైన చెప్పిన పల్లవి పాడుతూ పాడుతూ పసుపుపచ్చ రంగు గౌనేసుకున్న మీనా కాస్తా ఆకుపచ్చ రంగు చీర కట్టుకున్న జయప్రద అయిపోతుంది. మీనా పక్కన పిల్లాడేమో శోభన్‌బాబు అయిపోతాడు.

గుమ్మడి, రావుగోపాలరావు స్కూటర్ ఎక్కి హాయిగా షికార్లు చేస్తున్న జయప్రద-శోభన్‌బాబులని చూస్తూ "చూడు బావా!" అని ఒకరికొకరు చూపించుకుంటూ మురిసి పోతూ వుంటారు. వాళ్ళిద్దరికీ తొందరగా పెళ్ళి చేసెయ్యాలనుకుంటారు.

ఇక్కడ మనం గుర్తు చేసుకుని సినిమా కథ పూర్తయ్యే దాకా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే ప్రియ అనబడే జయప్రద రావుగోపాలరావు కూతురు, చంద్రశేఖర్ అనబడే శోభన్‌బాబు గుమ్మడి కొడుకు. జయప్రద శోభన్‌బాబుని "బావా!" అని పిలుస్తూ వుంటుంది. జయప్రదకి చిన్నప్పట్నుంచీ తెలిసిన ఒక టీచర్ వుంటుంది. ఆవిడ రమాప్రభ (సిన్మా పేరు రమాదేవి).

గుమ్మడి, రావుగోపాలరావుల దగ్గర ఓ మేనేజర్ పని చేస్తూ ఉంటాడు. ఆ మేనేజర్ ఒకరికిస్తానని ఒప్పుకున్న ఏజెన్సీని కాన్సెల్ చేసి పాతికవేల లంచం అడిగి వేరేవాళ్ళకి ఇస్తానని ఎక్స్‌టెన్షన్ ఫోన్లో చెప్తుంటే విన్న గుమ్మడికి కోపం వచ్చి మేనేజర్నిచెంప మీద కొట్టి పొమ్మంటాడు. మేనేజర్ గుమ్మడి కాళ్ళావేళ్ళా పడి ఈ ఒక్కసారికీ క్షమించి వదిలేయండి, ఎవరికీ చెప్పొద్దు అని బతిమాలుకుంటాడు. కానీ గుమ్మడి మీద కక్ష కడతాడు.

గుమ్మడి మీద కక్ష కట్టిన మేనేజర్ రావుగోపాలరావుని తన ఇంటికి తీసుకెళ్ళి పదేళ్ల క్రితం భార్య పోయిన రావుగోపాలరావుని, ఐదేళ్ల క్రితం భర్త పోయిన తన చెల్లెల్ని కలిపి "నన్ను మీ బావమరిది అనుకోండి" అంటూ వరసలు కలిపేస్తాడు. అలా కలిపిన సందర్భంలో బాక్‌గ్రౌండ్‌లో "నీకూ నీవారు లేరు, నాకూ నావారు లేరు" అన్న పాట మ్యూజిక్ రావడం వింటూ "ఆహా! ఏమి దాసరి వారి సందర్భశుద్ధి!" అనిపించి మురిశా!

దూరవిద్యలో చదివారో ఏమో గానీ శోభన్‌బాబు, జయప్రదలు ఎంకాం పాసవుతారు ఇందులో. గుమ్మడి పేపర్లో ఆ పరీక్షా ఫలితాలు చూపిస్తూ మెలికలు తిరుగుతున్న కొడుకుని చూసి మురుస్తాడు. ఆ పరీక్ష పాసైన ఆనందంలో మళ్ళీ ఓ పాట పాడుకుంటారు హీరో-హీరోయిన్లు.

"ఇక్కడ ఇక్కడ అంటూనే ఎక్కడికెళ్తున్నామో భయమేస్తున్నది" అని జయప్రద అంటే "భయం భయం అంటూనే ఇక్కడి దాకా వచ్చేశావ్ భయమేమున్నది?" అని శోభన్‌బాబు అడుగుతాడు. ఈ పాటలో ఒక చరణం నాకు అర్థమే కాలేదు. అదేంటంటే "మల్లెల వేళ కాకపోయినా... వెన్నెల రాత్రి రాకపోయినా ... చల్లని ప్రేమకు చెల్లెలు నేనని... ఎదురొస్తున్నది – అది ఎదురొస్తున్నది" అంటాడు శోభన్‌బాబు. ఆ ఎదురొచ్చేదేంటో నాకస్సలు అర్థం కానేలేదు. ఈ పాటకి డోలక్ సత్యంగారి సంగీతం మాత్రం అద్భుతం.

రావుగోపాలరావు అల్లుడు శోభన్‌బాబుని అమెరికా పంపిస్తానంటాడు. జయప్రద కూడా వెళ్తానంటుంది. మేనేజర్ అడ్డుపడి పెళ్లి కాని ఆడపిల్లని అలా పంపించకూడదని చెప్పి జయప్రదని పంపించకుండా ఆపేస్తాడు. అమెరికా వెళ్ళిన శోభన్‌బాబు "నేనిక్కడా... నువ్వక్కడా ... కనులిక్కడా...కలలక్కడా... మన ఇద్దరి కలలు తీరేదెపుడు? ఇంతే సంగతులూ ...చిత్తగించవలెను" అని జయప్రదతో కలలో పాడుకుంటూ ఆడుకుంటూ ఉత్తరాలు రాసుకుంటూ వుంటాడు.

మేనేజర్ దగ్గరుండి మరీ రావుగోపాలరావుని, తన చెల్లెల్నీ సింగపూర్ పంపిస్తాడు గుమ్మడికి కూడా చెప్పకుండా. రావుగోపాలరావు సింగపూర్ నుంచి తిరిగొచ్చే లోగా పుష్పలత ముచ్చట పడి అడిగిందని గుమ్మడి ఓ తోట కొనేస్తాడు. అది మేనేజర్ ద్వారా తెల్సి రావుగోపాలరావుకి కోపం వస్తుంది. పైగా మేనేజర్ గుమ్మడి చెప్పకుండా తోట కొన్నాడు కాబట్టి రావుగోపాలరావు తను వేరేగా ఏజెన్సీ

తీసుకోవడం తప్పులేదని ఒప్పించి జయప్రద పేరు మీద స్కూటర్ ఏజెన్సీ తీసుకునేలా చేస్తాడు. ఈ లోగా ఇంతకు ముందు తీసుకున్న ఏజెన్సీ ఏదో ఇబ్బందుల్లో పడిందీ, దానిమీద పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాదని తెల్సి దాన్ని రావుగోపాల్రావు మేనేజర్ సలహా మీద శోభన్‌బాబు పేరు మీద పెడతానంటాడు. అది విని అసలు విషయం తెలియని గుమ్మడి బోల్డు మురిసిపోతాడు.

కొన్ని రోజులయ్యాక రావుగోపాల్రావు వచ్చి గుమ్మడికి చాకోడ్రింక్స్ ఏజెన్సీ రద్దు అయిందని, అందులో పెట్టిన పదిహేనులక్షల పెట్టుబడి తిరిగిరాదని, ఆ ఏజెన్సీ శోభన్‌బాబు పేరు మీద వుంది కాబట్టి ఆ నష్టం గుమ్మడే భరించాలని చెప్తాడు. అక్కడితో గుమ్మడి, రావుగోపాల్రావుల వ్యాపారభాగస్వామ్యం లెక్క కూడిక నుంచి భాగహారం అవుతుంది.

అమెరికాలో వున్న శోభన్‌బాబుకి "మీరడిగిన డబ్బు మీకు పంపిచద్దని మీ అంకుల్ చెప్పారు" అంటూ ఎవరో ఫోన్ చేస్తారు. దాంతో శోభన్‌బాబు ఇండియాకి తిరిగి వచ్చేస్తాడు. వస్తూనే తమ ఇల్లు అమ్మేసి తోటలో వున్న చిన్న ఇంట్లోకి తన తలిదండ్రులు మారిపోయారని తెలిసి కోపంతో రావుగోపాల్రావు దగ్గరికి వెళ్లి "మా నాన్నని మోసం చేశావు. మాకు రావాల్సింది మర్యాదగా మాకివ్వు" అని గొడవ చేస్తాడు. ఈలోగా గుమ్మడి అక్కడికి వచ్చి శోభన్‌బాబుని ఇంటికి తీసుకెళ్లి చీవాట్లు వేస్తాడు. "రావుగోపాల్రావు మోసం చేస్తే చేశాడు, వాళ్ళ అమ్మాయి జయప్రదని చేసుకుంటే మళ్ళీ ఆ డబ్బు నీకే వస్తుంది కదా*!*" అని నచ్చచెప్పబోతే శోభన్‌బాబు నాకా పెళ్లే వద్దంటాడు. ఇది ***విని*** వాళ్ళ వెనకాలే వచ్చి, ఇంటి బయటనించుని వాళ్ళ వాదనలు వింటున్న జయప్రద కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతూ ఉంటే పుష్పలత చూసి గబగబా జయప్రద వెనకాలే వెళ్లి ఆపుతుంది. అప్పుడు జయప్రద "మా నాన్న నాకు వేరే సంబంధాలు చూస్తున్నాడు" అనేడిస్తే పుష్పలత శోభన్‌బాబుతో మాట్లాడి అలా జరగకుండా చూస్తామని చెప్పి జయప్రదని పంపిస్తుంది.

ఇంతలో రావుగోపాల్రావుని మేనేజర్ గొప్ప జమీందారు సంబంధమని చెప్పి అంజలీదేవి ప్యాలెస్‌కి తీసుకెళ్తాడు. ఆ ఇల్లు, ఐశ్వర్యం చూసి ఉబ్బితబ్బైపోయిన రావుగోపాల్రావు అంజలీదేవి పెద్దకొడుకుతో సంబంధం ఖాయం చేసుకుని ఇంటికి వస్తాడు.

రావుగోపాల్రావు జయప్రదకి వేరే సంబంధాలు చూస్తున్నాడని పుష్పలత చెప్పగానే గుమ్మడి రావుగోపాల్రావు దగ్గరికి వచ్చి చిన్నప్పట్నుంచి ప్రేమించుకుంటున్న జయప్రద, శోభన్‌బాబులని విడదీయొద్దు అని బ్రతిమాలినా రావుగోపాల్రావు వినిపించుకోక అంజలీదేవి దగ్గరికెళ్లి నిశ్చితార్థం చేసుకొచ్చేస్తాడు. ఈలోగా జయప్రద వాళ్ళింట్లో పనిచేసే అబ్బాయి చేత ఒక ఉత్తరం పంపిస్తుంది శోభన్‌బాబుకి – తనని ఇష్టం లేని పెళ్లి నుంచి తప్పించమని, లేకపోతే చచ్చిపోతానని. అది చదివి నడుచుకుంటూ బయల్దేరుతాడు హీరోగారు హీరోయిన్ దగ్గరికి. దార్లో ఉండగానే ఎవరో పరిగెత్తుకుంటూ వచ్చి వాళ్ళ నాన్న గుమ్మడికి గుండెపోటొచ్చి హాస్పిటల్లో వున్నాడని చెప్తాడు. అసలిప్పటిదాకా గుమ్మడికి గుండెపోటు రాకపోవడమే నాకు ఆశ్చర్యం. సరే! అక్కణ్ణుంచి పరిగెత్తుకుంటూ శోభన్‌బాబు, ఇంటి నుంచి పుష్పలత హాస్పిటల్‌కి వచ్చేటప్పటికి గుమ్మడి చనిపోయివుంటాడు.

ఇక్కడ జయప్రద ఇంటి దగ్గరేమో ఉత్తరం శోభన్‌బాబుకి ఇచ్చి ఇంటికి వచ్చిన అబ్బాయిని రావుగోపాల్రావు ఇంటి బయటే పట్టుకుని అతన్ని బెదిరించి శోభన్‌బాబు ఉత్తరం చింపేశాడని చెప్పమని చెప్పి జయప్రదకి అబద్ధం చెప్పిస్తాడు. అది విని కోపం తెచ్చుకున్న జయప్రద పెళ్ళైపోతుంది అంజలీదేవికి కోడలౌతుంది. వింతేంటంటే ఇప్పటిదాకా పెళ్ళికొడుకు ఎవరో కనిపించడు. ఇప్పుడు పెళ్ళి లోనూ కనిపించడు. ఒక ఫ్రేంలో శోభన్‌బాబు వాళ్ళ నాన్న చితికి నిప్పంటిం***చే*** సమయానికి, ఇంకో ఫ్రేంలో జయప్రద పెళ్ళిలో అగ్నిహోత్రం వెలుగుతూ కనిపిస్తుంది.

కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుని జయప్రద కోసం ఇంటికి వచ్చిన శోభన్‌బాబుకి అంతకు ముందు ఉత్తరం తెచ్చిచ్చిన అబ్బాయి కనిపించి రావుగోపాల్రావు తన చేత అబద్ధం చెప్పించి జయప్రదకెలా పెళ్లి చేశాడో చెప్తాడు. అది విని శోభన్‌బాబు విలవిల్లాడిపోతాడు.

పెళ్ళయింతర్వాత జయప్రదని అంజలీదేవికి అప్పగించి రావుగోపాలావు వెళ్ళిపోతాడు. శోభనం పెళ్లికూతురు జయప్రద తెల్లారుఝామున నాలుగింటి వరకు నించుని, ఐదింటి నుంచి కూర్చుని నిద్రపోతుంది. పెళ్ళికొడుకు ఇంటికి రానేరాడు.

ఇంతలో అంజలీదేవి పిల్లలకి పాఠాలు చెప్పడానికి టీచర్ రమాప్రభ వస్తుంది. ఆ ఇంట్లో కొత్తకోడలిగా జయప్రదని చూసి ఆశ్చర్యపోయిన రమాప్రభ జయప్రదని శోభన్‌బాబు ఎందుకు పెళ్లి చేసుకోలేదు, ఈ పెళ్లి నీకిష్టమేనా అనడిగిన సందర్భంలోని దాసరి మార్కు క్లాసిక్ డైలాగులు ఇవైనా రాయకపోతే ఈ కబుర్లలో సరదాయే లేదు... చిత్తగించుడి!

"ప్రియా! నేనొక్క మాటడుగుతాను చెప్తావా? ఇష్టపడే ఈ పెళ్ళి చేసుకున్నావా? చెప్పు ప్రియా! నిజంగా ఇష్టపడే ఈ పెళ్ళి చేసుకున్నావా?"

"ఆ రోజు పార్వతి ఇష్టపడే పెళ్ళి చేసుకుందా?"

(ఈ కథలో పార్వతి ఎవరూ లేరు – ఇక్కడ ప్రియ దేవదాసు పార్వతిని గుర్తు చేసుకుంది, అంతే!)

"అంటే... శేఖర్ బాబు నీ మనసు లోంచి వెళ్ళిపోయినట్టేగా?"

"లేదు."

"లేదా? ఇంకా అతనికి నీ మనసులో చోటుందంటే పెళ్ళి చేసుకున్న ఇతనికి చోటు లేనట్టేగా?"

"వుంది."

"ఏమిటి ప్రియా? ఏమిటి నువ్వనేది. నీ మనసులో ఇతనికీ చోటుంది, అతనికీ చోటుందా?"

రమాప్రభ కెందుకో టెన్షన్ వచ్చేస్తూ వుంటుంది. పాపం! అలా అడిగిన ప్రశ్నకి ఎంత పెద్ద సమాధానం రాసుంచారో అడిగేటప్పటికి తెలిసుండదు. తెలిసుంటే ససేమిరా ఆ ప్రశ్న అడిగేదే కాదేమో!

"రమాదేవిగారూ! మనసు, చోటు, వుండడం, లేకపోవడం కేవలం ఒక కట్టుకథ. చిన్నప్పట్నుంచీ ప్రేమించుకుని, నిన్నటిదాకా పెళ్ళి చేసుకుందామనుకుని ఏ పరిస్థితుల్లోనైనా ఆ పెళ్ళి జరగకపోతే వెంటనే ఆ వ్యక్తి ఆ మనసులోంచి వెళ్ళిపోతాడా? ఆ మర్నాడే మరొకడితో పెళ్ళి జరిగితే అర్జెంటుగా ఆ వ్యక్తి ఆ మనసులోకొచ్చేస్తాడా? చెప్పండి. ప్రేమించుకున్న వాళ్ళందరూ పెళ్ళి చేసుకోగలరా? పెళ్ళి చేసుకోలేనంత మాత్రాన ఆ భర్తలకి మనసివ్వలేకపోతున్నారా? ఆ భర్తలతో కాపురం చెయ్యలేకపోతున్నారా? చెప్పండి. ప్రేమించడానికి మనసిచ్చిన భగవంతుడు మర్చిపోవడానికి కూడా మనసిచ్చాడు. ప్రేమించిన వాడికి మనసివ్వమన్న భగవంతుడు పెళ్ళి చేసుకున్న వాడిక్కూడా ఆ మనసులో చోటివ్వమన్నాడు. ఏ మనిషికీ ఒకే మనసుండదు. అలా వుందీ అంటె అది కేవలం అబద్ధం, ఆత్మద్రోహం, ఆత్మ వంచన.... కొంతమందికి తీపి మీద మనసుంటుంది. కొంతమందికి కారం మీద మనసుంటుంది. కొందరికి తీపీ, కారం రెండిటి మీదా మనసుంటుంది. తీపి తినాలనుకునే మనసు కారం తినలేదా? ఒక్కోసారి ఇష్టం వున్నా లేకపోయినా గత్యంతరం లేక చేదు విషం తినాల్సొస్తుంది. బహుశా నా పెళ్లి కూడా అదేనేమో"

జయప్రద ఆపకుండా చెప్పిన ఆ పే..ద్ద డైలాగు విని రమాప్రభ నోట షడ్రుచులూ ఊరి, వాటి ఘాటుకి కళ్ళలో నీళ్ళూరి నోట మాట లేక నిర్ఘాంతపోతుంది. తర్వాత సీనులో కనిపించకుండా పారిపోతుంది.

అసలు జయప్రద పెళ్లయ్యేవరకూ జరిగే సిన్మా ఒకెత్తూ – అక్కణ్ణించీ ఇంకో ఎత్తూ... ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుందో పలకదో లేదో కానీ దాసరి సిన్మా హీరోయిన్ ఆ సిన్మా పలుకే పలుకుతుందండోయ్!

ఈ లోగా పెళ్ళికొడుకు దాసరి నారాయణరావ్ సూటేసుకుని, సిగరెట్టు కాలుస్తూ ఇంటికొచ్చి, జయప్రదతో ఈ పెళ్లి తనకిష్టం లేకపోయినా తన తల్లి కోసం చేసుకున్నానని చెప్పి మళ్ళీ బయటకి వెళ్ళిపోతాడు. అప్పుడేమో శోభన్‌బాబొచ్చి అంజలీదేవి ప్యాలెస్ ముందు దీపస్తంభం కింద నించుని ఓ పాట పాడేస్తాడు...

**ముసుగేసిన మబ్బులలో – మసకేసిన పరదాలలో**

**దాగి దాగి వున్న జాబిల్లి – ఒకసారి నువ్వు రావాలి**

**ఒక మాట నే చెప్పాలి – నీతో మాట చెప్పి పోవాలి**

పాట చాలా బావుంటుంది. కానీ జయప్రదకి ఆ పాట వినబడి, పాడే శోభన్‌బాబు కనబడి ఏడుస్తుంది. అంజలీదేవికి మాత్రం ఏమీ వినబడదు, ఎవరూ కనబడరు, కానీ జయప్రద ఏడుస్తోందని మాత్రం అర్థమవుతుంది.

మర్నాడు అంజలీదేవి కొత్తకోడలైన జయప్రద చేత పనివాళ్ళందరికీ బట్టలు ఇప్పిస్తూ ఉంటుంది. అక్కడికి ఓ గళ్ళతువ్వాలు ముసుగేసుకుని వచ్చిన శోభన్‌బాబుని చూసి గుర్తు పట్టిన మేనేజర్ గొడవ చేయబోతుంటే రమాప్రభ అడ్డుపడి తన ఇంటికి తీసుకెళ్లి శోభన్‌బాబు తండ్రి పోయిన విషయం తెలుసుకుని ఆ విషయం జయప్రదకు తెలిసేదాకా తన ఇంట్లోనే వుండమంటుంది. జరిగిందంతా జయప్రదకి చెప్పి ఎలా అయినా ఆమెని తన ఇంటికి తీసుకొస్తానని చెప్తుంది. అది వినగానే శోభన్‌బాబు జయప్రద తన దగ్గర కొచ్చినట్లు, తనతో వచ్చేస్తానని చెప్పినట్లు కలగని ఆ కలలోనే "ఆకాశం ఎందుకో పచ్చబడ్డది, ఆ నడుమ బొట్టేమో ఎర్రబడ్డది" అంటూ ఓ మాంచి పాట కూడా పాడేసుకుంటాడు. ఈ పాట ఖచ్చితంగా దాసరివరప్రసాదం.

రమాప్రభ తన పుట్టినరోజుకి జయప్రదని తన ఇంటికి పంపమని అంజలీదేవిని అడిగితే ఆవిడ సరేనని జయప్రదతో పాటు ఓ పెద్దాయన్ని, తన పిల్లలని కూడా పంపిస్తుంది. వాళ్ళందరూ కలిసి రమాప్రభ ఇంటికి వెళ్లబోయేంతలో దాసరి ఇంటికి వచ్చి అందర్నీ కసిరి ఇంట్లోకి వెళ్ళమంటాడు.

అన్నట్లు మర్చిపోయాను – అంతకు ముందు ఓ సీనులో దాసరి కారు రోడ్డు మీద ఆగిపోతే ఆ దార్లోనే వెళ్తున్న శోభన్‌బాబుని పిలిచి కారునెట్టమని, కారు స్టార్ట్ అయ్యాక శోభన్‌బాబుని రమాప్రభ ఇంటి దగ్గర దించి వస్తాడు దాసరి.

సరే! దాసరి తిట్టాడని జయప్రద ఇంట్లోకి వెళ్ళిపోతుంది కదా! అప్పుడు రమాప్రభ జయప్రదకి ఫోన్ చేస్తుంది. (ఆ రోజుల్లో మామూలు టీచర్లకి కూడా ఫోన్ కనెక్షన్లు ఇప్పించినట్లున్నాడు దాసరి.) చేసి శోభన్‌బాబుకి ఇస్తుంది. ఇంతలో దాసరి రావడంతో జయప్రద రాంగ్ నంబరని చెప్పి ఫోన్ పెట్టేస్తుంది. రమాప్రభ మళ్ళీ చేస్తుంది. ఈసారి దాసరి ఫోన్ తీస్తాడు. రమాప్రభ ఫోన్ పెట్టేస్తుంది.

ఆ మర్నాడు జయప్రద దగ్గరికి వెళ్లి సాయంత్రం గుడికి రమ్మని చెప్పి వెళ్తుంది రమాప్రభ. గుడికి జయప్రదతో పాటు అత్తగారు అంజలీదేవి కూడా వస్తుంది. వాళ్ళిద్దరినీ శోభన్‌బాబు, శోభన్‌బాబుని జయప్రద మాత్రం చూసుకుంటారు. ఇంతలో జయప్రద పడిపోతే అంజలీదేవి పట్టుకుని ఇంటికి తీసుకొచ్చేస్తుంది. డాక్టరొచ్చి జయప్రదకి మందులిచ్చి వెళ్తాడు.

ఆ రాత్రి శోభన్‌బాబు బోల్డన్ని కాయితం పడవలు చేసి నీళ్లలో వేస్తూ ఉంటాడు. వేస్తూ వేస్తూ అమాంతం ఓ పాట పాడడం మొదలుపెడ్తాడు, "గాలివానలో వాననీటిలో పడవ ప్రయాణం – తీరమెక్కడో గమ్యమేమిటో తెలియదు పాపం" — అంటూ.

పాట పాడుకుంటూ, వానలో నడుచుకుంటూ, పాట సగమయ్యేటప్పటికి జయప్రద వుండే పాలెస్ దగ్గరికి వస్తాడు. అప్పుడే కార్లో ఇంటికి వస్తున్న దాసరి పాడేపాడే శోభన్‌బాబుని కార్లో ఎక్కించుకుని తన పాలెస్‌కి తీసుకొస్తాడు. అయినా శోభన్‌బాబు పాట ఆపడే! ఒక తెల్ల తువ్వాలుతో తల తుడుచుకుంటూ పాడుతూనే వుంటాడు, లోపల్నుంచి జయప్రద వచ్చి విని ఏడ్చేదాకా. ఏడుస్తున్న జయప్రదని, తమ ఇద్దర్నీ

మార్చిమార్చి చూస్తున్న దాసరినీ చూసేటప్పటికి శోభన్‌బాబుకి అర్థం అవుతుంది తనెవరింటికి వచ్చాడో. అంతే ఆ తువ్వాలు అక్కడ పడేసి వెళ్ళిపోతాడు.

*.....*

ఇంక ఇప్పటినుంచి సినిమా చివరి రీలు వరకూ దాదాపు నలభై నిముషాలు తెర మీద దాసరి నారాయణరావు తప్ప ఇంకెవరూ వినిపించరు, కనిపించరు. చివరికి తనని తాను షూట్ చేసుకుని "చిన్నప్పుడే పెళ్ళి చేసుకున్న మీదే అసలైన స్వయంవరం" అని అంటూ జయప్రద–శోభన్‌బాబులని కలిపి కన్ను మూస్తాడు దాసరి.

అదండీ నేను చూసిన ఒక దాసరి సినిమా – స్వయంవరం.

సానుభూతికనర్హమైన స్వయంకృతం.

సహనపరీక్షలో నెగ్గి నిగ్గు తేలడం నా స్వానుభూతి.

నా స్వానుభవమేమంటే ... పంచిపెడితే పెరుగును వినోదం, పంచుకుంటే తరుగును విషాదం.

పందునైతే పంచివ్వద్దన్నారు కానీ పెద్దలు, బాధకీ, సినిమా గాథకీ ఆ పరిమితి చెప్పలేదు. పైగా పంచుకున్నవారికి తుంచుకున్నంత అని కూడా అన్నారన్నట్లు గుర్తు.

అందుకే నా ఈ సినీ–పాపం తలో రీళ్ళేదు అనుకుంటూ నా పరమైన ఈ స్వయంవర చిత్రరాజాన్ని మీతో ...ఇలా...ఇవాళ చెప్పేసుకుందారని పందేరం పెట్టేశానండి...ఆయ్!

***ముక్తాయింపు:***

స్వయంవరం చూసిన రోజు రాత్రి
మా ఇంట్లో నన్ను పూనిన దాసరి
వడివడిగా నా నోట వచ్చిన మాటల ఉరవడి
బెదిరి పరుగిడిన పిల్లలూ, పెనిమిటి...
ఎందుకో ఈ కింద చదువుడి...
మీరే తెలుసుకొనుడి...

"బుజ్జీ! నేనడిగినదానికి జవాబు చెప్తావా లేదా? ఇంతకీ వంట చేశావా? చెప్పు బుజ్జీ! అసలు వంట చేశావా, లేదా"

"ఆ రోజు సాంబారు చేస్తే మీకు నచ్చింది కదా?"

"అంటే... ఇవాళా సాంబారే చేశావా?"

"చేయలేదు"

"లేదా? ఇంతకీ ఇవాళ సాంబారు చేయలేదంటే ఇవాళ అప్పడాలు కూడా వేయించనట్లేనా?"

"వేయించాను"

"ఏమిటి బుజ్జీ? ఏమిటి నువ్వనేది? సాంబారు చేయకుండా అప్పడాలు వేయించావా?"

"ఏమండీ! సాంబారు, అప్పడాలు, వండడం, వేయించడం కేవలం ఒక కట్టుకథ. ఎప్పట్నుంచో పప్పు వేయించుకుని, నిన్నటిదాకా సాంబారు చేసుకుందామనుకుని ఏ పరిస్థితుల్లోనైనా ఆ సాంబారు చేయకపోతే వెంటనే ఆ పప్పు ఓ డబ్బాలో పోసేసుకోమా? ఆ మర్నాడే ఇంకో

కూర ఒండుకుంటే ఆ డబ్బాలో పప్పు పారబోసేస్తామా? చెప్పండి. పప్పు వేయించిన వాళ్ళందరూ పోపు వేయించగలరా? పోపు లేనంత మాత్రాన ముద్దపప్పు చేసుకోలేకపోతున్నారా? అందులో ఆవకాయ కలుపుకుని తినలేకపోతున్నారా? చెప్పండి. పప్పు చెయ్యడానికి గరిటిచ్చిన కొట్టువాడు పోపెయ్యడానికి కూడా గరిటిచ్చాడు. పోపెయ్యడానికి గరిటిచ్చిన కొట్టువాడు అది పప్పు వేసుకోవడానిక్కూడా వాడొచ్చన్నాడు. అన్ని గిన్నెలకీ ఒకే మూత పట్టదు. అలా పడుతుందీ అనేవరైనా అన్నారంటే అది కేవలం అబద్ధం, ఆత్మద్రోహం, ఆత్మ వంచన.... కొంతమందికి తీపి మీద మనసుంటుంది. కొంతమందికి కారం మీద మనసుంటుంది. కొందరికి తీపీ, కారం రెండిటి మీదా మనసుంటుంది. తీపి తినాలనుకునే మనసు కారం తినలేదా? ఒక్కోసారి ఇష్టం వున్నా లేకపోయినా గత్యంతరం లేక చేదు విషం తినాల్సొస్తుంది. బహుశా ఇవాళ మనం అదే తింటామేమో!"

# రాగదీపం.

రాగ-విరాగాల కతీతంగా చూడాల్సిన సిన్మా-విరాగదీపం.

ప్రేమా-పెళ్ళీ టాపిక్కుల మీద దాసరి వెలిగించిన ఒకానొక దర్శకత్వ ప్రయోగ-దీపం

ఈ రాగదీపంలో రాగాలు తీసి పాడినట్లుగా, అనురాగాలు మోసి ఓడినట్లుగా నటించినవారు నటసామ్రాట్టు నాగేశ్వర్రావ్.

ఆ రాగానికి సిన్మాలో మలిగిన తారామణీదీపం, సహజనటి అని పేరొందిన జయసుధ.

అదే రాగానికి ఇదే సిన్మాలో రగిలిన ఇంకో-తారామణీదీపం, ఏ పేర్లూ-పట్టాలూ పొందకపోయినా సహజంగా నటించే లక్ష్మి.

ప్రతి సినిమాలో లాగే గుండెపోటొచ్చే గుమ్మడి.

ఆస్తి మహ-లావైన రావుగోపాల్రావు.

సింగీతంవారి సినిమాల్లో ఏక్టర్ గానో, డాక్టర్ గానో తెరంగరంగవైభవంగా కనిపించే అందాల-హుందాల స్టైలిష్ హీరో ఈ దాసరివారి సినిమాలో మాత్రం అపరాథ-దీపమైన కృరంగనాథ్.

కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, మరియు కొన్ని పాటలు — మళ్ళీ అన్నీ దాసరే!

అట్టి అర్థ-దశావతారాల దాసరి గారికి ఓ సిన్మతీ గిద్యాన్ని సమర్పించుకుని నా సిన్మా కథని మొదలెట్టెద...

పాటల మాటలు బేర్చును
మాటల నా పాటలలోన నొప్పుగ దూర్చును
మాటల పాటల నలిగి
చతురమౌ దాసరి భావం తెలియవె సిన్మతీ!

ఈ సిన్మాలో నటసామ్రాట్టు నాగేశ్వర్రావ్ నిరుద్యోగ చక్రవర్తి. ఉద్యోగం కోసం ఒక ఆఫీసు నుంచి ఇంకో ఆఫీసుకి వెళ్తూ, వస్తూ రోడ్లు కొలుస్తూ వుంటాడు. ఓ రోజు తెల్లబట్టలేసుకుని ఇంటర్వ్యూకి వెళ్తూ వుంటే ఓ అమ్మాయి మోటర్ సైకిల్ మీద వేగంగా వచ్చి నాగేశ్వర్రావ్ మీద బురద చిమ్మి వెళ్తుంది. ఆ అమ్మాయెవరో కాదు, రెండు జళ్ళేసుకున్న జయసుధ. పాపం! నాగేశ్వర్రావ్ ఇంటికి వెళ్ళిపోయి బురదంటుకున్న

పేంటూ-చొక్కా మార్చుకుని బయటికి రాగానే మళ్ళీ అదే పిల్ల-అదే బండి-అదే బురద. నాగేశ్వర్రావ్ కింక భలే తిక్కొచ్చేసి ఆ బురద బట్టల తోనే ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పటికి వేళ మించిపోయి సాయంత్రం అవుతుంది. అక్కడ ఇంటర్వ్యూ చేసే రావుగోపాల్రావు నాగేశ్వర్రావ్ ఆలస్యంగా వచ్చిన కారణం తెలుసుకుని బోల్డుకోపాల్రావు అయిపోయి, నాగేశ్వర్రావ్ ఇంకో మోటర్ సైకిల్ మీద అర్జెంటుగా వెళ్ళి, ఆ బురద చల్లిన అమ్మాయిని పడేసి కాలో చెయ్యో విరగ్గొట్టి వస్తే కానీ ఉద్యోగం ఇవ్వనంటాడు.

నాగేశ్వర్రావ్ అలాగే అంజెప్పి వెళ్ళి, జయసుధని గా...ఠిగా దెబ్బలు తగిలేలా పడేసి మరీ హాస్పిటల్లో చేర్పిస్తాడు. ఇంతకీ జయసుధ ఎవరో కాదు, రావుగోపాల్రావు కూతురు. తల్లి లేని పిల్ల. సినిమా మొదలయ్యే టైంకి ఈవిడ మానసిక వయస్సు పదో, పన్నెండో పాపం! అందుకేనేమో ఇంట్లో బుద్ధి చెప్పేవాళ్ళు లేక, ఒంట్లో బుద్ధి పెరక్క ఎవరైనా తెల్లబట్టలు వేసుకుని రోడ్డు మీద వెళ్తూ కనిపిస్తే బురద చిమ్మడం హాబీగా పెట్టుకుంది. తన కూతురుకి దెబ్బలు తగిలి హాస్పిటల్లో వుందని తెలిసి పరిగెట్టుకొచ్చిన రావుగోపాల్రావుకి అది నాగేశ్వర్రావ్ చేసిన పని అని తెలిసి, తెగ కోప్పడి, ఉద్యోగం లోకి పోస్టింగు కాకుండానే ఊస్టింగు చేసేస్తాడు.

వచ్చిందనుకున్న ఉద్యోగం వచ్చీరాకుండానే ఊడిపోవడంతో నాగేశ్వర్రావ్ వెళ్ళి ఒక లైబ్రరీలో ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరతాడు. ఇంతలో అక్కడికి రెండుజళ్ళూ-గౌనూ వేసుకున్న జయసుధ ఓ నలుగురు స్నేహితురాళ్ళతో వస్తుంది. జయసుధని పడేసింది ఈ నాగేశ్వర్రావే అని తెలుసుకుని అభినందిస్తున్న తన మిత్రబృందాన్ని చూసి ఉడుక్కున్న జయసుధ నాగేశ్వర్రావుని పక్కకి పిలిచి "సారీ" చెప్పి, తన మీద ఒక కవిత చెప్పమని అడిగితే నాగేశ్వర్రావ్ "ఏకాంతం కావాలి, ఏకాగ్రత కావాలి, తోట కావాలి, పువ్వులు కావాలి, ఇలా ఇంకా ఎన్నో కావాలి" అంటూ ఓ పే...ద్ద లిస్టు చెప్పగానే జయసుధ అవన్నీ ఆ రోజు సాయంత్రమే ఏర్పాటు చేస్తానంటుంది. ఓ పసుప్పచ్చ చీర కట్టుకుని తయారై వచ్చేస్తుంది. వెంటనే ఎక్కడో గడ్డిభూముల్లో **"నీ కారు నంబర్ వన్, నీ జోరు నంబర్ వన్"** అంటూ నాగేశ్వర్రావు తెగ జోరుగా, హుషారుగా ఆడుతూ పాడేస్తాడు. నాగేశ్వర్రావుతో సమానంగా కాలు కదిపి ఆడిన జయసుధ ఆ పాటని మోసుకెళ్ళి లైబ్రరీలో ఇవ్వగానే ఆ ఉద్యోగం కూడా పోతుంది. ఏదో సరదాగా ఆటపట్టిద్దామనుకున్న తన వల్ల నాగేశ్వర్రావ్ ఉద్యోగం ఇంకోసారి పోగానే బాధపడి అతనికి "సారీ" చెప్పడానికి వెళ్ళిన జయసుధని "నీ సారీలు నాకేమీ వద్దు" అని వెళ్ళిపోయిన నాగేశ్వర్రావ్ ఇంటి వరండాలోనే కూర్చుంటుంది. ఆ రోజంతా ఎక్కడెక్కడో తిరిగి, రాత్రికి ఇంటికి తిరిగొచ్చిన నాగేశ్వర్రావుకి వరండాలో కూర్చునే నిద్రపోతున్న జయసుధ కనిపిస్తుంది. ఏంటిక్కడే వున్నారింకా అనడిగిన నాగేశ్వర్రావుకి అతను తనని క్షమించానని చెప్పలేదు కాబట్టి అక్కడే వున్నానని చెప్తుంది జయసుధ. అపుడు నాగేశ్వర్రావ్ అయ్యో-పాపం అని జాలిపడి మనిద్దరం ఫ్రెండ్స్ అంటూ చేతులు కలుపుతాడు.

ఇలా చదువూ-సంధ్యా ఆట్టే లేకుండా త్రిపాద నక్షత్రంలా రోడ్ల మీద తిరిగొస్తున్న జయసుధకి పెళ్ళి చేద్దామనుకుని రావుగోపాల్రావు బోల్డన్ని అబ్బాయిల ఫొటోలు ఆమెకు చూపిస్తే, తనకి వాళ్ళెవరూ నచ్చలేదని చెప్తూ, పెళ్ళంటూ చేసుకుంటే నాగేశ్వర్రావునే చేసుకుంటానంటుంది జయసుధ. రావుగోపాల్రావింకేం చేస్తాడు పాపం...నాగేశ్వర్రావు సిన్మాలో వుంటే జయసుధ తన మాటెక్కడ వింటుందీ, వేరే ఇంకెవర్ని చేసుకుంటుందీ కనక! సరే, నాగేశ్వర్రావుని ఇంటికి తీసుకురా మాట్లాడతానూ అంటాడు. సిన్మాలో హీరో-హీరొయిన్లకి పిడుక్కీ-బియ్యానికీ ఒకటే మంత్రం లాగా సందర్భం ఏదైనా పార్కుల్లో పరిగెడుతూ పాడుకోవడం అలవాటు కదా! అందుకే మన జేసుధ-నాగేశ్వర్రావు కూడా అప్పటికప్పుడు ఆర్కెస్ట్రా-సహితంగా **"వయ్యారానికి ఓటిస్తా – ఓ మాటొస్తావా"** అంటూ గెంతిగెంతి పాడుకుంటారు.

పాటై పోగానే తనతో మాట్లాడదామని ఇంటికి వచ్చిన నాగేశ్వర్రావు స్థాయిని గుమ్మం దగ్గర విడవాల్సిన చెప్పులతో పోల్చి అవమానించి పంపెయ్యబోతాడు మాలావుడబ్బుల్రావు – రావుగోపాల్రావు. అప్పుడు జయసుధ తన తండ్రిని, ఆస్తిని వదిలేసుకుని నాగేశ్వర్రావు స్థాయికి, స్థానానికి వెళ్ళిపోతానని బయల్దేరుతుంది. రావుగోపాల్రావు ఇంకేం చెయ్యాలో తోచక పెళ్ళికి ఒప్పుకుంటాడు.

ఈలోగా నాగేశ్వర్రావుకి రేడియోలో పాటలు పాడే ఉద్యోగం వస్తుంది. మొదటి పాట విశాఖపట్నం కేంద్రం నుంచి ప్రసారం అవుతుంది. ఆ పాట వింటూ జేసుధ కలలు కనేస్తూ వుటుంది – పెళ్ళైపోయి పిల్లలు కూడా పుట్టేసినట్టు. అప్పుడే నాకో డౌటొచ్చింది – ఇలా పెళ్ళీ, పిల్లలూ అన్నీ కలలోనే చూపించేస్తున్నారూ, వీళ్ళిద్దరికీ దాసరి తన సినీరాతలో పెళ్ళిరాతే రాసుండడని. ఇన్ని సిన్మాలు చూశాక ఆ మాత్రం ఊహించలేనేంటి? అది నా తెలుగు–మూస–సినీ–ప్రేక్షకత్వానికే అవమానం!

ఇంతకీ నాగేశ్వర్రావు రేడియోలో పాడే పాట ఏంటీ అంటే – అది "**తెల్లావారే తెల్లావారే సూరీడొచ్చే వేళా ఆయె లేరా**" అంటూ రామకృష్ణ, సుశీల పాడే పాట. అదేం వింతో కానీ ఈ పాట అంత స్పష్టంగా రామకృష్ణ పాడినట్లు వినిపిస్తుంటే టైటిల్సులో ఎక్కడా ఆయన పేరే లేదు. పైగా ఎవరో ప్రకాశరావు అనే అతని పేరుంది. అదేదో రామకృష్ణంటే అంతగా ఇష్టం లేని వాళ్ళెవరో సినిమాయ చేశారనిపించింది నా మటుక్కి నాకు. నేను మాత్రం అది రామకృష్ణ పాట అనుకునే ఎంజాయ్ చేశా.

సరే! పాట అయిపోయాక నాగేశ్వర్రావ్ షాపింగ్‌కి వెళ్ళి, పెళ్ళి కుదిరింది కదా మరి!, బట్టలు అవీ కొనుక్కుని బస్సెక్కడానికని బస్టాప్‌లో నించుని వుంటాడు. ఇంతలో దూరం నుంచి గుమ్మడి వస్తూ కనిపిస్తాడు. గుమ్మడెవరంటే...నాగేశ్వర్రావుని చిన్నప్పుడు వాళ్ళ నాన్న చదువు మానిపించి వడ్రంగం పనిలో పెడ్తుంటే వద్దని అడ్డుపడి, తనతో తీసుకొచ్చి, తనింట్లో వుంచుకుని, తన కూతురితో సమానంగా పెంచి, చదివించి ఓ దారి చూపించిన మాష్టారు. "మాష్టారూ! నా చదువయ్యాక మీకోసం వస్తే మీరు మన ఊళ్ళో కనిపించలేదు" అంటూ ఎదురొచ్చిన నాగేశ్వర్రావుని గుర్తుపట్టిన గుమ్మడి చాలా సంతోషపడ్డాడు. తన కూతురెలా వుందని అడిగిన నాగేశ్వర్రావుకి పెళ్ళి కాలేదని పిచ్చెక్కి, ఆత్మహత్య చేసుకోబోయి ప్రస్తుతానికి ఆ వూళ్ళోనే హాస్పిటల్లో వుందని చెప్తాడు గుమ్మడి.

గురువు గుమ్మడితో కలిసి హాస్పిటల్‌కి వెళ్తాడు శిష్యనాగేశ్వరం. ఆ హాస్పిటల్లో డాక్టర్లందరూ గుమ్మడికి చెప్పిన విషయం ఏంటంటే "మీ అమ్మాయికి పెళ్ళి పిచ్చి. పెళ్ళి చేయకపోతే మనిషి దక్కదూ" అని. ఆ పెళ్ళి–పిచ్చి కూతురెవరో కాదు – లక్ష్మి. మందులేసుకోకుండా, జుట్టంతా విరబోసుకుని తల బాదేసుకుంటూ కనిపిస్తుంది. తన కూతుర్ని కాపాడడానికి ఆమెని పెళ్ళి చేసుకుంటానని ఒక్క అబద్ధం చెప్పమని నాగేశ్వర్రావుని అడిగి, నాగేశ్వర్రావు ఆలోచించుకుని అవునూ–కాదూ అనేలోగా తల–బాదుడు కార్యక్రమంలో వున్న లక్ష్మిని ఇంటరప్ట్ చేసి, నాగేశ్వర్రావ్ తను చిన్నప్పట్నుంచీ పెంచిన అబ్బాయి అని గుర్తు చేసి, అతను నిన్ను పెళ్ళి చేసుకుంటాడని చెప్పి, ఆ హాస్పిటల్లో వున్న ఇనప మంచాలు విరిగిపోకుండా కాపాడి, అక్కడున్న డాక్టర్లకి మానసికారోగ్యాన్ని చేకూరుస్తాడు గుమ్మడి.

ఇంకంతే! లక్ష్మి పిచ్చి కుదిరిపోతుంది. కూతురి పిచ్చి కుదిరిందన్న సంతోషంలో వున్న గుమ్మడి నాగేశ్వర్రావుకి అంతకు ముందే పెళ్ళి కుదిరిందని తెలిసి, ఆ విషయం పిచ్చి కుదిరిందనుకున్న తన కూతురికి తెలిస్తే ఆ కుదిరిన పిచ్చి కాస్తా మరింత ముదురుతుందన్న భయంతో, నాగేశ్వర్రావ్ పెళ్ళి ఎవరితో కుదిరిందో తెలుసుకుని ఆ కుదిరిన పెళ్ళిని చెదర గొట్టటానికి పరుగు పెట్టుకుంటూ జేసుధ దగ్గరికి వెళ్ళి తన కూతురికి పెళ్ళి–భిక్ష పెట్టమంటాడు. జేసుధ, పాపం, త్యాగరాణి అయిపోయి పరిగే...ట్టుకుంటూ నాగేశ్వర్రావ్ దగ్గరికెళ్ళిపోయి, నాగేశ్వర్రావుకి దిమ్మ తిరిగి, ఉన్నపాటున తూర్పు తిరిగి దండం పెట్టేలా ఓ డ్రై–డైలాగు చెప్తుంది: "ప్రేమ తూర్పైతే, పెళ్ళి పడమర. తూర్పు పడమర ఎప్పుడూ ఎదురెదురుగానే వుంటాయి. చూసుకుంటూనే వుంటాయి. అంతే. ఒక పక్క ఉదయిస్తూ వుంటుంది. ఒక పక్క అస్తమిస్తూ వుంటుంది. అసలు ప్రేమంటే అదేనేమో. అలా కాకపోతే అది ప్రేమే కాదేమో!" అంటూ.

ఈ డైలాగుల బాధ భరించే కన్నా ఆ పిచ్చిదానితో పెళ్ళే మిన్న అనుకున్న వెర్రి నాగన్నకి గుళ్ళో పెళ్ళైపోతుంది. గుమ్మడికి పెళ్ళి–పిచ్చి కూతురైన లక్ష్మి ఇప్పుడు కొత్త పిచ్చి–పెళ్ళి కూతురు. కలలు కంటూ, కలలో పాట పాడేసుకుంటుంది నాగేశ్వర్రావుతో – "**కుంకుమ పూసిన ఆకాశంలో ఉదయ సంధ్యారాగాలు**" – అంటూ. ఈ సిన్మా మొత్తానికి ఇది భలే అందమైన పాట. లక్ష్మి ఇంటికొచ్చిన వాళ్ళందరికీ తన భర్తని

కొన్నాళ్ళు తన తండ్రే చదివించాడని, ఆ తర్వాత అతను రూపాయి రూపాయి అడుక్కుని చదువుకున్నాడని చెప్తూ వుంటుంది. అది విని అలా మాట్లాడకూడదని మందలించిన గుమ్మడిని విదిలించేస్తుంది.

లక్ష్మితో పెళ్ళైన దగ్గర్నుంచీ నాగేశ్వరావు నో-వాక్కేశ్వర్రావ్. హాయిగా హైపిచ్చులో డైలాగులు చెప్పుకుంటూ చలాకీగా వున్న నాగేశ్వర్రావుని హై-పిచ్చి వున్న తన కూతురికిచ్చి పెళ్ళి చేసి, గుళ్ళు లేని తుపాకీలా మూగబోయేలా చేసినందుకు గుమ్మడి పశ్చాతాప్పడతాడు. గుండె మీద రాసుకోవడం మొదలెడతాడు. రాబోయే కాలంలో ఆగబోయే గుండెకి సూచనేమో అది!

ఇక త్యాగమయి జయసుధ ఖాళీ సమయాల్లో ఎండిపోయిన తులసి మొక్క ఆకులు పీక్కుంటూ వుంటుంది. ఆ సీనులో జయసుధ–రావుగోపాల్రావుల మధ్యన మామూలు మెదడు మొయ్యలేనంత బరువైన మాటలు: పెళ్ళికి, ఎండిపోయిన తులసి మొక్కకీ ముడిపెడుతూ – వహ్వా! సరి లేరు నీకెవ్వరూ, ఓ దాసరి అనిపిస్తూ...చిత్తగించండి.

"రోజూ తులసికి నీళ్ళు పొయ్యట్లేదా?"

"పూజ చెయ్యట్లేదుగా..."

"ఎందుకని?"

"ఏముందని చెయ్యాలి?"

"అదేంటమ్మా... పెళ్ళికాని ఆడపిల్లలు, పెళ్ళైన ఆడవాళ్ళు ఇంట్లో వున్న తులసి కోటకి పూజ చేయకుండా వుంటారామ్మా?"

"నిజమే డేడీ... పెళ్ళి కాని వాళ్ళు మంచిమొగుడు రావాలని పూజ చేస్తారు, పెళ్ళైన వాళ్ళు మొగుడు మంచిగా వుండాలని పూజ చేస్తారు. రెండూ లేనివాళ్ళు ఎందుకు చెయ్యాలి డేడీ?"

"లేవని ఎందుకనుకుంటావమ్మా?"

"వున్నాయని ఎలా అనుకోను డేడీ?"

ఇలా ఓ పదినిముషాలు తలా-తోకా లేకుండా కొన్ని డైలాగులు అయ్యాక, రావుగోపాల్రావు ఎంత చెప్పినా జయసుధ పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకోదు. అందుకని ఆయన నాగేశ్వర్రావు దగ్గరికి వచ్చి ఎలా అయినా సరే జయసుధని పెళ్ళికి ఒప్పించమని బ్రతిమాలి తనతో తీసుకెళ్తాడు. అంతకు ముందే లక్ష్మి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూడ్డానికని చెప్పి, చేస్తున్న వంట సగంలో ఆపేసి మరీ వెళ్ళిపోతుంది. గుమ్మడికి గుండె నొప్పి వస్తుంది. ఇంతలోనే సినిమాకి వెళ్ళిన లక్ష్మి కూడా ఇంటికి వస్తుంది. ఫ్రెండ్స్ సాయం పడితే గుమ్మడిని ఇంట్లోకి తీసుకెళ్తుంది.

ఇక్కడింత హడావిడి జరుగుతుంటే అక్కడ జయసుధ ఓ పాట వింటూ ఆ పాటకి ఒకప్పుడు తనూ-నాగేశ్వర్రావ్ వేసిన్ స్టెప్పులు గుర్తు తెచ్చుకుంటూ వుంటుంది. **"అదిగో అదిగో అదిగో ఎవరో వస్తున్నారు..."** అంటూ తెగ హుషారుగా జాగింగ్ చేస్తున్నట్లుగా పరిగెడుతూ డాన్సాడేస్తారు ఈ పాటలో హీరో-హీరోయిన్లు. పాటైపోయే టైంకి నాగేశ్వర్రావొచ్చి, మళ్ళీ దాసరి-పలుకులు పలికి, మొత్తానికి జేసుధని పెళ్ళికొప్పించి, రంగనాథ్‌తో పెళ్ళి జరిపిస్తాడు.

నాగేశ్వర్రావ్ జయసుధ పెళ్ళి చేసి ఇంటికి తిరిగొచ్చేటప్పటికి గుమ్మడి ఫొటోకి దండేసేసి వుంటుంది. వాళ్ళ నాన్న పోయిన సమయానికి లేకుండా పోయాడని నాగేశ్వర్రావుతో దెబ్బలాడి ఏడుస్తుంది లక్ష్మి. ఊరుకోబెడ్తాడు నాగేశ్వర్రావ్. కొన్నాళ్ళకి వీళ్ళిద్దరికీ ఇద్దరు పిల్లలు పుడ్తారు. సినిమా పిచ్చితో భర్తని వదిలేసి కట్టుబట్టల్తో తన దగ్గరకొచ్చిన ఫ్రెండొకదాన్ని తనింట్లోనే వుండమంటుంది లక్ష్మి.

నాగేశ్వర్రావు చేసే ఉద్యోగం ఏంటో కానీ ఓ చిన్న బ్రీఫ్‌కేస్ పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ వుంటాడు. అలా ఓ రోజు రోడ్డు మీద నడుస్తూ వుంటే, అరటిపళ్ళు దొంగతనం చేశాడని ఓ పిల్లాణ్ణి పట్టుకుని కొడుతూ వుంటారు కొందరు. నాగేశ్వర్రావ్ కొట్టేవాళ్ళ నుంచి ఆ అబ్బాయిని విడిపించి దొంగతనం ఎందుకు చేశావూ అనడిగితే మా అమ్మ అన్నం పెట్టలేదూ అని చెప్తాడు వాడు. ఇంతలో వాళ్ళమ్మ అక్కడికి వస్తుంది. ఆ అమ్మ ఎవరో కాదు, మన జేసుధ.

అనుకోకుండా అలా కనిపించిన జయసుధ చెప్పిన విశేషాలేంటంటే... తన పెళ్ళి రంగనాథ్‌తో జరిగాక రేసులాడి ఇల్లు, ఆస్తి అంతా పోగొట్టుకుని రావుగోపాల్రావు ఉరేసుకున్నాడని, అది తెలిసి ఆస్తి కోసమే తనను పెళ్ళాడిన రంగనాథ్ తననీ, కొడుకునీ ఇంట్లోంచి పంపించేశాడని, అప్పట్నుంచీ ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పని చేసుకుంటూ తన కొడుకుని పెంచుకుంటున్నాననీ. ఆ కథంతా విన్నాక జయసుధనీ, ఆమె కొడుకునీ తన ఇంటికి తీసుకెళ్తాడు నాగేశ్వర్రావ్.

మొత్తానికి నాగేశ్వర్రావ్-లక్ష్మి దంపతుల ఇంట్లో ఇప్పుడున్నదెవరెవరంటే: ఆయన, ఆవిడ, ఆయనొదిలేసిన ఆయన ఫ్రెండూ, ఆయన్నొదిలేసిన ఆవిడ ఫ్రెండూ, ఓ ముగ్గురు పిల్లలూ.

జయసుధ కాపురం చక్కదిద్దాలనుకుని నాగేశ్వర్రావ్ ఆమెతో రంగనాథ్‌తో సర్దుకుపొమ్మని చెప్పే సన్నివేశం ఒకటుంది. అక్కడ వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకుంటారంటే...(ముందు జయసుధ మొదలుపెడ్తుంది...)

"బలవంతంగా పెళ్ళి చెయ్యగలం, కానీ బలవంతంగా మనసివ్వలేం, పుచ్చుకోలేం, బలవంతంగా కాపురం చేయలేం కూడా."

"ఇష్టం లేకపోయినా కొన్ని చేయాలి."

"అది మీలా అందరూ చేయలేరు."

"నిజమే! గమ్యం చేరాలనుకున్నప్పుడు వెళ్ళడానికి ఆ రైలు తప్ప మరో రైలు లేనప్పుడు, అందులో కూర్చోవడానికి చోటు లేకపోయినా నిలబడైనా ప్రయాణం చేయాలి. తప్పదు."

"అలాగని నిప్పులు చెరిగే ఇంజన్ మీద నిలబడి ప్రయాణం చేయలేరుగా!"

ఇంకిక్కణ్ణుంచీ ఆఖరి అరగంట సిన్మా – ప్రేక్షక జన భరతం పట్టే భీభత్సరస భరితం. ఓ పది పదిహేను స్టెప్పుల్లో చెప్పేస్తా... అసలే ఇలాంటప్పుడే థియేటర్లో కరెంట్ ఆదా కోసమని ఫాన్లు ఆపేస్తారు. హాలు వాళ్ళకెలాగూ తెలుసు మరి సిన్మా ఏమవుతుందా అనే టెన్షన్లో పడి ప్రేక్షక జనం ఆగిపోయే ఫాన్లకి, వూగిపోయే సీట్లకి అంతగా ఎటెన్షన్ చూపించరని! సరే...ఇక సిన్మా చివరి ఘట్టపు స్టెప్పులు...

నాగేశ్వర్రావ్ ఎంత చెప్పినా జేసుధ రంగనాథ్ దగ్గరికి తిరిగి వెళ్ళడానికి ఒప్పుకోకపోవుట

నాగేశ్వర్రావ్, లక్ష్మి మధ్య అపార్థాలు వచ్చుట

ఇంతలో జయసుధకి రావుగోపాల్రావు ఆస్తేదో కలిసివచ్చుట, ఆమె సంతకం పెడితే ఆ ఆస్తి తనకొచ్చునని రంగనాథ్‌కి తోచుట, దానికోసం కోర్టుకెళ్ళి మరీ జయసుధని తనతో తీసుకెళ్ళిపోవుట

ఈలోగా నాగేశ్వర్రావ్ చెవులకి రెండు డిప్పలు పెట్టుకుని – తన పాట తనకు వినపడకుండా జాగ్రత్త పడుతూ మరీ "పసుపుతాడుకు ముడులు వేసీ బంధమంటే సరిపోదు" అని పాడుట.

ఈ పాట స్టెప్పు దగ్గర ఆగి ఈ పాట విశేషం చెప్పకపోతే ఇంత సిన్మా కథ రాసీ నా బాధని పంచిన ఫలితం పూరిగా దక్కదు నాకు. రేడియోలో నాగేశ్వర్రావ్ పాట పాడడం మొదలు పెట్టగానే ఇంట్లో కూర్చుని ఆ పాట వింటున్న లక్ష్మి రేడియో కట్టేసి టేక్సీ ఎక్కి ఆ పాట వినిపించనంత దూరం వెళ్ళిపోదామన్నట్లు ఎక్కడికో వెళ్ళిపోతూ వుంటుంది. మొదటి చరణం అయ్యి మధ్యలో మ్యూజిక్ వచ్చే చోట "హమ్మయ్య! పాటైపోయింది" అనుకున్నట్లు దిగుతుందో లేదో, పక్కనున్న లౌడ్ స్పీకర్ లోంచి రెండో చరణం వినిపించగానే మళ్ళీ కారెక్కేసి ఆ పాట నుంచి పారిపోతూ వుంటుంది. ఇంతలో ఎవరో ఇద్దరు లక్ష్మి ఎక్కిన కారు పక్కనే వెళ్తూ, వాళ్ళ చేతిలో వున్న ట్రాన్సిస్టర్లో నాగేశ్వర్రావ్ పాడుతున్న పాట లక్ష్మికి పూర్తిగా వినిపించి మరీ వెళ్తారు. సిన్మా తీయడంలో ఇలాంటి దర్శకత్వపు టెక్నిక్ ఉపయోగించింది దాసరి తప్ప ఇంకెవరైనా వున్నారని ఎవరైనా ఎలా అనగలరని!

లక్ష్మిని ఇన్ని పాట్లు పెట్టిన ఆ పాట అయిపోగానే నాగేశ్వర్రావ్ వచ్చి తనసలు జయసుధని ప్రేమించినా లక్ష్మిని ఎందుకు పెళ్ళి చేసుకున్నాడో చెప్పడం, దానికి అలిగి లక్ష్మి భర్తనీ, పిల్లల్నీ కాదనుకుని మంగళసూత్రం కూడా తీసేసి నాగేశ్వర్రావుకి ఇచ్చేయడం, రంగనాథ్ ఆస్తి రాయించుకుని జయసుధని ఇంట్లోంచి తరిమేయడం, ఆవిడ తన కొడుకుని నాగేశ్వర్రావ్ దగ్గరికి వెళ్ళమని చెప్పి సముద్రంలో దూకి ప్రాణత్యాగం చేయడం, నాగేశ్వర్రావ్ చేతిలో వున్న లక్ష్మి మంగళసూత్రం జయసుధ మెళ్ళో పడడం, ఈలోగా పరిగెత్తుకొచ్చిన లక్ష్మి పశ్చాత్తాప్పడి తన పిల్లల్తో పాటు జయసుధ కొడుకుని కూడా దగ్గరికి తీసుకుని నాగేశ్వర్రావ్ దగ్గరికి వెళ్ళడం – ఒక రెండున్నర గంటల సినిమాలో ఓ హీరో-ఇద్దరు హీరోయిన్లు, ఒక ప్రణయం-రెండు త్యాగాలు, రెండు పరిణయాలు-ఒక మోసం, మూడు మరణాలు వెరసి ఈ రాగదీపం ఒక సెంటిమెంటల్ థ్రిల్లర్, ఒక మెంటల్ సెన్స్ కిల్లర్.

## ధనక్ (హిందీ).

"ఆ... తొండి... దాసరి సినిమా కథ అన్నావ్, ఇంకేదో చెప్తున్నావ్!"

"మరే! ఒట్టి కనకాంబరం పూలు మాల కడితే బావుంటుందా?'

"బానేవుంటుందనుకో..."

"మరందులో మరువం, దవనం కలిపితే ఎలా వుంటుంది?"

"బహు బాగుంటుంది...ఘుమ్మంటుంది!"

"అందుకే మరి... దాసరి వారి కథలని ఓ వారకి పెట్టి, ఈ సారికి '***ధనక్***' కథ విను మరి!"

"ఇంతకీ నీ దారెందుకు మార్చావో చెప్పు మరి!"

"చెప్తున్నా...చెప్పేస్తున్నా...ఎప్పట్లాగే సినిమా కబుర్లు రాద్దామని అనుకుని మొదలు పెట్టీ పెట్టబోయానో లేదో, నేను మర్చిపోయిన మార్చి నెల విశేషం ఒకటి గుర్తుకొచ్చింది. అదేంటబ్బా అంటే ప్రాసలతో పిల్లల కోసం సదా-సరదా పుస్తకాలు వీశెలు, వీశెలు

రాసిన డాక్టర్ జాయిస్ గారి పుట్టినరోజు మార్చ్ రెండో తారీఖునే అని. పిల్లలకి నేను చదివి వినిపించే రోజుల్నించి, వాళ్ళు నాకు వినిపించకుండా చదివేంత వాళ్ళైనా, ఇప్పటికీ మార్చ్ వచ్చిందంటే "గ్రీన్ ఎగ్స్ ఎండ్ హేమ్" కానీ, "క్యాట్ ఇన్ ద హ్యాట్" కానీ చదవాల్సిందే. చదివి నవ్వుకోవాల్సిందే. ఈసారి అక్కడితో ఆగిపోకుండా నా సరదా సిన్మాయణంలో ఏదైనా ఒక మంచి పిల్లల సినిమా కథ చెబ్దామనుకున్నా. అందుకే ఈ మార్చ్ నెలలో నా సర-దాసరి దారి మార్చుకుని, నాగేష్ కుకునూర్ దర్శకత్వంలో వచ్చిన "ధనక్" సినిమా కథ చెప్పబోతున్నా. అన్నట్టు నాగేష్ గారి పుట్టినరోజు కూడా మార్చ్ నెలలోనే -30వ తారీఖున అట - వికీపీడియా చెప్పింది. అలా కూడా ఈ నెలకి ఈ కథ కలిసొచ్చింది కదూ!

ఈ సినిమా ప్రత్యేకత ఏంటంటే...
కథ నడిపించిన నాగేష్ కుకునూర్
తెలుగు నేలకు చెందినవారు
తీసిన సినిమాలు మూడు పుంజీల మీద ఒకటి
తీసుకున్న అవార్డులు రెండు పుంజీల మీద ఒకటి
నే చెప్పబోయే కథ వీరు తీసిన "ధనక్"ది
బాలల చిత్రంగా జాతీయ-అంతర్జాతీయ ఖ్యాతి గాంచింది."

"బావుంది - నీ కథ వెనకాల కథ. ఇంతకీ ఈ 'ధనక్' అంటే ఏంటి?"

"ధనక్ అంటే అచ్చతెలుగులో వానవిల్లు - హెచ్చుతెలుగులో ఇంద్రధనుస్సు. ఇంక ఈ కొసరు కబుర్లాపి నువ్వు 'ఊ' కొడతానంటే నేనసలు కథ మొదలెడతా..."

అనగనగా ...బంగారు ఇసకల రాజస్థాన్ ఎడారిలో ఓ బుల్లి ఊరు - చురు ధని. ఆ ఊళ్ళో ఓ చాచా, ఓ చాచీ, పదేళ్ళ అక్క పరీ, ఎనిమిదేళ్ళ తమ్ముడు ఛోటూ. పరీకి షారుఖ్ ఖాన్ అంటే ఇష్టం, ఛోటూకి సల్మాన్ ఖాన్ మహా ఇష్టం. అందుకే తన చేతికి సల్మాన్ లాగే ఒక లేత నీలం రంగు రాయి వున్న బ్రేస్‌లెట్ వేసుకుని వుంటాడు. నవ్వుతో వెలిగే ఛోటూ కళ్ళకి, నక్షత్రాల్లా మెరిసే పరీ నయనాలకి చూపు మాత్రం ఒకటే - పరీది. అక్క కళ్ళతో చూసే ఛోటూకి అన్నీ కనిపిస్తాయి - పొద్దున్నే తనని బడికి తీసుకెళ్ళడానికి తయారయి తన నోట్లో బెల్లం ముక్క పెట్టే అక్క పరీ, భరిణలో రొట్టెలు దాచేసే చాచీ, హుక్కా కాల్చే చాచా.. తో సహా.

రోజూ బడికి వెళ్ళే ముందు బొమ్మా-బొరుసు వేసి బొమ్మైతే షారుఖ్ కథ, బొరుసైతే సల్మాన్ కథ చెప్పుకోవాలని అక్కా-తమ్ముళ్ళ ఒప్పందం. పాపం! చాలా సార్లు బొరుసే పడుతుంది. పరీకి షారుఖ్ కథ చెప్పే అవకాశమే రాదు.

ఛోటూ ఎలాంటి వాడంటే తనే సల్మాన్‌లా అనేసుకుంటూ వుంటాడు. బడి నుంచి ఇంటికొచ్చే దారిలో తనని అడ్డగించిన భానూ గాడితో "నీతో సమవుజ్జీలతో పోట్లాడు. మీ నాన్న దగ్గర్నుంచి నువ్విదేనా నేర్చుకుంది అని ఆయనకి ఎంత బాధేస్తుందో ఆలోచించు. నాలాంటి వాణ్ణి ఆపడానికి సిగ్గులేదా?" అంటూ పరీ "వద్దురా" అంటున్నా వినకుండా దెబ్బలాడి వాడి చేత బట్టలిప్పించుకుని ఇంటికొస్తాడు. పైగా "నాకెలాగూ కళ్ళు కనిపించవు. నా ఒంటి మీద బట్టల్లేకపోయినా నాకేం ఫర్వాలేదు" అని ఎదురు దెబ్బలాడతాడు, తనని చూసి నవ్వుతున్న చాచాతో. పరీకి ఒళ్ళు మండి "నువ్వేమైనా సల్మాన్‌ని అనుకుంటున్నావా అని తిడుతుంది. అలా దెబ్బలాడుకుంటున్న పరీ, ఛోటూలని చాచా "మీ చాచీ ఒచ్చేలోగా తయారవండి. సినిమా కెళ్దాం" అని చెప్పి మాట మారుస్తాడు. ముగ్గురూ చక్కగా తయారయి

ఒంటెత్తు–ఒంటె బండి ఎక్కి సిన్మాకి వెళ్తారు. పూలపూల పచ్చ చుడీదార్ వేసుకుని పరీ, తెల్ల బట్టల్లో ఛోటూ, ఎరుపూ–పసుపుల తలపాగా, నీలం రంగు చొక్కాలో చాచా – ముగ్గురూ కలిసి ఎక్కిన బండి అచ్చు కోటప్పకొండ ప్రభలా రంగులురంగులుగా భలే హంగుగా తోస్తుంది.

సిన్మాహాలు ఓ గుబురుగా వున్న పచ్చటి చెట్టు కింద ఓపెన్ ఎయిర్ థియేటర్. పరీ అక్కడున్న సిన్మా పోస్టర్లని చదివి ఏమేం వున్నాయో ఛోటూకి చెప్తుంది. "లగాన్, పాన్‌సింగ్ తోమర్, ఓం శాంతి ఓం, దబాంగ్" అంటూ. అప్పుడే ఆ పక్కనే అంటించిన "నేత్ర్ దాన్ కీజియే – కిసీకో నయా జీవన్ దీజియే" అని షారుఖ్ ఖాన్ అంటున్నట్టున్న ఒక పోస్టర్ చూస్తుంది పరీ. ఇంతలో సిన్మా మొదలవుతుంది. సినిమా జరుగుతున్నంత సేపూ పరీయో, చాచాయో ఛోటూకి సినిమా అంతటినీ కళ్ళకట్టినట్టు చెప్తూ వుంటారు. సిన్మా అంతా అయిపోయాక ఇంటికి వెళ్తూ పరీ షారుఖ్ నేత్రదానం పోస్టర్ గోడమీంచి చేత్తో లాగి పట్టుకెళ్తుంది.

సిన్మా చూసి ఇంటికొచ్చిన చాచా, పరీ, ఛోటూలని చాచీ తిడుతుంది – తను కష్టపడి సంపాదించిన డబ్బులన్నీ ఖర్చు చేసి సిన్మాలు చూస్తున్నారని. వాళ్ళకి ఆ రాత్రికి రొట్టెలు కూడా పెట్టనని చెప్పి లోపలికి వెళ్ళి పడుకుంటుంది. చాచీ అటెళ్ళగా చూసి ముగ్గురు తోడుదొంగలూ కిసుక్కున నవ్వుకుని, లోపలికెళ్ళి పెట్టెలో చాచా దాచిన చుడువా తీసుకుని తింటూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటారు. ఛోటూ "చాచా! నువ్వు పనిలోకెందుకు వెళ్ళవు?" అనడుగుతాడు. దానికి చాచా "నా నడుం విరిగింది. డాక్టరు అస్సలు నించోనేకూడదు అని చెప్పారు" అనగానే ఛోటూ నవ్వి "అబద్ధమైనా సరిగ్గా చెప్పు" మంటాడు చాచాతో. "అది నువ్వే నాకు నేర్పాలి" అని నవ్వుతాడు చాచా.

గువ్వపిట్టల్లా కువకువలాడుతున్న వాళ్ళ ముగ్గుర్నీ శబ్దం చేయొద్దని విసుక్కుంటుంది చాచీ. ఒక గుబురుగా వుండే చెట్టు, దాని మీదుగా ఎగురుతున్న పక్షులు, చిక్కని రాత్రి చాలా ప్రశాంతంగా వుంటుంది. అలాంటి రాత్రి కబుర్లతో, నవ్వులతో కడుపు అంతగా నిండకపోయినా, కలలతో కళ్ళని నింపుకుని పడుకుంటారు చాచా, ఛోటూ. పరీ అప్పుడు కూర్చుని షారుఖ్ ఖాన్‌కి ఉత్తరం రాస్తుంది. "మేరే ప్యారే సారుఖ్ ఖాన్‌జీ" అని మొదలుపెట్టి "నా పేరు పరీ. నేను రాజస్థాన్‌లో చురుధని అనే వూళ్ళో వుంటాను. నాకు ఛోటూ అనే తమ్ముడున్నాడు. వాడు చూడలేడు. వాడి తొమ్మిదవ పుట్టినరోజు లోగా వాడు చూడగలడని వాడికి నేను మాటిచ్చాను. వాడి పుట్టినరోజు అక్టోబర్ 2వ తారీఖున. ఇంకా రెణ్ణెల్లే వుంది" అంటూ ఉత్తరం రాస్తుంది.

ఆ మరసటి రోజు ఛోటూ బడికెళ్ళే ముందు ఎప్పట్లాగే బొమ్మా–బొరుసా వేస్తే పరీ గెలుస్తుంది ఈ మాటు. షారుఖ్ కథ చెప్పుకుంటూ బడికి వెళ్తూ మధ్య దారిలో పోస్టాఫీసుకి వెళ్తుంది పరీ. ఛోటూని కొంచెం అవతలగా నించోమని వదిలి వెళ్ళి, షారుఖ్ నేత్రదానం వున్న పోస్టర్ చూపించి ఆ ఉత్తరాన్ని ఛోటూకి కళ్ళు తెప్పించడం కోసం షారుఖ్‌కి రాశానూ, స్టాంపులు కొని అతికించడానికి డబ్బుల్లేవు, పోస్టుమాస్టర్ అంటిస్తే తను తర్వాత డబ్బులు తెచ్చిస్తానని చెప్తుంది పరీ. ఆ పాప మొహంలో ఆశ, సంబరం చూసిన పోస్టుమాస్టర్ ఏమ్మాట్లడకుండా ఆ ఉత్తరం తీసుకుంటాడు.

పరీ, ఛోటూ బడికెళ్తుంటారు, వస్తుంటారు. ఎడారి ఇసకలో చాచాతో జారుడుబల్ల ఆడుకుంటూ వుంటారు. పరీ షారుఖ్‌కి ఉత్తరాలు రాస్తూ వుంటుంది, పోస్టుమాస్టర్‌కి ఇస్తూ వుంటుంది.

ఓ రోజు పోస్టుమాస్టర్ చాచాని పిలిచి, పరీ రోజూ వచ్చి షారుఖ్‌కి రాసిన ఉత్తరాలు ఇస్తోందని, తను కొన్ని మాత్రం స్టాంపులు వేసి పోస్ట్ చేశానని చెప్పి, ఓ పోస్ట్ చెయ్యని ఉత్తరాల బొత్తి చాచాకి ఇచ్చి "ఛోటూకి కళ్ళు తెప్పించడానికి ఆపరేషన్‌కి కావల్సిన డబ్బులు నీ భార్య ఎలాగూ ఇవ్వదు. అ నిజం ఇంకా ఆలస్యం చేయకుండా ఆ పసివాళ్ళకి చెప్పు"మని చెప్పి పంపిస్తాడు.

పరీ వాళ్ళ బళ్ళో పాఠాలు చెప్పే టీచర్ ఇంటికొచ్చి ఛోటూని బ్రెయిల్ లిపి నేర్చుకోవడానికి పంపించమంటుంది. పరీకి ఆ మాటే నచ్చదు. దానికి పరీ ఒప్పుకోక ఛోటూని తను చదివిస్తానంటుంది. ఆ మాట విని ఒళ్ళు మండిన చాచీ ఛోటూకి ఇంకెప్పటికీ కళ్ళు రావని, వాడు బ్రెయిల్ నేర్పే బడికి వెళ్ళాల్సిందే అని, పరీని చదువు మానేసి తనతో పాటు పొలం పనులకి రమ్మంటుంది. అది విని కోపమొచ్చి ఛోటూ బయటికెళ్ళిపోయి ఎక్కడెక్కడో తిరిగి చీకటి పడ్డాక ఇంటికొస్తాడు. సల్మాన్ చేత కొట్టించి చాచీని చంద్రమామ దగ్గర పడేలా చేస్తానంటాడు ఛోటూ. అవసరమైతే షారుఖ్‌ని కూడా సాయం పిలుద్దామంటుంది పరీ. అది సల్మాన్ మాత్రమే చేయగల పని, షారుఖ్ వచ్చి ఏం చేస్తాడు అని ఛోటూ ప్రశ్న. కరణ్–అర్జున్ లోలా వాళ్ళిద్దరినీ పిలవాల్సిందే అంటుంది పరీ.

తెల్లారింతర్వాత ముందురోజు చెప్పినట్లే చాచీతో పాటు పరీ పొలంలో పనికెళ్తే, ఛోటూని చాచా బ్రెయిల్ స్కూల్‌కి తీసుకెళ్తాడు. ఆరోజు రాత్రి చాచా ట్రంకు పెట్టె లోంచి డబ్బులెన్నున్నాయో లెక్క పెడదామని తీసిన పరీకి తను షారుఖ్‌కి రాసిన, స్టాంపులెయ్యని, పోస్ట్ చెయ్యని ఉత్తరాల బొత్తి కనిపిస్తుంది. పరీకి బోల్డంత బాధేస్తుంది ఆ ఉత్తరాలు షారుఖ్‌కి చేరనందుకు. అయినా చాచా మీద కానీ, పోస్ట్ మాస్టర్ మీద కానీ కోపం వచ్చినట్లే కనిపించదు.

పొలంలో పని చేస్తున్న పరీకి అక్కడికి మోటార్‌సైకిల్ మీదొచ్చిన గర్దుకాకా వల్ల షారుఖ్ జైసల్మేర్‌లో షూటింగ్ కోసం వచ్చాడని తెలుస్తుంది. చాచాని తనని, ఛోటూని అక్కడికి తీసుకెళ్ళమని అడుగుతుంది. చాచా నవ్వి "మీ చాచీ నన్ను చంపేస్తుంది అలా చేస్తే" అంటాడు. చాచా, చాచీలతో చెప్పకుండా మూడొందల కిలోమీటర్ల దూరంలో వున్న జైసల్మేర్ వెళ్దామనుకుంటుంది పరీ.

ఓ వెన్నెల రాత్రి ... ఓ సంచీలో మంచినీళ్ళ సీసా, తన పోస్ట్ చెయ్యని ఉత్తరాలు, షారుఖ్ నేత్రదానం పోస్టర్ పెట్టుకుని, నిద్రపోతున్న ఛోటూని నడిపించుకుంటూ 300 కిలోమీటర్ల దూరంలో వున్న జైసల్మేర్‌కి బయల్దేరుతుంది పరీ. బంగారురంగు ఇసకగుట్టల మధ్యలో మెరిసే తార్రోడ్డు మీద ఆ అక్కా–తమ్ముళ్ళ ప్రయాణం మొదలు.

ఇక్కడేమో ఇంటి దగ్గర పిల్లలు కనిపించక చాచా చాచీని తిడ్తాడు – "నువ్వు తిండి పెట్టక పోవడం వల్లే ఛోటూకి చూపు పోయింది. ఆ పసివాళ్ళిద్దరినీ అన్యాయం చేసా"వని. చాచీ కూడా పాపం! అలా జరుగుతుందని వూహించలేదేమో – పశ్చాత్తాపపడుతుంది. పిల్లలని వెదకబోయే చాచాకి రొట్టెలు కట్టిస్తుంది.

జైతరన్ 51 కిమీ మైలురాయి దగ్గరకి రాగానే ఆకలేస్తోంది అన్న ఛోటూని ఓ చెట్టు నీడలో కూర్చోబెట్టి సంచీ లోంచి ఓ రొట్టె తీసి చేతికిస్తుంది పరీ. వెంట తెచుకున్న మంచినీళ్ళ సీసాకి చిల్లుండడం వల్ల నీళ్ళన్నీ కారిపోతాయి. ఆ రోడ్డు మీద ఓ పక్కగా లారీ ఆపుకుని, లారీ నీడలో పడుకుని వున్న డ్రైవర్‌ని మంచినీళ్ళు అడిగి తాగుతారు పరీ, ఛోటూ. వాళ్ళు జైసల్మేర్ వెళ్తున్నారని చెప్పగానే వాళ్ళు తప్పుదారిలో వస్తున్నారని, తనతో వస్తే ఆర్నియా జంక్షన్ దగ్గర దింపుతానని, అక్కణ్ణుంచి వాళ్ళు ఏ ట్రాక్టరో ఎక్కి జైసల్మేర్ వెళ్ళొచ్చని చెప్పి లారీ ఎక్కమంటాడు. పరీ, లారీ డ్రైవర్ కాకా షారుఖ్ గురించి మాట్లాడుకుంటూ వుంటే, ఉక్రోషం వచ్చి ఛోటూ చెవులు మూసుకుని "మాఫ్ కర్, సల్మాన్ భాయ్" అంటూ అరుస్తాడు. పిల్లలని ఆర్నియా దగ్గర దింపి, ఓ బ్రెడ్డు, మంచినీళ్ళ బాటిల్ ఇచ్చి జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోతాడు లారీ డ్రైవర్.

మళ్ళీ నడక మొదలు. ఇంతలో ట్రాక్టర్ మీద పాటలు పాడుకుంటూ ఎవరో వెళ్తూవుంటారు. వాళ్ళ పాటలో గొంతు కలిపిన ఛోటూ పాట విని ట్రాక్టర్ ఆపి ఎక్కమంటారు వాళ్ళు. "వాళ్ళు మత్తులో వున్నారు, ప్రమాదమేమో!" అని భయపడ్తున్న పరీకి "మిఠాయి వాసన, ఆడవారి గాజుల శబ్దం వినిపిస్తున్నాయి కాబట్టి ప్రమాదం లేదు, ట్రాక్టర్‌లో వెళ్దామం"టాడు ఛోటూ. మొత్తానికి ట్రాక్టర్ ఎక్కి పాటలు పాడుకుంటూ వాళ్ళతో పాటు పెళ్ళింటికి చేరుకుంటారు పరీ, ఛోటూ. ఆ రోజు రాత్రికి అక్కడే వుండి పాటలు పాడి, మిఠాయిలు తిని

వెళ్ళమంటాడు ఆ ట్రాక్టర్‌లో ఎక్కించుకున్నతను. తన కొడుకు షంషేర్ సింగ్‌ని పరీ, ఛోటూలకి పరిచయం చేస్తాడు. "అంధా" అని ఛోటూని చూడగానే పిలిచిన షంషేర్‌ని "నువ్వు గధావి, కానీ నిన్నలా పిలవను కదా! ఛోటూని అలా పిలవకు" అని కొత్త స్నేహితులతో చేయి కలపమని పంపుతాడు ఆ బంగారు కన్నతండ్రి తన కడుపున పుట్టిన బంగారుతండ్రి షంషేర్‌ని.

షంషేర్ ఛోటూ పక్కన నించుని ఇద్దరి ఎత్తులు కొలిచి చూసి "బాబా! వీడు నా అంతే వున్నాడు. నా బట్టలు వేసుకుంటే బావుంటాడు" అని లోపలికి తీస్కెళ్ళి ఛోటూకి మంచి బట్టలు వేసి ముస్తాబు చేస్తాడు. పరీ కూడా మంచి రంగురంగుల పరికిణీ, బుల్లి ఓణీ వేసుకుంటుంది. షంషేర్, ఛోటూ కలిసి బోల్డంత జిలేబీ తింటారు. పెళ్ళివారితో పాటు పరీ, ఛోటూ కూడా డాన్స్ చేస్తారు. ఆ రాత్రి పక్కపక్కనే పడుకున్న షంషేర్, ఛోటూ కబుర్లు...

*"నీక్కళ్ళు లేవు కదా? సల్మాన్ ఎలా వుంటాడో నీకెలా తెలుసు?"*

*"నాకు నాలుగేళ్ళ క్రితం వరకూ కళ్ళుండేవి. అపుడు పోయాయి. చివరి సారిగా నేను చూసిన సినిమా దబాంగ్."*

*"కళ్ళు పోతే నీకు భయం వేయలేదా?"*

*"నాతో పరీ వుంది కాబట్టి సరిపోయింది. లేకపోతే నాకు చాలా భయమేసేదే!"*

*"పరీకి పెళ్ళైపోతే నీక్కష్టం కాదా?"*

*"కష్టమే! పరీ భర్త ఏమీ అనుకోడని నా ఆశ."*

*"పరీని నేను చేసుకుంటే?"*

*"నిజంగా...? నువ్వు నా మంచి ఫ్రెండువి. మదన్‌మోహన్ కన్నా కూడా! రేప్పొద్దున్నే పరీతో మాట్లాడి నీతో సంబంధం ఖాయం చేస్తా!"*

ఇలా ఛోటూకి కళ్ళు పోవడం దగ్గర్నించి, పరీకి పెళ్ళి సంబంధాల వరకు మాట్లాడుకుని, పెద్దయ్యాక జిలేబి కిటికీలతో, మిఠాయిలతో తాము కట్టుకోబోయే ఇల్లు గురించి చెప్పుకుని పడుకుంటారు ఛోటూ, షంషేర్. ఆ రాత్రి వాళ్ళిద్దరికీ కడుపు నొప్పి వస్తుంది. పరీ లేచి వాళ్ళిద్దరినీ పెరట్లోకి తీసుకెళ్తుంది.

రెండోరోజు పొద్దున్నే పరీని, ఛోటూని జీప్ ఎక్కిస్తాడు ట్రాక్టర్ కాకా. కాపర్దా వెళ్ళి అక్కణ్ణించి జోధ్‌పూర్ బస్సెక్కమంటాడు. పరీ, ఛోటూ ఎక్కిన జీప్ మధ్యలో ఆగిపోతుంది. శీలామాత భక్తులతో కలిసి ఇంకో లారీ ఎక్కి కాపర్దా చేరతారు పరీ, ఛోటూ. వాళ్ళిద్దరికీ లారీలోంచి దిగడానికి ఓ కాషాయాంబరధారి సాయం చేస్తాడు. జోధ్‌పూర్ బస్సెక్కడానికి బస్టాండు కొస్తారు పరీ, ఛోటూ. పదిహేను నిముషాల్లో బస్సు కదిలేలా వుంటుంది. ఈలోగా ఛోటూకి పూరీ తినాలనిపిస్తుది. పూరీ కొనుక్కుని తిని, బస్సెక్కడానికి వెళ్తున్న పరీ, ఛోటూలని ఓ పోలీస్ ఆపి "మీ అమ్మా, నాన్న ఎక్కడ"ని అడుగుతుంటే అంతకుముందు లారీలోంచి దింపినతను వచ్చి, తను వాళ్ళ మామనని చెప్పి పోలీస్ నుంచి తప్పిస్తాడు.

ఈ లోగా ఎక్కాల్సిన బస్సెళ్ళి పోతుంది. కాషాయాంబర-మామ వచ్చి ఆ రాత్రికి మందిర్‌లో పడుకుని పొద్దున్నే వెళ్ళిపోవచ్చంటాడు. మాత దర్శనానికి తీసుకెళ్తాడు. ఆ ఆశ్రమం లోని మాత పూర్వాశ్రమంలో విభా అనబడే షారుఖ్ ఖాన్ ఫ్రెండు. "మీరు షారుఖ్‌ని కలిస్తే నేనడిగానని చెప్పండి" అని చెప్తుంది పరీతో. మర్నాడు కాషాయాంబర-మామ పరీ, ఛోటూలని బస్సెక్కిస్తాడు. లోహావట్, జోధ్‌పూర్ మధ్య దారిలో పిల్లలని దింపుకోమని ఎవరికో ఫోన్ చేసి చెప్తాడు. అప్పుడనిపిస్తుంది "అరె! వీడు చందమామ లాంటివాడు కాదు, గందా-ధందా-మామ" అని. పరీ, ఛోటూలని రోడ్డు మధ్యలో దింపి అక్కణ్ణించి జోధ్‌పూర్‌కి వేరే బస్సెక్కమని చెప్పి వెళ్తాడు బస్సు డ్రైవర్.

బస్సు దిగిన పిల్లలకి ఓ చెట్టు కింద సొమ్మసిల్లి పడున్న ఫారినర్ ఒకతను కనిపించి తాగడానికి కొంచెం నీళ్ళియ్యమని బ్రతిమాలుతాడు. పరీ ఇచ్చిన నీళ్ళు తాగి తేరుకున్న అతను వాళ్ళిద్దరికీ చాక్లెట్లు ఇస్తాడు. ఉకులెలె లాంటి వాయిద్యమేదో వాయిస్తూ పాట పాడుతున్న ఆ ఫారినర్‌తో గొంతు కలిపి తనూ పాడతాడు ఛోటూ. కాలిఫోర్నియా నుంచొచ్చిన ఆ ఫారినర్ తను ప్రపంచశాంతి కోసం నడుస్తూ దేశాలు తిరుగుతున్నానంటాడు. అతనితో కలిసి ఒక రోడ్డు పక్క హోటల్లో చాయ్‌లో బిస్కూట్లు ముంచుకుని తింటారు పరీ, ఛోటూ. ఇంతలో ఆ పక్కనే వున్న ఒకతను వచ్చి తన పేరు ప్రతాప్‌శర్మ అని పరిచయం చేసుకుని, పరీ, ఛోటూ జైసల్మేర్ వెళ్ళాలనుకుంటున్నరని తెలుసుకుని తనూ అటే వెళ్తున్నానని చెప్పి వాళ్ళిద్దరినీ కూడా తనతో రమ్మని కార్లో ఎక్కించుకుంటాడు. కార్లో వున్న మిఠాయిలు తిని స్పృహ తప్పుతారు పరీ, ఛోటూ. ఈ ప్రతాప్‌శర్మ ఎవరో కాదు, ఇంతకు ముందు గందా-ధందా-మామ పిల్లలొస్తున్నారూ, దింపుకోమని ఫోన్ చేసిన మనిషి.

పిల్లల్ని ఎత్తుకుపోతున్న కారుకి రాళ్ళడ్డు పెట్టి ఆపేస్తుంది ఓ తుపాకీవాలీ బంజారన్. ఆమెకి కార్లో ప్రతాప్‌శర్మ, డ్రైవర్ తప్ప ఎవరూ కనిపించరు. వాళ్ళిద్దరినీ కారు దిగమని, కారు ట్రంక్ తెరవమంటుంది. ట్రంక్ తెరిచి వాళ్ళిద్దరూ పారిపోతారు. ఆ బంజారన్ ట్రంకులో దేనిమీదో కప్పినట్లున్న దుప్పటి తీసి చూస్తే, దాని కింద స్పృహ తప్పి వున్న పరీ, ఛోటూ కనిపిస్తారు. వాళ్ళని తీసుకుని తమ గుడారాల దగ్గరికి తీసుకొస్తుంది. మెలకువ వచ్చిన పరీకి ఛోటూ అక్కడున్న వాళ్ళతో గొంతు కలిపి పాడుతూ కనిపిస్తాడు.

వాళ్ళని తీసుకొచ్చిన బంజారన్ ఒక గుడారంలో వున్న దాదీ దగ్గర కెళ్ళమని చెప్తుంది. తనని ఆ దాదీయే పిల్లలెవరో ఆపదలో వున్నారు, కాపాడమని కారు దగ్గరికి పంపించిందని చెప్తుంది. దాదీకి కూడా దృష్టి లేదు కానీ, దివ్యదృష్టి వున్నట్లుంది. ఆవిడ దగ్గర నున్నటి మాజిక్ రాళ్ళు కథలు చెప్తాయట. ఆవిడ పరీని పిలిచి వాళ్ళకి ఓ పెద్ద ఆపద రాబోతోందనిన్నీ, మూడు రోజుల్లోపల వాళ్ళు వెళ్ళాలనుకున్న చోటికి వెళ్తేనే ఛోటూకి కళ్ళొస్తాయనిన్నీ, వాళ్ళకి ఓ లావుపాటి విచిత్ర వ్యక్తి సహాయం చేస్తాడనిన్నీ చెప్తుంది.

మరసటి రోజు పరీని, ఛోటూని ఒంటె మీద ఎక్కించి జేమలా బస్ స్టాప్ దగ్గరకి తీసుకొస్తుంది బంజారన్. అక్కడ ఒకతను చేతిలో స్టీరింగ్ తిప్పుతూ, హారన్ మోగించుకుంటూ రోడ్డు మీద కారు నడుపుతున్నట్లుగా పరిగెత్తుకుంటూ వస్తూ కనిపిస్తాడు. బంజారన్ అతను బద్రీనాథ్ అనే ట్రక్ డ్రైవర్ అని చెప్పి, అతని కుటుంబం ఓ ప్రమాదంలో చనిపోయినప్పట్నుంచీ అతనలా అయిపోయాడని చెప్తుంది. ఆమె మాటలు వింటూనే పరీ "మాకొక వింత మనిషి సహాయం చేస్తాడని అంటూ దాదీ చెప్పిన అతను ఇతనే" అని చెప్పి ఛోటూ చెయ్యి పట్టుకుని ఆ బద్రీనాథ్ వెనకాలే పరిగెడుతుంది.

అలా పరిగెడుతున్నంతసేపూ "అతనింకా గాల్లోనే గాడీ నడుపుతున్నాడా? మనమెందుకు అతని వెనకాల వెళ్తున్నాం? దాదీ ఇంకా ఏమేం చెప్పింది? అతన్ని ఆపి జైసల్మేర్‌కి దారి అడక్కూడదా? మనమింతకీ బస్సెక్కుతామా, బండెక్కుతామా, ఒంటెక్కుతామా ?" అంటూ ఒక దాని తర్వాత ఒకటిగా బోల్డన్ని ప్రశ్నలు అడుగుతున్న ఛోటూని చూసి "దేవుడు వీడి కళ్ళు తీసేసుకుని నోరు మాత్రం ఎందుకు వదిలేశాడో" అని విసుక్కుంటుంది పరీ.

వాళ్ళ ముందు పరిగెడుతున్న బద్రీనాథ్ హఠాత్తుగా రోడ్డు మీద ఆగుతాడు. వెనక్కి చూడమన్నట్టు చెయ్యెత్తి సైగ చేస్తాడు (సినిమాలో మాటలకన్నా దృశ్యమే ప్రధానం అన్న ముళ్ళపూడివారి మాటల్ని చాలా చక్కగా ఇలస్ట్రేట్ చేస్తుంది ఈ సినిమా). ఎందుకా అని చూస్తే వెనక నుంచి తరుముకొస్తున్న ఇసుక తుఫాను. పడగలా పగబట్టినట్లు ముంచుకొస్తున్న ఇసక నుంచి తప్పించుకోవడానికి బద్రీనాథ్ వెనకాలే శిధిలాల మధ్య వున్న అతని ట్రక్కింట్లోకి వెళ్తారు పరీ, ఛోటూ. బద్రీనాథ్ ట్రక్కు బాటరీతో లైట్లు వెలిగించి, పిల్లలకి తినడానికి రొట్టె ఇస్తాడు. పరీ, ఛోటూ కాసేపు స్టీరింగు తోనూ, హారన్ తోనూ ఆడుకుని అలసిపోయి నిద్రపోతారు.

పొద్దున్నే లేచింతర్వాత బద్రీనాథ్ పరీని, ఛోటూని దుబ్‌దుబ్‌బాబా (అంటే దండవేసి అలంకరించిన ఒక మోటార్ సైకిల్) ఆశ్రమం దగ్గరున్న ఒక హోటల్‌కి తీసుకెళ్ళి తినడానికి రొట్టెలు ఇప్పిస్తాడు. "చాచా రోజంతా హుక్కా కాలుస్తూ వుంటాడు, చాచీ చెడ్డది కానీ వంట బాగా చేస్తుంది, నేనొక రోజు హుక్కా దమ్ము తీసుకుని ఓ గంటసేపు దగ్గా" అంటూ ఛోటూ చెప్తూవున్న కబుర్లకి నవ్వుకుంటూ వుంటాడు బద్రీనాథ్.

ఇంతలో దాదీ చెప్పిన మూడ్రోజుల గడువులో ఇంకో రెండ్రోజులు మాత్రమే మిగిలాయని గుర్తుకొచ్చిన పరీకి దిగులేస్తుంది. వెంటనే వెళ్ళి దుబ్‌దుబ్‌బాబాకి దండం పెట్టుకుంటుంది – తొందరగా జైసల్మేర్ చేరేలా చూడమని.

పరీకి పొలం దగ్గర కలిసి షారుఖ్ జైసల్మేర్‌లో షూటింగ్ కొచ్చాడని చెప్పిన గర్దుకాకా గుర్తున్నాడు కదా! ఆ గర్దు తన మోటార్‌సైకిల్ పాడైపోతే అక మెకానిక్ దగ్గరికి తెస్సుకొస్తాడు. ఆ మెకానిక్కేమో దుబ్‌దుబ్‌బాబా ఆశీస్సులు తప్ప ఆ బండిని ఇంకెవరూ బాగు చెయ్యలేరు అని చెప్తాడు. అది విని కోపం వచ్చిన గర్దు "ఇదే ఆఖరుసారి" అంటూ దుబ్‌దుబ్‌బాబాకి దండం పెట్టుకోవడానికి వచ్చి, అక్కడ పరీని చూసి ఆశ్చర్యపడి, సంబరమూ పడి "ఇదేంటి ఇక్కడున్నావ్?" అనడుగుతాడు. పరీ జైసల్మేర్‌కి ఎందుకు వెళ్తున్నానో చెప్తుంది. గర్దు దుబ్‌దుబ్‌బాబాకి దండం పెట్టుకుని మెకానిక్కుని బైక్ బాగు చెయ్యమంటాడు. ఇంతలో ఛోటూ బద్రీనాథ్ దేన్నైనా బాగు చెయ్యగలడని చెప్పి గర్దు బండిని బాగు చేయిస్తాడు.

బద్రీనాథ్ గర్దు మోటార్‌సైకిల్ బాగవ్వగానే తన స్టీరింగ్ తిప్పుకుంటూ వెళ్ళిపోతాడు. గర్దు పరీని, ఛోటూని షూటింగ్ జరుగుతున్న స్థలానికి తీసుకెళ్ళి, వాళ్ళని ఒకచోట వుండమని, తనతో వచ్చిన అమ్మాయి ఎక్కడుందో వెతుక్కొస్తానని వెళ్తాడు. ఈ లోగా షూటింగ్ ఆగిపోయింది, షారుఖ్ వెళ్ళిపోతున్నాడు అంటూ జనం పరుగులు పెడుతూ ఇసక గుట్టలు ఎక్కుతూ వుంటారు. వాళ్ళతో పాటే పరీ, ఛోటూ కూడా పరిగెడతారు. పరీ, ఛోటూలని వెతుక్కుంటూ వచ్చిన చాచా కూడా వాళ్ళలో వుంటాడు. కానీ ఎవరూ కూడా ఒకరినొకరు చూసుకోరు – ఆ తొక్కిసలాటలో.

ఆ ఇసక గుట్ట మీద షారుఖ్ ఖాన్ ఫ్రెండు నని చెప్పుకుంటూ, షారుఖ్ పాదముద్రలు చూపించి, షారుఖ్ మంచినీళ్ళు తాగిన గ్లాసుతో సెల్ఫీలు తీయించుకున్న వాళ్ళ దగ్గర డబ్బులు వసూలు చేస్తూ వుంటాడు ఏఏకే అనే అతను. తనా పూటకి సంపాదించిన డబ్బులెక్కపెట్టుకుంటున్న ఏఏకే దగ్గరికి పరీ వెళ్ళి “షారుఖ్ ఖాన్ బొంబాయి వెళ్ళిపోయాడా?” అనడుగుతుంది. ఛోటూ “నేను షారుఖ్‌ని కళ్ళు తెప్పించమని అడగడానికి వచ్చానం”టాడు. వాళ్ళు చెప్పిన మాటలు విని ఏఏకే "నిజంగా కళ్ళు పోయాయా, లేకపోతే షారుఖ్‌ని చూడడానికి ఇదో వంకా?" అని హేళనగా అడుగుతాడు. పరీ చూపించిన నేత్రదానం పోస్టర్ చూడగానే ఈ పిల్లలు నిజంగానే సహాయం కోసం వచ్చారని అర్థమై, వాళ్ళ మీద జాలిపడి షారుఖ్ అక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో వున్న వూర్లో షూటింగ్ చేస్తున్నాడని చెప్పి, అక్కడికి వెళ్ళాలంటే కొంచెం కష్టమైనా ఎడారిలో తొమ్మిది మైళ్ళు ఇసకలో నడవడం దగ్గరదారి అని చెప్తాడు ఏఏకే. అతని మాటలు విని ఇసకలో పరిగెడుతున్న పిల్లలని "ఇసకలో వెళ్తారా?" అనడిగిన ఏఏకేకి "మాకు ఇసకలో నడక అలవాటే" అంటుంది పరీ పరిగెడుతూనే. "మరి మీ అమ్మా, నాన్న ఎక్కడా?" అనడిగిన ఏఏకేకి "పుష్కర్‌లో ఒంటెల తొక్కిసలాటలో చనిపోయారు ఇంకో పాతిక మందితో కలిసి" అని చాలా మామూలుగా చెప్తాడు ఛోటూ.

ఎడారిలో పరిగెడుతున్న ఛోటూకి దాహం వేస్తుంది. సంచీలో మంచినీళ్ళ సీసా కనిపించక పోయేసరికి పరీకి ఆ సీసాని గర్దు బైక్ మీద మర్చిపోయాడని ఛోటూని తిడుతుంది. "ఎనిమిదేళ్ళు కూడా లేని నా మీద అంత పెద్ద భాద్యత మోపావు. అందులోనూ కళ్ళు

కనిపించని వాడి మీద!" అంటూ ఎదురు దెబ్బలాడుతాడు ఛోటూ. "దేవుడా! నేను నా తమ్ముణ్ణి చంపకుండా నువ్వే కాపాడు" అని ప్రార్థిస్తుంది పరీ.

నడుస్తూ నడుస్తూ పరీ, ఛోటూ బాగా అలిసిపోతారు. పరీ తన చున్నీ ఛోటూ నడుంకి కట్టి తనతో పాటే నడిపించుకుంటూ వెళ్తుంటుంది. కింద వేడి ఇసక, పైన అంతకన్నా వేడిగా ఎండ. దానికి తోడు దారి తప్పుతారు. పరీ తమ్ముణ్ణి "దారి తప్పినట్టున్నాం మనం" అని చెప్తూ "భయమేస్తోందా?" అనడుగుతుంది. ఛోటూకి అక్క మీద ఎంత భరోసా అంటే, ఏ మాత్రం తొణక్కుండా "నువ్వున్నావుగా!" అంటాడు. ఆ మాటతో పరీకి ఉత్సాహం వస్తుందిమళ్ళీ. బొమ్మా-బొరుసా వేసుకుని పరీ షారుఖ్ కథ చెప్పడం మొదలుపెడుతుంది – షారుఖ్‌ని రాజపుత్ దుస్తుల్లో ఊహించుకుంటూ. కథ చెప్తూ చెప్తూ, పెదవులు తడుపుకుంటూ పరీ సొమ్మసిల్లి పడిపోతుంది. అక్క పడిపోయిందని అర్థం అయ్యి ఛోటూ సహాయం కోసం, మంచినీళ్ళ కోసం అరుస్తాడు. ఏడుస్తాడు. ఇంతలో పరీ పట్టుకున్న చున్నీ కొస జారిపోయి ఛోటూ పరీ నుంచి దూరంగా వెళ్ళిపోయి తను కూడా స్పృహ తప్పి పడిపోతాడు. ఇంతలో ఓ గుర్తు తెలియని రాజపుత్ వచ్చి పిల్లలిద్దరినీ ఎత్తుకుని కార్లో ఎక్కించుకుని హాస్పిటల్లో చేర్పిస్తాడు. ఛోటూ ముందుగా కోలుకుంటాడు. పరీ ఎప్పుడు లేస్తుందా అని ఎదురు చూస్తూ వుంటాడు. స్పృహ వచ్చి కళ్ళు తెరిచిన పరీ తమని రాజపుత్ వేషంలో వున్న షారుఖ్ రక్షించాడని చెప్తే ఛోటూ నమ్మడు.

ఎవరో డబ్బులున్నాయన తమని రక్షించి ఈ హాస్పిటల్లో చేర్పించాడని, ఆయనే తన కంటి ఆపరేషన్‌కి కూడా డబ్బులు కట్టాడని చెప్తాడు. ఇంతలో పిల్లలని వెతుక్కుంటూ చాచా కూడా వస్తాడు. చాచీ ఇంటి దగ్గర పిల్లల కోసం ఎదురు చూస్తోందని చెప్తాడు. ఆ మరసటి రోజే ఛోటూకి కంటి ఆపరేషన్. ఛోటూ ఆపరేషన్ థియేటర్ లోకి వెళ్ళేముందు అక్కకి ధైర్యం చెప్తాడు "పరీ! భయపడకు.ఇలా వెళ్ళి అలా వచ్చేస్తాను" అంటూ.

ఛోటూ కోసం ఆపరేషన్ థియేటర్ బయట వేచివున్న పరీకి ఎవరో రాజపుత్ వేషంలో వున్నాయన ఛోటూకి ఆపరేషన్ చేసిన డాక్టర్‌తో మాట్లాడి, బయటికెళ్ళి కారెక్కడం కనిపిస్తుంది. పరీ వెళ్ళి డాక్టర్‌ని "ఆయన ఎవరని" అడిగితే డాక్టర్ సమాధానం – ఓ చిరునవ్వు. వెనక్కి తిరిగొస్తున్న పరీకి ఆ పక్కనే టేబుల్ మీద తను షారుఖ్‌కి రాసి పోస్ట్ చేసిన ఉత్తరాలు కనిపిస్తాయి. వాటినక్కడ చూసిన పరీ కళ్ళల్లో కనిపించిన ఆనందం ధనక్ కన్నా మిన్నగా కనిపిస్తుంది.

ఛోటూ కళ్ళకి కట్టిన కట్లు విప్పే సమయానికి పరీ ఓ కేకు, దాని మీద ఓ కొవ్వొత్తి పట్టుకుని నించుని వుంటుంది. "నువ్వు ముందుగా ఎవరిని చూడాలనుకుంటున్నావ"ని అడిగిన నర్సుకి "సల్మాన్" అని చెప్పి వెంటనే అల్లరిగా "పరీకి కోపం వచ్చిందా?" అనడుగుతాడు. ఛోటూ అల్లరి మాటలకి నవ్విన పరీ కంటి వెలుగులతో ఆ సమయంలో అక్కడ ఆనందాల వానవిల్లు విరుస్తుంది.

***చివరగా ఓ మాట... పేరున్న నటుల పేర్లని మాత్రమే వాడుకుని, వారి ఉనికిని ఏ మాత్రం ఎక్స్‌ప్లాయిట్ చేయని ఒక మంచి అభిరుచి గల దర్శకుడి సినిమా ఇది.***

***నేను పూర్తి కథ చెప్పేసినట్టు అనిపిస్తోంది కానీ ఈ సినిమా వున్నంత గొప్పగా నేను చెప్పలేకపోయాను. ప్రస్తుతానికి నెట్‌ఫ్లిక్స్‌లో వుంది – పిల్లలతో కలిసి చూడదగ్గ సినిమా, తప్పకుండా చూడాల్సిన సినిమా. డిజిటల్ ఏజ్‌లో కోల్పోతున్న బాల్యపు అమూల్య క్షణాలని బుగ్గ మీద సుతారంగా తట్టి గుర్తు చేసే సినిమా.***

***ఇందులో పిల్లలిద్దరూ అద్భుతంగా నటించారు. వాళ్ళే కాదు అందరూ చాలా బాగా నటించారు. సినిమాలో ప్రతి ఫ్రేమూ కూడా అందమైన పెయింటింగ్‌లా అనిపించింది. సాధ్యాసాధ్యాల వాదనలనీ, మురిపించే మాజిక్కుని మరిపించే లాజిక్కులనీ ఒదిలేసి చూస్తే ఈ కథ ఓ అందమైన చేందమామ కథ. పిల్లలతో, పిల్లలకై, పిల్లలని పిల్లలుగా మాత్రమే చూపిస్తూ, పిల్లల ఆలోచనలెలా వుంటాయో పిల్లల వైపు నుంచి***

*అర్థం చేసుకుని, పిల్లల కర్థమయ్యే భాషలో, చిన్ని చిన్ని పిల్లల పద్యాలతో, చూసే పిల్లలకి కూడా సరదా వేసేలా, పిల్లల సినిమాని పిల్లల సినిమాలా మాత్రమే తీసిన నాగేష్ కుకునూర్ గారికి జేజేలు!*

*మార్చ్ నెలలో పుట్టిన నాగేష్ కుకునూర్ గారికి పుట్టినరోజు జేజేలు!*

## మేఘసందేశం

నేనెంచుకుంటున్న దాసరివారి సినిమాలన్నీ పంచపాత్రభరితాలు, పంచావతారపూరితాలు. అనగా *క-స్క్రీ-మా-పా-ద*, *క-స్క్రీ-మా-ని-ద* అనబడే దా-సరళీ-సరాలు.

ఇవాళ్టి మేఘసందేశం *క-స్క్రీ-మా-ని-ద* సరమన్నమాట. అంటే ఏంటన్నమాటా? కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-నిర్మాత-దర్శకత్వం అంటూ పూస గుచ్చినట్లుగా, పూలల్లో దారంలా అన్ని చోట్లా సరదాగా సర్దుకుని దాసరి వున్నట్లన్నమాట.

అటువంటి వెర్సటైల్ పర్సనాలిటీకి ఓ సిన్మతీ-గిద్య-జత సమర్పయామి! అంటూ కథ మొదలెడతా సుమ్మీ!

క-స్క్రీ-మా-పా-ద:

లెక్కలకు ఐదు పాత్రలు ఎప్పుడును
ఒక్కటి కథయట ఇంకొక్కటి చిత్రానువాదమట
మిక్కిలియౌ మాటట కొండొకచో పాటట
ప్రాముఖ్యముగా దర్శకత్వమట దాసరిది సిన్మతీ !

క-స్క్రీ-మా-ని-ద:

లెక్కలకు ఐదు పాత్రలు ఎప్పుడును
ఒక్కటి కథయట ఇంకొక్కటి చిత్రానువాదమట
మిక్కిలియౌ మాటట ఇక్కడ నిర్మాత కూడానట
ప్రాముఖ్యముగా దర్శకత్వమట దాసరిది సిన్మతీ !

**మొట్టమొదటగా ఈ సినిమా ప్రత్యేకతలు**: ఈ సినిమాని దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి అంకితమిచ్చారు. ఇది అక్కినేని నాగేశ్వర్రావు గారికి 200వ చిత్రం. ఇందులో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు తన స్వంత పాత్రనే పోషించారు. ఇందులో దాసరి వారిది పాట ఒక్కటీ లేదు. అదంత పెద్ద

విశేషమేమీ కాదు కానీ కూసింత ఉపశమనం. కేశాలంకరణకి జయసుధకో కమల, జయప్రదకో కమల చేసినట్లున్నారో, లేకపోతే ఒకే కమల రెండు సార్లు విడివిడిగా అనబడ్డారో కానీ ఆ టైటిల్ కార్డ్ చదవడానికి బావుంది. ఇంకా ఇందులో జయప్రద తమ్ముడు రాజబాబు కూడా ఒకట్రెండు సీనుల్లో మాట్లాడుతూ కనిపించాడు. అంత మాత్రానికే నటించాడు అనాలని నాకనిపించట్లేదు. అసిస్టెంట్ డైరెక్టర్స్ పేర్లలో ఒక పేరు యిమంది రామారావు. అది చూడగానే ప్రస్తుతానికి యూట్యూబ్లో ఇప్పుడు మన మధ్య లేని వారి చాలా మంది రహస్యాలను టీవీధి–భాగోతం టైపులో పారాయణ చేస్తున్న ఒకానొక సీనియర్ జర్నలిస్ట్ ఈయనేనేమో అనిపించింది. అంతే...అంతకు మించి ప్రత్యేక ఆసక్తి ఏమీ లేకపోయింది ఆ పేరు మీద. ఇంకొక్క విశేషం ఈ సినిమా ఆద్యంతం వినిపించే నేపథ్యసంగీతం వింటున్నంత సేపూ 1980ల్లో జైపూర్ రాజప్రాసాదాల గురించిన డాక్యుమెంటరీలు తెగ గుర్తొచ్చాయి.

ఈ కబుర్లు దారి వదిలి దాసరి కథ దారి పడితే...

కథ మొదలు వర్తమానంలో. రవిబాబు(నాగేశ్వర్రావ్) కుర్చీలో కూర్చుని ఓ కాయితం వెనకాల ఇంకో కాయితం రాసిచ్చేస్తూ వుంటే ఆ కాయితాలు అందుకుని ఆయన వసతీమణి పద్మ(జయప్రద)"*ముందు తెలిసెనా ప్రభూ ...*" అని పాడేస్తూ వుంటుంది. ఒక్క చరణం పాడుతుందో లేదో ఇంతలో భుజానికో సంచీ వేసుకుని ఒకబ్బాయి(రాజా) వస్తాడు. వచ్చి "మీరు హంపీలో వున్నప్పుడు మా ఇంట్లోనే వుండేవారు. మీ అపూర్వ దంపతుల గురించి ఓ పుస్తకం రాశాను, చదవండి" అని "రవి కిరణాలు" అనే పుస్తకం ఇచ్చి వెళ్తాడు. ఆ పుస్తకంలో పేజీలు తిరగేసిన పద్మ కళ్ళ ముందు గతం గిర్రున తిరుగుతుంది.

ఇక్కణ్ణించి ఆ గతాన్ని నేనూ ఓ కథ లాగే చెప్తాను.

అనగనగా ఓ గోదారి ఒడ్డు. ఆ ఒడునే ఓ పల్లెటూరు. ఆ ఊళ్ళో ఓ మండువా ఇల్లు. ఆ ఇంట్లో ఓ ఉయ్యాలబల్ల. ఆ గోదారొడ్డునున్న పల్లెటూళ్ళోని మండువాఇంటిలో ఉయ్యాలబల్ల మీద కూర్చుని ఊగేదెవరంటే ఇంకా కవి కాని రవిబాబు. గుఱ్ఱబ్బండిలో వస్తూ వెళ్తూ వున్న ఆయన్ని చూసి పేకాట కూడా మానేస్తూ వుంటారు ఊళ్ళోవాళ్ళు. ఇంకా కవి కాని రవిబాబు గారేమో దండలేయించుకుని బడిలో జండావందనాలు చేస్తూ వుంటాడు. ఇంటికొచ్చి కాళ్ళు కడుక్కుని మండువా అరుగు మీద భోంచేస్తూ వుంటాడు.

రవిబాబుకో భార్య పార్వతి (జయసుధ). వారానికి మూడు రోజులు తడిబట్టలతో పూజలూ, వ్రతాలూ చేస్తూ, ఇంటికొచ్చిన భర్తకి భోజనం వడ్డించే తీరిక కూడా లేకుండా తులసికోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ వుంటుంది. కాఫీ నీళ్ళు కూడా తాగక కటిక ఉపవాసాలు చేస్తూ, కటిక నేల మీద పడుకుంటూ వుంటుంది.

వీళ్ళిద్దరికీ ఓ కూతురు – ఓ పదేళ్ళు కూడా లేని పాప, లక్ష్మి . ఎప్పుడూ అమ్మ వెనకాల ప్రదక్షిణాలు చేస్తూ వుంటుంది. ఇసకలో కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయే నాన్న, ఉన్నపళాన వదిలేసి ఊరెళ్ళిపోయే అమ్మ వున్నా, ఇంట్లో ఎవరూ లేకపోయినా ఒక్కతే వుండగలుగుతూ వుంటుంది.

పార్వతికి అన్న, రవీంద్ర బాబుకి బావ జగన్నాథం గారనబడే జగ్గయ్య. ఈయనకి భార్యా-పిల్లలూ-సంసారం ఏమీ వున్నట్లుండవు. ఈయన పనల్లా ఏంటంటే హఠాత్తుగా కవై పోయి ఇల్లూ-ఇల్లాలూ-పిల్లా పట్టకుండా కవితలు రాసుకుంటూ, పాడుకుంటూ తిరుగుతున్న బావగారు రవీంద్రబాబుని ఏ ఇసక మేటల్లోంచో, ఏ ఒడ్డుకి కట్టేసిన పడవల్లోంచో వెతికి పట్టుకుని ఇంటికి తీసుకు రావడం. వీళ్ళతో పాటు ఊళ్ళో ఉండే ఇంకొందరు జనాలు. వీళ్ళందరూ గోదావరికి ఈవల దరి వారు.

ఇక గోదావరికి ఆవల – ఓ పిన్ని, ఆ పిన్నితో పాటు పద్మ (జయప్రద), చంద్రిక(సుభాషిణి) అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు. కళావంతులైన ఇంతులు. వీళ్ళిక రోజంతా జయదేవుని అష్టపదులు పాడుకుంటూ, గోదారికి ఆ దరినున్న ఊరి నుంచి వచ్చేవారికి నచ్చే రీతిలో ఆడుకుంటూ కళాసేవ, కళాభిమానుల సేవా చేస్తూ వుంటారు.

ఓ రోజు రవిబాబు కుర్రాళ్ళు సరదాపడే మేజువాణీలు వద్దని మంగళంపల్లి సంగీతబ్బాణీలు వినే కార్యక్రమం ఏర్పాటు చేయిస్తాడు ఊళ్ళో. ఓ చల్లటి రేయిలో, చల్లటి గాలి అలల నడుమ, సంగీతాంబుధిలో పూర్ణచంద్రుడిలా వెలిగిపోతూ మంగళంపల్లి వారు ***"పాడనా వాణి కళ్యాణిగా..."*** పాడుతూ వుంటారు. అదే పాటకి భరతనాట్యం డ్రెస్ వేసుకుని పట్టపగలు నాట్యం చేస్తున్నట్టు జయప్రద కనిపిస్తుంది. ఆమె చుట్టూ గోదారికావల వూరివారు కొందరు కూర్చుని చూస్తూ వుంటారు. గోదారి ఒడ్డుకి ఇవతల రాత్రి, అవతల పగలు చూపించడం దాసరి దర్శకత్వ చమత్కారం సుమీ్మ!

సరే! మంగళంపల్లి వారి మధురగానానికి రవిబాబు మైమరచిపోతాడు. రాత్రి పడకగదిలో కూడా ఆ పాటే తలచుకుని పరవశిస్తూ వుంటాడు. ఓ రాత్రి ఇల్లాలికి ఉపవాస జనిత నీరసం, ఇంకో రాత్రి ఇంటాయనకి మధురగానామృతపానానంతర పరవశం. అదీ వారి సంసారభవసాగరసారం.

పడగ్గదిలో వుండాల్సిన రవిబాబు హఠాత్తుగా గోదారొడ్డున ఇసకలో నడుస్తూ కనిపిస్తాడు. అతనికి దూరంగా పడవలో ఒకమ్మాయి "ప్రియే చారుశీలే" అంటూ జయదేవుని అష్టపది పాడుతూ వెళ్తున్నట్లు తోస్తుంది. అదేం పడవ ప్రయాణమో గానీ గోదావరికి ఈ దరి నుంచి ఆ దరికి కాక ఒక ఒడ్డు అంచునే వెళ్తూ వుంటుంది – ఏదో సరదాగా షి-కారు చేస్తున్నట్టు. ఆ పాట వింటూ వింటూ వున్న రవిబాబు ఇంటికొచ్చేసి "***ఆకులో ఆకునై***" అంటూ ఓ పాట రాసేసి, ఆ పాట తన భార్య పార్వతి పాడుతున్నట్లూహించుకుంటూ వుంటాడు.

రవిబాబు ఇలా కవిబాబుగా మారుతూ వుండగా ఆ ఊళ్ళో జరిగే మార్పులు ఏంటీ అంటే మగపిల్లలు బడులూ, మగపెద్దలు పనులూ మానేసుకుని గోదారి కవతల అమ్మాయిల నాట్యాలు చూడ్డానికి పడవలేసుకుని వెళ్ళిపోతూ వుంటారు. ఊళ్ళో మగవాళ్ళెవరూ సాయంత్రాలు ఇళ్ళల్లో వుండట్లేదని రవిబాబుకి ఆడవాళ్ళు మొరబెట్టుకుంటారు. ఆ పళంగా రవిబాబు కూడా ఓ పడవేసేసుకుని అవతలొడ్డుకెళ్ళిపోయి మేజువాణీలు జరుగుతున్న ఇంటి ముందు నించుని వుంటాడు. అతన్ని చూసి అటుపక్కగా రాబోతున్న వూరి పిన్నా-పెద్దా-మగవాళ్ళంతా ఎక్కొచ్చిన పడవల్ని వెనక్కి తిప్పుకుని ఊళ్ళోకి వెళ్ళిపోతారు.

రవిబాబు పగలనక, రేయనక, ఎండనక, వాననక ఆ చెట్టుకిందే కూర్చుని వుంటాడు ఊళ్ళో వాళ్ళని అటు రానీయకుండా చూడడానికి. ఇంతలో ఆ ఇంట్లోంచి "***ప్రియే చారుశీలే***" అన్న జయదేవుని అష్టపది వినిపిస్తుంది. ఆ ఇంట్లో వున్న అక్కచెల్లెళ్ళిద్దరు పద్మ, చంద్రిక (జయప్రద, సుభాషిణి) ఆ అష్టపదికి నాట్యం అభినయిస్తూ వుంటారు. అది వినగానే వర్షంలో తడుస్తూ నించున్న రవిబాబు ఆశువుగా అష్టపదికి తెలుగు అనువాదం పాడేస్తాడు.

అష్టపదికి ఈ కింది తెలుగు పదాలు రాసిన వేటూరివారికి అక్షరలక్షలిచ్చేవారేమో రాజుల కాలమైతే!

వదసి యది కించి దపి దంతరుచికౌముదీ హరతి దరతిమిర మతిఘోరం
పలికితే చాలు నీ పలువరుస వెన్నెలలు, కలికి! నా ఎదద చీకటుల పోద్రోలు
స్ఫురదధరశీధనే తవ వదన చంద్రమా రోచయతు లోచన చకోరం
నీ మోము జాబిల్లి మోవి తేనియలు నా నయనములు చకోరమ్ములై గ్రోలు

పాట పాడుతున్న రవిబాబుని తలమీద ఎవరో కర్రతో కొట్టి పారిపోతారు. దెబ్బ తగిలిన రవిబాబు తలకి కట్టుకడతారు పద్మ ఇంట్లోని వారు. దెబ్బ నుంచి తేరుకుని లేచిన రవిబాబు పద్మ ఎంత వుండమన్నా వుండకుండా రాత్రికి రాత్రి పడవెక్కి గోదారి దాటి వూళ్ళో కెళ్ళిపోతాడు. వెళ్ళిపోయినవాడు ఊరికే వుంటాడా – ఉహూ! గోదారొడ్డున పద్మ, చంద్రికలు అభినయిస్తూ వుంటే అష్టపదులు తెనిగిస్తూ వుంటాడు. తను రాసినవి తీసుకుని పద్మ ఇంటికెళ్ళి చదవమని ఇస్తాడు. అలా అలా స్నేహం పెంచుకుని వూరివాళ్ళందరినీ ఏ ఇంటికైతే వెళ్ళనీయకూడదని కాపలా కాశాడో ఆ ఇంటికి తను మాత్రమే వెళ్ళి వస్తూ వుంటాడు. ఆ విషయం తెల్సిన పార్వతి బాధపడుతుంది. అంతకన్నా చేసేదేముంది కానీ!

ఓ రోజు వర్షంలో గుడికెళ్ళిన పార్వతి, అదే సమయంలో వచ్చిన పద్మని చూసి ఎవరో తెలీయక వర్షం తగ్గేదాకా తన ఇంట్లో వుండమని, గుఱ్ఱబ్బండి ఎక్కించుకుని ఇంటికి తీసుకొస్తుంది. అదేంటో వర్షం వస్తూ వుంటే ఎవరైనా తడవకుండా వుండాలని బండి లోపలికి కూర్చుంటారు. వీళ్ళిద్దరూ మాత్రం సగం వర్షంలో తడిసేలాగా కాళ్ళు బయట వేళ్ళాడేసి కూర్చుంటారు. సరే! మొత్తానికి ఇంటికి వస్తారు. వర్షం వెలిశాక వెళ్తానన్న పద్మకు బొట్టు పెట్టి పంపిస్తుంది పార్వతి. అప్పుడే వాళ్ళింటికి వస్తున్న వూళ్ళోవాళ్ళు పద్మే గోదావరి అవతలి గట్టమ్మాయి అని చెప్తారు. అంతే... పద్మని గుఱ్ఱబ్బండి ఎక్కించడానికి వెళ్ళిన కూతురు పదేళ్ళ పిల్ల లక్ష్మి వచ్చేవరకు కూడా ఆగకుండా, వున్నపళంగా వూరెళ్ళిపోయి తన అన్నయ్య జగ్గయ్య దగ్గర వెక్కివెక్కి ఏడుస్తూ కనిపిస్తుంది పార్వతి తరవాతి సీనులో.

ఇటుపక్క రవిబాబు కూడా పద్మ "***నిన్నటిదాకా శిలనైనా...***" అంటూ పాడుతూ ఆడుతుంటే చూస్తూ మైమరచి పోతూ వుంటాడు. మొత్తానికి అంత పెద్ద ఇంట్లో పిల్లొక్కతే వుంటుంది. వూర్నుంచి వచ్చిన జగ్గయ్యకు, జయసుధకు తలుపు తీసిన లక్ష్మి ఒక్కతే కనిపిస్తుంది. నాన్నెక్కడా అనడిగిన మావయ్యకు "అమ్మ ఊరెళ్ళినప్పటినుంచీ ఇంటికి రాలేద"ని చెప్తుంది ఆ పాప. ఎంతటి బాధ్యతా రాహిత్యం! ఎంత సినిమా ఐతే మాత్రం ఇంత ఫిల్మాటిక్ లిబర్టీనా! పదేళ్ళ పాపని లంకంత ఇంట్లో వదిలేసి అమ్మ వూళ్ళోకి, నాన్న ఏట్లొకి వెళ్ళిపోవడమే, హన్నా! కళాత్మకమైన సినిమా, ఇల్లాంటి అల్పాతి అల్పమైన విషయాలు పట్టించుకుంటే కళారాధనకి ద్రోహం చేసినట్టేమో! ఆ పాపం, దోషం నాకెందుకు గానీ, ఆట్టే సందేహాలడక్కుండా కథ చెప్పేసుకుంటా!

ఇంత జరిగినా రవిబాబు ఇంటికి రాడు. పార్వతి అన్నగారు జగనాథం వూళ్ళో వాళ్ళతో మాట్లాడి తన బావగారు ఏం చేస్తున్నాడో తెలుసుకుంటాడు. ఇంతలో సాయంత్రం అయ్యి చీకటి కూడా పడుతుంది. "అన్నయ్యా! మీరు భోజనానికి రండి" అన్న పార్వతితో "బావగార్ని రానీయ్ ఇద్దరం కలిసి భోంచేస్తాం" అంటాడు జగన్నాథం. అలా చూసి చూసి చాలా రాత్రి అయ్యాక గోదావరి ఆవలొడ్డుకి వెళ్ళి రవిబాబుని తీసుకొద్దామని బయల్దేరి పడవెక్కబోతూ పక్కకి చూసిన జగన్నాథానికి అక్కడే ఓ పడవలో కూర్చుని కవితలు రాసుకుంటున్న రవిబాబు కనిపిస్తే దగ్గరుండి అతన్ని ఇంటికి తీసుకొస్తాడు జగన్నాథం. బావగారి వరస చూసి, అతను రాసిన కవీతలు చదివి, ఆ కవితలకి ప్రేరణ పద్మేనని అర్థమై జగన్నాథం పద్మ ఇంటికి వెళ్ళి, ఆమె వల్ల తన బావైన రవిబాబు చెడిపోతున్నాడని, తన చెల్లెలి కాపురం కష్టాల్లో పడిందని చెప్పి ఆ ఊరు వదలి వెళ్ళిపొమ్మంటాడు. పద్మతో మాట్లాడి వచ్చిన సంగతి చెప్పిన జగన్నాథాన్ని "ఎందుకెళ్ళావక్కడికి?" అనడుగుతుంది పార్వతి. ఏంటో! పార్వతికి కన్సిస్టెన్సీ తక్కువ – ఒకసారి "అన్నయ్యా! మీరు..." అంటుంది, ఇంకోసారి "నువ్వు" అంటుంది. అచ్చు నేను అప్పుడప్పుడూ అచ్చుతప్పులతో రాసే నా వ్యాసాల్లాగే!

సరే! ఇంతట్లో పద్మ జగన్నాథం వల్ల ఊరొదిలి వెళ్ళిపోయిందని తెల్సుకున్న రవిబాబు తను ఇల్లూ, వాకిలీ, భార్యా, పిల్లలూ పట్టకుండా తిరగడానికి పద్మ కళాభినయం తనలో కలిగించిన భావావేశమే కారణం, అది అర్థం చేసుకోలేని మీ అందరూ వ్యర్థం అని గట్టిగా అరిచి పద్మ ఖాళీ చేసిన ఇంటికి వెళ్ళిపోయి అక్కడ బండల మీద బొగ్గుతో కవితలు రాసుకుంటూ వుంటాడు. ఈ సినిమా ఏ దారినో, గోదారినో నడిస్తే నడవనీ గాక పాలగుమ్మి పద్మరాజుగారి పద్యాలు ఏసుదాసుగారి మెత్తనైన స్వరంలో అద్భుతంగా పలికాయి.

ఏ సీమల ఏమైతివో! ఏకాకినీ, నా ప్రియా!
ఏలాగీ వియోగాన వేగేనో, నా ప్రియా!
ఏలాగీ మేఘమాస మేగేనో, ప్రియా! ప్రియా! ప్రియా!
గడియ గడియ ఒక శిలయై కదలదు సుమ్మీ!
ఎద లోపల నీ రూపము చెదరదు సుమ్మీ!
పడి రావాలంటే వీలు పడదు సుమ్మీ! వీలు పడదు సుమ్మీ!

★★★ ★★★ ★★★

దారులన్నియు మండె దశదిశలు ముంచెత్తె
నీరంధ భయదాంధకార జీమూతాళి
ప్రేయసీ! ప్రేయసీ! వెడలిపోయితివేల
ఆ అగమ్య తమస్వినీ గర్భ కుహరాల

★★★ ★★★ ★★★

ఎపుడు నీ పిలుపు వినబడదో అపుడు నా అడుగు పడదు
ఎచ్చటికో పైనమెరుగక ఎందుకో వైనమందక నా అడుగు పడదు

★★★ ★★★ ★★★

బొగ్గుతో ఈ విధంగా కవితలు రాస్తూ విరహంతో విలపిస్తున్న రవిబాబుని జగన్నాథం వెళ్ళి ఇంటికి తీసుకొస్తాడు. ఓ నెల రోజుల పాటు పద్మ జ్ఞాపకాలతో రాసిన కవితలన్నింటినీ "మేఘసందేశం" అనే పేరుతో ఓ పుస్తకం అచ్చు వేయించి రవిబాబుకి సన్మానం ఏర్పాటు చేస్తాడు జగన్నాథం.

ఆ సన్మానసభకి పద్మ వస్తుంది. ఆమెని చూసి సభని, సభ కొచ్చిన వాళ్ళని వదిలి "పద్మా, పద్మా!" అని అరుస్తూ పరిగెడతాడు కవిబాబైన రవిబాబు. ఎక్కడెక్కడో తిరిగి రాత్రికి ఇంటికొస్తాడు. "ఎందుకిలా చేస్తున్నారు?" అని నిలదీసిన జగన్నాథానికి "నాకూ, నీ చెల్లెలికీ అభిరుచులు కలవలేదు" అని చెప్తాడు రవిబాబు. అది విన్న జగన్నాథం పార్వతిని తన ఇంటికి తీసుకెళ్ళిపోతాడు.

వాళ్ళెళ్ళిపోయాక ఏదో పెళ్ళి ఊరేగింపు చూస్తూ పార్వతితో తన మొదటిరాత్రిని గుర్తు చేసుకుంటాడు రవిబాబు. కళాత్మక తెలుగు సినిమాల్లో ఇంత ఫికిల్-మైండెడ్-ఆత్మని చూసిన జ్ఞాపకం ఇదే నాకు. ఏదెలా వున్నా ఈ సందర్భంలో వచ్చే "***సిగలో... అవి విరులో***" అనే పాట ఒక స్వరాల-వరాల-మూట. ఎదురుగా వున్న మనసైన మగువ అందాన్ని "***ఎదుట... నా ఎదుట... ఏవో సోయగాల మాలికలు***" అనడం, "***చిరునవ్వుల అరవిడిన చిగురాకు పెదవుల మరిగి...మరలి రాలేవు నా చూపులు...***" "అని వాపోవడంలో వున్న భావుకత్వం, భావకవిత్వం దేవులపల్లి వారి కవితాప్రసాదం. అందులోనూ ఏసుదాసుగారు పాడడంతో పాట లోని ఉన్నతమైన సాహిత్యం మరింత ఉదాత్తంగా వినిపిస్తుంది.

పార్వతి జ్ఞాపకాలతో ఇంటికి తిరిగొస్తున్న రవిబాబుకి ఇంతకు ముందు తనెవరికైతే బుద్ధి చెప్పాడో ఆ ఊరివాళ్ళే కనిపించి "అమ్మగారిని ఉసురు పెట్టకండి" అని చెప్తారు. గుఱ్ఱబ్బండెక్కి అన్నగారింట్లో వున్న తన దగ్గరికొచ్చిన రవిబాబుని "మీతో నేను కలిసివుండలేను" అని చెప్పి పంపించేస్తుంది పార్వతి. అలా ఎందుకు చేశావ్ అనడిగిన అన్న జగన్నాథానికి "ఆయన మనసు నా మీద లేదని తెల్సు, అందుకే అలా చెప్పి పంపించేశాను" అని చెప్తుంది. ఏడుస్తుంది.

పార్వతి దగ్గర్నుంచి వెళ్ళిపోయిన రవిబాబు గడ్డం పెంచుకుని, మళ్ళీ పద్మని తలచుకుని విరహగీతాలు పాడుతూ వుంటాడు "***ఆకాశ దేశాన ఆషాఢ మాసాన***" అంటూ. ఈ పాటని స్వరంలో తేనె నింపుకుని పాడారు ఏసుదాసు గారు. రవిబాబు పాటలు పాడుకుంటూ, "పద్మా, పద్మా" అని కలవరిస్తూ తిరుగుతూ హంపి చేరతాడు. అక్కడ గుడి దగ్గర పడిపోతే ఎవరో వాళ్లింటికి తీసుకెళ్ళి వైద్యం చేయిస్తారు.

ఈలోగా హంపి లోనే వున్న పద్మ చెల్లెలు చంద్రికని పెళ్ళి చేసుకుంటానని ఇంతకు ముందున్న గోదారి ఒడ్డునున్న ఊర్నుంచి ఓ అబ్బాయి వస్తాడు. ఆ అబ్బాయిగా నటించిన అతను జయప్రద తమ్ముడు రాజబాబు. అతను రవిబాబు హంపిలోనే వున్నాడని ఊళ్ళో అందరూ అనుకుంటున్నారని చెప్తాడు. ఆ మాట వినగానే పద్మ హంపి కొండల్లో, కోట శిధిలాల్లో రవిబాబుని వెతకడానికి వెళ్తుంది. అక్కడ రాతిరథం దగ్గర గోడల మీద బొగ్గుతో రాసిన "***నవరస సుమ మాలిక***" అన్న కవితని చదివి ఆ పాటను రవిబాబు పాడుతున్నట్టు, తను నాట్యం చేస్తున్నట్టు ఊహించుకుంటుంది. ఈ సినిమా మొత్తంలో పద్మగా నటించిన జయప్రద కొంచెం పసుపు రంగులోనే కనిపిస్తుంది, ముఖ్యంగా మొహం. ఈ పాటలో మరీ "***ఆ మొహమూ ఎంతో పచ్చబడ్డదీ***" అన్నట్లానింది. అన్నట్టు హంపి శిధిల కుడ్యాల మీద బొగ్గుతో రాతలు రాయించిన దర్శకరత్నని ఆ రాయీ-రప్ప సాక్షిగా తిట్టుకున్నా. రాతి మీద బొగ్గు రాతే కదా, కడిగేస్తే పోతుంది అనుకుని అలా చేశారేమో కానీ నాకసలు నచ్చలేదు.

సరే! రవిబాబుని వెతుక్కుంటూ వెళ్ళిన పద్మకి రాతి మీద రాతలు తప్ప రాసిన రవిబాబు కనిపించక ఇంటికి తిరిగొచ్చి నిరాశగా ఏడుస్తుంటే చెల్లెలు చంద్రిక, కాబోయే మరిది ఓదార్చి పద్మ నాట్య ప్రదర్శన ఏర్పాటు చేస్తే అది తెలిసి రవిబాబు అక్కడికి తప్పక వస్తాడు అని చెప్పి పద్మని నాట్యప్రదర్శనకి ఒప్పిస్తారు.

ఈలోగా రవిబాబు పద్యాలు పాడుకుంటూ హంపి శిధిలాల్లో తిరుగుతూ వుంటాడు. ఆ సందర్భం లోని పాలగుమ్మివారి పద్యమింకొకటి:

ఆశలు రాలి ధూళి పడినప్పుడు – గుండెలు చీల్చు వేదనావేశము ప్రేల్చినప్పుడు
వివేకము గోల్పడి సల్పినట్టి ఆక్రోశము – రక్తబిందువులలో రచయించితి నేను
మేఘసందేశము రూపు దాల్చినది నేడు – ఇది యేమి మరా కవిత్వమో!

రవిబాబుని రక్షించి తమ ఇంటిలో ఆశ్రయమిచ్చిన రంగమ్మ అనే ఆవిడకి అతనే మేఘసందేశం పద్యకావ్యం రాసిన కవి అని తెలిసి, జగన్నాథానికి ఉత్తరం రాస్తుంది, రవిబాబు హంపిలొ తమ ఇంట్లో ఉన్నాడని. ఆ ఉత్తరం చూసిన వెంటనే జగన్నాథం పార్వతిని, మేనకోడలు లక్ష్మి ని వెంటబెట్టుకుని హంపిలో రంగమ్మ గారింటికి వస్తాడు. ఇంతలో ఊరంతా శిధిలాల్లో, దుమ్ములో తిరిగి పద్యాలు పాడినా అస్సలే మాత్రం మాయని మల్లెపూవులాంటి బట్టల్లో రంగమ్మ గారింటికి తిరిగొచ్చిన రవిబాబు వాకిట్లోనే కనిపించిన పార్వతి, జగన్నాథాలని చూసి చడీ-చప్పుడు లేకుండా వెనక్కి తిరిగి ఓ బస్సెక్కి ఎక్కడికో వెళ్ళిపోతూ వుంటాడు. ఆ బస్సులో పక్కన కూర్చున్న ఒకాయన చేతిలో పద్మ ఇవ్వబోతున్న "రాధికా విరహగీతం" నాట్యప్రదర్శన ప్రకటన చూసి బస్సు దిగి వెనక్కి నడుచుకుంటూ హంపి వైపు వస్తాడు రవిబాబు. పార్వతికి కూడా రంగమ్మగారి అబ్బాయి తెచ్చిన కరపత్రం వల్ల పద్మ నాట్యప్రదర్శన గురించి తెలుస్తుంది.

"***రాధికా కృష్ణా రాధికా***" అన్న జయదేవుని అష్టపదిని అభినయిస్తూ పద్మ నాట్య ప్రదర్శన మొదలవుతుంది. అనుకున్నట్టుగానే రవిబాబు అక్కడికి వచ్చి మధ్యలో పాట అందుకుని తనూ పాడతాడు. పద్మ, రవిబాబు కలుస్తారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన పార్వతి, జగన్నాథం ఒకరి చేతుల్లో ఒకరుగా వున్న పద్మ, రవిబాబుల్ని చూసి పలకరించకుండానే వెనక్కి వెళ్ళిపోతారు.

రంగమ్మగారి అబ్బాయినంటూ వచ్చిన మధు (రాజా) ఇచ్చి వెళ్ళిన "రవికిరణాలు" పుస్తకం చదువుతున్న పద్మకి వెనక జరిగిన సంగతులన్నీ ఇలా గుర్తుకొస్తాయి.

ఇక వర్తమానానికొస్తే రంగమ్మగారి అబ్బాయి మధుతో రవిబాబు, పార్వతిల కూతురు లక్ష్మి కి పెళ్ళి నిశ్చయిస్తారు. జగన్నాథం వచ్చి రవిబాబుని కూతురి పెళ్ళి జరిపించమని అడిగితే "నాకా బంధాలన్నీ ఎప్పుడో తెగిపోయాయి, రాననంటాడు" రవిబాబు. జగన్నాథం పద్మతో "ఆయన రాకపోతే దానికి నువ్వే కారణం అనుకుంటారు అందరూ" అని అనగానే పద్మ రవిబాబుకి నచ్చజెప్పి కూతుర్ని కన్యాదానం చేసి రమ్మని పంపిస్తుంది.

ఈ పెళ్ళి సీనులో పెళ్ళికొడుకు కాళ్ళు పాలతో కడుగుతారు పార్వతి, రవిబాబులు. అది కొంచెం వింత ఆచారంలా అనిపించింది నాకు. పైగా శుభమా అని పెళ్ళి జరుగుతుంటే పార్వతి తెల్లరంగు నూలు చీర కట్టుకోవడం కూడా సందర్భానికి తగినట్లనిపించలేదు. కళాత్మక చిత్రం అని సరిపెట్టేసుకున్నా.

పెళ్ళింటికి వచ్చిన రవిబాబుకి కూతురి పెళ్ళి జరిపించి వెనక్కి వెళ్ళిపోవడానికి బయల్దేరుతూ పార్వతికి వెళ్ళొస్తానని చెప్పడానికి వచ్చి ఆమె ఒడిలో "పద్మ, పద్మ" అని కలవరిస్తూ మరణిస్తాడు.

అదే సమయానికి రవిబాబు రాక కోసం ఎదురు చూస్తున్న పద్మ "***బ్రతుకంతా ఎదురుచూచు పట్టున రానే రావు. ఎదురరయని వేళ వచ్చి ఇట్టే మాయమౌతావు, కదలనీక నిముసము నను వదలిపోక నిలుపగా, నీ పదముల బంధింపలేను హృదయము సంకెల జేసి...***" అని పాడుకుంటూ వుంటుంది. ఇంతలో రవిబాబు ఆత్మ అక్కడికి వచ్చి పద్మని కూడా తనతో తీసికెళ్ళిపోతుంది. రవిబాబు మరణవార్త చెప్పడానికి వచ్చిన జగన్నాథానికి పద్మ కూడా చనిపోయి కనిపిస్తుంది.

చివరిగా పాలగుమ్మి పద్మరాజుగారి పద్యంతో సినిమా ముగుస్తుంది.

పూవుతావి వలె పదము భావము వలె
కలిసిపోయిన అరిది జంటలకు ఒక్కటే ప్రాణనాడి
తనువులు వేరైన గానీ బ్రతుకులో మృతిలో ఎడబాటు లేదు

మాసమేమో చైత్రమాసం. సినిమా ఏమో ఆషాఢమాసపు విరహాన్ని మోసుకొచ్చే మేఘసందేశం. దీన్నెన్నుకోవడానికి కారణం ఒకే ఒక్కటి. వికారి నామ సంవత్సర ఉగాది వేళల కవి-పిక-త్రయపు (దేవులపల్లి, వేటూరి, పాలగుమ్మి) కవితా కూజితాలని తలచుకోవడం.

## అద్దాలమేడ

కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం, కొన్ని పాటలు, కొండంత నటన – ఏదో ఒక విభాగంతో సరిపెట్టుకోని దాసరి – SIFDA. అసలు SIFDA అంటే ***సౌత్ ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్స్ ఎసోసియేషన్*** అనుకున్నానిన్నాళ్ళూ – కానీ దాసరి సినిమాల్లో మాత్రం దాని అర్థం ***సిన్మా (S) ఇంక (I) ఫుల్లు (F) దాసరే (D) అంతా (A)*** అని ఇప్పుడు కొంగొత్తగా అర్థమయ్యింది.

ఈ సిన్మాలో మహిళాప్రేక్షకనాడిని పట్టుకుని విజయం సాధించిన దర్శకుడిగా దాసరి రాసిన ఓ డైలాగు నాకు భలే నచ్చేసింది. ఆ డైలాగుకి కితాబుగా ఓ సిన్మతీ గిద్యం చిత్తగించండి:

ఆడది మెచ్చిందే అందం అన్నది ఆనాటి నుడి
ఆడవారు చూసిన సిన్మాదే చందం అన్నది ఈనాటి దా-నా-నుడి
కనులారా దా-నా-రా చిత్రాలు చూసి మహిళలు
తాకు తామే సరి అనిపించిరి, దాసరి సిరి పెంచిరి కారె సిన్మతీ!

**ఇందులో పాత్రలూ-ధారులూ:**
హీరో రాజమోహన్ - మురళీమోహన్ అసలు పేరు "రాజబాబు"లోంచి రాజ, సిన్మాపేరు లోంచి మోహన్ తీసుకుని పెట్టిన పేరు.
హీరోయిన్ సరోజ – గీత.
ఇంకో కాబోయిన హీరోయిన్ లక్ష్మి - అంబిక (అవును ఆవిడే రాధ అక్కగారు).
ఇంకో మహిళాపాత్రధారిణి ఝాన్సీ – ఝాన్సీ.
విలన్ భక్తా - పొడుగ్గా వుండే మోహన్ బాబు అసలు పేరు 'భక్తవత్సలం నాయుడుకి పొట్టిగా కుదిరిన పేరు.
కారెక్టర్ ఆర్టిస్ట్ రెడ్డి గారు – ప్రభాకరరెడ్డి.
హాస్యనటుడు కేవీ చలం - కేవీ చలమే. ఈయనకి ఇది ఆఖరి చిత్రం. టైటిల్స్‌లో కూడా స్వర్గీయ కె.వి. చలం అని వేశారు. పైగా ఈయన అంత్యక్రియలని సిన్మాలో భాగంగా చూపించారు.
మూర్తి - మన ఎర్రసినిమాల ఆర్. నారాయణమూర్తి

వీళ్ళే కాకుండా సినిమా యూనిట్లో ఏక్ట్ చేసిన వాళ్ళ పేర్లు కూడా అటూ-ఇటూగా వాళ్ళ ఒరిజినల్ పేర్లే. కాకపోతే అసలు వాళ్ళే నటించారా లేదా అనేది నాకు తెలీలేదు. అందుకే ఎందుకొచ్చిన అసత్యదోషం అన్నట్టు ఆ కొచ్చెన్ మార్కులు.

కెమెరామన్ మణి - నిజం కెమెరామన్ కె ఎస్ మణి?
నిర్మాత ధర్మరాజు - నిజం నిర్మాత ధర్మరాజు?
ఎసిస్టెంట్ డైరెక్టర్ రమణ - నిజం కో-డైరెక్టర్ సి వి రమణ?
ఇంక వీళ్ళందరి పాత్రలకి దిశానిర్దేశం చేసే దర్శకుడు డి.ఎన్. రావు - ఇంకెవరో కాదు మన దాసరి నారాయణరావు.
దర్శకుడు డి.ఎన్. రావుకి దశ తిరిగేలా చేసే సులక్షణ - సహజనటి జయసుధ.

ఇహ పోతే ఈ సినిమాల్లో చమక్కుమని మెరిసే సిన్మా-తళుక్కు తారలు జయప్రద (ఎంత అందంగా వుందో!!), శ్రీదేవి (అంత ముద్దుగా ఎలా వుంటుందో?!), ఇంకా బో...ల్డు మంది సర్‌ప్రైజు తారలు.

హీరో రాజమోహన్ డైరెక్టర్ డి.ఎన్. రావుతో చేస్తున్న షూటింగ్ వాయిదా పడుతుంది. ఆ సమయం కలిసొచ్చింది కదాని ప్రవర్ధమాన హీరో రాజమోహన్, వర్ధమాన హీరోయిన్ సరోజ రిజిస్ట్రార్ ఆఫీసులో ఎవ్వరికీ తెలియకుండా పెళ్ళి చేసుకుంటారు. విడివిడిగా బయల్దేరి కాశ్మీర్‌కి హనీమూన్

కూడా ప్లాన్ చేసుకుంటారు. సరోజకి ఒక అన్నా, వదిన వుంటారు. వాళ్ళు ఆమెని షూటింగ్ నుంచి ఇంటికి, ఇంటి నుంచి షూటింగ్‌కి తప్ప ఇంకెక్కడికీ వెళ్ళనీకుండా చాలా కట్టడి చేస్తూ వుంటారు. ఇక రాజమోహన్నేమో వాళ్ళ అక్క, బావ తమ కూతుర్ని పెళ్ళి చేసుకోమని బలవంతం చేస్తూ వుంటారు. అటు సరోజ అన్నా వదినలకి గానీ, ఇటు రాజమోహన్ అక్కా బావలకి గానీ, అస్సలెవ్వరికీ వాళ్ళిద్దరికీ పెళ్ళయినట్టు తెలీదు.

ఇంతలో డైరెక్టర్ డి.ఎన్. రావు తను వాయిదా వేసిన సినిమా షూటింగ్ మళ్ళీ మొదలుపెడతాడు. ఆ సినిమాలో హీరోయిన్ కాల్‌షీట్ల గురించి జయప్రదకి, శ్రీదేవికి ఫోన్ చేస్తే వాళ్ళిద్దరూ వేరేవేరే సినిమా షూటింగుల్లో బిజీగా వున్నామని చెప్తారు.

డైరెక్టర్ డి.ఎన్. రావు హీరో రాజమోహన్‌ని పిలిచి వాయిదా వేసిన షూటింగ్ షెడ్యూలు వర్షాకాలం వచ్చేలోగా పూర్తి చెయ్యాలని ప్రొడ్యూసర్, కెమెరామన్ అనుకుంటున్నారని చెప్తాడు. హీరోయిన్ల కాల్‌షీట్లు దొరకలేదని అనుకుంటున్న డి.ఎన్. రావుకి సరోజ పేరుని సూచిస్తాడు రాజమోహన్. వెంటనే సరోజని కూడా పిలిపించి రాజమోహన్ పక్కన హీరోయిన్‌గా బుక్ చేస్తాడు రావు. ఓ పదిహేను రోజులు ఔట్‌డోర్ షూటింగ్ వుంటుందని చెప్తాడు. అలా సరోజా, రాజమోహన్‌ల కాశ్మీర్ హనీమూన్ ప్లాన్ కాస్తా ఔట్‌డోర్ షూటింగ్ షెడ్యూలవుతుంది.

సినిమా ఔట్‌డోర్ షూటింగ్ జరిగే ఊళ్ళో ఆ ఊరి ప్రెసిడెంటు సినిమావాళ్ళు బస చేయడానికి ఒక బంగళా ఇప్పిస్తాడు. దాంతో పాటే వాళ్ళకి ఊరు చూపించడానికి, ఏమన్నా కావాలంటే సాయం చేసి అమర్చిపెట్టడానికి వాళ్ళ మనిషే ఓ కుర్రాణ్ణి కుదురుస్తాడు. ఇవన్నీ చేస్తూనే వాళ్ళ ఊరికి కొన్ని పద్ధతులున్నాయని చెప్తూ "*ఆడపిల్లల్తో మాట్లాడ్డం కానీ, ఏకాసికాలు ఆడ్డం కానీ, ఏళాకోలాలాడ్డం కానీ అట్టాంటియ్యేం జరక్కూడదు. తెల్సిందా?*" అంటాడు. అది విన్న సినిమా వాళ్ళు మాలో అలాంటివాళ్ళెవరూ లేరండి అని చెప్తారు. సినిమాలో పని చేస్తున్నవాళ్ళందరూ వానుల్లోనూ, కారుల్లోనూ ఓ నది ఒడ్డునున్న ఆ వూరికి ఔట్‌డోర్ షూటింగుకని వస్తారు. బంగళా ముందు వేచివున్న ఊరివాళ్ళు సినిమా వాళ్ళకి స్వాగతం పలికి బంగళాలోకి తీసుకెళ్తారు.

సినిమా యూనిట్ వాళ్ళు హాల్లో కుర్చీల్లో కూర్చుని వుంటారు. అప్పుడే లోపలికొచ్చిన డైరెక్టర్ రావుతో నీళ్ళు రావట్లేదని చెప్తాడు కెమెరామన్ మణి. దానికి డైరెక్టర్ సమాధానంగా "పక్కనే గోదావరుంటే నీళ్ళెందుకయ్యా?" అన్న మాట వినగానే నాకు "అర్రె! కాసిన్ని నీళ్ళు, ఓ బ్రిడ్జూ వున్నంత మాత్రానా ప్రతీ నదిదారీ మా గోదారెలా అవుతుందబ్బా?" అనిపించింది.

అసలు సినిమా వాళ్ళెక్కొచ్చిన వాన్లూ, కార్లూ ఆగే సీన్లో దూరంగా కనిపిస్తున్న నీళ్ళూ, బ్రిడ్జూ చూడగానే ఇదెక్కడో చూశానింతకుముందు అని అనిపించడమే కాదు, అదెక్కడ చూశానో కూడా చటుక్కుమని గుర్తొచ్చింది. అది బాపు-రమణల "గోరంత దీపం"లో మోహన్ బాబు శ్రీధర్, వాణిశ్రీల చేత కాపురం పెట్టించిన ఇల్లు. తన ముక్కోతి కొమ్మచ్చిలో ముళ్ళపూడివారు ఆ బంగళా లొకేషన్ గురించి రాసుకున్న ముచ్చటైన మూడు ముక్కలు కూడా గుర్తొచ్చేశాయి: "*బంగళా దృశ్యాలను మెడ్రాస్ దగ్గర్లో ఉన్న ఎన్నూర్ బాక్ వాటర్స్ బాక్‌గ్రౌండ్‌గా తీశాం. అది చూసిన రాజమండ్రి ప్రేక్షకులు కూడా అది గోదావరి ఒడ్డున రాజమండ్రి పాత రైలు బ్రిడ్జి దగ్గరే తీశామని అనుకున్నారు.*" అద్దీ, అద్గదీ ఆ మాటే గుర్తుకొచ్చింది ఈ అద్దాలమేడ సినిమలోని బంగళా చూస్తుంటే. అందులోనూ అదేదో గోదావరి ఒడ్డునున్నట్లు దాసరి హింట్-డైలాగ్ వినగానే "ఇది గోదావరి కాదు, ఏదో కిరి-కిరి" అనిపించింది.

అందులోనూ సిన్మావాళ్ళు కూర్చున్న హాల్లో ఎదురుగుండా కనిపిస్తున్న యు-షేప్ ఆర్చ్, దానికి అవతలి పక్కున్న చదరాలు చదరాలుగా వున్న కిటికీలో లేక కిటికీల్లాంటి డిజైనో, ఇవతలి పక్కున్న సీలింగ్ ఫానూ చూడగానే "***అదే నదీ, అదే బంగళా, అదే గదీ***" అనిపించింది. వెంటనే ఇంకో విండోలో యూట్యూబ్లో గోరంతదీపం సిన్మా పెట్టేస్కుని సరిగా 42 నిముషాల 12 సెకండ్ల దగ్గర ఆ గదినీ, ఈ అద్దాలమేడ గదినీ పోల్చి చూసే డికెక్టీ పని (బుడుగు భాషలో) చేశా. తీరా ఇంతా చేశా కానీ రేపెప్పుడో ఇది చదివినవారు, అద్దాలమేడ సిన్మా గురించి బాగా తెల్సినవారూ వచ్చి "ఆయ్! హన్నా! నువ్వూ, నీ చూపు సరిగ్గా ఆనని డికెక్టీతనం! ఆ బంగళాలు రెండూ వేరు వేరు. ఇంకెప్పుడూ ఇలా బుకాయించకు" అనేస్తారనుకోండి – అప్పుడేం చేయగలను? అందుకే

ఇప్పుడే, ఇక్కడే చెప్పేస్తున్నా – నే చెప్పింది నిజమైతే నే రాసిందంతా చదివుంటారు కనీసం ఇక్కడి దాకా. మీరు చెప్పేదే నిజమైతే నేనింకా ఎన్ని బుకాయింపులు రాసుంటానా ఇంకా ముందు సాగుతారు. పందెం! సరేనా?

సరి! సరి! శాఖాచంక్రమణాలు చేస్తూ రాయడం ముళ్ళపూడివారికి చెల్లును కానీ, నాలాంటి పిల్లకాకివారికి అది చెల్లదు. చదివేవారొల్లరు. అందుకని ఇప్పట్నుంచీ అబద్ధ-గోదారిని అసలు గోదారి గానే నమ్ముతూ కథ కొనసాగిస్తా.

ఇక గోదారి పక్కనున్న బంగళాలో రాజమోహన్ తన గది పక్కనే ఇంకో గదిలో సరోజ వుండేలా ప్లాన్ చేస్తాడు. మధ్యలో ఒక తలుపూ-గొళ్ళెమే అడ్డు. ఇంతలో అటువేపొచ్చిన డైరెక్టర్ రావు సరోజతో వాళ్ళ వాళ్ళెవ్వరూ రాలేదని తెలుసుకుని ఆడపిల్ల ఒక్కతీ గదిలో ఎలా వుంటుందని కోప్పడి ఆమె గదిలో ఝాన్సీని కూడా వుండమంటాడు. రాజమోహన్ గదిలో విలన్ పాత్రధారి భక్తాని కూడా సర్దుకోమంటాడు. ఆ రెండు గదులకీ మధ్యనున్న తలుపుకి తాళం కూడా వేయిస్తాడు. అది చూసి తల పట్టుకున్న రాజమోహన్‌కి డూప్లికేట్ తాళంతో తలుపు తెరిపించి సరోజతో కలిసేలా చేస్తానని హామీ ఇస్తాడు భక్తా.

అన్నట్టు ఒక కనులపండుగైన విషయం – డి.ఎన్. రావు వేసుకున్న ప్రింటెడ్ లుంగీలు, కాంట్రాస్ట్ కలర్ ప్లెయిన్ కుర్తాలు , రాజమోహన్ ధరించిన ప్రింటెడ్ లుంగీ, ప్రింటెడ్ చొక్కా సెట్లు హీరోయిన్ల చీరల కన్నా గొప్పగా వుంటాయి ఈ సినిమాలో.

రెండోరోజు పొద్దున్నే డైరెక్టర్ రావు, ప్రొడ్యూసర్ ధర్మరాజు, కెమెరామన్ మణి లొకేషన్లు చూద్దామని కార్లో బయల్దేర్తారు. దార్లో ప్రెసిడెంటుగారు కుదిర్చిన అతను కనిపించి వాళ్ళకి కావల్సిన గడ్డిమేట్లు, పొలాలు అవీ చూపిస్తూ వుంటాడు. కెమెరా లెన్స్ జూమ్ చేసి చుట్టూ చూస్తున్న డైరెక్టర్ రావుకి దూరంగా ఓ చెట్టు కింద నించుని పాడుతున్న ఓ అందమైన అమ్మాయి పరికిణీ, ఓణీలో కనిపిస్తుంది. ఆ అమ్మాయి తోకలెత్తిన ఆవుల మధ్యా, మేకల మధ్యనా పరిగెడుతూ "***నోరు మంచిదైతే ఊరు మంచిదీ – ఊరు మంచిదైతే నోరే మంచిదీ*** (ఈ పాట ఖచ్చితంగా దాసరి వారి ఇఫ్-దెన్-ఎల్స్ బాణీనే)" అంటూ పాడుకుంటూ పొలాల్లో, తోటల్లో తిరుగుతూ వుంటుంది. ఈ డైరెక్టరూ, అతనితో పాటు లొకేషన్లు చూడ్డానికి వచ్చిన నలుగురూ ఆ అమ్మాయి వెనకాలే పాట వింటూ అప్పుడెప్పుడో పైడ్‌పైపర్ ఆఫ్ హామెలిన్ వెనకాల వెళ్ళిపోయిన అమాయకపు ఎలకల్లా వెళ్తూ వుంటారు.

ఈలోగా ఊళ్ళో ఏం జరుగుతూ వుంటుందంటే ఇద్దరు మనుషులు డప్పులు మోగిస్తూ వుంటే, పిల్లలందరూ గోలగోలగా అరుస్తూ ఒకతన్ని రెండు చేతులూ కట్టేసి నెట్టుకుంటూ ఊరేగింపుగా తీసికెళ్తూ వుంటారు. అలా తీసికెళ్ళి ఒక చోట స్తంభానికి కట్టేసి అక్కడున్న మగవాళ్ళందరూ ఒక్కరొక్కరుగా అతని దగ్గరికెళ్ళి మొహమ్మీద ఉమ్మేస్తూ వుంటారు. అసలక్కడేం జరుగుతోందో చూడ్డానికొచ్చిన డైరెక్టర్ రావు బృందానికి అది ఓ అమ్మాయి చెయ్యి పట్టుకున్నందుకు ఊరివాళ్ళు అతనికి వేస్తున్న శిక్ష అని తెలిసి ఆశ్చర్యపోతారు. ఇంతలో అక్కడికొచ్చిన ప్రెసిడెంటు అప్పుడే పూర్నుంచి వచ్చిన తన కొడుకు రాజు (నళినీకాంత్)ని పరిచయం చేస్తాడు. రాజు తన స్టైల్ చూసి అందరూ రజనీకాంత్ అంటారని చెప్పి సినిమాలో వేషం ఇమ్మని అడిగితే, డైరెక్టర్రావు "నాకు స్టైలక్కర్లేదు. ఏక్టింగ్ కావాలి. స్టైల్ మూణ్రోజులు, ఏక్టింగ్ జీవితాంతం వుంటుంది" అంటూ రజనీకాంత్ లాగా సిగరెట్ నోట్లో పెట్టుకోబోయిన రాజుని జెమినీ సర్కస్‌లో పని చేసే వాళ్ళతో పోలుస్తాడు. ఈ సీన్లో దాసరి డైలాగులు వింటుంటే ఇండైరెక్టుగా రజనీకాంత్‌ని విమర్శిస్తున్నట్టుగా అనిపించింది.

మొత్తానికి కొబ్బరికాయ కొట్టి షూటింగ్ మొదలుపెడతారు. ఊళ్ళో అందరితో పాటు ఆ పరికిణీ-ఓణీ అమ్మాయి కూడా తేగలు తింటూ షూటింగ్ చూడ్డానికి వస్తుంది. షూటింగులో భాగంగా రాజమోహన్‌ని వెనక నుంచి కొట్టడానికి ప్లాన్ విలన్ భక్తాకి అరుచుకుంటూ అడ్డెళ్తుంది. పైగా ప్రతి సినిమాలో ఇలాగే చేస్తాడు, మంచివాడు కాదని భక్తాని తిట్టిపోస్తుంది. డైరెక్టర్రావు ఆ అమ్మాయి అమాయకత్వానికి నవ్వుకుని ఇది సినిమా, భక్తా నిజంగా చెడ్డవాడు కాదు అని సర్ది చెప్తాడు.

ఓ రోజు రాత్రి రాజమోహన్ గదిలోకొస్తుంది సరోజ. వాళ్ళిద్దరూ గదిలో తామిద్దరమే వున్నామని సంతోషపడే లోగా ఇంతలో డైరెక్టర్రావు తన గదిలో నీళ్లు లీకవుతున్నాయని రాజమోహన్ గదిలో పడుకుంటానని వస్తాడు. డైరెక్టర్ సరోజని చూస్తాడేమో అన్న భయంతో రాజమోహన్ సరోజని బాత్రూం లోకి పంపించి తలుపేసేస్తాడు. ఇంకక్కణ్ణించి ఓ పది నిముషాల పాటు దాసరి వారి నాసిరకపు సీనరీ.

షూటింగ్ జరుగుతున్న పక్క వూరే రాజమోహన్ బావది. ఆయన రాజమోహన్ దగ్గరకొచ్చి తన కూతుర్ని పెళ్ళి చేసుకోనంటున్న రాజమోహన్ గురించి డైరెక్టర్‌కి చెప్పి సినిమాల్లేకుండా చేస్తానని బెదిరించి, డైరెక్టర్రావు దగ్గరికెళ్ళి అలాగే చెప్పి రావు చేత తిప్పితిప్పి తిట్టించుకుని పిప్పైపోతాడు.

ఆ రోజు రాత్రి గదిలో కుదర్లేదని రెండోరోజు రాత్రి రాజమోహన్ సరోజని బయటికి రమ్మంటాడు. చీకట్లో మాట్లాడుకుంటున్న వాళ్ళని చూడడానికి సిన్మావాళ్ళందరూ బయటకొస్తారు. రాజమోహన్ బావ కూడా అరుచుకుంటూ వస్తే అతన్నీ, మిగిలిన సినిమా వాళ్ళందర్నీ కసిరి లోపలికి వెళ్ళమంటాడు డైరెక్టర్రావు. అందరూ వెళ్ళిపోగానే రాజమోహన్‌ని, సరోజని గదిలోకి తీసుకెళ్లి మళ్ళీ గుక్కతిప్పుకోకుండా బో...ల్డన్ని డైలాగులు తిప్పితిప్పి అవే మాటల్తో చెప్పి, వింటున్నవాళ్ళిద్దరికీ గుక్కపెట్టి ఏడుద్దామా అనిపించేలా చేస్తాడు డైలాక్కింగు డైరెక్టర్రావు. ఆ వాచాలతా ప్రహరణాలు తిని భరించలేక రాజమోహన్ తనకీ, సరోజకీ పెళ్ళయ్యిందని రావుకి చెప్పేస్తాడు. అది విని డైరెక్టర్రావు శాంతించి వాళ్లిద్దరినీ అభినందిస్తాడు. వాళ్ళకి పెళ్ళయిందని అందరికీ చెప్తాడు. ఆ సంబరంలో రాజమోహన్, సరోజ పాడుకున్న "***నా జీవిత గమనంలో ఒక నాయిక పుట్టింది***" అన్న పాట భలే ప్లెజెంట్ సర్‌ప్రైజ్ నాకు. మామూలుగా కన్నడ సినిమాల్లో వాడేసిన స్టాక్ ట్యూన్లు తెలుగు పాటలకి అరువిచ్చే రాజన్-నాగేంద్ర ఈ సినిమాకి చేసిన సంగీతం చాలా గొప్పగా, తాజాగా అనిపించింది. ఏ మాటకామాట చెప్పుకోవాలి. దాసరి సినిమాల్లో మాటలు సాగతీతతో చంపేస్తే, పాటలు సంగీతంతో ప్రాణం పోస్తాయి. తీరా వాళ్ళిద్దరూ పాడుకున్న పాట ఇలా అవుతుందో లేదో అలా వచ్చేస్తాడు సరోజ వాళ్ళన్న. సరోజకి, రాజమోహన్‌కి పెళ్ళి చేశాడని డైరెక్టర్రావుని తెగ తిట్టి, ఆ రావు చేత ఓ పేద్ద దవిలాగొహటి చెప్పించుకుని, సినిమా వాళ్ళందరి చేతా తన్నించుకుని, చివరాఖరికి నాకూ, నా చెల్లెలు సరోజకి ఏ సంబంధమూ లేదనీ, ఇక మీదట ఆమె దారికి అడ్డు రాననీ ఓ కాయితమ్మీద రాసి సంతకం చేసి ఇచ్చి వెళ్ళిపోతాడు. అలా సరోజ అన్న పాత్ర కంచికెళ్ళిపోతుంది.

ఓ రోజు గుళ్ళో షూటింగ్ జరుగుతూ వుంటుంది. అక్కడ సీనేంటంటే ఒక బాలవితంతువైన ఝాన్సీని విగ్గు పెట్టుకున్న ప్రభాకర్రెడ్డి పెళ్ళి చేసుకుంటానంటాడు. ఆ షూటింగ్ చూసిన శారద అనే ధవళవస్త్రధారిణి ఆ రాత్రి డైరెక్టర్రావు దగ్గరికి వెళ్ళి మీరు ఆడవాళ్ళ గురించే ఎందుకు సినిమాలు తీస్తారు అనడుగుతుంది. అడిగిందే తడవు "***మగవాళ్ళ జీవితాలు ఆడవాళ్ళ జీవితాలని చుట్టుకుని, అంటిపెట్టుకుని వుంటాయి కనక. ఎవరి జీవితంలో ఏ మలుపు తిరిగినా దానికి కారణం ఆడది కనక. అందానికి బంధానికి, ప్రేమకి అనురాగానికి, కక్షకి కావేశానికి, మాతృత్వానికి భ్రాతృత్వానికి వారధి, ముఖ్య సారధి ఆడది అందుకు***" అని ఒక ***ది-ధి-థి*** డెఫినిషన్ చెప్పి ఆగుతాడు డైరెక్టర్రావు. తోచీతోచని అమాయకప్పక్షి శారద అది విని ఊరుకోవచ్చుగా. ఉహూ! మళ్ళీ అంతకన్నా వేరే ఉద్దేశ్యం లేదా అనడుగుతుంది. ఇక్కడ, ఇల్లిక్కడ డైరెక్టర్రావు చెప్పిన డైలాగు వినగానే "హమ్మ! దాసరీ! ఆంధ్రమహిళాప్రేక్షకనాడిని పట్టుటలో, కనిపెట్టుటలో నీకెవరు సరి?!" అనిపించింది. అదేంటో చెప్పేస్తున్నా మరి! ఆ డైలాగేంటంటే "***అంటే బిజినెస్ కూడా వుందనుకోండి. ఆడవాళ్ళెవరూ సినిమాకి ఒంటరిగా రారు. వచ్చేటప్పుడు భర్తని తీసుకొస్తారు. భర్తతో వచ్చేటప్పుడు పిల్లలూ వస్తారు. పిల్లలూ వచ్చేటప్పుడు ఇంట్లో వున్న ముసలాళ్ళు కూడా వస్తారు. అంటే ఒక ఆడది వస్తుందంటే కూడా పది పదిహేను మందిని తీసుకొస్తుంది. ఒక్కసారితో విడిచిపెట్టరు కదా! కనీసం మూణ్ణాలుగు సార్లైనా చూస్తారు. అంటే ఇంటికి ఒక్కొక్క సినిమాకి నలభై, ఏభై టిక్కెట్లు తెగుతాయి. అందుకే మీ ఆడవాళ్ళంతా మా సినిమా వాళ్ళకి శ్రీమహాలక్ష్ములు. మీ ఆడవాళ్ళకి సినిమా నచ్చిందనుకోండి నిర్మాతకి కనకాభిషేకమే***"

ఇదిగో ఇలానే ఆనాటి ఆడవాళ్ళ సెంటిమెంటాభిరుచిని ఇంత చులాగ్గా అర్థం చేసేస్కుని హీరో, హీరోయిన్ పాత్రల్తో రకరకాల పెర్ముటేషన్స్ & కాంబినేషన్స్ కథలు రాసి(యించి?) టీవీ సీరియళ్ళు లేని ఆ రోజుల్లో మహిళాప్రేక్షకులని సినిమా హాళ్ళకి రప్పించాయి దాసరి సినిమాలు. పైన్రాసిన డైలాగ్ వినగానే నాకు చటుక్కున శాంతాంటీ గుర్తుకొచ్చారు. పిల్లలు స్కూల్‌కి వెళ్ళాక ముందు అంకుల్‌తో మార్నింగ్‌షో చూసొచ్చి. ఇంటికొచ్చింతర్వాత "దాసరి

నారాయణ్రావు విమెన్‌ని ఎంత బాగా అర్థం చేసుకోపోతే ఇంత బాగా డైరెక్ట్ చేస్తాడు?" అని తెగ మెచ్చేస్కుని తనతో పాటు సినిమాకి రమ్మని అపర్ణ, ఆర్తిలని అడగడం, అటుగా వెళ్ళిన నాక్కూడా సినిమా గొప్పదనం గురించి చెప్పడం చేసేవారు. ఈ అద్దాలమేడ సినిమా పుణ్యమా అని నాకెంటో ఇష్టమైన శాంతాంటీని తలుచుకోవడానికి ఇంకో సందర్భం దొరికింది.

సరే! మళ్ళీ సినిమా–దారి తప్పేశా! వెనక్కి మళ్ళీ మళ్ళీ దాసరి–వారి–సినీదారికొచ్చేశా. ఇంత అమాయకంగా మాట్లాడుతున్న శారద ఒక్కసారిగా మీ సినిమాల్లో లాగే నేనూ బాలవితంతువుని, నన్ను మీరు పెళ్ళి చేసుకుంటారా అనడగ్గానే డైరెక్టర్రావు తనెందుకు శారదని పెళ్ళి చేసుకోలేడో చెప్పడానికి తన ఫ్లాష్‌బాక్ మొదలెడతాడు. డి.ఎన్. రావు ఇంకా డైరెక్టర్రావు కాకముందు కథలు రాసి, ప్రింట్ చేయించడానికి డబుల్లేవని దాచుకుంటూ వుంటాడు. వాటిని చదివి అతని కొలీగ్ సులక్షణ (జయసుధ) ఎంతో బావున్నాయని మెచ్చుకుని తన డబ్బుతో డి.ఎన్. రావు రాసిన ఒక నవల ప్రింట్ చేయిస్తుంది. దాన్ని చదివి సినిమా తీస్తానని ఓ సినిమా నిర్మాత రావుని మెడ్రాస్‌కి రమ్మని ఉత్తరం రాస్తాడు. సులక్షణ నువ్వు దర్శకుడు కావాలని "***ఎదురు చూస్తున్నాను***" అంటూ ప్రోత్సాహకరంగా ఉత్తరాలు రాస్తూ వుండగా ఉట్టి డి.ఎన్. రావు కాస్తా డైరెక్టర్ డి.ఎన్. రావు అయిపోతాడు.

నాకు ఈ సిన్మాలో కొన్ని చమక్కులు భలే నచ్చాయి. డి.ఎన్. రావు మెడ్రాస్ వెళ్లినప్పటి సీన్లలో – ఎల్వీ ప్రసాద్, రామానాయుడు, అల్లు రామలింగయ్య, జయమాలిని, ఎంటీఆర్, ఏఎన్నార్, కృష్ణంరాజు (***గోల్కొండ అబ్బులు*** సినిమా షూటింగ్), రేఖ, జితేంద్ర, అశోక్‌కుమార్ (తెలుగు ***గోరింటాకు*** సినిమాకి హిందీ వెర్షన్ ***మెహందీ రంగ్ లాయేగీ***), కృష్ణ, శోభన్‌బాబు (***కృష్ణార్జునులు*** సినిమా షూటింగ్), గుమ్మడి – ఇలాంటి గొప్పగొప్ప వాళ్ళెందరో కనిపిస్తారు.

తను దర్శకత్వం వహించిన మొదటి సినిమా విజయవంతమైన సందర్భంలో హైద్రాబాదు సంగం థియేటర్‌లో సినిమా స్క్రీనింగ్‌కి వచ్చిన డి.ఎన్. రావుని కలవడానికి వచ్చిన సులక్షణ జనం మధ్యలో చిక్కుకుని తొక్కిసలాటలో దెబ్బలు తగిలి చనిపోతుంది. ఈ కథంతా చెప్పి సులక్షణని మర్చిపోలేకపోతున్నానని బాధ పడుతున్న డి.ఎన్. రావుకి క్షమాపణ చెప్పి శారద వెళ్ళిపోతుంది.

అంతకు ముందు పొలాల్లో పాట పాడుతూ కనిపించిన పరికిణీ–ఓణీ అమ్మాయి లక్ష్మి సినిమా యూనిట్ వాళ్ళకి పాలు పోయడానికి వస్తుంది. ఆ అమ్మాయిని చూసి బావుందని చెప్పి ఫొటోలు తీయించి సినిమాలో వేషం ఇస్తే చేస్తావా అనడుగుతాడు డైరెక్టర్రావు. అది వినగానే లక్ష్మి తన ఫొటోలు చూసుకుంటూ అప్పుడే రాజమోహన్‌తో హీరోయిన్‌గా పాట పాడేస్తున్నట్టు కలగనేస్తుంది. ఆ కలలో పాట "***తొలిచూపు ఒక పరిచయం, మలి చూపు ఒక అనుభవం***" ఇంకో ప్లెజెంట్ సర్‌ప్రైజ్. ఈ పాట అసలు ఈ సినిమాలో అని ఎప్పుడూ అనుకోలేదు.

ఇక సినిమా వాళ్ళ విషయానికొస్తే కె.వి. చలం ఏదో పనుందని మెడ్రాస్ బయల్దేరి వెళ్తూ రైలు ప్రమాదంలో చనిపోయాడని ఫోన్ వస్తుంది డైరెక్టర్రావుకి. అది వినగానే అందరూ మెడ్రాస్ వెళ్తారు. కె.వి.చలంకి ఇది ఆఖరి సినిమా. ఆయన అంతిమయాత్రని కూడా సినిమాలో వాడుకున్నారు. అందులో సత్యనారాయణ, అల్లు రామలింగయ్య లాంటి ఈ అద్దాలమేడ సినిమాలో లేని వాళ్ళు కూడా కనిపిస్తారు.

సినిమా యూనిట్ వాళ్ళందరూ మళ్ళీ ఔట్‌డోర్ జరుగుతున్న ఊరికి తిరిగి వచ్చాక ఈ సినిమాలో నటించాల్సిన జయంతి అనే ఆర్టిస్ట్ సింగపూర్ వెళ్ళిందని ఆమెకు బదులుగా లక్ష్మి ని తీసుకుంటారు సినిమాలో ఏక్ట్ చేయడానికి. లక్ష్మి కలగన్నట్టుగానే రాజమోహన్‌తో "***పట్టపగలు నువ్వు నవ్వితే, ఆ నవ్వులన్ని వెన్నెలైతే***" అన్న ఓ మంచి పాట పాడుకుంటుంది సినిమాలో.

**ఇంక ఈ సినిమాలో మిగిలిన స్టెప్పులు**: ఇంతలో అప్పటిదాకా జైల్లో వున్న లక్ష్మి మేనమామ (గోకిన రామారావు) బయటికి రావడం, సినిమాలో లక్ష్మి నటించడానికి వీల్లేదని గొడవ చేయడం, సినిమా వాళ్ళకి సాయం చేయాలనుకుని ప్రెసిడెంటు లక్ష్మి మేనమామని మళ్ళీ జైల్లో పెట్టించడం, మళ్ళీ

సినిమాలో నటిస్తానని చెప్పడానికి అర్థరాత్రి పూట లక్ష్మి సినిమా వాళ్ళున్న బంగళాకి బయల్దేరి వెళ్ళడం, లక్ష్మి ని చీకట్లో ఎవరో రేప్ చేయడం, అది చేసింది సినిమా వాళ్ళే అని ఊరి ప్రెసిడెంటు అనుకోవడం, సినిమా వాళ్ళకి ఊరివాళ్ళెవరూ తిండి కూడా దొరక్కుండా చేయడం, ఆకలితో సినిమా యూనిట్‌లో ఓ కుర్రాడు చనిపోవడం, విలన్ వేషాలు వేసే భక్తా పిల్లల్ని ఊరివాళ్ళు ఎత్తుకుపోవడం, తన వాళ్ళని రక్షించడం కోసం డైరెక్టర్ రావు ఆ నేరం తన మీద వేసుకోవడం, ఆ ఊరి ఆనవాయితీ ప్రకారం ఊరివాళ్ళందరూ డి.ఎన్. రావుని కట్టేసి మొహమ్మీద ఉమ్మేయడం, ఇంతలో ఊరి చివర నడుస్తున్న లక్ష్మి కి తనని రేప్ చేసిందెవరో తెలియడం, లక్ష్మి అతన్ని సీసా పగలగొట్టి పొడిచి చంపెయ్యడం, డి.ఎన్. రావు నిర్దోషి అని తెలియడం, అందరూ డి.ఎన్. రావుని క్షమించమని అడగడం, లక్ష్మి జైలుకెళ్ళడం, సినిమా వాళ్ళు తిరిగి మెడ్రాస్ వెళ్ళిపోవడం.

అసలీ సినిమా పేరు "అద్దాలమేడ" అని చూడగానే భలే రొమాంటిక్ టైటిల్ అని మురిసిపోయి చూడడం మొదలు పెట్టాను. కానీ ఈ సినిమా దాసరి నారాయణరావు తీసిందెందుకంటే - అద్దాలమేడల్లోంచి కనిపించే సినిమా వాళ్ళ గురించి ఏవేవో ఊహించుకుంటూ, ఆ సినీ-ప్రపంచానికి దూరంగా వుండే సినిమావాళ్ళు కానివాళ్ళు అసలు సినిమావాళ్ళ గురించి పెంచుకునే అపోహలని తుంచివెయ్యడానికి. ఈ సినిమాలో అందరూ వారివారి పాత్రల్లో ఒదిగిపోయారు అవి వారివారివే కాబట్టి. అంతకు మించి పట్టకుండా ఎదగడానికి వారి పాత్ర పట్టదు కాబట్టి.

నేననుకున్నట్టు ఈ సినిమా రొమాంటిక్కూ కాదు, రోమాంచకపు థ్రిల్లరూ కాదు, అలా అని రొటీనూ కాదు. కానీ ఇంకో దాసరి వారి సంభాషణా, నట, దర్శక విశ్వరూప నిదర్శనం. జై డి.ఎన్. రావూ!

## యువరాజు

ఊసుపోని వేళల్లో నన్ను పిలిచి ఎవరైనా
సినిమాని నిర్వచింపుము! అనడిగితే నేనేమంటానో తెలుసా? మీకు తెలుసా?
సినిమా ఒక కాలక్షేపం అంటా
సినిమా చూచు వేళల్లో కట-కట దవడాడు నన్ను చూసి ఎవరైనా
సినిమా చూచునప్పుడు నిర్-వచింపుము! అంటే నేనేం చేస్తానో తెలుసా? మీకు తెలుసా?
సినిమా చూచునప్పుడు కాలక్షేపం-బఠాణీలు తినకుంటా

అంతే! అంతకు మించి సినిమా గురించి నా వరకు నాకెలాంటి ఎక్స్‌పెక్టేషన్సూ లేవు. హీరో హీరోయిన్లు చూడ్డానికి బావుండి, మరీ జిడ్డు కారిపోకుండా అలా అని పౌడర్ కేకులు ఫేసుపాకుల్లా వేసేసుకోకుండా, పాటలు బావుండి, అంతా ఏడుపే కాకుండా అక్కడక్కడా పరమాన్నంలో జీడిపప్పులా ఒకటో రెండో నవ్వులు, ఒక సుఖాంతమైన క్లైమాక్స్ - బస్! నా టికెడ్డబ్బులు కిట్టింపైనట్లే.

అల్లాంటి ఒకానొక సినీ-సానుకూల దృక్పథంతో వుండే నేను ఈసారి ఎంచుకున్న సినిమా
ధిలాసా-డీఎన్నార్ తీసిన కులాసా-ఏఎన్నారు విలాసాల నటనా పటిమ – యువరాజు.

ఈ యువరాజుని తెరకెక్కించే ముందు కూడబలుక్కున్నారేమో డీఎన్నారూ, ఏఎన్నారూ!
ఏమనీ?
కథేదైనా సరే అనిన్నీ
ఒకరికి ఇద్దరైన వేడుకే అనిన్నిన్నీ
కావాలి కాశీపతి మోడలే అనిన్నిన్నిన్నీ.

అటువంటి అచ్చొచ్చిన వన్నీస్టూ-టూ కథ ఇంకొక్కమారు తీసి, అక్కినేనివారికి పక్కనిద్దర్ని చేర్చి "చూడు, దా దా" యని ఆంధ్ర ప్రేక్షక ప్రపంచాన్ని ప్రియమార పిలిచిన దాసరివారికి నాదో సిన్మతీ గిద్యం:

నారీనారీ నడుమ ఏఎన్నారే
ఏ సినిమా ఐననూ దారి డిఎన్నారిదిదే
నటసామ్రాట్టుకి ప్రేమకో యువతి, పెళ్ళికో పడతి
వెరసి ముగ్గురికి దక్కె ఓ ఉయ్యాల సిన్మతీ!

సినిమా మొదలౌతూనే డప్పుచప్పుడుకి అల్లువారాడే పులివేషపు చిందు ఎంచక్కటి కనువిందు. అందులోనూ వారి వేషం పేరు ఇందులో పులిపాపారావు. ఆహా! పాత్రకు తగిన పాత్రత! ఈ పాపారావు అతిశయోక్తులు మాట్లాడుతూ వుంటాడని “గ్యాస్ కబుర్లు చెప్తున్నాడ”ని అందరూ అంటూ వుంటారు.

ఈ గ్యాస్ పులిపాపారావు గారికో స్నేహితుడు, పైపుతో మొక్కలకి నీళ్ళు పోస్తూ అదే వ్యాయామం అనుకునే అమాయకపు ***మచ్***-రంగాసుబ్బారావుగారు (ప్రభాకర్రెడ్డి). ఈయనకేమో ఎవరేం చెప్పినా ***టూ-మచ్, త్రీ-మచ్*** అంటూ వుండడం అలవాటు.

పులిపాపారావుకో డాక్టరు కూతురు కరుణ (సుజాత). రంగాసుబ్బారావుకో కొడుకు రాజేష్ (ఏఎన్నారు). ఆ కొడుకో యువరాజు లాంటివాడు. వందలు కావల్సొస్తే డ్రైవర్ని పంపిస్తూ, వేలు కావల్సొస్తే ఫోన్ చేస్తూ, లక్షలు కావల్సొస్తే స్వయంగా కనిపిస్తూ వుంటాడట. అలా అని ఆయనే చెప్తాడు తన కూతుర్ని కోడలుగా చేసుకొమ్మని అడగొచ్చిన పులిపాపారావుకి. ఇంక సుబ్బారావుగారేమో కొడుకుని చూడాలనిపించినప్పుడల్లా పేపర్లో "కనబడుటలేదు...నాయనా! నీ మీద బెంగతో మంచం మీద వున్నాను. ఇంటికి రా!" అంటూ ప్రకటనలు వేయిస్తూ వుంటాడు. పేపర్లో ఆ ప్రకటన చూడగానే అబ్బాయిగారు అర్థరాత్రి, అపరాత్రి అని చూడకుండా నాన్నగారికి ఫోన్ చేసి, ఆయన్ని నిద్ర లేపి, మాటా-పలుకూ లేకుండా మౌతార్గన్ వాయిస్తూ వుంటాడు. ఆ అపస్వరాలు వినలేక నాన్నగారు విసుక్కుని ఫోన్ పెట్టేస్తూ వుంటాడు.

ఇంతకీ ఆ సుబ్బారావుగారి యువరాజు గారు చేసే రాచకార్యాలేంటంటే – క్లబ్బులో సిగరెట్లూదుతూ బ్రాందీ నుంచి విస్కీకి, విస్కీ నుంచి బీరుకి వస్తూ వుంటాడు. మళ్ళీ బీరు నుంచి విస్కీకి, విస్కీ నుంచి బ్రాందీకి వెళ్తూ వుంటాడు. కాక్టెయిల్ బాబు! ఆ కాక్టెయిల్ బాబుకి

వెనకాలే ఓ డ్రైవర్ (పద్మనాభం). క్లబ్బుల్లో తాగుతూ, తూలకుండా, తాళం తప్పకుండా ఆడడం, ఇద్దరమ్మాయిలతో ***నారీ నారీ నడుమ మురారీ! నీదీ నాదీ వేరే దారీ*** అంటూ తిప్పుకుంటూ పాడడం కాక్టెయిల్ బాబు హాబీ. ఆ ఆడిన చిక్కని చక్కని చుక్కలూ జోతిర్లక్ష్మి , జయమాల్ని ఐతే ఎంచక్కా వుండేది కదా అనిపించింది ఓ క్షణం. కాకపోతే పైడ్-పైపర్‌లా సగం నల్ల-సగం ఎఱ్ర చొక్కా వేసుకుని, తళుక్కుమని మెరిసే గోల్డ్ కలర్ బెల్టు పెట్టుకుని అమ్మాయిలతో సమానంగా, కొండొకచో వాళ్ళ కన్నా కొంచెం ఎక్కువగానే కళ్ళు, కాళ్ళూ, చేతులూ, మూతులూ తిప్పుకుంటూ ఏఎన్నారు గారు ఆడిన ఆటకి ఇంక పక్కనెవరున్నారూ అన్నది పెద్ద లెక్కలోకి రాకుండా పోయింది. ఈ పాటకి డాన్స్ డైరెక్టర్ సలీం హీరో గారితో ఆడించిన ఆటకి సలాం! ఏఎన్నారు ఆటకి దీటుగా డీఎన్నారు పాట లాజవాబ్! ఆ పాటలో ఓ ముక్క కింద రాశా.

***ఆగానని, ఆగి తాగానని – తింటానని, దెబ్బ తింటానని***
***అనుకోమాకు కలగనమాకు గోదారీ***
***చూశానని, అందం చూశానని – పోయానని, పడి పోయానని***
***అనుకోమాకు కలగనమాకు కావేరీ***
***పాడీ ఆడి పాడి, ఆడీ పాడి ఆడి – గెలుపు పొందగ పిలుపు అందగ***
***నిన్ను ఓడీ గెలిచే వాడే మగాడూ...***

క్లబ్బులో నల్ల-ఎఱ్ర చొక్కా వేసుకుని డాన్సాడిన ఏఎన్నారు తూలుకుంటూ ఒచ్చి డ్రైవర్ని వెనక సీట్లో కూర్చోపెట్టుకుని కారు తోలబోయే టైంకి చొక్కా రంగు మారిపోయుంటుంది. అప్పటికే చాలా రాత్రి ఐపోయుంటుంది. అంత రాత్రి పూటా హీరోగారి కారు కింద పడడానికి ఓ చిన్నపిల్లని ఏర్పాటు చేయడం దాసరివారి దర్శకత్వ ప్రతిభ. కథ ఆయనది. స్క్రీన్‌ప్లే కూడా వారిదే. అందుకని పాత్రలన్నీ ఆయన ఆడమన్నట్లల్లా ఆడతాయి. సరే! కారు కింద ఓ చిన్నపిల్ల పడుతుంది. రోడ్డు మీద పడి కాళ్ళూ, చేతులూ తన్నుకుంటూ ఏడుస్తూ వుంటుంది. ఆ పిల్లని రెండు చేతుల్లో ఎత్తుకున్న డ్రైవర్ పద్మనాభంతో కలిసి హీరో ఏఎన్నారు అప్పుడే పెట్టె సర్దుకుని ఇంటికెళ్ళబోతున్న డాక్టరు కరుణ దగ్గరికి వచ్చి ఆ పిల్లకి ఇంజెక్షన్ చేయమంటాడు. అలా అంటూ బల్ల మీద పడుకోబెట్టిన పిల్లని పరీక్ష చేయబోతున్న డాక్టరు మొహమ్మీదకి సిగరెట్టు పొగూదుతూ మాట్లాడుతూ వుంటాడు. మామూలుగా హీరోని చూసి హీరోయిన్ను మనసు పారేసుకుంటూ వుంటుంది. ఇందులో మాత్రం డాక్టరు చదువుకున్న సుజాత బుఱ్ఱ పారేసుకుంటుంది. డాక్టరయ్యుండి తన ఆఫీసులో తన సమక్షంలో చిన్నపిల్ల మొహమ్మీద సిగరొత్తులు ఊదుతున్న హీరోని ఆరాధనగా చూస్తూ ముచ్చట పడిపోతుంది. పైగా న్యూసుపేపర్లో "కనబడుటలేదు" అన్న ప్రకటన చూసి ఈ హీరో రాజేష్ అనబడే రంగాసుబ్బారావుగారి అబ్బాయని ఇట్టే కనిపెట్టేస్తుంది, కన్నేసేస్తుంది, కన్నెమనసిచ్చేస్తుంది. కానీ రాజేష్‌కి అదేం పట్టదు. ఈలోగా దెబ్బ తగిలిన పిల్ల లేచ్చక్కా పోతుంది ఆ చీకటి రాత్రిలోకి. మొత్తానికి ఏఎన్నారుంటే మిగిలిన పాత్రలు ఏ ఏట్లో కలిసినా, చీకట్లోకి వెళ్ళిపోయినా పట్టించుకోకూడదు. అదీ డీఎన్నారు దర్శకత్వ సూత్రం.

ఈలోగా పాపారావు తన స్నేహితుడు రంగాసుబ్బారావు కొడుకు రాజేష్‌తో తన పెళ్ళి కుదిర్చానూ, అబ్బాయి యువరాజులా వుంటాడూ, శ్రీరామచంద్రుడిలాంటివాడూ అని చెప్పగానే డాక్టర్ కరుణ అతను శ్రీరామచంద్రుడు కాదు గోపాలకృష్ణుడు లాంటి వాడు అని చెప్పగానే పాపారావు పోన్లే ఈ సంబంధం ఒద్దులే అనగానే ఎదురుగా వున్న నాన్నకేసి కాక ఎటో చూస్తూ "***నచ్చినవి ఏరుకోవడానికి, నచ్చనివి వదిలేయడానికి ఇవేమైనా కూరగాయలా?***' అని జనాం-తకమైన ఓ మాటల బాణమోటి వదిలి రాజేష్‌నే చేసుకుంటానంటుంది.

డ్రైవర్‌తో కలిసి బాగా తాగి తూలుకుంటూ, ఓ చేత్తో సిగరెట్టు ఊదుకుంటూ ఇంటికొచ్చిన రాజేష్‌కి వాళ్ళ నాన్న సుబ్బారావు "నీ పెళ్ళికి తాంబూలాలు తీసుకోబోతున్నాను రేపు" అని చెప్పగానే, రాజేష్ కనీసం అమ్మాయెవరని కూడా అడక్కుండానే చేసుకోనని చెప్పేస్తాడు. ఆ మరసటి రోజు తెల్లవారగానే తాంబూలాలు తీసుకుని, పెళ్ళికి ముహూర్తం పెట్టడానికి ఓ పురోహితుణ్ణి కూడా వెంటబెట్టుకొచ్చిన పులిపాపారావుకి తన కొడుకు పెళ్ళికి ఒప్పుకోలేదని చెప్తాడు రంగాసుబ్బారావు. అప్పటికే చెప్పా పెట్టకుండా ఊటీ వెళ్ళిపోయిన రాజేష్ అక్కణ్ణించి ఓ ఏభైవేలు పంపించమని తండ్రికి ఫోన్ చేస్తాడు. తన కూతుర్ని చేసుకుంటాడేమో అనుకున్న రాజేష్ ఊటీ వెళ్ళిపోయాడని తెలుసుకుని పాపారావు, పాపం! బిక్కమొహం వేసుకుని ఇంటికెళ్ళిపోతాడు.

ఇహ హీరోగారు ఊటీలో కారులో వెళ్తూ, ఇంజిన్ వేడెక్కి కారు ఆగిపోయిందని తనతో వున్న డ్రైవర్ పద్మనాభాన్ని పక్కనే వున్న ఓ కాలువ లోంచి నీళ్ళు తెమ్మంటాడు. ఇంతలో ఓ పొగమంచు కలర్ ప్లెయిన్ చీర, దాని మీద చేతికి కుచ్చేసిన దారాలున్న ఓ చక్కటి జాకెట్టు తొడుక్కుని సహజ నటి పరిగెత్తుకుంటూ వచ్చి, తనని ఎవరో తరుముకొస్తున్నారని చెప్తూనే, పరిగెట్టుకుంటూ వెళ్ళిపోతుంది. అప్పటి వరకూ వెంటబడి తరుముకొచ్చిన వాళ్ళెవరో ఆమె కనిపించక వెళ్ళిపోతారు. ఆగిపోయిన కారు స్టార్ట్ కాగానే బయల్దేరిన రాజేష్, డ్రైవర్లకి వెనక సీట్లోంచి అమ్మాయి మాటలు వినిపిస్తాయి. ఎవరా అని చూస్తే జేసుధ. తన తండ్రి తాగుబోతని, ఆయనకి తాగుబోతులంటే ఇష్టమని, అందుకే ఒక తాగుబోతుకి ఇచ్చి పెళ్ళి చేయబోతుంటే తప్పించుకుని వచ్చేసిన తనని పట్టుకోవడానికి రౌడీలని పంపించాడని ఓ అసహజమైన కథ చెప్పిన సహజనటి ఓ వారం రోజులు తనని రాజేష్ గెస్ట్‌హౌస్‌లో వుండనియ్యమంటుంది. సరే! ముగ్గురూ కలిసి రాజేష్ వాళ్ళ నాన్న కట్టించిన గెస్ట్‌హౌస్‌కి వస్తారు. వచ్చిందగ్గర్నుంచీ జయసుధ కాఫీలు కాచిచ్చేసి, వంటలొండేసి వడ్డించేసి, రోడ్డు మీద నడుస్తూ జడేసేస్కునేసి, ఆరుబయట అద్దంలో చూస్కుంటూ బొట్టెట్టేస్కునేసి, రాత్రి పూట నాగేశ్వరావు తాగుతుంటే బాటిల్ తీసేస్కునేసి, తాగబోతున్న బాటిల్‌ని తాగనియ్యని తనని తాగలేని నాగేశ్వరావు తాగకుండా వుండలేక తిడితే తిట్టించేస్కుని, చివరాఖరికి నువ్వు నా మొగుడివే కదా తిట్టినా పర్వాలేదనేస్తుంది. వెంటనే పాట–ఆట ఊటీ లానులోనట.

***ఎవరో చెప్పారు చిన్నప్పుడు ...ఒక యువరాణి పుడుతుందని*** అంటూ హీరో,

***నాకెవరో చెప్పారు చిన్నప్పుడు... ఒక యువరాజు పుట్టాడని*** అంటూ హీరోయిన్నూ స్టెప్పులేసేస్కుంటారు

నాకు మాత్రం ఈ పాట మొదట్లో ఏఎన్నారు, జేసుధ చూపెట్టిన భంగిమలు భలే నచ్చేశాయి. స్వరరాగ చక్రవర్తి టముకు–టముకు దరువులు, ఆ దరువుకి నటసామ్రాట్టు టంకుటమా చిందులు కనువిందులు, బల్ పసందులు!

ఇలా పాటల్లో పెదాలు కదుపుకుంటూ, ఆటల్లో పాదాలు తొక్కుకుంటూ, మాటల్లో పదాలు పలుక్కుంటూ హీరో, హీరోయిన్ను వుంటుండగా, ఇంతలో రంగాసుబ్బారావు ఓ పెట్టె పెట్టుకుని కారు దిగుతాడు ఉదకమండలపు అతిథిగృహం ముందు. చెప్పాపెట్టకుండా తండ్రి వచ్చాడని కంగారు పడుతూ జయసుధని ఓ తలుపు తెరిచి అవతలకి పంపేస్తాడు ఏఎన్నారు. తీరా వాళ్ళ నాన్న వచ్చి ఆ తలుపే తెరుస్తాడు. అప్పటికే జయసుధ ఎంతో తెలివిగా ఆలోచించి తనో పనమ్మాయినని నమ్మిస్తుంది. అంతే...ఈ సీను తర్వాత రంగాసుబ్బారావు ఎక్కడికో వెళ్ళిపోతాడు సుబ్బరంగా, ఐపూ అజా లేకుండా.

ఆ రాత్రికి హీరో, హీరోయిన్నుల మధ్య గాంధర్వవివాహం టైపు సీనొహటి. తెల్లవారగానే "మనకి పెళ్ళి చేసెయ్యమని మన పెద్దవాళ్ళని అడుగుదామంటే అడుగుదాం" అనేస్కుని ఊటీ నుంచి కార్లో బయల్దేరి ముందు జయసుధ వాళ్ళింటికి వెళ్దామనుకుని ఆమె చూపించిన ఇంటి దగ్గర ఆగుతారు. తీరా ఆగింతర్వాత "నన్ను చూస్తే మా నాన్న కోప్పడతాడు, నేను కార్లోనే వుంటాను, మీరే వెళ్ళిరండి" అని ఏఎన్నారుని, పద్మనాభాన్ని ఇంటి లోపలికి పంపిస్తుంది జేసుధ. ఇంతకీ చూస్తే అది పులిపాపారావు ఇల్లు. "మీ అమ్మాయిని పెళ్ళి

చేసుకుంటానూ" అనొచ్చిన ఏఎన్నారుతో "మా అమ్మాయిని నా స్నేహితుడు రంగాసుబ్బారావు కొడుక్కే ఇచ్చి పెళ్ళి చేస్తాను" అనగానే ఏఎన్నారు తనే ఆ రంగాసుబ్బారావు కొడుకునని చెప్తాడు. ఈ సీనులో పులిపాపారావుగా హోమియోపతీ తెల్సిన అల్లు వారిది బహు నాచురోపతిక్ ఏక్షన్. ఆ మాట వినగానే పులిపాపారావు బోల్డంత సంబరపడిపోతాడు. ఏఎన్నారు "ఈ మాట మా అమ్మా-నాన్నకీ కూడా చెప్తాన"ని బయటకొచ్చి అక్కడ కారు దగ్గర నించుని వున్న జయసుధతో "మీ నాన్న అంత మంచివాడైతే తాగుబోతని అబద్ధం ఎందుకు చెప్పావని" అడిగితే "మీరంటే ఇష్టం, మిమ్మల్నెలాగైనా కలుసుకోవాలని అలా చెప్పానని" చెప్పి, మళ్ళీ పెళ్ళి టైంకే కలుస్తానని ఇంట్లోకి వెళ్ళిపోతుంది. "మీ నాన్న లాగే నువ్వు కూడా గ్యాస్ మాట్లాడతావే!" అనేసి ఏఎన్నారు కారెక్కి హైద్రాబాదులో వున్న తన తలిదండ్రుల దగ్గరికి వెళ్తాడు.

భలే! పులిపాపారావుకి సుజాత, జయసుధ ఇద్దరు కూతుళ్ళన్నమాట. ఒకరికొకరు తెలీకుండా ఇద్దరూ ఏఎన్నారుని ప్రేమిస్తున్నారన్న మాట. పులిపాపారావుక్కూడా ఏఎన్నారు ఏ కూతుర్ని చేసుకోబోతున్నాడో క్లారిటీ లేదన్న మాట. ఇలా రకరకాలుగా నేనేదేదో అనేస్కున్నానన్న మాట.

అస్సలు పెళ్ళే చేసుకోనన్న రాజేష్ ఇంటికొచ్చి పులిపాపారావు కూతుర్ని చేసుకుంటానని చెప్పగానే రంగాసుబ్బారావు దంపతులు సంతోషిస్తారు. పులిపాపారావు కూడా వెళ్ళి ఇంటికొచ్చిన స్నేహితురాళ్ళతో కబుర్లు చెప్తున్న కూతురు డాక్టరు కరుణకి "నువ్వు ఊటీ వెళ్ళొచ్చిన అబ్బాయితోనే నీ పెళ్ళి" అని చెప్తే సిగ్గుపడి ఊర్కుంటుంది తప్ప "నేనెక్కడ ఊటీ వెళ్ళాను?" అని అడగనే అడగదు. అది సరే – "నాకు తెలీకుండా నువ్వు ఊటీ ఎప్పుడు వెళ్ళావూ?" అని ఆ తండ్రీ అడగడు. ఆ! ఆ! అట్టే! అట్టే! ఇది దాసరివారి చిత్రరాజం. ఏం చూపించినా "సరి సరి" అనుకోవడమే తప్ప "ఇది ఎలా సరి? ఎందుకు సరి?" అని అడిగామో దాసరివారి భాషణా-ఝరిలో పడి మన పని సరి. అందుకని నోటి మీద వేలేస్కుని సిన్మా సూసేద్దారి!

ఇంటికొచ్చిన ఫ్రెండ్స్ "నువ్వు ఊటీ వెళ్ళలేదు కదా మీ నాన్నేంటీ నువ్వు వెళ్ళావంటున్నారు?" అంటే డాక్టరమ్మ "మా నాన్న మాటలు అంతా గ్యాసు" అంటుంది. అంటే పులిపాపారావు "నాన్నా! పులి" టైపన్నమాట. నిజం చెప్పినా గ్యాసే అనుకుంటారు అందరూ, తన కూతురితో సహా.

సరే! మొత్తానికి పులిపాపారావు కూతురు డాక్టరు కరుణకి, రంగాసుబ్బారావు కొడుకు రాజేష్‌కి పెళ్ళి. పెళ్ళి పందిట్లో సందడిగా బాండుమేళం వాళ్ళు వాయిస్తున్న పాటలకి పులివేషం స్టెప్పులేస్తున్న పాపారావుని ఆయన సెక్రటరీ బలవంతంగా పెళ్ళి మంటపం దగ్గరికి తీసుకెళ్తాడు. పెళ్ళిపీటల మీద కూర్చున్న రాజేష్ పెళ్ళికూతురు అలంకరణలో వస్తున్న డాక్టర్ కరుణని చూసి "నేను ప్రేమించింది, ఊటీ వెళ్ళింది ఈ అమ్మాయితో కాదు ఆశ అనే అమ్మాయితో, నాకీ పెళ్ళి వద్దని" పెళ్లిపీటల మీంచి లేచిపోతాడు. అతనికి నచ్చ చెప్పబోయిన పాపారావు, సుబ్బారావులని కరుణ తనంటే ఇష్టం లేని రాజేష్‌ని పెళ్ళి చేసుకోనని చెప్పి కొబ్బరిబొండంతో సహా మేడ మెట్లెక్కి తన గది లోకి వెళ్ళిపోతుంది. పెళ్ళాగిపోతుంది. ఒక ఆడపిల్ల జీవితాన్ని నవ్వులపాలు చేశావని రాజేష్‌ని తిట్టి సుబ్బారావు, ఆయన భార్య (పుష్పలత)వెళ్ళిపోతారు. ఈ సీనైపోగానే నాకు భలే అయోమయంగా అనిపించింది. ఆ రోజు పులిపాపారావు ఇంట్లోకి వెళ్ళిన జయసుధ, అదే ఆశ ఏమయినట్లు? అమ్మో! దెయ్యం కాదు కదా?! నాకసలే రెపరెపలాడే తెల్ల చీర, ఘలుఘల్లుమనే గజ్జెల మోత వుండే సినిమాలంటే అస్సలిష్టం వుండదు. కానీ, ఈ సినిమా రాయడం మొదలుపెట్టి చాలా దూరం వచ్చేశాను. పూర్తి చెయ్యాలి తప్పదు. అంతగా జయసుధ దెయ్యమై వస్తే ఎలాగోలా కళ్ళు మూసుకుని చూసేద్దాం అనుకున్నా! అలా ముందుకి సాగిపోయా.

డాక్టర్ కరుణ ఎప్పట్లాగే తెల్లకోటు చేతి మీద వేసుకుని కాళ్ళీడ్చుకుంటూ తన హాస్పిటల్ రూంలోకి వస్తుంది. అక్కడ సిగరెట్టూదుకుంటూ రాజేష్ కనిపిస్తాడు. "నా వల్ల పెళ్ళాగిపోయిన మిమ్మలని ఇంకెవ్వరూ పెళ్ళి చేసుకోరంటే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటా" అని కరుణకి చెప్తాడు. "మీరు నన్ను చేసుకుంటే మిమ్మల్ని ప్రేమించి మిమ్మల్నే నమ్ముకున్న ఆమెని ఏం చేస్తారు? నాకు నా వృత్తి వుంది. మీరెళ్ళి మీ ఆశని పెళ్ళి చేసుకోండి" అని రాజేష్‌ని పంపించేస్తుంది డాక్టర్ కరుణ.

రాజేష్ ఎర్ర రంగు సిల్కు లుంగీ, చొక్కా తొడుక్కుని, సిగరొత్తులూదుతూ ఎర్ర ఫోన్‌తో బోల్డంత సేపు ఎవరితోనో ఏదో మాట్లాడుతూ కనిపిస్తాడు. ఇంతలో డ్రైవర్ పద్మనాభం ఓ పేపర్ తెచ్చి చూపిస్తాడు. అందులో "మతిస్థిమితం లేని జ్యోతి అనే అమ్మాయి తప్పిపోయింది" అనే ప్రకటన వుంటుంది. ఆ జ్యోతి ఎవరో కాదు, ఊటీలో రాజేష్‌ని ప్రేమించిన ఆశ. అదే మన సహజనటి జయసుధ. నాకొక్క నిముషం హమ్మయ్య! ఇది దెయ్యాల సినిమా కాదు, రెండు కళ్ళూ తెరిచి చూడొచ్చని భలే సంతోషమేసింది.

పేపర్లో ఆ ప్రకటన చూడగానే రాజేష్‌కి ఊటీలో చూసిన ఆశ తింగర వేషాలు, మాటలు గుర్తుకొస్తాయి. పేపర్లో ఇచ్చిన అడ్రస్ ప్రకారం ఆశ/జ్యోతి వాళ్ళింటికి వెళ్తాడు. అక్కడ వాళ్ళ అన్న రామకృష్ణ (శ్రీధర్), వదిన విజయ (కె. విజయ) లని కలుస్తాడు. వాళ్ళతో మాట్లాడింతర్వాత ఏదో పిక్నిక్కి వెళ్ళినప్పుడు స్నేహితురాలు రాళ్ళ మీద పడి చనిపోవడం చూసి జ్యోతికి మతిస్థిమితం తప్పిందని, దానికి తోడు యామ్నీషియా కూడా వచ్చిందని, అందుకే ఆమెకి గతమేమీ గుర్తు లేదని, హాస్పిటల్ నుంచి తప్పించుకుని ఎక్కడికో పారిపోయిందని, ఇలా బోల్డంత ఫ్లాష్‌బాక్ తెలుస్తుంది రాజేష్‌కి. రాజేష్‌తో పాటు నాకూను. కాకపోతే అంత మతి చలించిన ఆశ ఊటీ దాకా వెళ్ళిపోవడం, ఒకే చీర కట్టుకున్నా అది మాసిపోకపోవడం, అదే చీరతో ఫస్టాఫ్ అంతా గడిపెయ్యడం – ఇలాంటివేమీ అడక్కూడదేమో నిజమైన సినిమాభిమానులైతే!

సరే! ఇంత కథ తెల్సింది కదా. ఆ తర్వాత సీనులో ఆశ/జ్యోతి ఓ ఎర్రచీర కట్టుకుని ఓ గోడ మీద కాళ్ళూపుకుంటూ కూర్చుని రోడ్డు మీద వచ్చే పోయే జనాన్ని చూస్తూ వుంటుంది. ఈ ఎర్రచీరెక్కడ దొరికిందో ఈమెకి? లేకపోతే ఫస్టాఫ్‌లో కట్టుకున్న పొగమంచు రంగు చీర దుమ్ము పడి, ధూళి పడి, ఎండకెండి, వానకు తడిసి, ఎర్రమన్ను పడి ఈ రంగు తిరిగిందేమో? తిన్నగా సినిమా చూడక అక్కర్లేని అనుమానాయణం ఇది. బాక్ టు సిన్మా!

అక్కడ ఎవరిదో కారు ఆపి వుంటే, ఆ కారెక్కి డ్రైవ్ చేసుకుంటూ ఆశ/జ్యోతి వెళ్ళిపోతుంటే, రెడ్ లైట్ పడ్డప్పుడు ఆగలేదని పోలీసులు పోలీస్ స్టేషన్‌కి పట్టుకొస్తారు. అక్కణ్ణించి తప్పించుకుని ఈసారి పోలీస్ జీప్ తీసుకుని పారిపోతుంది. ఇంతలో ఆశ/జ్యోతిని వెతుక్కుంటూ పోలీస్ కంప్లైంట్ ఇద్దామని రాజేష్ అదే పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఆమె జీపెక్కి వెళ్ళిందని తెల్సి కంగారు పడతాడు. ఈలోగా ఆశ/జ్యోతి ఆక్సిడెంట్ అయి హాస్పిటల్లో చేర్చబడుతుంది. ఆమె మంచం చుట్టూ అన్నా, వదినా, రాజేష్ నించుని ఎప్పుడు స్పృహ వస్తుందా అని చూస్తుంటారు. కళ్ళు తెరిచిన ఆశ రాజేష్‌ని గుర్తు పడుతుంది. తన అన్నా, వదినలని వాళ్ళెవరో నాకు తెలీదంటుంది. ఆమెకి ట్రీట్‌మెంట్ ఇస్తున్న డాక్టర్ డబ్బింగ్ జానకి రాజేష్‌ని దగ్గరుండి జ్యోతిని మామూలు మనిషిని చేయమని పాత్రోచిత ఉచిత సలహా ఇస్తుంది. హీరో కోరిందీ అదే, డాక్టరు అడిగిందీ అదే, "వాయ్యేస్" అనేస్తాడు.

ఇంతలో రంగాసుబ్బారావు మంచం పడతాడు. అదేంటో అప్పటిదాకా "గురూ అమ్మాయి ఆచూకీ ఇది" అంటూ రాజేష్‌కి పేపర్లందించిన పద్మనాభం అసలదేమీ గుర్తు లేనట్లు, రాజేష్ ఎక్కడున్నాడో తనకు తెలీనట్లు, రాజేష్‌ని ఇంటికి రప్పించాలంటే ఆనవాయితీగా పేపర్లో "బాబూ! నువ్వెక్కడున్నా ఇంటికి రా...నేను మంచం పట్టా" అని ప్రకటన ఇప్పిద్దామంటాడు. దానికి సుబ్బారావు అలా వేయిస్తే ఎప్పట్లాగే అది సరదాగా వేశామనుకుంటాడు, ఈసారి నేను చచ్చిపోయానని వేయించమంటాడు. స...రీ పోయింది! ఈ సిన్మా అంతా "నాన్న! పులి" నీతి కథలా వుంది.

రాజేష్ జ్యోతికి ఆమె చిన్నప్పటి ఫోటోలు చూపించి, వాళ్ళన్నయ్య చేత పుల్లైసులు ఇప్పించి, మౌతార్గన్లు వినిపించి ఆమెకెలాగైనా గతం గుర్తు చేద్దామని ప్రయత్నిస్తూ వుంటాడు. అసలీ సినిమాలో జయసుధ వేషం కోసమని ప్లెయిన్ చీరలు టోకున కొన్నట్టున్నాడు డీఎన్నారు. ఓ పువ్వూ లేదు, ఓ గీతా లేదు. వనవాసం చేసేప్పుడు కట్టుకునే నారచీరల్లా వున్నాయి మరీను! ఓ రోజు వేరుశనక్కాయలు కొనుక్కుంటూ అవి కట్టిచ్చిన పొట్లం కాయితంలో సుబ్బారావు నిర్యాణం ప్రకటన చూసి రాజేష్ ఇంటికి వచ్చేటప్పటికి తండ్రి ఫోటోకి దండ వేసుంటుంది. తల్లి స్పృహ తప్పి మంచమ్మీద వుంటుంది. తల్లి పక్కనే బీపీ చూస్తూ డాక్టర్ కరుణ కూర్చుని వుంటుంది. రాజేష్ రాగానే తన ఇంటికి వెళ్ళిపోతానన్న కరుణని తన తల్లికి స్పృహ వచ్చేవరకు ఉండమంటే అలాగేనని ఆవిడకి నయం కాగానే తండ్రి పులిపాపారావుతో వెళ్ళిపోతుంది కరుణ.

ఇంకిక్కడ జ్యోతి రాజేష్ కాకుండా తనకి భోజనం పట్టుకొచ్చిన అన్నావదినలని రాజేష్ ఏడని అడిగి, అతన్ని వాళ్ళే ఎక్కడికో పంపించేశారని హాస్పిటల్లో చాలా గొడవ చేసి పారిపోతూ వుంటుంది. డీఎన్నారుకి కథలో ఎలా ఇమడ్చాలో తెలీలేదో ఏమో జ్యోతి చూసేలాగా ఓ బొమ్మని రాళ్ళ మధ్య ఎవరో విసుర్తున్నట్లు చూపిస్తాడు చాలా అసందర్భంగా. అది చూసి జ్యోతికి మళ్ళీ గతం గుర్తుకొస్తుంది. మామూలుగా అయిపోతుంది. తన కోసం వచ్చిన రాజేష్‌ని ఇంక గుర్తు పట్టదు. మొత్తానికి ఏఎన్నారుకి ***ఆ నారీ, ఈ నారీ లేక లంక మేత గోదారి ఈత*** అయ్యింది ఇప్పటికి ఈ సినిమా, హమ్మయ్య! అయిపోతుందేమో అనుకున్నా! అబ్బే! ఇంకా ముప్పావు గంట పైగా వుంది.

ఈ చివరాఖరి ముప్పావు గంట ముక్కలో...

జ్యోతి వాళ్ళ వదిన తమ్ముడు మురళీమోహన్‌ని పెళ్ళి చేసుకోవడం, పెళ్ళైన మొదటి రాత్రే కళ్ళు తిరిగి పడితే డాక్టర్ ఆమె గర్భవతి అని చెప్పడం, జ్యోతికి రాజేష్‌తో ఊటీలో వున్న రోజులు గుర్తుకు రావడం జరుగుతాయి.

ఈలోగా రాజేష్ ఓ మాం..ఛి మెలాంకలిక్ మెలోడీ

నెలలు నిండినట్టు – బతుకు పండినట్టు
కానిచోట కాశావు వెన్నెలా!
కారడవుల కాశావు వెన్నెల
ఎవరి కొరకు కాశావే వెన్నెలా?
అడవి కాసినా వెన్నెలా! ...

అంటూ పాడడం, ఆల్కహాలిక్ అయి రోడ్డున పడడం కూడా జరుగుతాయి. ఇంతలో పులిపాపారావు చనిపోతూ తన కూతురు కరుణని పెళ్ళి చేసుకోమని రాజేష్‌ని అడగడం, రాజేష్ దానికి ఒప్పుకోవడంతో, కరుణా, రాజేష్‌లు ఇంకో భలే మంచి మెలోడీ పాడేసుకుంటారు.

నీలాల నింగి ఒకసారి వంగి
అద్దాల చెక్కిలి ముద్దాడి పోతే
అదే అచ్చట అదే ముచ్చట
అదే ముచ్చట అదే అచ్చట ఈ జన్మకంటా – అంటూ పాడిందే అటూ ఇటూ తిప్పితిప్పి పాడుకుంటా.

రాజేష్‌కి, డాక్టర్ కరుణకి పెళ్ళైపోతుంది. సరిగ్గా అప్పుడే ***ప్రేమ్‌నగర్*** నుంచి ***ప్రేమాభిషేకం*** దాకా కీలక పాత్ర పోషించిన, సినిమా ఆఖరి క్షణాల్లో పూనకం వచ్చినట్లు అటూ ఇటూ ఊగిపోయే ఎంబాసడర్ కార్లో వస్తారు జ్యోతితో పాటు ఆమె అన్నావదినలు. వాళ్ళని చూడగానే పెళ్ళిపీటల మీంచి ఇవతలకి వస్తాడు అప్పుడే కరుణ మెళ్ళో మూడు ముళ్ళేసిన రాజేష్.

కరుణ మళ్ళీ షరా మామూలుగా, బేషరతుగా నిర్ఘాంతపోయి, దిగ్భ్రమ చెంది ఈసారి కొబ్బరిబొండం కూడా లేదే నా చేతిలో అని కుములుతూ లోపలికి వెళ్ళిపోతుంది.

జ్యోతి తల్లి కాబోతోందని తెలిసి, ఏడుస్తున్న ఆమెని ఓదార్చబోయిన రాజేష్‌తో "అస్సలు నా బ్రతుకే రైలెళ్ళిపోయిన తర్వాత స్టేషన్‌కి రావడం అయిపోయింది. మీ బిడ్డని మీకు అప్పగించి చచ్చిపోతాను. మీరు పెళ్ళి చేసుకున్న ఆమెతో హాయిగా వుండండి" అని బాధ పడి వెళ్ళిపోబోతుంది. అప్పుడు రాజేష్ "నా బిడ్డకి తల్లివి నువ్వూ నా భార్యవే" అని జ్యోతిని తీసుకుని కరుణ దగ్గరికి వెళ్ళి "ఈ సమస్యకి పరిష్కారం చూపించు అంటే "ఆ రోజు నా పెళ్ళి పీటల మీద ఆగిపోయింది, ***ఈ రోజు పీటలెత్తేశాక ఆగిపోయింది*** (ఈ ***పీటలెత్తేశాక*** ముక్క ఆక్రోశం ఆశువుగా పలికిన నాది, డీఎన్నారుది కాదు)" అంటూ తన మెళ్ళో మంగళసూత్రం తీసి జ్యోతి మెడలో వెయ్యబోతే రాజేష్‌కి ఇద్దరూ తనకి దక్కకుండా పోతారని ఉక్రోషం వచ్చి "త్యాగం చెయ్యడమంటే ఒకరికొకరు దూరం కావడం కాదు, ఒకరితో ఒకరు కలిసుండడం" అని కొత్త లాజిక్కేదో చెప్తాడు. పైగా దేవుళ్ళాంటి భర్త అంటే శివుళ్ళా ఇద్దరికీ న్యాయం చేయగలిగినవాడు తప్ప ఒక్క భార్యను కూడా సుఖపెట్టలేని రాముడు కాదంటాడు.

ఒక భర్తా-ఇద్దరు భార్యలుగా తమ ముగ్గురినీ నలుగురూ ఆమోదించరని జ్యోతి, కరుణ ఏకగ్రీవంగా అంటూ ఏవో అర్ధాంగిమెరిట్ లెక్కలు చెప్పబోతే, రాజేష్ కోపంతో ఊగిపోతూ, అటూ ఇటూ పరిగెడుతూ – సిన్మా హాల్లో ఫాన్లు, ఏసీలు ఆగిపోయి జనం ఉక్కిపోయే టైంలో, వాళ్ళు ఇంకా ఉక్కిరిబిక్కిరి అయిపోయేలా, ఉలిక్కిపడి లేచిపోయేలా...

ఎవరా నలుగురు?

ఏరా నలుగురు?

నీవాళ్ళా?

నీలో వున్నవాళ్ళా?

నిన్ను చూసి నవ్వేవాళ్ళా?

నవ్వలేక ఏడ్చేవాళ్ళా?

నిను నవ్వులపాలు చేసేవాళ్ళా? – అంటూ పాడేస్తాడు.

ఆ పాట దెబ్బకి జ్యోతికి డెలివరీ అయిపోతుంది. ఆ హాస్పిటల్ సీనులో శ్రీధర్ పక్కన కుర్చీలో కూర్చున్నదెవరో అర్థం కాలేదు. అది మురళీమోహన్‌లా అనిపించలేదు. సినిమా మొత్తంలో ఆ పాత్రే లేదు. కానీ సినిమా అయిపోయింది.

ఇద్దరు భార్యలూ – ఒక ఉయ్యాల సహిత "శ్రీవారి ముచ్చట్ల"కి విలోమానుపాత "యువరాజు" నామాంకిత చిత్రరాజాంతే, నా పరిస్థితి ఏంటంటే ***సినిమా అయిపోయాక టికెట్టు చించుకోవడం***లా అయిపోయింది.

సరి లేరు మీకెవ్వరూ!

డీఎన్నారు, ఏఎన్నారు!

రమణులు ఇద్దరుంటే ముచ్చటని
మీరిరువురు మెప్పించిన తీరు
కనలేదెవరు వినలేదెవరు
జోహారు! జోహారు!

## శ్రీవారి ముచ్చట్లు

"అబ్బా! మళ్ళీ – ***ఒకరికి ఇద్దరు ఎన్నార్లూ (ఏఎన్నారూ, డీఎన్నారూ) , ఒక ఏఎన్నారుకి ఇద్దరూ*** – తరహా సినిమానా బాబోయ్!" అనిపించింది కానీ కిందటి మాటు "***యువరాజు***" అచ్చటా–ముచ్చటా చూసింతర్వాత "***శ్రీవారి ముచ్చట్లు***" గురించి చెప్పకపోతే నా విలోమానుపాత లెక్క తేలకుండా పోతుందని అనేస్కుని, ఈ కథ కూడా చెప్పేస్కుంటే సినిమాంత–ఉయ్యాల వ్రత ఉద్యాపన కూడా చేసేస్కున్నట్లవుతుందని మొదలెట్టేశా.

ఒక ఏఎన్నారు, ఇద్దరు జయ(ప్రద, సుధ)లు, ఆ ఇద్దరి కేశాలంకరణలకి చెరికో కమల చొప్పున ఇద్దరు కమలలు. ఏఎన్నారుకి నాన్న ప్రభాకర్రెడ్డి షరా మామూలే. అమ్మ మాత్రం ఎప్పట్లా పుష్పలత కాదు, తమిళ తాయి సుకుమారి. జయసుధకి నాన్న అల్లు రామలింగయ్య. ఆంటీ తాయారమ్మ నిర్మలమ్మ. ఆవిడకి ఆవిడే కవిత అల్లుకున్నట్టు "***రూపు చూడ చక్కనుండు – వయసు చూడ ఎక్కువుండు***". ఆవిణ్ణి చూసిన కన్ను చల్లగుండు. ఈ సిన్మా "అద్దాలమేడ" తర్వాత విడుదల అయినట్లుంది. సినిమా మొదట్లో కేవీ చలానికి శ్రద్ధాంజలి కార్డు వుంది. ఇక సంగీతం కృష్ణ–చక్ర సమేత చక్రవర్తి. ***కస్క్రీమాపాద*** దర్శకరత్న దా.నా.రా, ఎస్సైఎఫ్వీయే. (కస్క్రీమాపాద=కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం).

దానారా, ఎస్సైఎఫ్వీయే గారికో సిన్మతీ గిద్యం సమర్పయామి...

కథలో సుధ వుందని ప్రద బాధ
ప్రదదే ఈ కథ అని సుధ వ్యధ
బాధా వ్యధలు తమ కథల కంచికంపగ
దానారా బాధ ఆయె అనారా వ్యధ సిన్మతీ!

అనగనగా ఓ చక్రపాణిగారి ఇల్లు. ఆ చక్రపాణిగారెవరో కాదు ప్రభాకర్రెడ్డి.

పేర్లు అయ్యీ అవ్వగానే చక్రపాణి వాళ్ళబ్బాయి గోపీ (ఏఎన్నార్ అనబడు అనారా) ఎక్కడున్నాడో చెప్పమని అడుగుతూ అతని స్నేహితులకి ఫోన్ చేస్తూ, ఎక్కడికి వెళ్ళాడో చెప్పకపోతే తంతానని దబాయిస్తూ కనిపిస్తాడు. చివరాఖరికో ఫ్రెండు గోపీ సితార్ పోటీలకి కాశ్మీర్ వెళ్ళాడని చెప్తాడు. పెళ్ళిచూపులు ముందు పెట్టుకుని గోపీ కాశ్మీర్ వెళ్ళినందుకు విసుక్కుని చక్రపాణి ఆ రాబోయే కాబోయే–పెళ్ళివారికి ఫోన్ చేసి గోపీ పనుండి వేరే ఊరు వెళ్ళాడూ, అతనొచ్చింతర్వాత కలుద్దామని చెప్తాడు.

మన హీరో గోపీ కాశ్మీర్ సరస్సులో వెళ్తున్నట్లుగా ఓ స్పీడుబోటు మీద ఝుమ్మని వెళ్ళిపోయి మన హైద్రాబాదు గుట్టల మీదుండే ఓ గుడి ముందు నుంచి చెంగుచెంగున ఎగురుకుంటూ "రాధా!" అని పిలుస్తూ వస్తూ వుంటే, ఆ గుట్ట కింద నుంచి "గోపీ!" అని అరుచుకుంటూ జయప్రద పరిగెట్టుకొస్తుంటుంది. ఇద్దరూ కలిసి కబుర్లాడుకుని, నవ్వుకుని, గుళ్ళూ-గోపురాలు తిరుక్కుని, మొక్కజొన్నపొత్తులు కొనుక్కుని, కొరుక్కు తింటూ, తిరుక్కుంటూ తిరుక్కుంటూ చివరికి గోపీ అలసిపోయి ఓ ఏపిల్ చెట్టు కింద పడుకుండి పోతాడు. ఇంతలో ఓ బుట్ట నిండా ఏపిల్స్ మోసుకుంటూ రాధ వస్తుంది. రాధని వెతుక్కుంటూ "రాధమ్మా!" అని పిలుస్తూ రాధ బాబాయి కేవీచలం వస్తే, అతనికి తెలుగు మాట్లాడడం వచ్చని తెగ ఆశ్చర్యపోయేస్తాడు గోపీ. మరప్పటిదాకా రాధతో ఏ భాష మాట్లాడుతున్నట్లో? అప్పటి దాకా ఆమె తరపువాళ్ళు తెలుగులో మాట్లాడతారని తెలియకపోవడమేమిటో?

సరే! బాబాయితో రాధ వెళ్ళిపోతుంది. గోపీ హోటల్ గదిలో స్నేహితులతో కబుర్లాడుతూ వుంటాడు. అక్కడ తెలుస్తుంది అస్సలు విషయం. ఏంటదీ? గోపీకి రాధ ఎలా పరిచయమయ్యిందీ అన్న సంగతి. ఒకసారెప్పుడో సితార్ పోటీలకి గోపీ శ్రీనగర్ వస్తే, అతని సితార్ వాదనకి ముచ్చటపడి డాన్స్ చేసి మరీ ప్రేమించి, ప్రేమించబడుతుందట రాధ. ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఓ మాం...ఛి పాట వినిపిస్తాడు గోపి. అదేం పాటంటే... "***ఉదయ కిరణ రేఖలో...హృదయ వీణ తీగలో***" అంటూ రాధ, గోపి గడ్డిలో పరిగెడుతూ, గోడలెక్కి నడుస్తూ పాడేసుకుంటారు. పాటైపోగానే ఆ పాట గుర్తు చేసుకోవడం కోసమే కాశ్మీరు కొచ్చాడా అన్నట్లు మళ్ళీ పెట్టె సర్దుకుని మోసుకుంటూ ఎర్ర బస్సెక్కి, ఆపై ఎయిర్ బస్సెక్కి వెళ్ళిపోచ్చేస్తాడు గోపీ. వస్తూవస్తూ "మళ్ళీ వచ్చి నిన్ను పెళ్ళి చేసుకుంటానని" రాధకి చెప్పి మరీ వెళ్ళిపోచ్చేస్తాడు.

అలా వచ్చేసిన గోపీని ఓ పెద్దసైజు జగన్మోహినీ (అమృతం భాడం వంచి పంచినావిడ కాదు విఠలాచార్య వారి పొయ్యిలో కాళ్ళు పెట్టుకున్న బ్రాండు) అవతారంలో వున్న జయసుధ రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకొస్తుంది. జయసుధ సిన్మా పేరు ప్రియ. ఈ ప్రియ గోపీకి మరదలు. ప్రియకి కళ్ళజోడెట్టుకుని, కర్ర పట్టుకున్న అల్లురామలింగయ్య డేడీ, కాసులపేరు వేసుకుని వడ్డాణం పెట్టుకున్న నిర్మలమ్మ ఆంటీ. గోపీ కోసం కష్టపడి బోల్డన్ని వంటలు చేసి కొసరికొసరి తినిపించబోతుంది ప్రియ. గోపీతో తనకి పెళ్ళి చేస్తానన్న డేడీ అల్లు మాట విని కళ్ళు పైకెత్తి ఏదో కలగనబోతుంది కానీ ***తానొకటి తలిస్తే దానారా ఒకటి తలిచాడన్నట్లు*** అక్కడ పాటేం పెట్టలేదు దర్శకరత్నం.

ప్రియని పెళ్ళి చేసుకుంటావా అని అడిగిన అమ్మానాన్నలకి గోపీ తనకి ప్రియ మీద అలాంటి ఉద్దేశ్యం ఏమీ లేదని చెప్తూ, తన సితార్‌కి తగ్గట్టు డాన్స్ చేసిన రాధ అనే కాశ్మీర్ అమ్మాయి అంటే తనకిష్టమని, ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని చెప్తాడు. దానికి వాళ్ళ అమ్మా-నాన్నా ఒప్పుకుంటారు కానీ, ప్రియ డేడీ అల్లుకి మాత్రం బోల్డంత కోపం వచ్చి నా కూతుర్ని నీ కొడుక్కి ఇచ్చి ఎలాగైనా సరే పెళ్ళి చేస్తానని చెప్తాడు.

ఈలోగా గోపీ తన ఇంట్లో వాళ్ళు పెళ్ళికొప్పుకున్నారన్న విషయం చెప్పడానికి రాధ దగ్గరికి కాశ్మీర్ వెళ్తాడు. అక్కడ రాధ వాళ్ళ నాన్న చాట్ల శ్రీరాముల్ని అప్పిచ్చిన డబ్బు కోసం అగచాట్లు పెడుతున్న తెలుగు-కాబూలీవాలాని చీవాట్లేసి వాళ్ళకివ్వాల్సిన పదివేలూ ఓ రెండ్రోజుల్లో ఇచ్చేస్తానని చెప్తాడు గోపీ. చెప్పి నాన్న చక్రపాణికి డబ్బు పంపించమని టెలిగ్రాం ఇస్తాడు. ఆ డబ్బొచ్చేలోగా ఖాళీగా వుండడం ఎందుకూ అని ఓ హైద్రాబాదు గుళ్ళో గంట కొట్టి దండమెట్టుకుంటున్న రాధ వేలికి ఉంగరం తొడిగి, దీంతో మనకి పెళ్ళైపోయినట్లే అంటాడు. ఇదో రకమైన శకుంతలా-ట్రాక్ అన్నమాట. ఆ తర్వాత ఇంకా టైముందని నడుమూపుకుంటూ, చప్పట్లు కొట్టుకుంటూ, చెమ్మచెక్కలాడుకుంటూ, చెక్క భజన చేసుకుంటూ "***ముక్కు పచ్చలారని కాశ్మీరం, ముక్కుపుడకతో వచ్చింది కాశ్మీరం***" అంటూ పాట పాడేసి డాన్సు కూడా ఆడేసుకుంటాడు. ఆడీ, పాడీ హోటల్‌కి తిరిగొచ్చిన గోపీకి ఓ టెలిగ్రాం వస్తుంది. దాన్ని చూసి నిర్ఘాంతపోయి, దిగ్భ్రమ చెందిన గోపీ మళ్ళీ ఫ్లైటెక్కి ఇంటికి వెళ్ళేటప్పటికి వాళ్ళ నాన్న చక్రపాణి కాల్‌షీట్లైపోయి కాలం చేసివుంటాడు. అది చూసి గోపీ వెక్కివెక్కి ఏడుస్తాడు. ఈలోగా బోల్డు మంది అప్పులాళ్ళు వస్తారు. ఇల్లమ్మేసి, చనిపోయిన చక్రపాణి వాళ్ళకివ్వాల్సిన డబ్బులిమ్మని గొడవ చేస్తారు. అప్పుడు అల్లు రామలింగయ్య ఆ డబ్బు తనిస్తానని చెప్పి గోపీకి ఇల్లు మిగిలేలా చేస్తాడు. ఇంతలో లాయరొచ్చి "మీ నాన్నగారు పోవడానికి ముందు నాకీ ఉత్తరమిచ్చారు మీకిమ్మని" అంచెప్పి ఓ ఉత్తరం గోపీ చేతికిస్తాడు. ఆ ఉత్తరంలో చక్రపాణి చాలా విషయాలు రాస్తాడు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య

చేసుకుంటున్నానని, తనకి భీమవరంలో ఇంకో భార్యా, ఆమెకో కూతురూ వున్నారని, వాళ్ళిద్దరికీ ఓ దారి చూపించమని, అలా దారి చూపించిన సంగతి మీ అమ్మకి తెలియనీయకని, ఇలా ఓ గంటకి సరిపోయే సీన్లని ఓ ఉత్తరంతో సరిపెట్టేస్తాడు. ("ఆమె కూతురు" అంటాడు కానీ నాకు కూతురు, నీకు చెల్లెలూ అనడు. పాపం! ఫాదర్ చనిపోయే హడావిడిలో రాశాడు కదా, తడబడి వుంటాడు. ఆట్టే ఫెదర్లు లాక్కూడదు.)

వెంటనే గోపి భీమవరం వెళ్తాడు. అక్కడ తన పింతల్లి రాజసులోచన, ఆమె కూతురు కవితని కలిసి చక్రపాణి మరణవార్త, తనకు రాసిన ఉత్తరం గురించి చెప్పి తనతో పాటు హైద్రాబాద్ తీసుకొస్తాడు.

ఓ పక్క కాశ్మీర్‌లో పెళ్ళి చేసుకోవడానికి వస్తానని చెప్పి వెళ్ళిన గోపీ ఇంకా రాలేదని రాధ వాళ్ళ నాన్న కంగారు పడుతూ వుంటాడు. ఇంకో పక్క ప్రియ అల్లు రామలిగయ్యని నాకు పెళ్ళెప్పుడు చేస్తావ్ అనడుగుతూ వుంటుంది. ఈ దానారా సినిమాల్లో ఆడపిల్లలకి పెళ్ళి గొడవ తప్ప ఇంకో ధ్యాసున్నట్లు కనపడదు. ప్రియ బాధ పడలేక ముహూర్తం పెట్టించుకొస్తానని వెళ్తాడు అల్లు రామలింగయ్య. వెంటనే ప్రియ, గోపీతో కలిసి ఓ పాట పాడేసుకుంటున్నట్టూహించేసుకుంటుంది "***ఆకాశం ముసురేసింది, ఊరంతా ముసుగేసింది***" అంటూ. సంగీత చక్రవర్తి బీటుకి తగ్గ నటసమ్రాట్టు ఆట ఈ భలే పాట!

ప్రియ అనబడే జయసుధ ఇలా కలలు కంటూ వుండగా, ఈలోగా గోపీ మళ్ళీ బోటెక్కి రాధ అనబడే జయప్రద ఇంటికి వెళ్తాడు. అప్పటికే రాధ తండ్రికి అప్పిచ్చిన కాబూలీవాలా వచ్చి గోపీని ఏదో ఒకటి చెప్పి వెనక్కి పంపించకపోతే రాధని చంపేస్తానంటాడు. ఆ భయంతో రాధ తండ్రి గోపీ ఏ సంగతీ చెప్పకుండా వెళ్ళిపోవడంతో అప్పు తీర్చలేక రాధకి పెళ్ళి చేశానని చెప్తాడు. అది విని గోపి రాధ-లేని-బాధతో బోటెక్కి వెళ్ళిపోతాడు. రాధ నాన్న వున్న-రాధకి పెళ్ళి చెయ్యలేని బాధతో ఇహలోకం లోంచే వెళ్ళిపోతాడు. తనని బలవంతంగా పెళ్ళి చేసుకోబోతున్న కాబూలీవాలా నుంచి తప్పించుకోవడానికి రాధ కాశ్మీరు లోయల్నుంచి హైద్రాబాదు కొండల దాకా తెగ పరుగెట్టేస్తూ ఓ చోట కాలు జారి పడిపోతుంది. ఎక్కడ పడిందా, ఏమయ్యిందా అని చూద్దామనుకునే లోపు సీను మారిపోతుంది.

మారిన సీనులో రాజసులోచన, కవిత గోపీ ఇంటికొస్తారు. ఈ ఇంట్లో నాకూ హక్కుంది అని గొడవ చేయబోయిన రాజసులోచనని బ్రతిమలాడి వాళ్ళనుంచిన ఇంటికి తీసుకెళ్తాడు గోపీ. రాధతో పెళ్ళి కాలేదనీ, ప్రియతో పెళ్ళి వద్దనీ సతమతమవుతున్న గోపీకి ఇంకో పెళ్ళి గొడవ చుట్టుకుంటుంది. రాజసులోచన తన కూతురు ప్రేమించిన వాడితో ఆమెకి పెళ్ళి చెయ్యమని గోపీని దబాయిస్తుంది. సరే అని అడగబోయిన గోపీని మూడు లక్షల కట్నం అడుగుతాడు పెళ్ళికొడుకు హరిప్రసాద్ తండ్రి పీజేశర్మ. డబ్బు లేదో అని బాధపడుతున్న గోపీకి ఆ మూడు లక్షలూ ఇస్తాడు అల్లురామలింగయ్య. దాంతో కవిత, హరిప్రసాదుల పెళ్ళైపోతుంది. గోపీ కూడా అల్లు మామయ్య చేసిన డబ్బు సాయానికి కృతజ్ఞతగా ప్రియని పెళ్ళి చేసుకుందామనుకుంటాడు. అందులోనూ ప్రియ బుంగమూతి పెట్టి నన్ను పెళ్ళి చేసుకోనన‌కు బావా అని బ్రతిమలుతుంది కూడా. అప్పుడు పెళ్ళికి ఒప్పుకోలుగా నటసామ్రాట్ నవ్వీనవ్వనట్టుగా రువ్విన ఓ చిరునవ్వు భలే సటిల్‌గా వుండి నాకు నచ్చేసింది. ఆ నవ్వు చూడగానే ఇంకేముంది?! ప్రియ మళ్ళీ కలగనేస్తుంది. "***కాళ్ళా గజ్జా కంకాళమ్మా***" అంటూ పెళ్ళికూతురి వేషమేసుకొచ్చి మరీ. ఈ పాటలో బారెడు జడకి జడగంటలేసుకుని, బుగ్గన చుక్క పెట్టుకుని, కాళ్ళకి పట్టీలు, మెళ్ళో హారాలు, పట్టుచీరలతో ముస్తాబు చేసుకుని జయసుధ ఎంతో ముద్దుగా అచ్చు కొత్తపెళ్ళికూతురులా వుంటుంది. అసలు ఈ సిన్మాలో ఏఎన్నారు-జయసుధ పాటలు భలే హుషారుగా, ఒకరితో ఒకరు పోటీ పడుతూ డాన్సాడుతున్నట్టుగా వుంటాయి. భలే!

సరే! పాటవుతూనే ప్రియకి, గోపీకి పెళ్ళవుతుంది. గోపీ లేచి ప్రియ మెడలో మంగళసూత్రం కట్టగానే ఎదురుగుండా అక్షింతలు వేస్తూ రాధ కనిపిస్తుంది. నయం! ఇంతకు ముందు నే చెప్పిన "యువరాజు" సినిమాలో లాగా ఏఎన్నారు పీటల మీంచి లేచెళ్ళిపోలేదు. కాకపోతే పెళ్ళైపోయింతర్వాత కారేసుకుని వూళ్ళో వున్న హోటల్సన్నీ వెతకడానికి వెళ్తాడు. ప్రియేమో శోభనం గదిలో పెట్టిన ఫ్రూట్సూ, స్వీట్సూ తినేసి పాలు తాగేసి భుక్తాయాసంతో

నిద్రపోతుంది. రాధ కోసం ఊరంతా తిరిగి తిరిగి గోపీ ఓ హోటల్ రూంలో కూర్చుని ఊళ్ళో వున్న మిగిలిన హోటళ్ళన్నిటికీ ఫోన్ చేస్తూ వుంటాడు "కాశ్మీర్ నుంచొచ్చిన రాధ అనే అమ్మాయి మీ హోటల్లో వుందా?" అంటూ.

ఇంతలో పక్క గదిలోంచి చంటిపిల్లాడి ఏడుపు వినిపిస్తుంది. ఎందుకా అని చూడ్డానికి వెళ్ళిన హోటల్ రూంబోయ్ పరిగెట్టుకుంటూ వచ్చి, ఎవరో ఒకావిడ నిద్రమాత్రలు మింగిందని చెప్తే, చూడ్డానికి వెళ్ళిన గోపీకి మంచం మీద పడివున్న రాధ, పక్కనే ఏడుస్తున్న బుజ్జిపాప కనిపిస్తారు. గబగబా రాధని తీసుకెళ్ళి హాస్పిటల్లో చేరుస్తాడు గోపీ. రాధకి ఏమీ ప్రమాదం లేదని డాక్టర్ చెప్తుంది. ఇంతలో అక్కడికొచ్చిన రాధ బాబాయి కేవీచలం గోపీకి తెలియని, సినిమా చూస్తున్నవాళ్ళందరికీ రాధ పరిగెడుతూ గోతిలో (అది నేననుకున్నట్టు గొయ్యి కాదు, లోయట) పడ్డ దాకా తెలిసిన ఫ్లాష్‌బాక్ మాత్రమే కాక, ఆ తర్వాత రాధకి కాలు విరిగి, నెల తప్పిన సంగతి కూడా చెప్తాడు. నేను చిన్నప్పుడు ఈ సినిమా చూసుంటే గోతిలో పడి కాలు విరిగినందుకే జయప్రదకి పిల్లాడు పుట్టాడు అనుకుని వుండేదాన్ని. అలాంటి తలాతోకా లేని అల్గారిథంలు రాస్తానేమోనని ఊహించే మా అమ్మ నాకీ సినిమాలు చూపించలేదు. ఎంత అపార్థం చేసుకున్నాను మా అమ్మని! *హన్నా!*

సరే! సరే! చలంబాబాయి చెప్పిన కథ వల్ల గోపీకి రాధకి పెళ్ళి కాలేదని, ఆ పాప తనకు పుట్టిన పాపేనని తెలుస్తుంది. ఇంతలో రాధ కళ్ళు తెరుస్తుంది. కళ్ళు తెరిచిన రాధతో దాసరి వ్రాసిన బోల్డంత క్రిప్టిక్‌గా, మరెంతో లాజిక్కుతో తిప్పి–తిప్పి– చెప్పిందే చెప్పి–మెదడుని–పిప్పి చేసే డవిలాగులు చెప్పి చెప్పక చెప్తూనే గోపీ రాధతో " నీ సంగతి ప్రియతో చెప్పి ముగ్గురం కలిసుండడానికి ఒప్పిస్తా"నంటే, దానికి రాధ "ఒక మొక్కని పాతటం కోసం మరో మొక్కని నరికేయటం తప్పండి" అనగానే, దానికి గోపీ "పడవలో ఒకరున్నారని నీళ్ళల్లో కొట్టుకు పోయేవారిని చూసి వదిలేయడం న్యాయమంటావా?" అనడుగుతాడు. ఈ చెట్లూ–పడవలూ వగైరా ఉదాహరణలు అయ్యాక కూడా రాధ గోపీతో ప్రియకి తన సంగతి చెప్పనే వద్దని చెప్తుంది. ఇంక చెప్పడానికీ, వినడానికీ డైలాగులేమీ లేక సైలంటైపోయిన గోపీ చూపించిన ఇంట్లో రాధ, పాప, చలంబాబాయి వుంటుంటారు. వాళ్ళకి గోపీ సరుకులు కొంటుంటాడు. రాధ కొంతమంది ఆడపిల్లలకి నాట్యం నేర్పిస్తూ వుంటుంది.

ఇక్కడ ప్రియ వాళ్ళింట్లో ఏం జరుగుతూ వుంటుందంటే చిట్టిపొట్టి కవితలల్లే తాయారమ్మాంటీ ఓ హార్మణీ పెట్టె పట్టుకుని ముందుకీ–వెనక్కీ ఊపుతూ "రాసుకో రాసుకో ఈ పూట ఒక పాట...పాడుకో పాడుకో ఆ పాట ఈ పూట" అని ఓ పాటకి వరస కడుతూ వుంటుంది. పైగా "పేకాట ఆడేవాడికి పక్కన ఒక ఆడే చెయ్యీ, తాగేవాడికి పక్కన ఒక తాగే నోరూ లేకపోతే ఎలా తోచదో ఈ సంగీతం కూడా అంతే! పాడేవాడికి వాయించేవాడు, వాయించేవాడికి పాడేవాడూ లేకపోతే మైండేం పని చెయ్యదు" అని సంగీతం గురించి ఓ స్పీచిచ్చి "నీ మీద మీ బావకి ప్రేమ పుట్టాలంటే నువ్వు డాన్స్ నేర్చుకోవాలి" అని ప్రియకి ఓ సలహా ఇస్తుంది. అంతే కాదు తన ఫ్రెండు వెంకాయమ్మ ఇచ్చిన రిఫరెన్సుతో ప్రియని దగ్గరుండి మరీ తీసుకెళ్ళి రాధ దగ్గర డాన్స్ నేర్చుకోవడానికని చేరుస్తుంది.

అలా రాధ దగ్గర డాన్స్ నేర్చుకోవడం మొదలు పెట్టిన ప్రియకి పగలూ రాత్రీ కళ్ళు తిప్పుకోవడం, చేతులు తిప్పుకోవడం ఇదే ధ్యాస. ఇంతకీ రాధ, ప్రియలకి వాళ్ళిద్దరూ ఒక శ్రీవారి దేవేరులే అని తెలీదు.

ఇంతలో గోపీ ఓ రోజు రాత్రి కొత్తబట్టలు పట్టుకుని రాధ దగ్గరికి వస్తాడు. అవెందుకని అడిగిన రాధకి ఉగాది వస్తోందని నీకూ, పాపకీ బట్టలు తెచ్చానంటాడు. వెంటనే రాధ ప్రియకి తెలిస్తే బావుండదు ఇంకెప్పుడూ ఇలా రావొద్దు అని చెప్పి పంపించేస్తుంది.

ఇక ప్రియ ఓ రోజు ఏం చేస్తుందీ అంటే గోపీ ఆఫీసుకి ఫోన్ చేసి "నేను డాన్స్ చేయడం నువ్వు చూడాలి, ఉన్నపళంగా ఇంటికి రమ్మం"టుంది. ఇంటికి వచ్చిన గోపీకి రాధ తన గుర్విణి అని పరిచయం చేస్తుంది. రాధకి అప్పుడు అర్థం అవుతుంది ప్రియ గోపీ భార్య అని. ప్రియ గోపీని సితార్

వాయించమని చెప్పి డాన్స్ చెయ్యడానికి రెడీ అవుతుంది. రాధాప్రియల మధ్య నలిగిపోతూ బాధామయుడు గోపీ ఓ సరి లేని దాసరి మార్కు పాటనందేసుకుంటాడు. దానికి ప్రియ చిందేసుకుంటుంది.

ఆ పాట వరస ఇదీ...

*సూర్యునికొకటే ఉదయం – మనిషికి ఒకటే హృదయం*
*ఆ ఉదయం ఎందరిదో? – ఈ హృదయం ఎవ్వరిదో?*
*చీకటి పోకకు వెలుతురు రాకకు వారధి ఆ ఉదయం*
*ప్రేమ పోకకు త్యాగం రాకకు సారథి ఈ హృదయం*
*అది వెలిగే ఉదయం – ఇది కరిగే హృదయం*

వారెవా! రాకపోకలని ఓ పాటలో ఇలా రాసేసుకుపోయిన దాసరి వారికి వందనం...అభివందనం! అన్నట్టు ఈ పాటలో ఎస్పీబీ శృతి ఓ రెండు చోట్ల ఆరున్నొక్కటికి చేరుతుంది. ఈ పాట మధ్యలో స్టెప్పు కుదరక తడబడిన ప్రియ ఆగిపోతే, అది సరిచేయడానికి ఆవేశంతో ఊగిపోతూ రాధ కూడా స్టెప్పులేసి డాన్స్ చేస్తుంది. పాట అయిపోగానే డాన్స్ చేస్తున్న ప్రియ కళ్ళు తిరిగి కింద పడిపోతుంది. అప్పటివరకు అక్కడే వుండి డాన్స్ చూస్తున్న గోపీ తల్లి, తాయారమ్మాంటీ, చలం బాబాయి కంగారుగా ప్రియ కేమయిందో అని తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టారు. స్పృహ వచ్చిన ప్రియ ఇంకా తను డాన్స్ చేస్తున్నట్లే కాళ్ళూ, చేతులూ తిప్పుతూ వుంటుంది. మొత్తానికి తేరుకుంటుందనుకోండి.

ఓ రోజు ప్రియ రెండు ఒకేలాంటి చీరలు తీసుకుని రాధ దగ్గరికి వెళ్ళి, ఇవి మనిద్దరి కోసం కొన్నానంటుంది. అప్పుడే మాటల్లో రాధ వాళ్ళాయన ఆమెతో ఎందుకు కలిసి వుండట్లేదో అనడుగుతూ, తను ఎంతో ఇష్టపడి పెళ్ళి చేసుకున్న తన బావ గోపీకి తనంటే ఇష్టం లేదని, తన ఫ్రెండ్స్‌తో చెప్పుకోవడానికి శ్రీవారిముచ్చట్లే లేవని చెప్తుంది. అది విని రాధ బాధ పడ్తుంది. వెంటనే గోపీకి ఫోన్ చేసి రమ్మని చెప్పి ప్రియని బాధ పెట్టొద్దని, ఆమెని భార్యగా సంతోష పెట్టమని చెప్తుంది. ఇంక ఆ తర్వాత సీనులో రాధ ప్రియని శోభనం పెళ్ళికూతురిలా అలంకరించి "***తూరుపు తెలతెలవారగనే తలుపులు తెరిచీ తెరవగనే చెప్పాలమ్మా మీ శ్రీవారిముచ్చట్లు***" అని పాడి గోపీ దగ్గరికి పంపిస్తుంది.

ఇంకా తర్వాత రాధ డాన్స్ పాఠాలు చెప్పడంలో మునిగిపోతుంది. ప్రియకి నెలలు నిండి ఒక పాప పుడుతుంది. ఓ రోజు పాపని తీసుకుని ప్రియ రాధ ఇంటికి వచ్చి పాపాయికి రాధ పేరే పెట్టానని చెప్తుంది. ఆ కబురూ ఈ కబురూ చెప్తూ మళ్ళీ రాధ భర్త గురించి అడుగుతుంది ప్రియ. ఇంతలో ఒళ్ళో వున్న పాపాయి చీర తడిపితే పాపాయికి బట్టలు మార్చడానికి లోపలి గది లోకి వెళ్తుంది ప్రియ. అప్పుడే గోపీ రాధ దగ్గరికి వచ్చి తమ సంగతి ప్రియకి చెప్పేస్తానని అంటుంటే, రాధ ప్రియ బయటికొచ్చి గోపీని అక్కడ చూస్తే ఏమవుతుందో అని కంగారు పడుతుంది. ఇంతలో ప్రియ రానే వస్తుంది, గోపీని ఏంటిక్కడికి వచ్చారని అడుగుతుంది. వెంటనే గోపీ మాట మార్చి ప్రియ ఇక్కడ వుందని తెలిసి దార్లోనే కదా అని ఇంటికి తీసుకెళ్దామని వచ్చానని చెప్తాడు. హమ్మయ్య! నాకసలే టెన్షనూ...జయసుధ, అదే ప్రియ, రాధా, గోపీల అసలు సంగతి తెలిసిపోయి "నీవాడు లేడన్నావ్ ఆఅ ఆఅ అ అ ఆ , నా వాడిని లాక్కున్నావే ఆఅ ఆఅ అ అ ఆ " లాంటి పాటేదో పాడెస్తూ, మళ్ళీ చీర పైక్కట్టి కళ్ళు పెద్దవి చేసి తాండవం చేసేస్తుందేమోనని! అలాంటివేమీ జరగవు. ప్రియ గోపీతో "రాధ భర్త ఆమెని వదిలేసి వేరే పెళ్ళి చేసుకున్నాడని, అతనికి రాధని అతనింటికి తీసుకెళ్ళే ధైర్యం లేద"ని ఏంటేంటో చేతులు తిప్పుకుంటూ అనేస్తుంది. ఇంటికెళ్ళింతర్వాత గోపీ చాలా తెలివిగా ఇద్దరుభార్యలభర్తకి వున్న ఇద్దరు భార్యల్లో ఒకరిగా నీకే ఆ పరిస్థితి వస్తే నువ్వేం చేస్తావ్ అనడిగితే "సలహాలు ఎదుటి వారికివ్వడానికే గానీ నేను అలాంటి భర్త చేసే పనిని ఒప్పుకోనం"టుంది ప్రియ . పైగా రాధని పొగుడుతున్న గోపీని అనుమానంగా చూస్తూ రాధంటే అంత ఇంట్రెస్టు ఏంటీ అన్నట్లు మాట్లాడుతుంది. అక్కడితో అప్పటిదాకా ఉత్సాహ పడిన గోపీ సైలెంటైపోతాడు.

ఓ రోజు చీరల షాపింగ్‌కి వెళ్ళిన ప్రియకి ఆమె ఫ్రెండ్ కవిత కనిపిస్తే తనకు పెళ్ళైందని చెప్పి, శ్రీవారిముచ్చట్లు చెప్తూ తన ఇంటికి తీసుకొస్తుంది ప్రియ. ఆ సమయానికి తాయారమ్మాంటీ తనకి సినిమా పాటలు రాయడం ఇష్టమని కవితకి చెప్తూ "సినిమాలకి పాటలు రాయడం పెద్ద విశేషమా ఏం? ఏముందీ...వెన్నెలొచ్చింది, చీకటి పడింది, చెట్టూ, చెట్టు కింద పుట్ట, దాని కింద గుట్ట...నన్ను రాయమంటే మూడు నిముషాల్లో రాసి పడేస్తానే!" అంటుంది. ఔరా! డీఎన్నారూ! సినిమా పాట రాయడం ఇంత వీజీ అనుకోలేదుస్మీ!

ప్రియ గదిలో గోపీ ఫోటో చూసి మా అన్నయ్య అని చెప్తుంది కవిత. ప్రియని తన ఇంటికి తీసుకెళ్ళి తన తల్లి రాజసులోచనకి గోపీ ప్రియ భర్త అని చెప్తుంది. అప్పుడే ప్రియకి రాజసులోచన తన మావగారి రెండో భార్య అని తెలుస్తుంది. ఆ విషయం తనకి గోపీ అస్సలెప్పుడూ చెప్పలేదేంటా అనుకుంటున్న ప్రియతో కవిత, రాజసులోచన మగవాళ్ళెప్పుడూ నిజాలు చెప్పరని అంటూ ప్రియకి గోపీ మీద అనుమానం కలిగేలా మాట్లాడతారు. కవిత ఇంకా ఏమంటుందంటే తన భర్త హరిప్రసాద్‌కి కూడా ఇంకా ఒకళ్ళో, ఇద్దరో వున్నారంటుంది. సరిపోయింది! ఈ సినిమా అంతా ***ఏ ఆడపాత్ర కథ విన్నా ఏముంది తెరాయణం? తెరతెర మొత్తం శ్రీశ్రీవారి ముచ్చట్ల పారాయణత్వం!***

సరే! తల్లీకూతుళ్ళైన రాజసులోచన, కవిత చెప్పిన వాళ్ళ వాళ్ళ శ్రీవార్ల ముచ్చట్లు విని ఇంటికి వస్తున్న ప్రియకి గోపీ కార్లో ఎవర్తోనో కలిసి వెళ్తున్నట్లనిపిస్తుంది. ఇంటికొచ్చిన గోపీతో అతనికింకో అమ్మ, చెల్లి వున్నట్లు తనకెందుకు చెప్పలేదూ అని గొడవ పెట్టుకుంటుంది. ఇంతలో అక్కడికొచ్చిన గోపీ తల్లి సుకుమారి "ప్రియ చెప్పేదంతా నిజమేనా" అనడిగితే ప్రియ ఆవిడని తీసుకుని రాజసులోచన ఇంటికి బయల్దేరుతుంది.

ఓ రోజు రాధ గోపీ ఆఫీసుకి ఫోన్ చేసి పాపకి ఒంట్లో బాగాలేదని చెప్తుంది. అది వినగానే గోపీ బయల్దేరి రాధ దగ్గరికి వెళ్ళి ఆమెతో కలిసి పాపని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తాడు. అదే టైంకి అటుగా వెళ్తున్న ప్రియ గోపీ కారు డాక్టర్ క్లినిక్ ముందు ఆగి వుండడం చూసి, కారాపమని వెళ్ళి రాధా, గోపీలని చూస్తుంది. ఇంటికొచ్చేసిన ప్రియకి చాలా కోపంగా వుంటుంది. తన కోసం వచ్చిన రాధని నోటికొచ్చినట్టల్లా తిడుతుంది. అప్పుడే ఇంటికొచ్చిన గోపీ రాధని తిడుతున్న ప్రియని చెయ్యెత్తి కొట్టబోతాడు. ఇక్కడ కదా... ఈ శ్రీవారి ముచ్చట సంగతేమో కానీ వారి శ్రీమతులకి పిచ్చట అనిపించేదీ?? ఒక పక్కేమో రాధ ప్రియని కొడితే నా మీద ఒట్టే అని లాగుతూ వుంటే, ఇంకో పక్క రాధ మాట విని తనని కొట్టకపోతే ఇంకంతే సంగతులు అని ప్రియ అరుస్తూ వుంటుంది.

ఆ సపత్నీ-సంవాదంతో విసిగిపోయిన గోపీ ప్రియకి రాధ తనకి తాళి కట్టని భార్య అని చెప్పి, తను ప్రియతో సవ్యంగా కాపురం చేయడానికి రాధ మంచితనమే కారణమని చెప్తాడు. ఈలోగా అక్కణ్ణించి తన ఇంటికి బయల్దేరిన రాధ రోడ్డుకి అడ్డంగా నడుస్తుంటే డీఎన్నారు ఓ కారుతో గుద్దించి పడేస్తాడు. అది ఆ వెనగ్గా వస్తున్న గోపీ చూసి రాధని హాస్పిటల్లో చేరుస్తాడు. ఆ రాత్రి ఇంటికి వచ్చిన గోపీ ప్రియకి ఓ పే...ద్ద దానారా వారి ప్రవచనం చెప్తాడు: "***జరిగింది ఎందుకు జరిగిందని కానీ, ఎలా జరిగిందని కానీ, ఇందులో తప్పెవరిదని కానీ ఆలోచించొద్దు. జరిగే ప్రతిదాంట్లోనూ కొన్ని తప్పులూ వుంటాయ్, ఒప్పులూ వుంటాయ్. నేను రాధకీ న్యాయం చేయలేకపోయాను, నీకూ న్యాయం చేయలేకపోయాను. ఆమెకు అన్యాయం జరక్కూడదనే తాపత్రయం తప్ప నీకన్యాయం చెయ్యాలనే ఉద్దేశ్యం నాకెప్పుడూ లేదు. తుఫాను ఎప్పుడొచ్చినా భయంకరంగానే వుంటుంది. దానిని తట్టుకోవడం కూడా చాలా కష్టం. ఆ గాలిని తట్టుకుని ఒక్క క్షణం నిలబడగలిగితే ఆ తర్వాత ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది.***" ఈ ప్రవచనం ముందంతా బానే వుంది కానీ ఆ చివరాఖరి తుఫానూ-గాలీ-గోలా ఏంటో? అది విన్న ప్రియ అవాక్కు, గోపీ అవతలికి సైలెంట్లీ వాక్స్.

ప్రియ దగ్గర్నుంచి ఇవతలకి వచ్చిన గోపీకి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న రాజసులోచన, కవిత కనిపిస్తారు. మీరిక్కడికి ఎలా వచ్చారు అనడిగిన గోపీకి వాళ్ళమ్మ సుకుమారి వాళ్ళని తనే తీసుకొచ్చానని చెప్తుంది. గోపీ సంభ్రమాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బై తన తల్లిని దేవతల్లో దేవతవి అని పొగుడుతాడు. అది పక్కనుంచి విన్న ప్రియ తనూ దేవత కావడమెలా అని బా..ఘా ఆలోచించి ఓ డాక్టర్ దగ్గరికెళ్ళి ముందు అతన్ని బ్రతిమాలి, తర్వాత తను

చెప్పమన్నట్లు చెప్పకపోతే నిద్రమాత్రలు మింగేస్తానని బెదిరించి, తనకి కాన్సర్ వుందని, రెండు నెలల్లో చనిపోతానని డాక్టర్ చేత గోపీకి అబద్ధం చెప్పిస్తుంది. అది నిజమని నమ్మి గోపీ, అతనితో పాటు ఇంట్లో వాళ్ళందరూ బాధ పడతారు. రాధ కూడా ప్రియకి కాన్సర్ అని తెలిసి చూడ్డానికి వస్తుంది. పాపం! చెయ్యి విరిగింది కదా అందుకని జడ కూడా వేసుకోకుండా జుట్టిప్పుకుని అలాగే వచ్చేస్తుంది. రాధ తనని చూడడానికి వచ్చిందని చెప్పిన పనమ్మాయితో రాధతో పాటు, గోపీని కూడా మేడ మీదకి రమ్మనమని చెప్తుంది ప్రియ.

రాధతో పాటు వచ్చిన గోపీతో ప్రియ తనెలాగూ ఇంకో రెణ్ణెల్లలో పోతుంది కాబట్టి, తను తృప్తిగా పోవాలంటే రాధని భార్యగా తన స్థానం లోకి రమ్మని, దానికి ఒప్పుకోని రాధని, గోపీని సెంటి-మెంటల్‌గా మాట్లాడి ఒప్పిస్తుంది. వాళ్ళిద్దరూ ఒప్పుకోగానే ప్రియ అంతకుముందే కొనుంచిన ఒకేలాంటి చీరలు రెండు తెచ్చి ఒకటి రాధకిచ్చి, ఇంకోటి తను కట్టుకుని, అంతకు ముందు రాధ పాడిన "***తూరుపు తెలతెలవారగనే***" పాట ఇప్పుడు తను పాడుతుంది. పాట అయిపోయే సమయానికి రాధ చేతికున్న ఉంగరంలో వజ్రం మింగేసి, స్పృహ తప్పే ముందు గోపీకి ప్రియకి కాన్సర్ లేదని చెప్తుంది. నీకెలా తెలుసు అనడిగిన గోపీకి డాక్టర్ ఇంటికొచ్చినప్పుడు ప్రియలాంటి చీర కట్టుకున్న తనని చూసి తనే ప్రియ అనుకుని 'నీకు కాన్సర్ లేదని మీ ఆయనకి చెప్పేస్తాను" అని అనడంతో తనకి తెలిసిందని, అందుకే ప్రియ కోసం తను చనిపోతున్నానని చెప్తుంది. అసలా డాక్టర్ ఆ టైంలో ఇంటికి రావడమేంటో, హాలు మధ్యలో నిలబడి అంత గట్టిగా మాట్లాడినా అది రాధకి తప్ప ఇంకెవ్వరికీ వినపడక పోవడమేంటో... అంతా దా.నా.రాత!

ఈలోగా ప్రియ నిద్రమాత్తర్లు మింగేస్తుంది. అన్నట్టు అప్పుడెప్పుడో కవితని పెళ్ళి చేసుకుంటూ కనిపించిన హరిప్రసాద్ ఇంత కథా జరుగుతున్నప్పుడు ఎక్కడున్నాడో కానీ చివర్లో హీరోయిన్లు ఇద్దరూ తెరమరుగయ్యే టైంలో తెర మీదకి వస్తాడు.

చివరికి అటు ప్రియ, ఇటు రాధ ఇద్దరూ కలిసి "***ఆకాశానికి సూర్యుడూ వున్నాడు, చంద్రుడూ వున్నాడు. సృష్టికి చీకటీ వుంది, వెలుగూ వుంది. మనిషికి సుఖాలూ వున్నాయి, దుఃఖాలూ వున్నాయి. అన్నీ రెండ్రెండు వున్నప్పుడు నీకు రెండు ఉయ్యాలెందుకు ఉండకూడదూ?***" అని లాజికల్‌గా ఓ పెద్ద స్విచ్ స్టేట్‌మెంట్ లాంటిదేదో రాసి చెరో ఉయ్యాల్లో చెరో పిల్లనీ గోపీకి వదిలి వెళ్ళిపోతారు.

మొత్తానికి ...శ్రీవారిముచ్చట్లంటే నాకర్థమయింది ఏంటంటే...
ఓ భార్య లేని భర్త (ఇంటూ రెండో, మూడో... )
ఓ వున్న భార్య, పారిపోయిన భర్త...
ఓ ఇద్దరు భార్యలుండి వెళ్ళిపోయిన భర్త...
ఓ ఇద్దరు భార్యలు వెళ్ళిపోయి ఉండిపోయిన భర్త...
ఓ భార్యా-భర్తా...

**ఇదో దాసరీ-మజిలీ కథ... ఇంత వరకు మీరిది చదివుంటే, ఆ పైనున్న భార్యలెవరో, భర్తలెవరో కనిపెట్టి, ఖళ్ళు తుడుచుకోండి...బాబూ, ఖళ్ళు తుడుచుకోండి!**

లంకేశ్వరుడు

దానారా-అనారా కాంబినేషన్‌లో మరీ ఎక్కువగా సినిమాలు చూసేస్తున్నానూ అనిపించి, వేరే హీరో సినిమా ఏమన్నా చూద్దామని చూస్తే అనుకోకుండా దొరికిన లంకెబిందెలా ఈ **లంకేశ్వరుడు** సినిమా దొరికింది. దాంతోపాటే బోల్డన్ని సరదా-ట్రివియా టైపు విశేషాలు గుర్తుకొచ్చాయి. ఎందుకైనా మంచిది... ఏ **"మీలో ఎవరు కోటీశ్వరుడు?"** లాంటి క్విజ్జుల కోసమైనా పనికొస్తుందేమో ఎవరికైనా అని ఇక్కడ రాస్తున్నాను. ఇది చదివి ఎవరికైనా కోటి వస్తే నా వాటాగా ఇంకోటి అడిగి పుచ్చుకోవడం మర్చిపోకండేం?

1) లంకేశ్వరుడు అని పేర్గాంచిన ఈ చిత్రరాజం ఎస్సైఎఫ్డీఏ డీఎన్నారు, చిరంజీవిగా యశస్వి అయిన కేఏసెస్వీపీ కాంబినేషన్‌లో వచ్చిన మొట్టమొదటి సం-చలనచిత్రం

2) డీఎన్నారు దర్శకత్వంలో వచ్చిన వందో చలనచిత్రం

3) దానారా మొదటి సినిమా **తాతా-మనవడు**. దానారా వందో సినిమా **లంకేశ్వరుడు**కి డైరెక్టర్-హీరోలు ఎవరంటే తాతా-మనవడు వరసవారైన దానారా - చిరంజీవి (ఓ రెణ్ణెల్ల క్రితం "దాసరి నాకు తాత అవుతారు" అని వాక్రుచ్చారు మెగాస్టారుగారు).

4) లంకేశ్వరుడు సినిమా టైంకి చిరంజీవి బిరుదు "నటవిజేత" (ఈ సిన్మా **విజేత** తర్వాత రిలీజ్ అయినట్లుంది.)

5) ఈ సిన్మాలో నందమూరి వంశదీపం, అన్నగారి తమ్ముడుగారి కొడుకు కళ్యాణ చక్రవర్తి కూడా వున్నాడు

6) "**అన్నయ్య**" తో పాటు తమ్ముడు కూడా వున్నాడీ సినిమాలో - అంటే **తమ్ముడు** సిన్మాలో హీరో అయిన జూలు లేని సింహం పవన్ కళ్యాణ్ కాదండోయ్, నవ్వులెక్కువగా నవ్వే బాబు నాగేంద్ర బాబు. (అన్నయ్య=చిరంజీవి హీరోగా వచ్చిన ఒకానొక సిన్మా).

7) డాన్స్ డైరెక్టర్‌గా వాళ్ళ నాన్న సుందరంతో పాటు ప్రభుదేవా యస్-ప్రభు గా పరిచయమయినట్టున్నాడు ఈ సినిమాతో. తను ప్రభుదేవా కాక ముందు ప్రభు సుందరం కదా మరి?!

8) క. స్కీ. మా. పా. ద. డా. దా నా రా. కొసన కొంగుబగారం SIFDA లేదు. (ఇన్ని సిన్మాయణాలూ చదివి **కస్కీమాపాద** అంటే ఏంటని అడిగార్ట వెనకటికెవరో మీలాంటి వాళ్ళే! మరీ చోద్యం కాపోతే!)

**చిత్ర కథా ప్రారంభే యథాశక్తి సిన్మతీ గిద్యం సమర్పయామి ...**

మొదటిసారిగా చిరంజీవిని హీరోగా పెట్టు
వందో సిన్మాలో నవరసాలూ వండిపెట్టు
కథ మాటలూ పాటలూ తానే రాసి పెట్టు
హిట్టో ఫట్టో సెంటిమెంటు కూరిపెట్టు మన దానారా సిన్మతీ

పేర్లూ అవీ ఇంకా పడకుండానే చిరంజీవొచ్చేస్తాడు తెర మీదకి. ఒచ్చి రావుగోపాల్రావు గొంతుతో మూడు లైన్లు బట్టీపట్టినట్టుగా అప్పచెప్పి అదృశ్యమైపోతాడు. ఆ మూడు లైన్లూ ఇక్కడ నేనట్టిపెట్టా మీరు చదూకొనేట్టు...

*వందమంది పేదవాళ్ళ కడుపుకొట్టే ఉన్నవాడి తల కొట్టూ*
*ఆ కొట్టింది పదిమందికీ పంచి పెట్టు*
*మనిషిగా పుట్టినందుకు ఈ జన్మ విలువ నిలబెట్టు*

పేర్లవుతూనే తెర మీద అంతా చీకటి.
ఆ చీకటిని వెలి గిస్తూ నీలం రంగు బెడ్‌లైట్ల లాంటి కాంతి.
ఆ నీలపు కాంతిలో కనిపిస్తాడు చిరుత-సహిత-చిరంజీవి.
చిరుత-చిరంజీవి కాళ్ళ కింద ఇసక. ఆ ఇసకలో అటూ ఇటూ గుచ్చుంటాయి త్రిశూలాలు.
ఆ ఇసకలో ఒళ్ళంతా నల్లరంగు రాసుకుని మూటెత్తుకుని పారిపోతున్నట్లున్న చిరంజీవి విగ్రహం.
ఆ విగ్రహం ముందు కూర్చుని "సాంబసదాశివ సాంబసదాశివ" భజన చేస్తూ సాక్షి రంగారావు మాష్టారు, నాగ బాబు, బృందం.

ఇంతకీ అదో లంక. ఆ లంకలో వున్న ప్రతీ మనిషికో చింత: చదువు లేదనో, ఉద్యోగం లేదనో, వరదల్లో ఇళ్ళు కొట్టుకుపోయాయనో. ఆ చింతలన్నిటినీ బాపిన ఈశ్వరుడే లంకేశ్వరుడు, మన హీరో శంకరుడు. అసలు ఈ సినిమా టైటిల్ చూడగానే ఇదేదో రావణాసురుడిని రోల్-మోడల్‌గా పెట్టుకున్న విరోధాభాస-మాన అసమాన కథానాయకుడి కథ అనుకున్నా. తీరా చూస్తే "ఔరా! డీఎన్నారు మాటలకు అర్థాలు వేరులే!" అనిపించి ఇక నా బుర్రకి ఆట్టే పని చెప్పకుండా కళ్ళూ, చెవులూ తెరకప్పగించి చూస్తుండిపోయా.

ఈ లంక దాటితే ఓ తెల్ల గోడల డెన్ను. ఆ డెన్నుకో డాను కైకాల సత్యన్నారాయణ, దీన్‌దయాళ్ అనబడే గాడ్‌ఫాదర్. ఒంటి మీద మాయని తెల్ల సూటు, నోట్లో పొగొచ్చే పైపు, చేతికో కర్ర చేరుపు, నడకలో పడవ టైపు ఊపు – ఇదీ డాను గారి ముస్తాబు. ఆ డాను గాడ్‌ఫాదర్ దీన్‌దయాళ్ (డాన్ గా.ఫా.దీ.ద.) గారి దగ్గర మైఖేల్ అని పిలవబడే మోహన్‌బాబు ఎడంభుజం, రెడ్‌సన్ అనబడే విషపురుషుడు రఘువరన్ కుడిభుజం. రఘువరన్‌కి పాము చేత కాటేయించుకుని, రంగు కాంటాక్ట్ లెన్సులు పెట్టుకోవడం సరదా.

హెరాయిన్ను స్మగుల్ చెయ్యబోతూ పోలీసులకి దొరికిపోయిన తన కొడుకుని రక్షించమని సేఠ్ చమన్‌లాల్ (త్యాగరాజు) డాన్ గా.ఫా.దీ.ద. దగ్గరికి వస్తాడు. ఆ పని చేయడానికి డాన్ గా.ఫా.దీ.ద. ఏభై లక్షలు అడగ్గానే త్యాగరాజు లంకేశ్వరుడు ఒక లక్ష రూపాయిలకే తన కొడుకుని విడిపిస్తానన్నాడని చెప్పగానే డాన్ గా.ఫా.దీ.ద. అదే జరిగితే కనక తనే త్యాగరాజుకి ఏభై లక్షలు ఇస్తానని సవాల్ చేస్తాడు.

మొత్తానికి పోలీసుల్నుంచి త్యాగరాజు సన్నుని కాపాడ్డానికి డెన్ను నుంచి టోపీ పెట్టుకున్న మోహన్‌బాబున్నూ, లంక నుంచి లంకేశ్వరుడున్నూ చెరో పక్కా బయల్దేరుతారు. తీరా అక్కడికెళ్ళాక మోహన్‌బాబు తన కార్లో వెనక సీట్లో వున్న శ్రీహరి, బాబ్‌క్రిష్టోలను బాంబులేసి చిందరవందరగందరగోళం చెయ్యమని పంపిస్తాడు. వాళ్ళెళ్ళి నోటితో కొరికి విసిరిన నేలటపాకాయలతో బోల్డంత దుమ్ము రేగేలా చేస్తారు. అంత గందరగోళం లోనూ ఛాన్స్ దొరికినా పారిపోకుండా దిక్కులు చూస్తున్న సేఠ్ చమన్‌లాల్ కొడుకుని మోహన్‌బాబు గాంగ్ తీసుకెళ్తూ వుండగా, ఈ లోగా లంకేశ్వరుడొచ్చి కాకి తన్నుకుపోయిన నేతిగిన్నెలా పట్టుకుపోతాడు ఆ సన్నుని. వెంటనే సేఠ్ చమన్‌లాల్ డాన్ గా.ఫా.దీ.ద.కి ఫోన్ చేసి ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏభై లక్షలూ పంపమంటాడు.

లంకేశ్వరుడు ఫైటింగులూ గట్రా అయిపోగానే లంకలో తన ఇంటికి వస్తాడు. అదేదో యూనివర్సల్ స్టూడియోలో కౌబాయ్ సెట్టింగులా వుంటుంది ఆ ఇల్లు. దాని ముందు మేకలు కాసుకుంటూ, బట్టలు నేసుకుంటూ జనజీవనస్రవంతి మహా హడావిడిగా వుంటుంది.

ఇంతలో అక్కడికి బాబ్‌క్రిష్టో, శ్రీహరి, ఇంకో ముగ్గురు సూట్లేసుకున్న రౌడీలతో వచ్చి లంకేశ్వరుడితో "నిన్ను మా అయ్యగారు దీన్ దయాళ్ రమ్మంటున్నాడు" అని చెప్తాడు. మరి లంకేశ్వరుడు అంత వీజీగా వెళ్ళడు కదా! మళ్ళీ ఓ ఫైటు.

ఇన్ని సినిమాల్లో చేస్తున్నా ఈ విలన్లకీ, వాళ్ళ వెనకాల వుండే రౌడీలకీ బుద్ధి రాదు కాక రాదు. అందరూ ఒక్కసారి వెళ్ళి హీరో మీద పడి కొట్టకుండా ఒక్కోడూ క్యూలో వెళ్ళడం, తన్నులు తినడం. ఇదంతా తన డెన్నులోనే కూర్చుని టీవీ స్క్రీన్ మీద డీఎన్నారు టెలికాస్ట్ చేయిస్తే చూసిన డాన్ గా.ఫా.దీ.ద లంకేశ్వరుణ్ణి తీసుకురమ్మని రఘువరన్‌ని పంపిస్తాడు.

చిరుత-సహిత-చిరంజీవి గా.ఫా.దీ.ద. డెన్నుకొస్తాడు. అప్పుడు డీఎన్నారు డైలాగ్రతిభకి నా నోట మాట లేక అయ్యా నేనప్రతిభ! మీరూ చిత్తగించండి.

*"మాతో చేతులు కలుపగలవా?" గా.ఫా.దీ.ద. ప్రశ్న.*
*"చేతులకి సున్నం రాయనంతవరకూ కలిపే వుంచుతాను", లంకేశ్వరుడి సమాధానం.*
*"అన్నం పెట్టిన చేతిని నరకనంతవరకూ సున్నం రాయాల్సిన అవసరం వుండదు" మైఖేల్ మోహన్‌బాబు ఉవాచ.*
*"అందుకే కడుపు నిండేంతవరకూ అన్నం పెట్టకూడదు." లంకేశ్వరుడి ప్రతి-ఉవాచ.*

ఆ పై డవిలాగులు విన్న నా తెలివిడి నాపై కినిసి నానుంచి విడివడి "ఈ డీఎన్నారు మాటల అలికిడి మాత్రమే నీ వినికిడికి సరి. నీ తెలివిడి ఆట్టే వాడకు, అర్థం చేసుకోవడానికి ఆపసోపాలు పడకు, ఆవిరైపోతావు" అని హెచ్చరించింది. మళ్ళింకొక్కసారి ఆలోచన వైపు మళ్ళకుండా సిన్మా చూస్తానని శపథం చేశా. సిన్మా చూడ సాగా.

మొత్తానికి లంకేశ్వరుడు, గాఫాదీద ఇప్పట్నుంచీ కలిసి పని చేయడానికి ఒప్పందాలు చేసుకుంటారు. అన్నట్టు చిరుత, చిరంజీవి రెస్పెక్టివ్ మెడల చుట్టూ ఒకే లాంటి గొలుసులు చుట్టుకున్నారండోయ్!

ఈ సిన్మాలో ఒంటికి తెల్ల చొక్కా కూడా వేసుకోని, కంటికి నల్ల కళ్ళజోడు పెట్టుకునే ఇంకో పిల్ల-డాన్ కూడా వున్నాడు. మైఖేల్ మోహన్‌బాబు, రెడ్‌సన్ రఘువరన్ అతని దగ్గరకు వెళ్తారు. ఇప్పటివరకు కన్నతండ్రిలా తమని పెంచిన గాఫాదీద ఇప్పుడు లంకేశ్వరుణ్ణి తనతో కలుపుకుంటున్నాడని, అందుకని అతనితో విడిపోయి ఈ పిల్ల-డాన్‌తో చేతులు కలుపుదామనుకుంటున్నామని చెప్పగానే ఆ పిల్ల-డాన్ తొందర పడొద్దని చెప్తాడు.

ఈలోగా సీను మారి ఓ డాన్స్ స్టేజ్ మీదకి వెళ్తుంది. అక్కడ ఓ పాతికేళ్ళొచ్చినా వయసుకి, బుద్ధి విలోమానుపాతంలో వున్నట్టున్న ఓ వీరోయిన్ను ప్రేక్షకుల్లో కూర్చుని వుంటుంది. ఇంతలో తాడు కట్టిన ఓ చెక్కస్టూల్ మీద నుంచుని స్టేజ్ మీదకి దిగుతాడు సకలకళావల్లభుడు లంకేశ్వరుడు. వస్తూనే అందరితో చప్పట్లు కొట్టిస్తూ పాట మొదలెట్టేస్తాడు "***పదహారేళ్ళ వయసు, పడిపడి లేచె మనసు***" అంటూ. ఈ పాట ఇంకో దాసరి వర-ప్రసాదం. ఇందులో "***అగ్గిపుల్ల.. కుక్కపిల్ల... సబ్బుబిళ్ళ.. కాదేదీ కవితకు అనర్హం***" అన్న మహాకవి శ్రీశ్రీ కవితాస్ఫూర్తితో చమక్కుమన్న డీఎన్నారు రచనా చమత్-కృతి వినాల్సిందే "***ఆడపిల్ల సబ్బుబిళ్ళ రాసుకుంటే, ఆడపిల్ల అగ్గిపుల్ల రాజుకుంటే***" అని వున్న చరణంలో.

నయం! "***ఆడపిల్ల కుక్కపిల్ల పెంచుకుంటే, ఆడపిల్ల కుక్కపిల్ల ఆడుకుంటే***" అనలేదు. లంకేశ్వరుడి డాన్స్ చూస్తూ అతనితో కలిసి తనూ స్టేజ్ మీద డాన్స్ చేస్తున్నట్లు ఊహించుకున్న హీరోయిన్ను రాధ పాటై పోయే సమయానికి నిజంగానే స్టేజ్ మీదకి వెళ్ళిపోయి డాన్సాడేస్తుంది.

పాటైపోయిన పక్క సీనులో ఓ పెద్ద బంగళాలో బోల్డు మంది ఆడపిల్లలు "హేయ్ శివా!" అంటూ ఒక పెద్ద పూల బొకే పట్టుకొస్తున్న అల్లు రామలింగయ్య చుట్టూ చేరతారు. ఇంతలో అ వెనకాలే నడుచుకుంటూ వస్తున్న లంకేశ్వరుణ్ణి చూసి "హేయ్ శివా!" అని అతని వెంట పడతారు. ఈ సీను పూర్తయేటప్పటికి లంకేశ్వరుడి అసలు పేరు శివ శంకర్ అనీ, అతనో డాన్సర్ కూడాననీ, మామయ్య అల్లు రామలింగయ్య అతని మేనేజర్ అనీ, రేవతి లంకేశ్వరుడు / శివ శంకర్ చెల్లెలనీ అర్థం చేసుకోవాల్సి వచ్చింది.

అన్నాచెల్లెళ్ళు శివ శంకర్, రేవతి వాళ్ళ వాళ్ళ పెళ్ళిళ్ళ గురించి మాట్లాడుకుంటూ వుంటే మేనేజర్ అల్లు ఒచ్చి ఎవరో స్పెషల్ ఫాన్ వచ్చింది కలవడానికి అని చెప్తాడు. ఎవరా అని చూస్తే అది హీలోయిన్ రాధ, కాదు కాదు... **లాధ**.

లాధొచ్చి శంకల్‌తో "కంగ్లాచ్యులేషన్స్! బ్లేకు ఎంత బాగా చేశాలండి? బ్లేకులో మీలే మహాలాజు" అని దాన్ని "బ్రేక్" అని కరెక్ట్ చేయబోయిన శంకర్‌ని "ఓ మీకు లా లాదా?" అనడుగుతుంది. పైగా "మీ డాన్స్ అంటే నాకు చాలా ప్లేమ. ప్లోగ్లాం దగ్గలకొచ్చాను, లష్‌గా వుంది. కాలు దగ్గలకొచ్చాను లష్‌గా వుంది. అందుకే ఇంటికొచ్చి డోల్ కొట్టాను" అని చెప్తూ తన పేలు లాధ అని కూడా చెప్తుంది. ఇహిప్పట్నుంచీ హీలోయిన్ లాధొచ్చినప్పుడల్లా నాకు "ల" పలకదు , సలేనా?

అసలూ... దాసలి నాలాయణలావు ఈ సిన్మాకి పెట్టాలనుకున్న పేలు లంకేశ్వలుడేమో? ఆటోగ్లాఫ్ కావాలన్న లాధతో శంకల్ పుస్తకం తెమ్మంటే పుస్తకం చిలిగిపోతుంది చేతి మీద సంతకం పెట్టమని లాధ చెయ్యి జాపితే శంకల్ కూడా "ఇక్కడైతే చెలిగిపోదూ?" అనడుగుతాడు, భలే, భలే! అలా అంటాడే కానీ లాధకి చేతిమీదే ఆటోగ్లాఫ్ ఇస్తాడు.

ఈ లోపులో చిరుత-చిరంజీవి కాంబినేషన్లో మళ్ళీ లంకేశ్వరుడు గాఫాదీద దగ్గరికి వస్తాడు. అదేంటో ఇలా వచ్చినప్పుడల్లా లంకేశ్వరుడు ఒక చేతికే చొక్కా తొడుక్కొస్తాడు. అంటే అంత వున్న పళంగా వచ్చేస్తాడని దానారా దర్శక-హృదయమేమో! "ఏంటీ ఇంత రాత్రివేళ పిలిచావ్?" అనడిగిన లంకేశ్వరుడికి టీవీ స్క్రీన్ మీద విజయచందర్‌ని చూపిస్తాడు గాఫాదీద.

అసలు విషయమేంటంటే ఓ దుర్మార్గుడైన హోంమినిస్టర్ చచ్చిపోయాడనుకుని తన పత్రికలో వార్త వేస్తే తీరా అతనింకా పోలేదని, ఆ వార్తతో తన పత్రిక బయటికి పోతే, ఆ పోతాడనుకున్న హోంమినిస్టర్ కన్నా తను ముందు పోతానని, అందుకని ఎలాగైనా ఆ ఇంకా పోని హోం మినిస్టర్ని పోయేలా చేయాలని చెప్తున్న విజయచందర్ని చూస్తుంటే "ఆరి! కరుణామయుడైన విజయచందరేనా ఈ మాటలంటుంటా?" అనిపించి విస్తుబోయా! సరే! దుర్మార్గులనంతమొందించడానికి లంకేశ్వరుడిదెప్పుడూ ముందడుగే కదా! ఓ తెల్ల కోటేసేస్కుని డాక్టర్లా వెళ్ళి హోంమినిస్టర్ని నాకవాసుణ్ణి చేసొస్తాడు.

అక్కణ్ణించి మళ్ళీ శివలా మారిన లంకేశ్వరుడు తన బంగళా ఇంటికొచ్చి "కళ్యాణ్" అని పిలవగానే నందమూరి అందగాడు కళ్యాణ చక్రవర్తి, ఆ వెనకే చెల్లెలు రేవతి వస్తారు. "నీకో ప్రెజెంటేషన్ తెచ్చానని"చెప్పి కళ్యాణ్‌కి ఓ ప్రొఫెసార్ ఉద్యోగం లెటర్ ఇస్తాడు శివశంకర్లంకేశ్వరుడు. అది చూడగానే "బడిపంతులు ఉద్యోగమా? నేను చేయను" అని అలుగుతాడు కళ్యాణ్. అప్పుడు రేవతి అతనికి ఐపీఎస్ కావాలని చెప్తుంది అదేదో ఉద్యోగాలు చెట్లకి కాస్తున్నట్లు.

ఈ సీనులో నాకర్థమయింది ఏంటంటే లంకేశ్వరుడు వేషంలో చిరంజీవి లంకలో ఇంట్లో వుంటాడు. శంకర్ వేషంలో బంగళాలో వుంటాడు. శంకర్‌తో పాటు చెల్లెలు రేవతే కాక ఫ్రెండు కళ్యాణ్ కూడా వుంటుంటాడు. ఈ శంకర్ ఆ కళ్యాణ్ కోరుకున్న వుద్యోగం తెచ్చి చేతిలో పెడుతుంటాడు. సరే! మరిప్పుడు కళ్యాణ్‌కి ఐపీఎస్ ఇప్పించాలి కదా! మళ్ళీ చొక్కా విప్పుకుని గాఫాదీద దగ్గరికి వెళ్తాడు లంకేశ్వరుడు. ఈసారి చిరుత మైనస్.

లంకేశ్వరుడు తన ఫ్రెండుకి ఐపీఎస్ అవ్వాలనుందని చెప్పగానే ఓ నెల్రోజుల్లో ఆర్డర్స్ తెప్పిస్తానంటాడు గాఫాదీద. మొత్తానికి కళ్యాణ్‌కి ఐపీఎస్ ఆర్డర్స్ తెచ్చిస్తాడు శంకర్లంకేశ్వరుడు.

లంకేశ్వరుడు ఓ హోటల్లో కూర్చుని కాఫీ తాగుతుంటే లాధ "హలో శివప్లసాద్!" అంటూ అక్కడికొస్తుంది. నాకు ఈ **శివప్లసాద్** పేలెక్కడినుంచి వచ్చిందో అల్థం కాలేదు. నేనింకా శివ, శంకల్, లంకేశ్వలుడు మాత్లమే చిలంజీవి పేల్లనుకున్నా. ఏంటో! నా చెవులు సలిగ్గా పని చేస్తున్నట్టు లేవు. ఇంకిప్పట్నుంచీ చిలంజీవి లంకేశ్వలుడే! నో మోల్ శివ, నో మోల్ శంకల్!

సలే! లాధ తన చేతి మీద శివ అనే పేలు పచ్చబొట్టు పల్మనెంటుగా ప్లింటు చేసుకుంటుంది ఆటోగ్లాపులా. అది చూపిస్తూ వుండగానే ఓ పాట మొదలవుతుంది "***ఏయ్ బాబూ! ఏదో ఒకటి చేద్దాం బాబూ!***" అంటూ. కస్మీమాపాదతో ఆగిపోయి డాన్స్ జోలికి రానందుకు దానారాకి వేనవేల జేజేలు. కనీసం అవన్నా కనువిందుగా వున్నాయి – తండ్రి సుందరం, కొడుకు ప్రభు సుందరం పుణ్యమా అని! ఈ పాటలో ఇంకో విశేషం ఏంటంటే పాట మొత్తంలో "ట్ ట్ ట్ ట్" అంటూ వినిపించే కాన్స్టెంట్ బాక్‌గ్రౌండ్ బీట్ ఇళయరాజా పాట "***మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు***" (రాక్షసుడు) పాటని తెగ గుర్తు చేసింది.

పాటైపోగానే లంకేశ్వరుడు కార్లో వెళ్తూ ఉండగా, ఓ నాలుగు రోడ్ల సెంటర్లో నెత్తి మీదో ఎర్ర టోపీ పెట్టుకుని, చేతిలో కర్ర పట్టుకుని ట్రాఫిక్ పోలీసు లాగా చేతులూపుతున్న సత్యం (నాగేంద్ర బాబు) కనిపిస్తాడు. అతన్ని చూడగానే లంకేశ్వరుడు కారాపి, దగ్గరికెళ్ళి "సత్యం! ఏమైంది నీకు?" అనడిగితే ఆ సత్యం అస్సలు ఎదురుగా మనిషి వున్నాడన్న స్పృహ లేకుండా విజిల్ ఊదుతూ, చేతులూపుతూనే వుంటాడు. వింతగా నవ్వుతూ వుంటాడు. ఆ సత్యాన్ని తీసుకుని లంకేశ్వరుడు లంకలో వున్న వాళ్ళ ఇంటికి తీసుకెళ్తే అక్కడ సత్యం వాళ్ళ నాన్న "ఎవరో దీనదయాళ్ అనే ఆయన సత్యానికి రావల్సిన ఐపీఎస్ సీటుని ఎవరికో ఇప్పించడం కోసం మా వాడిని ఇలా చేశాడట" అని చెప్తాడు. వెంటనే లంకేశ్వరుడు సత్యానికి పోలీసు డ్రెస్సు వేసి, వెంటబెట్టుకుని గాఫాదీద దగ్గరికి తీసుకెళ్ళి, ఇతన్ని ఎందుకిలా చేశావ్ అనడుగుతాడు. దానికి గాఫాదీద "చూడు శంకర్! నీ ఫ్రెండుకి స్థానం కల్పించడానికి ఇతన్ని స్థానభ్రంశం చేయక తప్పలేదు" అని చెప్తాడు.

హమ్మయ్య! ఇప్పటికి నా శివశంకర్లంకేశ్వరుడి గురించిన తికమక తీరిపోయింది. **సిన్మాయణంలో ఓ కిటుకుల వేట** – అదేంటంటే ఇందులో ఒకడే చిరంజీవి, కానీ విత్ మూడు షేడ్స్. చిరుత పులితో వచ్చే లంకేశ్వరుడు, చిటికెలేస్తూ దాన్సాడే శివ, గాఫాదీదతో చేతులు కలిపిన శంకర్, ఇలా ఒకడే చిరంజీవి త్రిమూర్తులకి సాటైన అవతారాలతో త్రివిక్రముడై తెలుగు సినిమా తెరని కిందా, పైనా, అడ్డంగా ఆక్రమించేశాడు. ఈ సిన్మాయణం కోసం సిన్మాలు చూసీచూసీ గోదారి పాలయిందేమో నా బుద్ధి అని తెగ బెంగెట్టేసుకున్నా! ప్రస్తుతానికి నా బుద్ధికేమీ ఢోకా లేదు.

సరే! మళ్ళీ కథలోకి వెళ్తే లంకేశ్వరుడు ఈ సత్యాన్ని కూడా పోలీసు ఆఫీసరు చెయ్యాల్సిందే అని గొడవ చేస్తాడు. అది వింటూనే గాఫాదీద దాసరి దగ్గర్నుంచి లాజిక్కు అప్పు తెచ్చేసుకుని "***ఎండిపోయిన చెరువులో ఈత ఈదలేం, ఆకులు రాలిన చెట్టు కింద విశ్రమించలేం***" అంటాడేంటో! అది వినగానే లంకేశ్వరుడు "ఆయ్! నువ్వేనేంటి ఇలాంటి తిప్పి–తిప్పి–మెదడు–పిప్పి చేసే డవిలాగులు చెప్పేది?! నేనూ చెప్తాను" అనేస్కుని, "నో" అంటూ ఊగిపోతూ "***ఎండిన చెరువులో శ్రమించి తవ్వితే నీళ్ళొస్తాయ్. ఎండి పోయిన చెట్టుకి నీళ్ళు పోస్తే ఆకులొస్తాయ్***" అంటూ తన వాటాగా కొన్ని సరిలేని దాసరి

లాజిక్కులు వదిలి గాఫాదీద వల్ల పిచ్చివాడైపోయిన సత్యాన్ని తను పోలీసాఫీసర్ని చేస్తానని శపథం చేస్తాడు. ఫారిన్‌కి పంపిస్తే నయమవుతుందని ఓ డాక్టర్ చెప్తే సత్యాన్ని అమెరికా పంపిస్తాడు లంకేశ్వరుడు.

ఈ లోపు లంకేశ్వరుడి ఫ్రెండు కళ్యాణ్ ఐపీఎస్ పూర్తి చేసుకుని పోలీసాఫీసర్ అయి ఇంటికొస్తాడు. లంకేశ్వరుడు సంతోషిస్తాడు. కళ్యాణ్ కళ్యాణ ఘడియల కోసం ఎదురు చూస్తూ రేవతితో పార్కులూ అవీ తిరుగుతూ వుంటాడు. ఆ సంగతి ఇంటి నౌకర్ నాగేష్ ద్వారా తెలిసి లంకేశ్వరుడు పార్కుకి వెళ్ళి కళ్యాణ్‌ని, తన చెల్లెలు రేవతిని ఇంటికి తీసుకొస్తాడు. తీరా ఇంటికొచ్చాక ఇంట్లో వున్న సోఫాలన్నిటిలో చెప్పులు పెట్టి వాటితో కళ్యాణ్‌ని పోలుస్తూ స్థాయి మరిచి తన చెల్లెలితో కలిసి పార్కుల్లో పాటలు పాడుతూ తిరుగుతున్నందుకు చీవాట్లు పెడతాడు.

ఇది చూడగానే ఇంతకు ముందు రాసిన **రాగదీపం** సిన్మాలో జయసుధని ప్రేమించానని చెప్పి తనతో మాట్లాడదామని ఇంటికి వచ్చిన నాగేశ్వరావు స్థాయిని గుమ్మం దగ్గర విడవాల్సిన చెప్పులతో పోల్చి అవమానించిన రావుగోపాలావు గుర్తొచ్చాడు. డీఎన్నారుకి తెలుగు సినీ-ప్రేక్షకుల ఫిల్మోమీనిషియా గురించి బాగానే అర్థమయినట్టుంది. అదో, లేకపోతే ఒకసారి టికెట్టు కొనుక్కుని కుర్చీలో కూర్చున్నవాళ్ళు ఆ టికెట్టు డబ్బులు కిట్టింపయ్యేదాకా లేచెళ్ళిపోరన్న లెక్క తప్పని సినిమాంచనాయో!

ఇంతకీ కళ్యాణూ, రేవతీ కలిసి పాడిన ఆ పాటేంటో నేను చూసిన యూట్యూబు వెర్షన్లో కనిపించనేలేదు నాకు. ఇంతలో లంకేశ్వరుడు తిట్టినందుకు అలిగిన కళ్యాణ్ పెట్టె సర్దుకుని ఇంట్లోంచి వెళ్ళిపోదామనుకుని బయల్దేరేటప్పటికి రాత్రవుతుంది. అతనలా వెళ్ళిపోతుండగా చూసిన రేవతిని కూడా తనతో వచ్చెయ్యమంటే ఆవిడ " ***నేను రానూ, మా అన్నయ్య దేవుడూ, దేవుడి కళ్ళ ముందు హుండీలో డబ్బులు వేసినప్పుడు దేవుడు మాట్లాడ్డు. ఆ హుండీ లోంచి దొంగతనంగా తీసుకుపోయినప్పుడూ దేవుడు మాట్లాడ్డు. దేవుడు మాట్లాడ్డం లేదు కదా అని హుండీలెత్తుకుపోకూడదు*** " అంటూ ఒక హుండీ అంత బరువుండే మాటలేవో చెప్పి నీతో నే రానంటుంది. అప్పటిదాకా చెయ్యి నెప్పెడుతోందని కింద పెట్టిన సూట్కేస్ పట్టుకుని మళ్ళీ "నేనెళ్ళిపోతా"నంటూ బయల్దేరుతాడు కళ్యాణ్.

ఇంతలో ఎదురుగుండా లంకేశ్వరుడొచ్చి "నిన్ను నేను ఉట్టుట్టిగానే తిట్టాను, నా చెల్లెల్ని నీకే ఇచ్చి పెళ్ళి చేస్తాను" అని చెప్తాడు. ఆ సీను నేనిక్కడ రాసినంత సింపుల్‌గా తేలదు. "***పది మంది వచ్చాక తాడు కడితే అది పెళ్ళి, మెళ్ళో తాడు పడ్డాక పది మందీ వస్తే అదింకోటి***" అంటూ శుద్ధీ-పద్దీ లేని డైలాగులు బోల్డు చెప్పాక, లంకేశ్వరుడు-లాధ అబ్బాయి-అమ్మాయి తరపున పెళ్ళి పెద్దలుగా నటించే ఇంకో తలా-తోకా లేని సీనుంటుంది.

ఇప్పటిదాకా ఏ సీనులోనూ ఎక్కువ లోలు లేని లాధ సడెన్‌గా ఈ సీనులోకి వచ్చేసి లేవతి వైపు పెళ్ళిపెద్దగా "పెళ్ళి చేసుకోవడానికి పెళ్ళికూతురిగా ఏమేం కావాలో అన్ని అల్హతలూ వున్నాయి. లామాయణంలో సీత ఉత్తమ స్త్రీ ఐతే ఆ లక్షణాలన్నీ మా మలదలికున్నాయి" అనుకుంటూ వరసలు కలుపుకుని మరీ దగ్గరుండి రేవతి, కళ్యాణ్‌ల పెళ్ళి జరిపిస్తుంది లంకేశ్వరుడితో కలిసి. ఆ పెళ్ళవ్వగానే లంకేశ్వరుడితో "***కన్నె పిల్ల వేడికి ఓం నమః***" అంటూ ఓ స్తోత్ర-గీతాన్ని పాడి ఆడేస్తుంది.

కళ్యాణ్ తన మొదటి జీతంతో లంకేశ్వరుడికి ఓ బ్రేస్‌లెట్, తన భార్య రేవతికి ఓ ఎర్రచీర గిఫ్టులుగా ఇస్తాడు. తనకి దీనదయాళ్ కంపెనీ నడిపేవారిని పట్టుకునే స్పెషల్ అసైన్‌మెంట్ ఇచ్చారని, అందుకు తన బావైన శివ (లంకేశ్వరుడి) సహకారం కావాలని చెప్తాడు.

ఇంతలో గాఫాదీద రిటైర్ అవగానే తను గాడ్‌ఫాదర్ అవుదామనుకున్న మోహన్‌బాబుతో "నువ్వలా చేస్తే శంకర్ (లంకేశ్వరుడు) పోలీసాఫీసరైన వాళ్ళ బావతో కలిసి నిన్ను జైల్లో పెట్టిస్తాడు. అలా జరక్కూడదంటే శంకరే గాడ్‌ఫాదర్ అవ్వాలని" చెప్తాడు మోహన్‌బాబు ఫ్రెండు పిల్ల-డాన్. దాంతో మోహన్‌బాబు తన బావ పోలీసాఫీసర్ అవడంతో తను డాన్ కాలేనని చెప్పిన లంకేశ్వరుడి బావని చంపేస్తామని బెదిరించి దీనదయాళ్ కంపెనీకి

గాడ్‌ఫాదర్ అవడానికి ఒప్పిస్తాడు. వెంటనే లంకేశ్వరుడి మెళ్ళో ఓ ఎఱ్ఱరిబ్బనుక్కట్టిన బిళ్ళోటి వేసి చప్పట్లు కొట్టి డాన్ పట్టం కడతారు. అదే ముహూర్తానికి "ఆ దీనదయాళ్ స్థానంలో ఆదిశంకరుడున్నా పట్టిస్తాను సార్" అని వత్తులన్నీ ఒత్తి పలుకుతూ మరీ భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు కళ్యాణ్.

ఇంతలో పిల్ల-డాన్, మోహన్బాబుల దగ్గరికి ఒహతను వచ్చి ఏదో స్థలంలో గుడిసెలు ఖాళీ చేయించి అది తనకిప్పించమంటే వాళ్ళెళ్ళి ఆ గుడిసెలకి నిప్పంటిస్తారు. అది తెలిసి లంకేశ్వరుడు ఆ స్థలాపేక్షుడిని జీపులో ఊరి బయటికి తీసుకెళ్ళి కొట్టి ఆ గుడిసెలు తగలబెట్టిందెవరో చెప్పమంటే అతను చెప్పబోయేలోగా పిల్ల-డాన్ వచ్చి తుపాకీతో కాల్చేసి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఓ పోలీసు కాన్‌స్టేబుల్ "ఆ హత్య జరిగిన స్థలంలో దొరికింది మీ బావగారికి మీరిచ్చిన బ్రేస్‌లెట్" అంటూ తెచ్చి కళ్యాణ్‌కి ఇస్తాడు. భలే! దాసరి తన స్క్రీన్‌ప్లే స్క్రిప్ట్ సిన్మాలో వున్న పాత్రలందరితోనూ చదివించేసినట్టున్నాడు. అందరికీ అన్ని విషయాలూ తెల్సిపోయి సీనానుకూలంగా చాలా తెలివిగా వాడేసుకున్నారల్లే వుంది. లేకపోతే బావగారికి పోలీసాఫీసరుగారిచ్చిన బ్రేస్‌లెట్ గురించి కాన్‌స్టేబుల్‌కి ఎలా తెలుస్తుందబ్బా?!

సరే! కళ్యాణ్ తన బావ శివని బ్రేస్‌లెట్ గురించి అడిగితే, శివ తన బెడ్‌రూంలో వుందని చెల్లెలు రేవతితో తెప్పించి చూపిస్తాడు. దాంతో కళ్యాణ్ తనకి స్టేషన్‌లో బ్రేస్‌లెట్ తెచ్చిచ్చిన కాన్‌స్టేబుల్‌ని పిలిచి, అబద్ధపు సాక్ష్యం తెచ్చినందుకు కోపంతో చెంప మీద కొడ్తాడు.

కాన్‌స్టేబుల్‌ని కళ్యాణ్ కొట్టిన ఆ సంతోష ఘడియల్ని సెలబ్రేట్ చేసుకోవడానికి లంకేశ్వరుడు, లాధ హిమాలయాలకి వెళ్ళి "***జివ్వుమని కొండగాలి కత్తిలా గుచ్చుతోంది***" అని ఆనంద నాట్యమాడేసుకుంటారు. ఏమాటకామాట చెప్పుకోవాలి – సందర్భ శుద్ధి కుసింత తక్కువైనా మధురమైన పాట, మనోహరమైన ఆట.

తీరా పాటై పోయే సమయానికి కళ్యాణ్‌కి ఇంట్లో ఓ మూల పడున్న బంగారం వస్తువుల చుట్టూ చుట్టే గులాబీ రంగు కాయితం, నలిపి పారేసిన బంగారం కొట్టు బిల్లు కనిపిస్తాయి. కళ్యాణ్‌కి అవి రెండూ కనిపించడం లంకేశ్వరుడికీ కనిపిస్తుంది.

కళ్యాణ్ బంగారం షాపుకి వెళ్ళి ఆ బిల్లు చూపించి ఆ బ్రేస్‌లెట్ కొన్నవాళ్ళెవరో చెప్పమని అడగడం, దానికి ఆ కొట్టతను ఆ అమ్మిన సేల్స్ పర్సన్ చెల్లెలి పెళ్ళి అంజెప్పి సెలవు మీద వెళ్ళాడు కానీ, ఆ పెళ్ళి కోసం అప్పడిగిన కట్నం డబ్బుల కోసం వస్తాడని చెప్పడం, ఇదంతా డీఎన్నార్-దర్శినిలో లంకేశ్వరుడు, దీనదయాళ్ ఎండ్ కో చూడడం – ఆహా! ఇంక ఇంత చూసింతర్వాత ఇంకింతకన్నా చూసేదేం లేక, ఇంకేమన్నా వున్నా చూడాలనిపించక, చూసినా ఇంతకు మించి రాయాలనిపించక "ఆపెయ్, చూడ్డం మానేయ్" అంటున్న బుద్ధిననుసరించకుండా, ఇంకా ఈ సిన్మా గురించి రాస్తున్న నన్ను చూసి నా బుద్ధి చేసేదేం లేక నా ***ఖర్మానుసారిణి*** అయింది. ఆ రకంగా సిన్మాలో చివరాఖరి గంటా ఎలాగోలా ముగించా.

**ఇదిగో ఆ గంట ముచ్చట ఇచ్చట:**

లంకేశ్వరుడికి బ్రేస్‌లెట్ అమ్మిందెవరో కాదు సాక్షి రంగారావు కొడుకు.

అతను అనుకున్నట్టుగానే కట్నం డబ్బుల కోసం సైకిల్ మీద బంగారం కొట్టుకి బయల్దేరడం; ఒక లారీ ఒచ్చి అతని సైకిల్ని గుద్దేయడం; అతను చనిపోవడం;

లంకేశ్వరుడు వెళ్ళి కట్నం డబ్బులు ఇచ్చి సాక్షి రంగారావు కూతురు పెళ్ళి జరిపించడం;

ఈలోగా మోహన్‌బాబు కళ్యాణ్‌కి ఫోన్ చేసి సాక్షి రంగారావు కొడుకుని మీ బావే చంపాడని చెప్పడం;

కళ్యాణ్ సాక్షి రంగారావుని పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చి ఇంటరాగేట్ చెయ్యబోతే, చిరుతపులి పొగలోంచి దూకొచ్చి సాక్షి రంగారావుని తప్పించి కార్లో ఎక్కించుకుని వెళ్ళిపోవడం;

కళ్యాణ్ ఆ పని తన బావ శివే చేశాడని అతనితో గొడవ పడడం;

అంత సేపూ తిట్టుకుని, కొట్టుకున్న తర్వాత లంకేశ్వరుడు "మీ కోసం కొన్నాను" అని రేవతి, కళ్యాణ్‌లను ఓ ఇంటికి తీసుకెళ్ళడం; ఎలా సంపాదించావో తెలియని నీ డబ్బుతో కొన్న నీ ఇల్లు మాకొద్దని పోలీస్ డ్రెస్సులో కళ్యాణూ, వాళ్ళాయన మొదటి జీతంతో కొన్న ఎర్రబిన్నీసిల్క్ చీర కట్టుకుని రేవతి ఇంట్లోంచి వెళ్ళిపోవడం;

ఆ వెంటనే లంకేశ్వరుడు ఆ కొన్న కొత్త ఇల్లు బ్రేక్ చేసేసి "***పోతే పోనీ పోరా, చెల్లే లేదనుకోరా, అయాం మాడ్***" అంటూ బ్రేక్ తాండవం చేసేయడం; (ఈ పాటలో "పోతే పోనీ పోరా, చెల్లే లేదనుకోరా" అన్న లైను తర్వాత ఒచ్చే "దుదుదున్ దుదుదున్" అనే బీటు భలే గ్రేటు!);

పాటై పోగానే మళ్ళీ లాధ ప్రత్యక్షం. విషయమేంటంటే రేవతి తల్లి కాబోతోంది. కాకపోతే ఆ వార్త డైలాగు కూడా చిరంజీవితోనే చెప్పించేసి రాధతో జస్ట్ "ఊ" అన్నట్టు తలూపించాడేంటో డీఎన్నారు!

వెంటనే శివ ఆనందంతో మిఠాయిలు కొనుక్కుని తన చెల్లెలి దగ్గరికెళ్ళి నోట్లో స్వీట్ పెట్టబోవడం; అది చూసి బావ కళ్యాణ్ "దొంగసొమ్ము మేం తినం" అనడం; శివ వెనకాలే ఎక్కణ్ణించో వచ్చిన లాధ మొట్టమొదటిసారిగా "ల లాదా" అనకుండా, ర-కారం లేకుండా ఓ డైలాగు చెప్పడం; అక్కణ్ణించి శివ, లాధ వెళ్ళిపోవడం;

శివశంకర్లంకేశ్వరుడి మీద కేసు పెట్టించాలని మోహన్‌బాబు, రఘువరన్ కుట్ర చేయడం తప్పన్న గాఫాదీద సత్యన్నారాయణని వాళ్ళిద్దరూ కలిసి చంపేయడం; ఆ తర్వాత మోహన్‌బాబుని లంకేశ్వరుడు చంపడం;

ఈలోగా పిచ్చెక్కి అమెరికా వెళ్ళిన సత్యం ఐపీఎస్ ఆఫీసరవ్వడం; లంకేశ్వరుణ్ణి పట్టుకోవడానికి లంకకి కళ్యాణ్‌తో సత్యం కూడా వెళ్ళడం; లంకలో వాళ్ళందర్నీ లంకేశ్వరుడు ఎక్కడున్నాడో చెప్పమంటూ పోలీసులు కొట్టినా వాళ్ళు చెప్పకపోవడం; లంకలో వున్న లంకేశ్వరుడి దొంగావతార-విగ్రహం మీద చెయ్యేసిన సత్యానికి అది బొమ్మ కాదు లంకేశ్వరుడే అని తెలిసినా పోలీసులకి చెప్పక పోవడం;

ఇంతలో లంకేశ్వరుడు రఘువరన్‌ని చంపి, మేనమామ గండంతో పుట్టిన తన మేనకోడలి మెడ చుట్టూ వున్న పేగు ఓ పాల పాకెట్లు కట్ చేసుకునే కత్తెరతో కోసి "అక్కడో ప్రాణం తీశా, ఇక్కడో ప్రాణం పోశా, లెవెలైపోయింది" అన్నట్టు ఓ ఎక్స్ప్రెషన్ ఇవ్వడం; (నేనేమో ఈ సిన్మా చూసే చిరంజీవి-అభిమానులైన డాక్టర్లు ఉంటారా? ఉంటే ఈ సీనుని చప్పట్లు కొట్టుకుంటూ చూసుంటారా అని వాపోవడం!)

లంకేశ్వరుడెక్కడున్నాడో చెప్పమని పిల్ల-డాన్ లంకలో వున్న వాళ్ళందరినీ హింసించడం; లంకేశ్వరుడి చిరుత పులి, సత్యం, సాక్షి రంగారావుతో సహా లంకలో వున్న అందర్నీ చంపేయడం; ఆ పిల్ల-డాన్‌ని లంకేశ్వరుడు చంపేయడం; దుష్ట శిక్షణే తప్ప శిష్ట రక్షణ జరగలేదని లంకేశ్వరుడు కుమిలిపోవడం;

లంకేశ్వరుణ్ణి పట్టుకోవాలంటే నువ్వు చనిపోయినట్టు నటించాలని కళ్యాణ్ రేవతికి చెప్పడం; ఆవిడ ఒప్పుకుని అలాగే నటిస్తానని చెప్పి కళ్ళు మూసుకుని పడుక్కోవడం; ఆ నటనలో జీవిస్తూ నిజంగానే కళ్ళు మూయడం; లాధ ఆ వార్తని బాధతో ర–కారం లేని డైలాగులో రెండిటితో లంకేశ్వరుడికి చెప్పడం;

అన్నట్టు చెప్పడం మర్చా... చెల్లెలు లేని బాధతో తనూ యమలోకానికేగబోయిన లంకేశ్వరుణ్ణి ఏడుస్తున్న మేనకోడలి ఏడుపు వినిపించి రక్షించుకుంటుంది అపర–సావిత్రి లాధ.

లంకేశ్వరుడు చివరికి పోలీసులకి లొంగిపోవడం; ఆ అరెస్ట్ చెయ్యడానికి సీనియర్ ఏక్టర్ రామకృష్ణ ఓ రెణ్ణిమిషాల భాగ్యానికి తెర మీదకి రావడం;

ఇచ్చాసింతర్వాత దానారా ఎంత అనారా పక్షపాతో అర్థమయ్యింది నాకు. అనారా కైతే ఎంచక్కా మల్లెపూవుల్లా నలగని బట్టలు, ప్రతీ ఫ్రేములోనూ హీరోయిన్ను తోడు, పైగా ఒకరు కాదు ఇద్దరు. ఈ లంకేశ్వరుడుకి ఒంటి మీద వుండీ లేని చొక్కా, వున్న ఒక్క హీరోయిన్ను వున్న సీన్లే తక్కువ, పైగా ర–పలకని లాధ.

**మొత్తానికి ఈ లంకేశ్వరుడు ఓ పాము పులి గుఱ్ఱాల సహిత, సోదరీసోదర వాత్సల్య పూరిత, గుండెలు పిండే సెంటిమెంటు భరిత, దానారా విరచిత చిత్రవిచిత్ర గాథ!**

దీన్ని ఆ రోజుల్లో థియేటర్లో చూసి భరించిన వారికి జోహార్లర్పించుకుంటూ...
అప్పుడు చూడక పోయినా ఇప్పుడు నా ఈ రాత చదివి తరించిన వారికి ఒకసారి గా...ఠిగా జై కొట్టుకుంటూ...
మరొక్కసారి...జై దానారా! జోహార్ డీఎన్నార్!

## సినిమా బుచ్చిబాబు

ఉత్తరాది "బావర్చీ"లో పైపై మసాలా మాత్రం తీసుకుని, దాన్ని ఇంకా పైపైన జల్లి వండగా అసలు రుచి మరిచి కలగూరగంపైన తెలుగు పులిహోర "బుచ్చిబాబు".

ఇందులో బుచ్చిబాబు అనే వంటవాడి వంటి పాత్రలో ఒదిగిపోయిన ఏఎన్నారు సన్నాఫ్ ప్రభాకర్రెడ్డి, పుష్పలత.

బుచ్చిబేబీ అనే పాత్రలో మెరిసిపోయిన జయప్రద డాటరాఫ్ వింటమే–తప్ప–అంటమే రాని నాన్నపాత్ర రావి కొండలరావు, అంటమే–తప్ప–వింటమే రాని అమ్మపాత్ర సూర్యకాంతం.

ఈ సిన్మాలో ఓ నలుగురు అతిథి పాత్రలు– సుజాత, మురళీమోహన్, రాజబాబు, కేవీ చలం, కొత్త పాత్ర రాజా, మరియు కొసరు పాత్ర మోహన్ బాబు, ప్రత్యేక పాత్ర దాసరి. ఓ వెర్రి ఆడపడుచు పాత్రలో రమాప్రభ. ఆ వెర్రి పాత్రకి భర్త పాత్ర కేవీ కాని ఉత్తి చలంది.

బుచ్చిబేబీ జయప్రద కదా! మరి కేశాలంకరణకి కమల వుండాల్సిందే. బుచ్చిబాబు, బుచ్చిబేబీలకి వస్త్రాలంకరణ చేసినవారు బొంబాయి దర్జీ కచిన్స్.

ఇందులో వినిపించే గుమ్మపాలలాంటి తియ్యని పద్యాలు పాలగుమ్మి పద్మరాజుగారివి. (ఇంతకు ముందు "మేఘసందేశం" సినిమాలో పాలగుమ్మి వారు రాసిన "ప్రియే చారుశీలే" అష్టపదికి తెలుగు సేతని వేటూరివారి ఖాతాలో వేసిన నా తెలివిడి-లేమిని నాకు నేనే మొట్టికాయలేసుకుని ఇక్కడ సరిచేసుకుంటున్నాను.)

ఈ సిన్మాలో పాటలు పాడినవాళ్ళు: ఎస్పీబీ, మాధవపెద్ది రమేష్, సుశీల, శైలజ కాక రమణ, పుష్పలత కూడానట. సంగీతం కృష్ణ-చక్ర సహకార చలనవర్తి, చక్రవర్తి.

సహకార దర్శకుల్లో ఒక పేరు డిమిట్రావ్. దాసరి సినిమా టైటిల్సులో ఈయన పేరు కనిపించే కార్డు నాకు చాలా ఇష్టం. చూడగానే ఓ రెండు సార్లు "డిమిట్రావ్! డిమిట్రావ్! నీకేమిట్రావ్? ఓసారిట్రావ్! " అని టంగ్ ట్విస్టర్లా అనుకుని ఆడుకుని నవ్వుకుంటా.

క. స్క్రీ. మా. పా. ద. దానారా, ఎస్సైఎఫ్టీపీ.

సరదాగా, షరా మామూలుగా దాసరిబాబుని మెచ్చి, నేనిచ్చుకుంటున్న ఓ సిన్మతీ గిద్యం:

రాజేష్ఖన్నా బావర్చీ ఆయె ఏఎన్నారు బుచ్చి
బుచ్చైన బాబుకి దొరికె ఇంకో బేబి బుచ్చి
వీరిరువురికి తోడయ్యె అత్తై, అమ్మై గుండమ్మొచ్చి
సోకొచ్చె సిన్మాకి, సొమ్మొచ్చె దాసరికి సిన్మతీ!

సిన్మా మొదలవుతూనే ఓ పడవలాంటి కారొచ్చి, ఓ పెద్ద గేట్లోంచి దూరొచ్చి, ఓ పెద్ద కోటలాంటి ఇంటి ముందు ఆగుతుంది. అప్పటికే ఆ ఇంట్లో చిచ్చుబుడ్లు, టపాకాయలు కాలుస్తూ సందడి చేస్తూ వుంటారు కొందరు. ఎందుకూ అంటే ఆ కోటింటి వంశాంకురం బుచ్చిబాబు అమెరికా నుంచొస్తున్నాడని. కార్లోంచి దిగి వరసైన మామలూ, వరస కలుపుకోవాలనుకునే ఆడపిల్లల తండ్రులూ వేసిన దండలని మెడలో మోస్తున్న బాబు బుచ్చికి తోడొచ్చు నాన్న ప్రభాకర్రెడ్డి, హారతి పళ్ళెంతో ఎదురొచ్చు తల్లి పుష్పలత.

అమెరికా నుంచొచ్చిన బుచ్చికి స్వాగతం చెప్పడానికి బోల్డంత మంది వరసైన ఆడపిల్లలు వరసలో నించుని వుంటారు. అంతే కాకుండా ఫోన్ల మీద ఫోన్లు కూడా వస్తూ వుంటాయి బుచ్చిబాబుని తమ ఆడపిల్లలకి చేసుకుంటామని. ఏంటో! దాసరి ఎజెండాలో పెళ్ళికే పెద్దపీట. సరే! బుచ్చి అమ్మా, నాన్న అడుగుతారు "ఎవర్ని చేసుకుంటావు నాయనా?"అని.

వెంటనే బుచ్చిబాబు "నిజానికి నా పెళ్ళెప్పుడో జరిగిపోయింది" అంటూ లేచెళ్ళి, ఒక చిన్న డబ్బా తెరిచి అందులోంచి ఓ బుల్లి మంగళసూత్రం తీసి చేత్తో పట్టుకుని తీక్ష్ణంగా చూస్తూ వుండగా... ఓ పాట మొదలు "***పసుపు పచ్చా తాడూ, పసుపు కొమ్ముకు తోడూ...***" అంటూ.

ఆ పాటకి సందర్భం - ఆడుకునే తెలిసీ తెలియని వయసులో పిల్లలు చేస్తున్న బొమ్మలపెళ్ళిలో పాడుకునే పాట. ఈ పాటలో ఆరిందా పెళ్ళికూతురు చిన్నారి తులసి. వాళ్ళ బొమ్మలపెళ్ళిని ముచ్చటగా చూస్తూ వుంటారు తాత (గుమ్మడి), మామ్మ (నిర్మలమ్మ), నాన్న (ప్రభాకర్రెడ్డి), అమ్మ

(పుష్పలత). పిల్లలు ఆడుకుంటూ పాడుకుంటూ నిజంగానే పెళ్ళి చేసేసుకుంటారు. అది చూస్తున్న పెద్దవాళ్ళు "వీళ్ళకి పుట్టగానే పెళ్ళైపోయింది" అని మురిసిపోతూ వుండగా గునగునా నడుచుకుంటూ సూర్యకాంతం వచ్చేస్తుంది. "హన్నా! మా డబ్బు కొట్టేద్దామని బొమ్మలపెళ్ళి వంకతో మా బుచ్చిబేబీ మెళ్ళో మీ బుచ్చిబాబు చేత తాళి కట్టిస్తారా?" అని చడామడా తిట్టేసి, బుచ్చి (తులసి) మెళ్ళోంచి మంగళసూత్రం తీసి గిరాటేసేసి లాక్కెళ్ళిపోతుంది.

అదే ఆ మంగళసూత్రమే ఇప్పుడు బుచ్చిబాబు చేతిలో వుంది. దాన్ని చూస్తూ బుచ్చిబాబు తల్లి ఆనందభాష్పాలు రాలుస్తూ వుండగా ప్రభాకర్రెడ్డి ఎవరొచ్చారో చూడమంటూ పిలుస్తాడు. అదెవరా అని చూస్తే బుచ్చిబాబు మామ, బుచ్చిబేబీ తండ్రి అయిన రావి కొండల్రావు.

వస్తూనే "నేనాడపిల్ల తండ్రిని. మా అమ్మాయిని మీ బుచ్చిబాబు కిద్దామని వచ్చాను" అని పెళ్ళి మాటలు మొదలు పెడ్తాడు. బుచ్చిబాబుకీ అదే ఉద్దేశ్యం ఉన్నట్టు తెలుసుకుని ఆనందపడ్తాడు కానీ బుచ్చిబాబు తను ఫలానా అని చెప్తే తన భార్య సూర్యకాంతం పెళ్ళికి ఒప్పుకోదని చెప్తాడు. ఇక్కడ దాసరి ఓ లాజిక్కు మిస్సయ్యాడబ్బా! అంతకు ముందు సూరక్క ఏమందీ? మా డబ్బు చూసి పిల్లలకి బొమ్మల పెళ్ళి చేశారు అని కదా? మరిప్పుడు ప్రభాకర్రెడ్డికి బోల్డంత డబ్బు చేసినట్లుంది. పైగా మన ఏఎన్నార్ ఎన్నారై కాబోయే అవకాశమున్న బుచ్చిబాబు ఎఫ్ఆర్సీఎస్ (ఫారిన్ రిటర్న్డ్, సినిమా సెటిల్డ్). మరిప్పుడింక బుచ్చీ-బుచ్చీ కళ్యాణానికి గుండాబత్తుల సూరమ్మ అడ్డెందుకు చెప్పునమ్మా?

వూరికే అంతా అలా చాటుమాటుగా గుసగుసలాడుకుని ఆడిపోసుకుంటారు కానీ, సూరేకాంతంతో ఓ మాటు సవ్యంగా మాటాడి వుంటే దగ్గరుండి బుచ్చి(బాబు) మెళ్ళోంచి బుచ్చి(బేబీ )మెళ్ళో తాళి కట్టించి వుండును. అలాక్కానిస్తే రెండున్నర గంటల సినిమా నడిచేదెలా? అందుకే లాజిక్కులు పక్కనెట్టి, బుర్రని బీరువాలో అట్టేపెట్టి దాసరి వారి దర్శకత్వ ప్రతిభకి అప్రతిభురాల్నవుదామని ఇంకోసారి అనేసుకున్నా...ఆ రకంగా మళ్ళీ బుక్కైపోయి ముగ్గిపోయా. ఆ రకంగా నే చూసిన దానారా విరచిత చలనచిత్ర వీక్షణా ఫలితం...ఇదిగో ఈ రకంగా తలా పిడికెడు...

సర్సరే! ఇపుడిక మళ్ళీ కథ లోకి వస్తే – తన కూతురు బుచ్చిని ఎలాగోలా పెళ్ళి చేసుకొమ్మని అడిగిన రావి కొండల్రావు మాటలు విని తనంతట తనుగా వస్తే సూరమ్మ ఇంట్లో అడుగు పెట్టనీయదు కాబట్టి మారువేషంలో వస్తానంటాడు బుచ్చిబాబు. అలా వస్తానన్న బుచ్చిబాబుకి తన ఇల్లొక సర్కస్లా వుంటుందని, తన కూతురు బుచ్చి కోపంతో విసిరి కొట్టే ఫ్లయింగ్ కంచాల దెబ్బలు తినలేక, తన భార్య నోటికొచ్చినట్టు అనే తిట్లు పడలేక ఇంట్లో వంటవాళ్ళు, పనివాళ్ళు పారిపోతూ వుంటారని కూడా చెప్తాడు మామ కొండల్రావు. అంతే కాకుండా వృద్ధులై తన దగ్గరే వుంటున్న తన తలిదండ్రులు గుమ్మడి, నిర్మలమ్మలని అస్సలు మనుషుల్లాగే చూడదు తన భార్య అని కూడా చెప్తాడు. ఇంకా ఏం చెప్తాడంటే ఏక్సిడెంటులో తన పెద్దకొడుకు, కోడలు చనిపోతే వాళ్ళకి పుట్టిన కవలపిల్లలని తనకి మనవళ్ళైనా సరే వాళ్ళకి ముసలివాళ్లైన తన అత్తామామలంటే ఇష్టమని ఆ కోపంతో అస్సలు తన దగ్గరికే రానివ్వదట సూరేకాంతం. సూర్యకాంతం ఈ సీనులో లేదు కాబట్టి రావి కొండల్రావు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నాడు. హన్నా!

మామ కొండల్రావు చెప్పిందంతా విని ఆ సర్కస్ లాంటి ఇంట్లోని జంతువుల్లాంటి మనుషుల్ని అదుపులో పెట్టడానికి రింగ్మాస్టర్లా తనొస్తానని హామీ ఇస్తాడు బుచ్చిబాబు.

మామకి మాటిచ్చినట్టుగానే మరసటి రోజు పొద్దున్నే కచిన్స్ దర్జీలు కుట్టిన డిజైనర్-వేర్ వేసుకుని, చిల్లుల్చిల్లుల డిజైనున్న కుక్-వేర్ పట్టుకుని వంటవాడి వంటి అవతారంలో గుండాబత్తుల అచ్చమ్మ(సూర్యకాంతం) గారింటికి వస్తాడు బుచ్చిబాబు. వస్తూనే భుజాలు దాటని జుట్టు దువ్వుకుని, భుజాలు దిగని జాకెట్టు తొడుక్కున్న గుండాబత్తుల అచ్చమ్మని చూసి "అప్పుడెప్పుడో బెజవాడలో నెహ్రూ గారిని చూసి ఆనందించాను. ఇప్పుడు మీ మొహం చూసి సంతోషిస్తున్నాను" అనగానే సూరేకాంతం మహా శాంతంగా "ఎవరు బాబూ నువ్వు?" అనడిగితే "నా పేరు మర్యాదరామన్న అని, వంటపని చేయడానికి వచ్చాన"ని చెప్తాడు బుచ్చిబాబు. ఇహిప్పట్నుంచీ ఏఎన్నారు పాత్ర బుచ్చిబాబు, మర్యాదరామన్నలుగా చెరో-కాయ ప్రవేశంగా నడుస్తుంది.

లండన్, అమెరికా, రష్యాల్లో వున్న గొప్పగొప్ప వాళ్ళిళ్ళల్లో పని చేసొచ్చిన పేర్గాంచిన వంటవాడినని చెప్పగానే ఉబ్బితబ్బిబ్బై మర్యాదరామన్నని తనింట్లో వంట చేయడానికి కుదుర్చుకుంటుంది అచ్చమ్మగారు.

అచ్చమ్మగారి ముగ్గురి కూతుళ్ళూ మూడు రకాలు. అందులో మూడో కూతురు బుచ్చిది తిట్టే-నోరు, కొట్టే-చెయ్యి. పొద్దున్నే లేవగానే బెడ్డుకాఫీ నోట్లో పడకపోతే బెడ్డు మీదున్నవన్నీ మేడ మీద నుంచి కిందకి పడేలా గిరాటేసేస్తూ వుంటుంది. ఆమె కోసమని కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళ్ళిన మర్యాదరామన్నకి అక్కడ జ్వరంతో వుండి, రగ్గు కప్పుకుని దగ్గుకుంటూ కాఫీ కాచుకుంటున్న మామ్మగారు కనిపిస్తుంది. ఆవిడకి తనని కొత్తగా వచ్చిన వంటవాడిగా పరిచయం చేసుకుని, జ్వరం తగ్గడానికి ఓ మాత్ర కూడా ఇస్తాడు మర్యాదరామన్న. ఆ తర్వాత కలిపిన కాఫీ కప్పులో పోసుకుని మేడ మీద గదిలో పడుక్కుని వున్న బుచ్చిబేబీని లేపి కాఫీ తాగమని ఇస్తే పంచదార లేదని కప్పు తీసి మొహానికి ట్రే అడ్డంగా పెట్టుకున్న మర్యాదరామన్న మీదకి విసురుతుంది. వెంటనే మర్యాదరామన్న ఆశువుగా ఓ పద్యం పాడతాడు.

పంచదార వలన పలు రోగములు వచ్చు
రాచపుండు వగైరాలు తెచ్చు
చేదు కాఫీ వలన జీవితాయువు హెచ్చు
ఆలకింపుమా మర్యాద రామా!

పాలగుమ్మివారి పద్యం వినగానే బుచ్చిబేబీ కోపం పాలపొంగులా చల్లారిపోతుంది. పిల్లా నవ్వి కళకళ్ళాడిపోతుంది. కోపిష్టి ఐన బుచ్చినే మెప్పించాడూ, ఇన్నాళ్ళకి మంచి వంటవాడు దొరికాడని మురిసిపోతున్న అచ్చమ్మని "అత్తగారూ!" అని పిలిచి విసిగిస్తాడు. "నన్నలా పిలవకు" అని కేకలేసిన అచ్చమ్మతో తనింతకు ముందు పని చేసిన వాళ్ళింట్లో తను "అమ్మా!" అని పిలిచినవాళ్ళందరూ కష్టాల పాలయ్యారనీ, తననిష్టపడే అచ్చమ్మకి ఏ కష్టం రాకూడదని "అత్తగారూ" అని పిలుస్తున్నానని చెప్పి ఒప్పించుకుంటాడు, తప్పించుకుంటాడు మర్యాదరామన్న.

వంటవాడినని వచ్చాక ఏఎన్నార్రైనా సరే పాత్రలతో వంట చేసే పాత్ర పోషించక తప్పదు కదా! చింతచిగురు పప్పు ఎలా చెయ్యాలీ అని వంటింట్లో కిందామీదా పడుతున్న మర్యాదరామన్న దగ్గరికి అచ్చమ్మగారి రెండో కూతురూ, నిత్యధవళవస్త్రధారిణి రమాప్రభ కొంచెం సిగ్గుపడుతూ వస్తుంది. ఈ సిన్మాలో ఈవిడ పాత్ర చూస్తే హిందీ సుభాష్ ఘై "హీరో" సినిమాలో కనిపించే బిందు గుర్తుకొస్తుంది. వారగా వున్న తలుపు లోంచి ఓరగా చూస్తూ లోపలికొచ్చిన రమాప్రభ మర్యాదరామన్నతో "నువ్వు వంటవాడిలా లేవు...హి..హీరోలా వున్నావు" అంటుంది. ఈ సిన్మా అంతటికీ ఈవిడబ్బా నిజమైన తెలివైంది! హీరో వంటవాడి వేషంలో వచ్చిన సంగతి ఇట్టే కనిపెట్టేసింది. పైగా హీరోకి వంట చేయడం రాదని కూడా కనిపెట్టేసి, వంట ఎలా చేయాలో చూపిస్తానని చెప్తూ తనే వంట చేసేస్తుంది. అన్నట్టు ఈవిడ నట్టుతున్నట్టుగా భలే గమ్మత్తుగా మాట్లాడుతూ వుంటుంది. ఈ సీనులో యాప్లీస్ కాయ కొరుక్కుని తింటూ "నీళ్ళ పొయ్, కందిపప్పు వెయ్, వెయ్ చింతచిగురు, ఇట్టిట్టా అను" అంటూ వంట-దర్శకత్వం డీఎన్నారుకి దీటుగా ఏఎన్నారు చేయడం మహా సరదాగా వుంటుంది.

మొత్తానికి వంట పూర్తవుతుంది. ఆ వండినవన్నీ గిన్నెల్లో సర్దుకుని లంకంత ఇంట్లో ఓ మూలగదిలో వుంటున్న మామ్మ, తాతగార్లు, వాళ్ళ మునిమనవల దగ్గరికి తెచ్చిచ్చి భోంచేయమంటాడు మర్యాదరామన్న. ఈయన వ్యవహారమంతా మర్యాద గానే వుంది గానీ ఇంట్లో, నట్టింట్లో, వంటింట్లో కూడా ఆరంగుళాల హీలుండే నల్లబూట్లు ఎందుకు తొడుక్కున్నాడబ్బా? అనిపించింది.

సరే! ఇప్పటివరకూ ఇంట్లో వున్న వాళ్ళెవ్వరూ తమని పట్టించుకోకపోయినా ఇప్పుడు మర్యాదరామన్న భోజనం తెచ్చి పెట్టాడని ఆనందిస్తూ ఆ ముసలి దంపతులు రాజమండ్రిలో వున్న తమ కూతురుకి రామన్న వయసున్న కొడుకున్నాడని చెప్తారు. “మరి ఇక్కడిలా కోడలైన అచ్చమ్మ చేతిలో

ఇబ్బందులు పడే బదులు కూతురు దగ్గరికే వెళ్ళి వుండొచ్చు కదా" అని మర్యాదరామన్న వేషంలో వున్న బుచ్చిబాబు అడిగితే తాతైన గుమ్మడి అలా వెళ్తే తమతో వున్న కవలపిల్లలైన మునిమనవలకి, వాళ్ళు తన కొడుకు పిల్లలని కూడా చూడకుండా తమ కోడలు అచ్చమ్మ ఆస్తి దక్కనివ్వదని, అందుకే కష్టమో నష్టమో ఇక్కడే వుంటున్నామని చెప్తాడు. వాళ్ళ కథంతా విన్న మర్యాదరామన్న ఇహిప్పట్నుంచీ వాళ్ళకే అవసరం వచ్చినా తను చూసుకుంటాననీ, తననే వాళ్ళ మనవడు అనుకోమని ధైర్యం చెప్తాడు.

ఓ రోజు బుచ్చిబేబీ రెండు జళ్ళేసుకుని, ఇంత నోరేసుకునొచ్చి రామన్నని పిలిచి ఓ ఐదారుగురు స్నేహితులు భోజనానికి వస్తున్నారని చెప్పి జింజర్ చికెన్, చిల్లీ చికెన్, ఎగ్ ఫ్రైడ్ రైస్, చికెన్ బిర్యానీ, టొమేటో సూప్ అంటూ ఓ లిస్ట్ చెప్పి, అవన్నీ ఫైవ్ స్టార్ హోటల్లో వంటల్లా వుండాలని చెప్తుంది. ఎలాగూ ఫైవ్ స్టార్ హోటల్ రుచిలో వుండాలంది కదా అని పదార్థాలన్నిటినీ హోటల్ నుంచి తెప్పించి ప్లేట్లలో సర్దుతూ వుంటాడు మర్యాదరామన్న. అది రమాప్రభ చూసి "నీకు నిజంగా వంట రాదా?" అనడిగితే "మీ చెల్లెలే ఫైవ్ స్టార్ హోటల్ నుంచి తెప్పించమంది" అని చెప్పి తప్పించుకుంటాడు రామన్న.

ఇంటికొచ్చిన బుచ్చిబేబీ స్నేహితురాళ్ళు భోంచేస్తూ ఏం మాట్లాడుకుంటూ వుంటారూ అంటే ఎవరెవరు ఎలాంటి వాళ్ళని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారూ అని. అసలే దాసరి సినిమాల్లో అమ్మాయిలకి పెళ్ళి తప్ప వేరే ధ్యాస తక్కువ. అందులో మన బుచ్చిబేబీ తనని చేసుకోబోయేవాడు ఎలా వుండాలీ అని చెప్తుందీ అంటే తనకి "యద్దనపూడి సులోచనారాణి నవలలో హీరోలా అందగాడు, సూటూ బూటుతో వున్నవాడు, కళ్ళకు కళ్ళజోడు పెట్టగలిగినవాడు, ఎడమ చేత్తో డ్రైవ్ చేస్తూ కుడి చేత్తో సిగరెట్టు కాల్చగలిగినవాడు, ఆ పొగలు రింగులు రింగులుగా వదుల్తూ కారులో వెడుతున్నవాడు, కంటితో చూస్తేనే చాలు శతకోటి బాణాలు కురిపించగలిగినవాడు, నోరు తెరిస్తే చాలు పంచదార కురిపించినట్టు తియ్య తియ్యగా మాట్లాడగలిగినవాడు" అని ఓ పేద్ద హజ్బెండు-లిస్టు చదువుతుంది. ఆ పక్కనే నించుని ఆ లిస్టు వింటున్న ఏఎన్నార్ ముఖ కవళికల విన్యాసం – అహో! నర్తనశాలలో బృహన్నల నాకు జ్ఞాపకం రావడం – ***ఆ తప్పు నాది కాదంటే, మన్నించుమా చదువరీ! మన్నించుమా!***

మరి బుచ్చిబేబీకి భర్త కావాలంటే ఎలా వుండాలో మర్యాదరామన్న వేషంలో వున్న బుచ్చిబాబుకి తెల్సిపోయింది కదా! వెంటనే సూటూ-బూటూ వేసేస్కుని, సిగరెట్టు కాలుస్తూ, కారు డ్రైవ్ చేస్తూ, అదే దారిలో వస్తున్న బుచ్చిబేబీ కారు కడ్డంగా తన కారాపి, బుచ్చిబేబీతో ఆమె కారు వెనక చక్రం సరిగ్గా లేదు చూసుకోమని చెప్తాడు. అచ్చు మర్యాదరామన్న లాగే కనిపిస్తున్న బుచ్చిబాబుని చూసి అతను అచ్చు తమ వంటవాడిలా వున్నాడు అని చెప్తే నమ్మని బుచ్చిబాబుకి మరసటి రోజు వంటవాణ్ణి గండిపేట పార్కుకి తీసుకొచ్చి చూపిస్తానని చెప్తుంది బుచ్చిబేబీ. తను ఎఱ్ఱకారు వేసుకొస్తానని చెప్పి వెళ్ళిపోతాడు బుచ్చిబాబు.

ఇంటికొచ్చిన బుచ్చిబేబీ ఆ రెండోరోజు పొద్దున్నే తొమ్మిదింటికి మర్యాదరామన్నని తనతో కలిసి బయటికి వెళ్ళడానికి తయారు కమ్మంటుంది. అనుకున్నట్టుగానే ఇద్దరూ కలిసి గండిపేట పార్కుకి వెళ్తారు డ్యుయెట్టు పాడుకోవడానికన్నట్టు ఒకే మోడల్ పేంట్లూ-చొక్కాలూ వేసుకుని.

తీరా అక్కడికి వెళ్ళగానే మర్యాదరామన్న "నన్ను కార్లో ఇంత దూరం తీసుకొచ్చావంటే నన్ను ప్రేమిస్తున్నావు, అందుకే సిన్మాలోల్లా పాటలు పాడుకుందాం పద" అంటాడు. అది వినగానే బుచ్చికి కోపం వస్తుంది. ఇంతలో వాళ్ళిద్దరికీ అక్కడ ఆగి వున్న ఎఱ్ఱకారు కనిపిస్తుంది కానీ అందులో బుచ్చిబాబు వుండడు. అప్పుడు "అచ్చు నీలా వున్నవాణ్ణి చూశానూ, అతనికి నిన్ను చూపిద్దామనే ఇలా తీసుకొచ్చానూ" అని చెప్పిన బుచ్చిబేబీకి "అచ్చు నాలానే వుంటే వాడెందుకు?" అంటూ తను ముందే అనుకున్నట్టు ఓ పాట మొదలుపెడ్తాడు మర్యాదరామన్న.

ఆ పాట దాసరి వారి ఉడికీ ఉడకని వంటకం అయినా చక్రవర్తి గారి తాళింపు పడడంతో మరీ అంత అరుచిగా అనిపించదు. "***గుండాబత్తుల బుచ్చమ్మా! ఎండాకాలపు మంటమ్మా! మంట మండావా – వంట చేస్తాను. వంట తిన్నావా – జంట ఔతావు...ఒంటి వాడినీ, నీ వంటవాడినీ***" అని మర్యాదరామన్న పాడుతున్నంత సేపూ, నాకా పాటలో నచ్చినవేంటంటే స్విమ్మింగ్ పూల్లో తామెలా కనిపిస్తామా అని ఒంగి చూసుకుంటున్న కొబ్బరిచెట్లూ,

అవతలగా కనిపించిన సముద్రపు అలలూ, చుట్టూ నేలకి పందిరేస్తున్నట్లు కనిపించిన కొబ్బరితోటలు. పాటలో ఏఎన్నారు వేసిన పులివేషపు చిందులూ, జయప్రద వేసుకున్న టైటు పేంటు ఇబ్బందులూ గురించి అట్టే పట్టించుకోక పోవడం చూసిన కంటికి, ఆ కంటి ఓనరు ఒంటికి మంచిది.

సాయంత్రం ఆలస్యంగా ఇంటికొచ్చిన బుచ్చిబేబీని “ఇప్పటిదాకా ఎక్కడ తిరిగొచ్చావూ?” అనడిగిన మాత-అచ్చమ్మకి సుత-బుచ్చమ్మ తను గృహలక్ష్మి గారి మనవరాలూ, మహలక్ష్మి గారి అమ్మాయీ, ధనలక్ష్మి చెల్లెలూ అయిన శ్రీలక్ష్మి గారింటికి వెళ్ళొచ్చానని చెప్తుంది. “మరి కూడా మర్యాదరామన్న ఎందుకొచ్చాడని” అడిగిన భుజాల్డాటని జుట్టూ-భుజాలపైకి జాకెట్టూ ధరించి, చేతిలో గొడుగూ, భుజానికి హేండ్‌బాగ్గు తగిలించుకున్న అచ్చమ్మకి తనూ, బుచ్చి కలిసి వెళ్ళి "గుండాబత్తుల బుచ్చమ్మా!" అంటూ బుచ్చిని ఆట పట్టిస్తూ పాట పాడడమే కాకుండా బుచ్చి తల్లైన గుండాబత్తుల అచ్చమ్మని "రాక్షసి" అని తిట్టాడని ఒకణ్ణి కొట్టడానికి వెళ్తే వాడు పారిపోయాడని అప్పటికప్పుడు ఫాస్టుఫుడ్డు లాంటి కథోటి వండి వడ్డించి, వంటింట్లో కొత్తిమీర పచ్చడి చేయాల్సిన పనుందని చెప్పి వెళ్ళిపోతాడు మర్యాదరామన్న.

రెండోరోజు వంటింట్లో మిక్సీలో ఏదో రుబ్బుకుంటున్న మర్యాదరామన్న దగ్గరికొచ్చి ముందురోజు తన తల్లి కోపం నుంచి తనని కాపాడినందుకు టిప్పు అంటూ డబ్బులివ్వబోతుంది బుచ్చిబేబీ. మర్యాదరామన్న టిప్పు ఒద్దని, టిప్పుసుల్తానుగారి మనవడు అప్పుసుల్తానుగారు తనతో స్వయంగా చెప్పారు అంటూ పాలగుమ్మివారి పద్యమొహటి పాడతాడు.

సేవకులకు హోటలు సర్వర్లకును టిప్పులిచ్చి
పాడు సేయుటేమి తెలివి?
తినమరిగిన గొడ్డు పనికి పనికిరాదు
ఆలకింపుమా మర్యాదరామా!

"మాట్లాడితే పద్యం పాడేస్తున్నావ్. ఎక్కడ నేర్చుకున్నావ్?" అనడిగిన బుచ్చికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారింట్లో పని చేసినప్పుడు నేర్చుకున్నానని చెప్తాడు మర్యాదరామన్న. ఇదిగో...హీరో ఇలా వంటవాడిగా రావడం, ఏవో సూక్తులు చెప్పడం, అవన్నీ గొప్పగొప్ప వాళ్ళింట్లో పని చేసేటప్పుడు ఆ గొప్పవాళ్ళు తనతో అన్న మాటలని చెప్పడం మాత్రం సుప్రసిద్ధ "హాయిందీ" దర్శకులు హృషీకేష్ ముఖర్జీ వండి వార్చిన "బావర్చీ" రెసిపీ. మిగిలిందంతా గులాబ్‌జామూన్ చేసి మసాలా కూరలో కలిపిన "తెలుగింటి వంట" వైనం.

బుచ్చి, మర్యాదరామన్న వంటింట్లో నించుని టిప్పుల గురించి మాట్లాడుకోవడం తలుపు వార నుంచి ఓరకంటితో చూసిన శాటినంచు తెల్లచీర కట్టుకున్న రమాప్రభ అదోలా చూస్తూ దగ్గరికి రాగానే వంటింట్లోంచి పారిపోతాడు మర్యాదరామన్న.

ఆ తర్వాత రోజు మిట్ట మధ్యాహ్నం పూట, ఓ మధ్యపాపిడి తీసిన నల్లటి విగ్గోటి తల మీద తొడుక్కొని, పసుప్పచ్చ డ్రెస్సేదో వేసుకుని బుచ్చిబేబీ బస్టాపులో నించుని వుంటే ఇంపోర్టెడ్ కారూ, పాయింటెడ్ షూ వేసుకుని ఒచ్చిన బుచ్చిబాబుని చూసి, అంతకు ముందు రోజు గండిపేట పార్కుకి వస్తానని చెప్పిన మాట నిలబెట్టుకోలేదని అలుగుతుంది. అప్పుడు బుచ్చిబాబు "నేను వచ్చాను ముందు కారెక్కండి అసలేం జరిగిందో చెప్తా" ననగానే బుచ్చిబేబీ బుచ్చిబాబు కారెక్కేస్తుంది. బుచ్చీ-స్క్వేర్ కార్లో వెళ్తూ మాట్లాడుకుంటూ వుంటారు. "నిన్న పార్కుకి వచ్చి కూడా నాకెందుకు కనిపించలేదు మీరు" అనడిగిన ఆడ-బుచ్చికి మగ-బుచ్చి "నువు నా కోసం ఎంత సేపు వేచి వుండగలవో టెస్ట్ చేద్దామనుకున్నానూ, ఈలోగా ఇంకెవరో ఒకతను నిన్ను చూసి పాడడం చూశానూ, నాకు రొమాన్సులో పోటీ పడడం ఇష్టం వుండదూ, అందుకే నీ దగ్గరికి రాలేదూ" అని చెప్పగానే ఆడ-బుచ్చి "ఛిఛీ వంటవాడితో నాకు రొమాన్సేంటీ?" అని చిరాకు పడుతుంది. మొత్తానికి అలా కబుర్లు చెప్పుకుంటూ, కార్లో అలా అలా తిరుగుతూ బుచ్చులిద్దరూ అచ్చికబుచ్చికలాడేసుకుంటారు.

ఇంతలో అసందర్భంగా ఏం జరుగుతుందంటే అచ్చమ్మగారి పెద్దకూతురు ఓ ఉత్తరం తెరిచి దొంగతనంగా చదువుతుంటే చెల్లెలు బుచ్చిబేబీ "నాకొచ్చిన ఉత్తరం నువ్వు చదువుతావా?" అని కోప్పడి లాగేసుకుని తను చదవబోతుంది. అంతే – వెంటనే గోదారి, గోదాట్లో పడవ, పడవలో చొక్కా మీద బెల్లెట్టుకుని బుచ్చిబాబు, గోదారి గట్టు మీద తెల్లబూట్లేసుకుని గుఱ్ఱపుడెక్క తొక్కుకుంటూ బుచ్చిబేబీ పాటకి తయారు. "***సిత్తరాల తోటలో ఉత్తరాలు దొరికాయి. నువ్వు రాశావా? నేను రాశానా? నాకు నువ్వు రాశావా? నీకు నేను రాశానా?***" అని బుచ్చిబాబు అడిగితే దానికి బదులుగా బుచ్చిబేబీ "***సిత్తరాల తోటలో సిత్తరాలు జరిగాయి. నువ్వు చూశావా? నేను చూశానా? అవి నువ్వు చూశావా? అవి నేను చూశానా?***" అని అడిగేస్తుంది. ఈ పాట ఎప్పట్నుంచో వింటున్నా ఈ సిన్మాలో చూస్తున్నప్పుడు మాత్రం జగ్గయ్యగారి "***కొండగాలి తిరిగిందీ...గుండె ఊసులాడింది***" పాట గుర్తొచ్చింది, ఆ గోదారీ–పడవ–పడవలో గెడా, పాట ఎత్తుగడా చూసీ, వినీ.

అరెరె! ఇంతకు ముందు అక్కగారు ఉత్తరం చింపడం అసందర్భం అనుకున్నానే కానీ అది ఈ పాటకి సందర్భంగా కూర్చిన దాసరి విజన్ వజన్ నాకు తెలీలేదుస్మీ!

వీళ్ళిలా ఆడుకుంటూ, పాడుకుంటూ, ఉత్తరాలు రాసుకుంటూ, సిత్తరాలు చూసుకుంటూ, కుంటుకుంటూ, గెంతుకుంటూ, ఉంటూ ఉండగా పాటైపోతుంది.

పాటైపోయిన పక్క సీనులో జైలు నుంచి విడుదలై ఇంటికొచ్చిన గుండాబత్తుల అచ్చమ్మగారి తమ్ముడు మోహన్‌బాబు వెళ్ళి నిద్రపోతున్న బుచ్చిని లేపి చెంపదెబ్బ తింటాడు. ఇంతలో కాఫీ కప్పులు ట్రేలో పెట్టుకుని పట్టుకుని అక్కడికొచ్చిన మర్యాదరామన్న మళ్ళీ ఓ పద్యం పాడతాడు.

వలపు జ్వరమునకు దవడ పగులుట మందు
కోపమునకు వేడి కాఫీ మందు
సూక్తి వినవె ఉష్ణముష్ణేన శీతలః
ఆలకింపుమా మర్యాదరామా!

ఏమాటకామాట చెప్పుకోవాలి "హు! ఈ అవమానమును సహించి జీవించుటయా, లేక సన్మానముగా భావించి కాబోయే పెళ్ళాం కదా అని వదిలివేయుటయా?" అని చెంపదెబ్బ కొట్టిన బుచ్చితో అనే మేనమామ మోహన్‌బాబు ఓ అరసెకనులో పావువంతు పాటు యశస్వీరంగారావుని అనుకరించి ఇమిటేషన్ స్టారై మెరిశాడు.

మోహన్‌బాబు వచ్చాడని గుమ్మడీ–నిర్మలమ్మలనీ, కవలలనీ వాళ్ళుంటున్న గది ఖాళీ చేయించి పెరట్లో వున్న ఔట్‌హౌస్‌కి మార్పిస్తుంది కోడలచ్చమ్మ.

ఈలోగా హేమ్మాలిని అని పేరెట్టుకున్న రమాప్రభతో లవ్–ట్రాక్ నడపబోయి ఏఎన్నారు చేతిలో తన్నులు తిన్నంత పనిచేస్తాడు హేమా–కీ–మామ మోహన్‌బాబు.

ఔట్‌హౌస్ లోకి మారిన నిర్మలమ్మ కోడలు అచ్చమ్మ దగ్గరికొచ్చి కవలల పుట్టినరోజని చెప్పి కొత్తబట్టలు కుట్టించమంటుంది. "వాళ్ళు పుట్టీపుట్టగానే నా కొడుకుని పొట్టనపెట్టుకున్నారు నేను కొత్త బట్టలు కుట్టించను" అని తిట్టిపోస్తుంది అచ్చమ్మ. అది విని ఏడుస్తున్న నిర్మలమ్మకి పిల్లల పుట్టినరోజు తను జరిపిస్తానని చెప్తాడు మర్యాదరామన్న. అన్నట్టు ఆ కవలల్లో ఒకడు తర్వాతర్వాత "ప్రేమఖైదీ"నంటూ మాలాశ్రీతో హిట్టు కొట్టిన హరీష్.

సరే! రెండోరోజు పొద్దున్నే కచిన్స్ దర్జీలు కుట్టిన కొత్తబట్టలేసుకుని మర్యాదరామన్న ఓ టేబులేసి, దాని మీద కేకు పెట్టి, కొవ్వొత్తులు వెలిగించి "***వాల్మీకి ఇంటిలో లవకుశులు పుట్టారు***" అని పాడుతూ పిల్లల చేత కేక్ కోయించి, స్వీట్లు తినిపించి పుట్టినరోజు పండగ జరిపిస్తాడు. ఈ పాట మధ్యలో ఆకాశం నుంచి దీవించే అమ్మానాన్నలుగా సుజాత-మురళీమోహన్ ఓ క్షణం కనిపిస్తారు. అంతా బానే వుంది కానీ నాకు ఈ పాటలో కవిహృదయం అయోమయం...

*ప్రతిరోజూ పుడతారు ఎవరో ఒకరు*
*ఆ రోజున తెలియదు ఎవరికి ఎవరు*
*తెలిసిన రోజున లేరు మీకెవ్వరూ*
*ఎవరున్నా లేకున్నా మీకు లేనిదెవ్వరు?*

ఆ పై లైన్లకర్థమేమిటో, తెలుపుమా, మర్యాదరామా!

సరే! పాటైపోయింది. ఇంకా తర్వాత ఈ దాసరి-వంటకంలో ఐటెం ఏంటీ అంటే ఓ కొత్త పాత్ర ప్రవేశం. ఓ రోజు మర్యాదరామన్న అచ్చమ్మ గారింట్లో డ్రైవర్‌గా పని చేస్తున్న చలం వెనకాలే ఇంట్లోకి వస్తున్న ఓ అబ్బాయిని చూస్తాడు. వెంటనే అతనికి ఈ అబ్బాయిని ఎక్కడో చూసినట్లనిపిస్తుది.

ఇక్కడో చిన్న ఫ్లాష్‌బాక్. బుచ్చిబాబుకి ఓ బాబాయ్ ఎఱ్ఱికళ్ళ చలపతిరావు. ఆ బాబాయ్‌తో పాటు వాలుకళ్ళ పిన్ని డబ్బింగు జానకి. వాళ్ళిద్దరికీ పుట్టిన ఓ కూతురు, బుచ్చిబాబుని అన్నా అని పిలిచే చెల్లెలు బెదురు కళ్ళ గీత. ఓ రోజు చలపతిరావు గీతని పట్టుకుని ఎవరితోనో సినిమాలూ, షికార్లూ తిరుగుతోందని కొడుతూ వుంటాడు. అతన్నించి గీతని విడిపించి ఆమెని అసలు సంగతేంటని అడుగుతాడు బుచ్చిబాబు. అప్పుడు గీత తనని రాజా ప్రేమించేస్తున్నాడనిన్నీ, పెళ్ళి చేసుకుంటానన్నాడనిన్నీ చెప్తుంది. అప్పుడు బుచ్చిబాబు ఓ భలే మంచి బొమ్మల చొక్కా తొడుక్కుని రాజా దగ్గరికి వెళ్తాడు. ఇక్కడ ఈ బొమ్మలచొక్కా ప్రసక్తి మహా అప్రస్తుతమైనా నాకు బొమ్మలంటే ఇష్టం కాబట్టి ఆ చొక్కా గురించి చెప్పకుండా వుండలేక – ***ఏదో ఏదో రాశాను, అంతే...అంతే...***

తీరా బుచ్చిబాబు వెళ్ళి అడిగితే ఆ రాజా “గీతని పెళ్ళి చేసుకుంటాను, కానీ మా అమ్మ అంటే భయం కాబట్టి ఆవిడకి తెలీకుండా చేసుకుంటాను” అని చెప్పి, అన్నట్టుగానే మెళ్ళో దండలేసుకుని గుళ్ళో పెళ్ళి చేసుకుని అందరి కాళ్ళకి దండాలు పెడతాడు కూడా.

ఇప్పుడా రాజాయే చలంతో ఇంట్లోకి వచ్చింది. ఇంటికొచ్చిన రాజా బాబ్డ్ హెయిరూ-బ్లూ శారీ వేరూ అచ్చమ్మకి గీతతో జరిగిన తన పెళ్ళి గురించి చెప్తే "ఆయ్! హన్నా! నాకు తెలీకుండా డబ్బు లేని అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా? ఆ అమ్మాయిని మర్చిపోకపోతే నేను విషం తాగి చచ్చిపోతా" అని బెదిరిస్తుంది గుండాబత్తుల అచ్చమ్మ. ఈలోగా ఆ గది లోకి కాఫీ పట్టుకుని మర్యాదరామన్న పాత్ర ప్రవేశం. మర్యాదరామన్నని రాజా బుచ్చిబాబుగా గుర్తు పట్టినా దాన్ని బయటికి కనిపించనీయదు రాజా. మొత్తానికి రాజాని గీతని విడదీయాలనుకుంటుంది అచ్చమ్మ. ఆ ప్రణాళికలో భాగంగా చలాన్ని వాళ్ళింటికి పంపించి రామారావు అనబడే రాజా ఏక్సిడెంటులో పోయాడని చెప్పిస్తుంది. ఋజువుగా రాజా బట్టలు, వాచీ చలపతిరావుకిస్తాడు చలం.

అవి చూసి గీత ఏడుస్తుంది. ఆ సీను ముగుస్తుంది. అచ్చమ్మ ప్లాన్ గురించి మర్యాదరామన్నకి తెలుస్తుంది. దాన్ని ఎలా తిప్పికొట్టాలా అన్న ఆలోచనొస్తుంది.

ఈలోగా బుచ్చిబేబీ తన గదిలో పౌడర్ పారపోశాడని కవలల్లో ఒకడైన హరీష్‌ని కొడుతుంది. అది చూసి మర్యాదరామన్న తల్లీ-తండ్రీ లేని అన్నగారి పిల్లల్ని అలా కొట్టకుండా చేరదియ్యడం మంచిమనుషుల లక్షణం అని చీవాట్లు పెడతాడు. అది విని బుచ్చిబేబీ పుట్టిన ఇన్నేళ్ళకు అప్పుడే బుద్ధొచ్చినట్లు కనిపిస్తుంది.

మర్యాదరామన్న మామ్మా-తాతల దగ్గరికి వెళ్ళి తన చెల్లెల్ని చూసి రావడానికి వూరెళ్తున్నానని చెప్పి గీత దగ్గరికి వెళ్తాడు. వెళ్ళి గీతకి రాజా బతికే వున్నాడని చెప్తాడు. చెప్పి అచ్చమ్మ ఆడించిన నాటకానికి ఎదురు నాటకం ఆడదామంటాడు.

ఈలోగా ఏం జరుగుతుందంటే అంతకు ముందు పౌడర్ ఒలికిన గొడవలో బుచ్చి "మా అమ్మతో చెప్తాను నీ పని" అన్న మాటలు గుర్తు చేసుకుని కవల పిల్లలు ఇద్దరూ అచ్చమ్మ కొడితే అడ్డుకోవడానికి రామన్న కూడా లేడని భయపడి ఇంట్లోంచి పారిపోతారు. పిల్లలు కనిపించట్లేదని కంగారు పడుతున్న మామ్మ నిర్మలమ్మని, తాత గుమ్మడిని ఇంట్లోంచి పంపించేస్తుంది అచ్చమ్మ.

ఆ సంగతి ఊర్నుంచి వచ్చిన మర్యాదరామన్నకి చెప్తాడు డ్రైవర్ చలం. అది తెలియగానే మర్యాదరామన్న ప్రభాకర్రెడ్డికి ఫోన్ చేసి "ఇలా పిల్లలూ, ముసలివాళ్ళూ ఇంట్లోంచి వెళ్ళిపోయారూ, వాళ్ళని వెతకాలీ" అని చెప్తే ప్రభాకర్రెడ్డి "వాళ్ళ సంగతి నేను చూసుకుంటాను" అన్నవాడు సినిమా ముందుముందు ఏం జరుగుతుందో అని చూసుకుంటూ వుండడం తప్ప ఇంకేమీ చేసినట్టు కనపడ్డు.

ఇంట్లోంచి వెళ్ళిపోయిన ముసలివాళ్ళు మునిమనవలని వెతుక్కుంటూ రోడ్ల మీద తిరుగుతూ వుంటారు. అప్పుడో చోట పని చేస్తూ పిల్లలు కనిపిస్తారు. తమ కోసం వచ్చిన మామ్మా-తాతలని చూసి వాళ్ళ వెంట ఇంటికి వెళ్తే నాన్నమ్మ కొడుతుందని ఏడుస్తూ పారిపోతుంటే ముసలివాళ్ళిద్దరూ పిల్లలని పట్టుకుని ఇంక ఆ ఇంటికి తిరిగి వెళ్ళమని మాటిస్తారు.

అంతే వెంటనే పాట...పిల్లలు దొరికిన ఆనందంలో మామ్మా-తాత పాడేది కాదు సుమీ! కచ్చిన్స్ వారి సూటు వేసుకుని బుచ్చిబాబు, వారే కుట్టిన స్కర్టు వేసుకుని బుచ్చిబేబీ కలిసి "***సందమామ పైటేసిందీ.. అందగాణ్ణి మూసేసిందీ... ఎన్నెల్లో సీకటై సీకట్లో ఎన్నెలై సీకట్లో సిందులాట ఆడేసింది***" అని కొండలూ-కోనలూ చిందులేసి దున్నేస్తూ వుంటారు. అదంతా వాళ్ళింటి పెరట్లోనే నించుని రమాప్రభ చూసేస్తుంది.

లంకేశ్వరుడు సినిమాల్లో రాధకి "ర" పలకనట్లు ఇందులో రమాప్రభకి ప్రతీ మాటకి మొదట్లో అచ్చులు తప్ప హల్లులు పలకవు. ఎంటనే అమాప్రభ అరిగెత్తుకుంటూ ఎళ్ళి ఆళ్ళమ్మ అచ్చమ్మతో "ఓటలో ఆమన్న, ఉచ్చి ఆట ఆడుకుంటూ ఆన్సు ఏసేస్తున్నారు" అని ఎప్తే, అది విన్న అచ్చమ్మ నవ్వేసి "బుచ్చిని ఓ కంట కనిపెట్టమని రామన్నకి చెప్పాను. అందుకే అలా బుచ్చి చుట్టూ తోటలో చెట్లెమ్మటా, పుట్లెమ్మటా తిరుగుతున్నాడు ఏం ఫర్లేదు" అని కొట్టి పడేస్తుంది.

ఇంకిక్కణ్ణించీ కొన్ని రీళ్ళ సినిమాలో రమాప్రభకి, చలానికి పెళ్ళి చెయ్యడానికి మర్యాదరామన్న చేత దాసరివారు నడిపించిన కథ పుణ్యమా అని రమాప్రభ మిగిలిన సినిమా అంతా కళకళ్ళాడుతూ కనిపిస్తుంది.

ఇదంతా అవుతూనే మర్యాదరామన్న ఇంట్లో పని చెయ్యడానికొచ్చిందని చెప్పి గీతని అచ్చమ్మ దగ్గరికి తీసుకొస్తాడు. "ఇదెవర్రా హీరోయిన్‌లా వుందీ?" అనడిగిన అచ్చమ్మకి "అందమైన మీకు అందమైన పనిమనుషులుంటే బావుంటుందని" పొగిడి గీతని పని లోకి తీసుకునేలా చేస్తాడు రామన్న. గీతని తమింట్లో మర్యాదరామన్న పని లోకి కుదర్చడం చూసిన రాజా ఆ రోజు రాత్రి గీత దగ్గరికెళ్ళి తనెలాగైనా గీత గురించి తన అమ్మ అచ్చమ్మకి చెప్పి ఒప్పిస్తానని, అంత వరకూ తను గీతని పెళ్ళి చేసుకున్నానన్న విషయం ఎవరికీ చెప్పొద్దని చెప్తూ, వంటవాడి వేషంలో వున్నది బుచ్చిబాబే కదా అనడిగితే గీత

"అతను బుచ్చిబాబు కాదు. అతన్నే పోలిన మర్యాదరామన్న" అని చెప్తుంది. రాజా గీత దగ్గరికొచ్చి మాట్లాడడం కిటికీ లోంచి చూసి మర్యాదరామన్న సంతోషిస్తాడు. ఇదిలా జరుగుతుండగా అచ్చమ్మ దగ్గరికి మోహన్‌బాబు వచ్చి బుచ్చి ఎవరితోనో తిరుగుతోందని చెప్పి బుచ్చికి, రాంబాబుకి కుండమార్పిడి పెళ్ళిళ్ళు చేయడానికి ఒక రాజకీయనాయకుడి పిల్లలను కుదుర్చుకొచ్చానని చెప్తాడు. ఆ రా.నా. ఎవరో కాదు సాక్షాత్తూ దానారా. అన్నట్టు రానా పాత్రలో వచ్చిన దానారా గారికి ***ప్రతీ ప్రమాటకీ క్రావడి త్రగిలించి ప్రమాట్లాడడం భ్రలే స్రరదా.***

బుచ్చిని పెళ్ళి చూపులు చూడ్డానికొచ్చిన దానారాకి మర్యాదరామన్న ఎన్నో అబద్ధాలు చెప్పి ఈ పెళ్ళి తప్పిద్దామనుకుంటే దానారా అవేమీ పట్టించుకోకుండా పెళ్ళి ఖాయం అంటాడు. తప్పిపోతుందనుకున్న పెళ్ళి కుదిరిందని బాధ పడుతున్న బుచ్చిబేబీకి బుచ్చిబాబుని రెజిస్టర్డ్ మారేజ్ చేసుకోమని సలహా ఇస్తాడు మర్యాదరామన్న. ఆ ఐడియా బుచ్చికి నచ్చి ఇంట్లో ఎవరికీ తెలీకుండా బుచ్చిబాబుని పెళ్ళి చేసేసుకుంటుంది. ఇద్దరూ కలిసి "***హే బుచ్చిబాబూ...హే బుచ్చిబేబీ***" అని పాట కూడా పాడేసుకుంటారు. ఈ పాటలో అనారాకి గొంతిచ్చింది ఎప్పట్లా ఎస్పీబీ కాదు మాధవపెద్ది రమేష్. ఈ పాట మాత్రం దాసరి తప్ప వేరెవరూ రాయలేరు, ఇలా రాయొచ్చని కూడా ఊహించలేరు... "***చలిగాడు, వేడిగాడు, దుప్పటిగాడు, పరుపుగాడు***" అంటూ తెలుగులో నేనిప్పటివరకూ ఎప్పుడూ వినని పలుకుబడుల్లో ఎన్నో వినూత్న ప్రయోగాలు చేసి అలరించారు దానారా వారు. అది ఎవరికి వారు విని వండరైపోవాల్సిందే!

సరే! దానారాకి బుచ్చిబేబీకి బుచ్చిబాబుతో పెళ్ళైన సంగతి తెలీదు కదా! అందుకని బుచ్చిని తన పిచ్చికొడుకైన రాజబాబుకి ఇచ్చి పెళ్ళి చేయబోతున్న సంగతి పిచ్చి కుదిర్చే డాక్టర్‌తో మాట్లాడుతూ వుంటే, ఆ మాటలు ఆ ఇంట్లో పని చేయడానికి చేరిన మామ్మ నిర్మలమ్మ వింటుంది. వెంటనే ఆవిడ వెళ్ళి కోడలు అచ్చమ్మకి పిచ్చిపెళ్ళికొడుకు రాజబాబు గురించి చెప్పి బుచ్చితో పెళ్ళి ఆపుచెయ్యమంటే అచ్చమ్మ వినిపించుకోక ఆవిణ్ణి తిట్టి పంపించేస్తుంది. వెళ్ళిపోతున్న నిర్మలమ్మని చూసి మర్యాదరామన్న "మీ అందర్నీ ఓ చోటికి తీసుకువెళ్తాను" అని చెప్పి మామ్మా-తాతల్ని, కవలల్ని తన ఇంటికి తీసుకెళ్తాడు.

అక్కడకెళ్ళాక గుమ్మడి-నిర్మలమ్మలకి మర్యాదరామన్న తమ మనవడైన బుచ్చిబాబు అని తెలుస్తుంది. వాళ్ళు తమ కూతురింటికే చేరామని సంతోషిస్తారు.

ఈలోగా మోహన్‌బాబుకి ఊర్కే వుంటే ఆట్టే రోలుండదు కదా! అందుకని అచ్చమ్మక్క దగ్గరికెళ్ళి ఇంట్లో వున్న పనిపిల్ల రాజా పెళ్ళి చేసుకున్న గీత అని చెప్పి, ఆ అమ్మాయిని ఇంట్లోంచి పంపించెయ్యడానికి ఓ ప్లాన్ చెప్తాడు. అదొక నాసిరకపు కీచకవధ తరహా సీను. అందులో గీత బదులు చీర కట్టుకుని గాజుల చేత్తో పాల గ్లాసు అందించిన మర్యాదరామన్న చేత తిట్లు తిని బుద్ధి వచ్చిందని వెళ్ళిపోతాడు మోహన్‌బాబు. అలా వెళ్తానని చెప్పి వెళ్ళినవాడు వెళ్ళకుండా ఇంట్లో వాళ్ళందరినీ తీసుకొచ్చి మర్యాదరామన్న పెట్టుకున్న విగ్గు పీకేసి అతనే బుచ్చిబాబు అని అందరికీ చూపించి, గీతనీ, బుచ్చిబాబునీ ఇంట్లోంచి వెళ్ళగొట్టిస్తాడు.

భలే! నాగేస్వర్రావ్ విగ్గు మీద విగ్గు పెట్టుకున్న సినిమా ఏంటండీ అనీ ఎవరైనా అడిగితే "బుచ్చిబాబు" అని చెప్పడం మర్చిపోకండేం?!

బుచ్చిబేబీకి కూడా బుచ్చిబాబు మీద కోపమొచ్చి బుస కొడ్తూ ఇంట్లోకి వెళ్ళిపోతుంది. బుచ్చిబాబు గీతని తీసుకుని తనింటికి తీసుకెళ్తాడు. మొత్తానికి అందరూ వైకుంఠపాళీ ఆటలోలా ఒక్కో సీనూ దాటి చలనచిత్ర-పట-సోపానం లాంటి హీరో గారింట్లో చేరుతూ వుంటారు.

ఇంతలో *బుచ్చికి పెళ్ళి కాలేదనుకుని తాంబూలాలు తీసుకోవడానికి వస్తాడు దాసరి*. అప్పుడక్కడికి కోయదొర వేషంలో వచ్చిన బుచ్చిబాబు బుచ్చికి అప్పటికే పెళ్ళైపోయిందని చెప్పగానే "*పెళ్ళైపోయిన పిల్లకి నా కొడుకు చేత తాళి కట్టించడానికి నేనేమీ గాడిదని కాను"* అని ఓ పదినిముషాలు స్పీచిచ్చి లేచెళ్ళిపోతాడు దాసరి.

ఈలోగా బుచ్చి ఓ ఎఱ్ఱచీర కట్టుకుని, చెవిలో ఓ ఎఱ్ఱపువ్వెట్టుకుని పాటకు రెడీ అయి ఇంట్లోంచి పారిపోతుంది. ఆమె వెనకాలే వెళ్ళిన మోహన్ బాబు కోయదొర శపిస్తాడని భయమేసి పారిపోతాడు. వెంటనే కోయదొర వేషంలో వున్న బుచ్చిబాబు "*ఎఱ్ఱకోక కట్టినావె పిట్టా*" అంటూ పాట పాడేస్తాడు. పాట చివర్లో బుచ్చిబేబీకి ఆ కోయదొర బుచ్చిబాబే అని తెలుస్తుంది. బేబీ, బాబులిద్దరూ కలిసి బాబింటికి చేరతారు. అక్కడ బుచ్చికి చిన్నప్పుడు బొమ్మలపెళ్ళిలో తనని పెళ్ళి చేసుకున్న బాబే ఈ బుచ్చిబాబని తెలుస్తుంది. అన్నట్టు ఈ సీనులో ఏఎన్నార్ వేసుకున్న ఆకుపచ్చ చొక్కా మీదున్న పూలపూల డిజైను నాకు భలే నచ్చేసింది. అలాంటి చీర ఎక్కడైనా దొరుకుతుందేమో చూడాలి.

చివరాఖరి పదినిముషాల్లో...

మోహన్‌బాబు మాట విని అచ్చమ్మ రాజాకి వేరే పెళ్ళి చేయాలీ అనుకోవడం;
పిల్లల ఆస్తి కోసం గుమ్మడి అచ్చమ్మ మీద దావా వేయడం;
ఆస్తి కన్నా అప్పు ఎక్కువ ఉన్నట్టు చూపిస్తే పిల్లలకి ఆస్తి పంచక్కర్లేదని మోహన్‌బాబు చెప్తే చలం ఓ పదిలక్షలు అప్పు తీసుకొచ్చి అచ్చమ్మ చేత ఏవో కాయితాల మీద సంతకాలు పెట్టించడం;
రాజాకి బుచ్చి వాళ్ళమ్మ అచ్చమ్మ చేసిన మోసాలు అన్నీ చెప్పడం;
రాజా పెళ్ళి జరుగుతుంటే బుచ్చిబాబు గీతని అక్కడికి తీసుకొచ్చి పెళ్ళి జరక్కుండా ఆపడం;
పెళ్ళాగిపోగానే ఇంటికి వచ్చిన అచ్చమ్మని చలం “ఈ ఇల్లు అమ్మినట్టు సంతకం పెట్టావు, ఈ ఇల్లిక నీది కాదూ” అని అచ్చమ్మని అటకాయించడం;
అచ్చమ్మకి ఇల్లు కొనుక్కున్నది ప్రభాకర్రెడ్డి అని తెలియడం;
చివరికి రావి కొండల్రావు చేత అచ్చమ్మ చెంపదెబ్బ తింటే కానీ బుద్ధి రాకపోవడం;
సినిమా మొదట్లో కనిపించిన పెద్దల్లుడు కేవీ చలం మళ్ళీ చివర్లో రావడం;
అందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగడం...

ముందే చెప్పినట్లు హిందీ సిన్మా "బావర్చి" నుంచి ప్రధానమైన దినుసు తీసుకుని, దానికి పప్పూ-ఉప్పూ, పులుపూ-బెల్లం, మినుమూ-కిలుమూ, కారం-మసాలాగరం తగిలించి దానారా వండిన దర్శకత్వపు-కిచిడీ, వార్చిన స్క్రీన్‌ప్లే-పులిహోర "బుచ్చిబాబు".

**దాసరి వారి వరసలో ...**

**బావర్చి బిర్యానీ... హొయ్!**
**బావర్చి బిర్యానీ... పులిహోర అయ్యింది**
**నువ్వు వండావా...? నేను వండానా...?**
**దాన్ని నువ్వు వండావా...? దీన్ని నేను వండానా...?**

– అని పాడుకుంటూ నా ఈ కథ కంచికి!

## "రాముడు కాదు కృష్ణుడు".

ఇందులో ఏఎన్నారు ద్విపాత్రాభినయం - రాముడి పాత్రలో ఒదిగిపోయాడు, కృష్ణుడి పాత్రలో ఎదిగి పోయాడు.

రాముడికి జంట రాధిక. కృష్ణుడికి జత జయసుధ.

రామకృష్ణులని కన్నవాళ్ళు నవరసనటనాసార్వభౌమ సత్యనారాయణ, తమిళతాయి సుకుమారి.

ఇందులో దుష్టత్రయం - తల్లి సూర్యకాంతం, కొడుకు రావుగోపాల్రావు, కోడలు రాజసులోచన.

వీళ్ళందరితో పాటు బోల్డన్ని ఆటలో అరటిపళ్ళు - మాటల చివర గాలొదిలే ప్రభాకర్రెడ్డి, మాటలని దొర్లించే గిరిబాబు, మాటలెక్కువ లేని జయమాలిని, మాటవరసకున్నఅల్లు రామలింగయ్య, మమత, జయంతి గట్రా, ఎట్సెట్రా.

సంగీతం కృష్ణ-చక్ర రహిత చక్రవర్తి.

కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం - దాసరి నారాయణరావు 'సిఫ్డా'.

కథాప్రారంభే యథావిధి దాసరి దర్శకత్వ కథనం స్మరామి... యథాశక్తి సిన్మతీ గిద్యం సమర్పయామి!

ఓ ఏఎన్నారు భజన పాటల సోబర్రాముడట
ఇంకో ఏఎన్నారు డిస్కో చిందుల ట్రిక్కృష్ణుడట
రాముడి సీత రాధిక, కృష్ణుడికేమో జత జేసుధ
ఈ డబుల్ కపుల్, డబ్బుల్ కాసుల్ డీఎన్నారుకి సిన్మతీ!

అనగనగా ఓ పెద్ద ఇల్లు. ఆ ఇంట్లో ఓ రాముడు. రాముడి నాన్న బహదూర్ అప్పారావుగారు. ఈయనకి పేకాటాడ్డం, దానాలు చేయడం, హోమీలు ఇవ్వడం హాబీలు. ఈ అప్పారావుకో బావమరిది గోపాల్రావు. ఆ గోపాల్రావుకో భార్య, రాధ అనబడే రాజసులోచన. ఈవిడ ఒకప్పటి ఏఎన్నారు హీరోయిన్ను శాంతినివాసం అనే బ్లాకెండ్వైట్ సినిమాలో. ఇందులో ఈవిడ అప్పారావుకి చెల్లెలు కూడా. గోపాల్రావు, రాధలకి ఓ కూతురు జయమాలిని. ఆస్తి కోసం రాముడికి, జయకి పెళ్ళి చేయాలని ఆశ పడుతూ వుంటారు వాళ్ళ అమ్మా, నాన్న. గోపాల్రావు తల్లి సూర్యకాంతం. ఆవిడ కూతురు కొడుకు గిరిబాబు. వరస ప్రకారం జయమాలినికి రాముడూ, గిరిబాబు బావలౌతారు.

ఇంకా ఆ ఇంట్లో అప్పారావు పెద్దకోడలూ, రాముడికి వదినగారూ అయిన జయంతి, ఆవిడకి పుట్టిన ఇద్దరు మగపిల్లలు కూడా వుంటూ వుంటారు. ఈవిడ భర్త సినిమా మొదలవకముందే కారు ప్రమాదంలో మరణించేసి వుంటాడు. రావుగోపాల్రావే లారీతో గుద్దించి పైకి పంపించేస్తాడట...చివరాఖర్లో అల్లువారు చెప్తారు అలా అని.

ఇక రాముడేమో శ్రీరాం చిట్‌ఫండ్స్ అనే కంపెనీని నడుపుతూ వుంటాడు. రాముడి దగ్గర అల్లు రామలింగయ్య మేనేజర్. రాముడేమో పితృవాక్యపరిపాలకుడు. అన్నిటికీ "నాన్నగారు చెప్పలేదండి" అంటూ వుంటాడు. నాన్నగారు చెప్పి పంపించిన వాళ్ళకి లేని ఉద్యోగాల్ని సృష్టించి ఇస్తూ వుంటాడు.

రాముడి తండ్రి అప్పారావు పేకాటపాపారావావతారం. ఈయన హామీలు, చందాలు, విరాళాలు విరివిగా ఇస్తూ వుంటాడు. వీళ్ళిద్దరూ కలిసి ఆస్తిని కృష్ణార్పణం చేస్తున్నారని రాముడికి తన కూతురు జయనిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్న గోపాల్రావు బాధపడిపోతూ వుంటాడు. అందుకే రాముడు పోస్టింగ్ ఇచ్చే వాళ్ళకి గోపాల్రావు ఊస్టింగ్ ఆర్డర్స్ ఇస్తూ వుంటాడు.

ఇహ రాముడింట్లో ఎలా వుంటుందంటే వాళ్ళ వదిన వరాలమ్మ అంటే జయంతి రాముకి కావల్సినవన్నీ చూస్తూ వుంటుంది. ఆవిడ పిల్లలిద్దరూ పెద్దకబుర్లు చెప్తూ వుంటారు. వాళ్ళ గురించి చెప్పుకోవడానికి అంతకన్నా ఏమీ లేదు.

రాము ఆఫీసులోనే అల్లురామలింగయ్య భార్య మమత కూడా టైపిస్టుగా పని చేస్తూ వుంటుంది. కానీ వాళ్ళిద్దరూ భార్యాభర్తలని ఎవరికీ తెలియనియ్యడు అల్లురామలింగయ్య. ఓ రోజు వాళ్ళిద్దరూ కలిసి ఐస్క్రీం తింటూ వుంటారు. అలా తింటూ అల్లురామలింగయ్య రోడ్డుకవతలి పక్క నించున్న రాధికని చూస్తాడు. ఆయనలా చూడగానే రాధిక కన్ను కొడుతుంది. వెంటనే "భార్యకుంజెప్పడు, తినడు ఐస్క్రీం కప్పుడు..." అన్నట్లు అల్లువారు పరిగెట్టుకుంటూ రాధిక దగ్గరికెళ్ళగానే, ఏవో సైగలు చేసి ఆయన దగ్గర ఓ నూటపదిరూపాయలు పుచ్చుకుని "ఈయనెవడో నా చెయ్యి పట్టుకున్నాడు" అని గొడవ చేస్తుంది రాధిక. నలుగురూ వచ్చి అల్లురామలింగయ్యని చీవాట్లు పెడితే ఆయన మమతతో కలిసి అక్కణ్ణించి వెళ్ళిపోతాడు.

రాధికకో తాగుబోతు నాన్న, ఓ చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్ళు. నాన్న పనేమీ చెయ్యడు. ఇంట్లో వున్న డబ్బాలన్నీ వెతికి డబ్బులు పట్టికెళ్ళి తాగొస్తూ వుంటాడు. ఒక తమ్ముడేమో జ్వరమొచ్చి మంచంలో వుంటాడు. రాధికకి తల్లి వుండదు. వున్నదల్లా ఓ పూరిల్లు, ఓ పుంజీడు సినిమా కష్టాలు. అలా వుండి కూడా రాధిక మంచిమంచి ప్రింటెడ్ షిఫాన్ చీరలు కట్టుకుంటూ వుంటుంది. అదెలా సాధ్యం అనాలోచించే కన్నా దానారా సినిమాల్లో లాజిక్కు కన్నా మేజిక్కు ఎక్కువ అనేసుకుని, సర్దేసుకుని, ఆట్టే ఆపసోపాలు పడకుండా, కళ్ళూ చెవులూ మాత్రం అప్పగించి, ఈ ఒక్కపూటకీ బుఱ్ఱ నాది కాదూ అనేసుకుంటేనే ఈ చిత్రరాజాన్ని ఆస్వాదించగలనూ అని, ఇప్పటికి రాసిన తొమ్మిది సినిమాల తర్వాత కూడా నాకర్థం కాకపోతే ఎలా? ఆయ్! హన్నా!

రాము ఇంట్లో జయంతి ఒక్కతీ ఇంట్లో వున్న అందరికీ వంటలు వండి పెడుతూ, సేవలు చేస్తూ వుంటే సూర్యకాంతం, రాజసులోచన, రావుగోపాల్రావు కూర్చుని తింటూ వుంటారు. అది చూసి రాము వాళ్ళనేమీ అనలేక చాటుగా తిట్టుకుంటూ వుంటాడు.

ఓ రోజు రాము కారెక్కి రివర్స్ చేయబోతూ వుంటే రాధిక కావాలని ఆ కారు కింద పడి దెబ్బ తగిలినట్లు ఏడుస్తుంది. వెంటనే రాము ఆమెని కార్లో ఎక్కించుకుని డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళబోతే మధ్యలోనే కారాపి "మీకెందుకు శ్రమ. డబ్బులిచ్చేస్తే నేనే వెళ్తాను డాక్టర్ దగ్గరికి" అంచెప్పి రాము వెయ్యి రూపాయిలివ్వబోతే వంద రూపాయలు చాలని తీసుకుని కారు దిగిపోతుంది రాధిక ఓ పెద్ద గుఱ్ఱంతోక లాంటి జడేస్కుని. కారు దిగుతూనే పరిగెట్టుకుని పారిపోతుంది. అది చూసి "మోసం" అంటూ నోరు నొక్కుకుంటాడు రాము.

రాము దగ్గర వంద రూపాయలు తీసుకుని ఇంటికొచ్చిన రాధికకి వాళ్ళ తమ్ముడు చనిపోయాడని తెలుస్తుంది. ఆమె వెనకాలే వెతుక్కుంటూ వచ్చిన రాముని చూసి ఏడుస్తూ "మా తమ్ముడి మందుల కోసం నాటకమాడి ఈ వందా తీసుకున్నాను. ఇప్పుడింక ఆ మందులూ, ఈ వందా అక్కర్లేదు" అంటూ ఆ వంద రూపాయలు తిరిగివ్వబోతుంది. అప్పుడు వెంటనే రాము “కష్టాల్లో వున్నవాళ్ళకి సాయం చెయ్యమని నాన్నగారు చెప్పారు” అని ఆమె ఇవ్వబోయిన వందా తీసుకోడు.

ఆ తర్వాత ఆఫీసులో కొన్ని సీన్లు – రావుగోపాల్రావు, అల్లురామలింగయ్య, మమత ఉన్నవి అటు కథ లోనూ కలిసేవి కావు. పోనీ పిట్టకథగా చెప్పుకుని నవ్వుకోవడానికీ పనికొచ్చేవి కావు. సినిమాను ఓ రెండున్నర గంటలు సాగదీయడానికి మాత్రమే వున్నట్లుంటాయి.

ఇహ పేకాటక్లబ్బులో బహద్దూర్ అప్పారావుగారు పేకాడుతూ, తాను పెసరట్లు తింటూ, తనని చందాలు అడగడానికి వచ్చినవాళ్ళకి పెసరట్టు సహిత పాతికవేల చందాలు ప్రసాదిస్తూ వినోదిస్తూ వుంటారు. నాన్నగారి మాట జవదాటని పుత్రరత్నం రాము, అప్పారావుగారు ఒప్పుకున్న చందాలకి సంతకాలు చేసిన చెక్కులు అర్పిస్తూ వుంటాడు. ఈ రకంగా తండ్రీకొడుకులిద్దరూ నాలుగుచేతులా "పరోపకారార్థం మాకున్న పణం" అన్నట్లు దానాలు చేస్తూ వుంటారు. ఇంకో పక్క నుంచి గోపాల్రావు ఏవేవో ఖర్చులని ఖాళీ చెక్కుల మీద అప్పారావు సంతకాలు తీసుకుంటూ వుంటాడు. అలా తెలీకుండానే అప్పారావు తన ఆస్తిని తన రెండు చేజేతులా చేజార్చుకుంటూ వుంటాడు.

అన్నట్టు గోపాల్రావుకి జయ (జైమాల్ని) అనే కూతురుంది కదా! ఆవిడేమో ముక్కురాజు దగ్గర "తకతకతై" అంటూ డాన్స్ నేర్చుకుంటూ వుంటుంది – లలితకళాపోషణకి కాదు శరీరభారశోషణకి. "అమ్మాయికి నాట్యంలో అడుగులు నేర్పగలను కానీ, శరీరంలో అంగుళం కూడా కరిగించలేను" అని గురువు ముక్కురాజు చెప్పగానే జైమాలిన్ని డాన్స్ మానిపించి ఇంటికి తీసుకొస్తాడు గోపాల్రావు. ఇంటికి వస్తూనే ఎదురుగా కనిపించిన రాముని పట్టుకుని ముద్దు పెట్టుకుంటున్న జయని చూసి "పెళ్ళికాని ఆడపిల్లలు అలా చేయడం మర్యాద కాద"ని కోప్పడుతున్న జయంతిని సూర్యకాంతం, రాజసులోచన కలిసి జైమాల్నికి నీతులు చెప్పొద్దని తిడతారు. పైగా జైమాలిన్ని రాము బావ పనులు దగ్గరుండి చూసుకోమని రకరకాల ఐడియాలు ఇస్తారు.

ఇలా చెప్తే అలా అల్లుకుపోతుంది మన జయమాల్ని. ఓ రోజు చీకటి పడ్డవేళ భుజానో సంచీ తగిలించుకున్న రాముడు తలొంచుకుని ఇంట్లోకి రాగానే జయమాల్ని పరుగున వెళ్ళి తలవాకిలి తలుపేసేసి "***బావా! మరి... అన్నం పెట్టమంది అమ్మ***" అంటూ పాడేసి ఆడేస్తుంది. బిత్తరపోయిన రాముణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంది. ఈ పాటలో చక్రవర్తి గారి దరువుల బీటుకి జయమాల్ని చిందులు బల్ కనువిందులు. రాముడిగా ఏఎన్నారు చేసిన బెదురేక్షన్‌కి ఎదురే లేదు.

ఇలా హుషారుగా పాట సాగిపోతున్న వేళలో రాముడి వదిన వరాలమ్మ (జయంతి) వచ్చి జయమాలిన్ని "పెళ్ళి కాని ఆడపిల్ల మగవాళ్ళ దగ్గర ఎలా ప్రవర్తించాలో నేర్చుకో" అని చీవాట్లేస్తుంది. అత్తెల్సిన మామ్మ సూర్యకాంతం, అమ్మ రాస్సులోచన జయమాలిన్ని ఓదారుస్తారు. అంత డాన్సు చేసినా రాముడిలో చలనం లేదని విన్న మామ్మ ఓ భలే డైలాగంటుంది "దశరథ మహారాజు సంతానం కదా...పాల్రాయి మనుషులూ" అంటూ...అంటే అర్థమేమిటో?

ఈలోగా రాము ""కష్టాల్లో వున్నవాళ్ళకి సాయం చెయ్యమని నాన్నగారు చెప్పారు" అని ఇంతకు రెండు సీన్ల ముందు చెప్పిన డైలాగే మళ్ళీ చెప్తూ సరుకులు కొనుక్కొచ్చి రాధిక ఇంట్లో వేయిస్తూ వుంటే, ఎంచగ్గా ఫేషియల్ చేసి, ఐ-బ్రోస్ దిద్దిన కడిగిన ముత్యంలా వున్న ఆ పేదింటి రాధిక "నాకు మీ ఇంట్లో ఏమన్నా పనిప్పించండీ" అంటుంది. అన్నట్టుగానే వచ్చి జయంతికి సహాయంగా వుంటానని పనిలో చేరుతుంది. అందరికీ మాటల్తో వాతలు పెడుతూ జయంతి వండినవి వడ్డిస్తూ వుంటుంది. ఆ ఇంట్లో రాధికని చూసి గిరిబాబు ఇష్టపడితే, అల్లువారు మొట్టమొదట్లో రాధిక వల్ల చీవాట్లు తిన్న సీను గుర్తు తెచ్చుకుని ఇబ్బంది పడతారు. మొత్తానికి రాధిక ఆ ఇంట్లో చేదోడు-వాదోడుగా, చలాకీగా పని చేసేస్తూ వుంటుంది. జయంతి కొడుకులు, అదే ఆ చిన్న చిన్న అబ్బాయిలు, రాముడేఎన్నారు, రాధికలని "మీరిద్దరూ ఖాళీగా వున్నారు, పెళ్ళి చేసుకోండి" అంటూ పెద్దకబుర్లు చెప్తూ వుంటారు.

ఓ రోజు రాము దగ్గరికి రాధిక వాళ్ళ నాన్నొచ్చి ఇంట్లో కష్టంగా వుందని చెప్పి వెయ్యి రూపాయలు అడిగి తీసుకురమ్మందని చెప్పగానే రాము "నాన్నగారు చెప్పలేదండి" అనకుండానే ఇచ్చిన వెయ్యిరూపాయలు తీసుకుని వెళ్తుండగా తనకి ఎదురొచ్చిన రావుగోపాల్రావుకి తన

కూతురు రాధిక, రాముడేఎన్నారూ ప్రేమించుకుంటున్నారని చెప్తాడు. అది విన్న రావుగోపాల్రావు ఇంటికొచ్చేసి తన బావప్పారావుకి (సత్యనారాయణ) రాధిక మంచిది కాదని చెప్పి ఇంట్లోంచి పంపించేసేలా చేస్తాడు.

రాధికని ఇంట్లోంచి పంపించేశారని తెలిసిన రాము, ఆమె ఇంటికి భుజానున్న బాగ్గుతో సహా వెళ్ళి "మీకోసం ఆ ఇల్లు విడిచి రమ్మన్నా వచ్చేస్తాను" అంటూ ఆవేశ పడతాడు. వెంఠనే రాధిక కల గనేస్తుంది "***మంచు ముత్యానివో ...హంపి రతనానివో...తెలుగు వాకిట వేసిన ముగ్గువో...ముగ్గు నడుమన విరిసిన ముద్దబంతి పూవువో...***" అంటూ కంఠానికి ఓ బౌ పెట్టుకున్న రాముడేఎన్నారు నటరాజస్వామి విగ్రహం ముందు, గంటల కింద, బంతిపూలు పరిచిన ముగ్గులు తొక్కకుండా మరీ నడుస్తూ పాట పాడినట్లు, తానాటాడినట్లూ. ఈ పాటలో కనడానికాట్టే ఏం లేదు కానీ వినడానికి బావుంది.

రాధికతో పాట పాడేసి ఇంటికొచ్చిన రాముడేఎన్నారుని నాన్నప్పారావు చీవాట్లెట్టి, ఇంకెప్పుడూ అలా రాధికింటికెళ్ళొద్దని, రాము పెళ్ళి రాధికతో కాకుండా తనిష్టప్రకారం జరుగుతుందని గట్టిగా చెప్తాడు. ఈలోగా రావుగోపాల్రావు అమ్మా, ఆలిలతో కలిసి తన కూతురు జయమాలిన్ని ఆ రాత్రి రాముడి గదిలోకి పంపిద్దామనుకుంటాడు. చాటుగా వుండి అది విన్న గిరిబాబు వెళ్ళి రాము పక్కన పడుకుంటాడు. అర్ధరాత్రి వేళ రాధిక రాముడికి ఫోన్ చేస్తుంది "మా నాన్న నన్నెవడికో ఇచ్చి తెల్లారగానే పెళ్ళి చేస్తానంటున్నాడు. నువ్వొచ్చి నన్ను రక్షించూ..." అంటూ. రాముడటు లేచి రఫీ-రఫీగా వెళ్ళగానే జయమాలినిటు రాము గది లోకి రాముడున్నాడనుకుని వస్తుంది "బావా!" అంటూ. ఆవిణ్ణక్కడా ట్విస్టులో వదిలేసి నేను సిన్మాలో ముందుకెళ్ళిపోయా.

తీరా అంత అర్ధరాత్రీ వున్నపళంగా నడుచుకుంటూ రాధిక ఇంటికెళ్ళిన రాముడికి గుర్తొస్తుంది ఆవిడ ఇంటి గడప తొక్కనని తన తండ్రప్పారావుకిచ్చిన మాట. వెంటనే రాధిక పిలుస్తున్నా వినిపించుకోకుండా వెనక్కి తిరిగి మళ్ళీ నడుచుకుంటూ ఇంటికొచ్చేస్తాడు.

ఈలోగా రాము గదిలో కలిసున్న గిరిబాబు, జైమాలిన్లను చూసి జయంతి నిర్ఘాంతపోయి, దిగ్భ్రమ చెంది, అప్రతిభురాలవుతుంది. ఆవిడలా నిర్ఘాంతపోయి దిగ్భ్రమ చెంది అప్రతిభురాలయ్యిందన్న విషయాన్ని జైమాల్ని నాన్న రావుగోపాల్రావుకి చెప్తుంది. రావుగోపాల్రావు ఆ తర్వాతేం చెయ్యాలో ఆలోచించుకోవాలి కదా! అందుకే ఈలోగా జయసుధ వున్న సీను మొదలవుతుంది.

జయసుధ ఓ తెల్ల చొక్కా, నల్ల పాంటూ వేసేస్కుని వ్యాపారం తప్ప ఇంకేమీ తెలియని డేడీ ప్రభాకర్రెడ్డికి పాపులర్ డిస్కో డాన్సర్ కృష్ణ చేయబోయే డిస్కో డాన్స్ చూడ్డానికి క్లబ్బు కెళ్తున్నానని చెప్తుంది. ఆ తర్వాతి సీన్లో డిస్కో లైట్ల వెలుగులో ఏఎన్నారు "***ఒక లైలా కోసం...తిరిగాను దేశం***" అంటూ పాడుతూ డ్రిల్లుడాన్సు మొదలు పెట్టగానే జయసుధ తను కూడా ఆ స్టేజ్ మీద డాన్సు చేసేస్తున్నట్లు కల కంటుంది.

నాకు ఈ పాట వినడానికి భలే ఇష్టం. చూడ్డానికి ఇంకా సరదా... ఇదొక డ్రిల్లూ-కం-చెమ్మచెక్కా తరహా కన్-ఫ్యూజనైజ్డ్ డిస్కో డాన్స్. కానీ ఇది చేసింది మన ఏఎన్నారు కాకపోతే బోర్ కొట్టేదేమో...చక్రవర్తి డేంగ్-డేంగ్ బీటుకి, ఏఎన్నారు బేంగ్-బేంగ్ ఆటకి భలే కుదిరింది. అసలు నేనీ సిన్మా చూడాలనుకుందే ఈ "***లైలా కోసం***" పాట కోసం...

పాటాగిపోయి జయసుధ కల లోంచి మెలకువ లోకి వచ్చేటప్పటికి అమ్మాయిలందరూ డిస్కో డాన్సర్ కృష్ణ చుట్టూ మూగి ఆటోగ్రాఫులు తీసుకుంటూ వుంటారు. ఓ అమ్మాయైతే ముద్దు కూడా పెడుతుంది. వెంటనే కృష్ణుడేఎన్నారు ఆ అమ్మాయిని కొట్టిన చిరుచిలిపి దెబ్బ తర్వాత్తర్వాత అక్కినేని వారి వారసత్వపు దెబ్బేమో అనిపించింది. మరీ ట్రివియా అంటూ విసిగించను ఇక్కడ. ఈవీవీ గారి "హలో బ్రదర్" సిన్మాలో నటసామ్రాట్టుగారి వారస్సామ్రాట్టు ద్విపాత్రాభినయం చేస్తూ, ఓ పాత్రలో అమ్మాయిల్ని వెనకాల కొడుతూ వుంటాడు. అది గుర్తుకొచ్చి దాసరి వారు చూపిన బాట శిష్యులు అనుసరించారన్న మాట అనుకున్నా.

సరే! అమ్మాయిలందరూ కృష్ణుడేఎన్నారు చుట్టూ మూగడం చూసిన జయసుధ ఉడుక్కుని, ఉక్రోష పడి, ఆ రోషంతో "ఐ హేట్ యూ!" అని ఓ కాయితమ్మీద రాసి కవర్లో పెట్టి కృష్ణ ఇంటికొచ్చి అతని తల్లి సుకుమారి చేతిలో పెట్టి "మీ అబ్బాయికివ్వండి" అని చెప్పి వెళ్ళిపోతుంది. తల్లిచ్చిన ఆ నోటుని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్న కృష్ణుడేఎన్నారు చదువుకుని కూల్‌గా నవ్వుకుంటాడు.

ఇంతలో ఇక్కడేమవుతూ వుంటుందంటే జైమాల్ని నెల్తప్పిందని ఇంటికొచ్చిన డాక్టర్ రావుగోపాల్రావు & కో కి చెప్తాడు. అసలు విషయం తెలియని బావప్పారావు జయమ్మకి ఏమయిందని అడిగితే రాముడు పెళ్ళి చేసుకోవట్లేదని నిద్రమాత్రలు మింగిందని చెప్తాడు రాగోరావు.

ఆ మాట వినగానే బావప్పారావు వెంటనే రాము, జయమ్మల పెళ్ళికి ముహూర్తాలు పెట్టిస్తానంటాడు. అది తెలిసిన రాము దిగులుగా వుంటే వదిన వరాలమ్మ ఒచ్చి "నువ్వు జయమ్మని పెళ్ళి చేసుకుంటే నేను చచ్చిపోతాను" అని ఏడుస్తుందేంటో? ఆవిడలా ఏడుస్తూ వుండగా మామ్మ సూరేకాంతం ఇంటిల్లిపాదినీ రాము గది లోకి తీసుకొస్తుంది. మామ్మ కూడా వచ్చిన మామప్పారావు "ఆయ్! నా కొడుక్కి నేను పెళ్ళి చేద్దామనుకుంటే నువ్వు చచ్చిపోతానంటావా? హన్నా!" అని గాలిగా కేకలేస్తాడు.

అంతే! తెల్లారేటప్పటికల్లా వరాలమ్మ తనిద్దరు పిల్లల్నీ తీసుకుని ఓ ఉత్తరం రాసి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోతుంది. ఆ పళంగా రాముడేఎన్నారు కూడా తెల్ల చొక్కా, తెల్ల పాంటూ వేసుకుని ఓ ఆకుపచ్చ సూట్కేసు పట్టుకుని "నా తల్లి లాంటి వదిన లేని ఇంట్లో నేనుండనని" వెళ్ళిపోతుంటే నాన్నప్పారావు ఇంకా ఇంటితో రాముకి ఏ సంబంధం లేదని కాయితమ్మీద సంతకం చేయించుకుని మరీ పంపేస్తాడు.

సూట్కేసు పట్టుకుని రాముడేఎన్నారు సరాసరి రాధిక ఇంటికి వెళ్తాడు. తీరా అక్కడికెళ్ళాక రాధిక వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికో వెళ్ళిపోయారని తెలుస్తుంది.

ఇహ పోతే ఎడం చేతికి తెలీకుండా కుడి చేత్తో, కుడి చేతికి తెలీకుండా ఎడం చేత్తో దానాలు, ధర్మాలు, చందాలు, పేకాట్లు, పెసరట్లూ అంటూ ఎడా-పెడా ఖర్చులు పెట్టిన బహద్దూరు అప్పారావు కాస్తా బలాదూరు అప్పారావు అయిపోతాడు. అప్పులవాళ్ళు అప్పారావు డబ్బులియ్యాలీ అంటూ ఇంటి చుట్టూ మూగుతారు. అప్పుడు బావమరిది రాగోరావు "ఈ అప్పులవాళ్ళ నుంచి నీ ఆస్తిని కాపాడుకోవాలంటే నీ చెల్లెలైన నా భార్య రాస్సులోచన పేర్న రాసేయ్. నువ్వేమో పిచ్చివాళ్ళా నటించెయ్, బావా!" అని సలహా ఇస్తాడు. పాపం! ఆ భోళాప్పారావు బావమర్ది చెప్పినట్లే చేస్తాడు. అప్పులాళ్ళందర్నీ తన పిచ్చేక్షన్‌తో భయపెట్టి తరిమేస్తాడు.

ఆ తర్వాత బావప్పారావు “పొద్దునొచ్చిన అప్పులాళ్ళు ఏమంటున్నారని” అడిగితే అప్పటికే ఇల్లూ, ఆస్తి అంతా తన పేర రాయించేసుకున్న బావమర్ది రాగోరావు "ఏ అప్పులాళ్ళు బావా? నీకేదో నిజంగా పిచ్చి పట్టినట్టుంది" అంటూ తీసుకెళ్ళి ఓ ఇంట్లో బంధిస్తాడు. పూట పూటకీ తిండి మాత్రం పెడతానంటాడు. ఓ దుడ్డుకఱ్ఱ వాణ్ణి కాపలాగా పెడతాడు.

తర్వాతి సీనులో కృష్ణుడేఎన్నారు ఓ స్కూటరెక్కొచ్చి మేడ మీదున్న జయసుధకి ఓ లెటర్ పంపించి "ఐ వాంట్ రిప్లై. పార్కులో ఎదురు చూస్తుంటాను" అని చెప్పి వెళ్ళిపోతాడు. అది చదువుకుని జయసుధ పరిగెట్టుకుంటూ పార్కుకెళ్తుంది.

అక్కడేమో జయసుధ కోసం ఎదురు చూస్తున్న కృష్ణుడేఎన్నారుని చూసిన ఆడవాళ్ళు "నువ్వు డిస్కో డాన్సర్‌వి కదా, నువ్వంటే మాకిష్టం" అంటూ పలకరిస్తూ వుంటారు. అది చూసి జయసుధ అలుగుతుంది. వెంటనే కృష్ణుడేఎన్నార్ "ఇహహ్హాహ్హా" అని నవ్వుతాడు. ఎఱ్ఱ ఆకాశం కింద "***ఒక సంధ్యా సమయాన దిక్కుతోచక నే దిక్కులన్నీ చూచుచుండా***" అంటూ మొదలు పెట్టి "***చూసాక నిను చూసాక... ఆగలేక... మనసాపుకోలేక రాసాను ఒక లేఖ***" అంటూ భలే పాట మొదలెట్టేస్తాడు. ఈ పాట వింటూనే నా చెవులు ఆనందంతో విచ్చుకున్నాయి. "అరె! ఇదిందులోనా?" అని మురిసిపోయా. డీఎన్నారు సిన్మాల్లో మాటలు కళ్ళు తిరిగేలా చేస్తే పాటలు మాత్రం చెవులు వెలిగేలా చేస్తాయి.

సిన్మాల్లో వచ్చే పాటలు సందర్భానికి తగినట్లు రాసేవి కొన్నైతే, సందర్భమే లేకుండా వచ్చేవి ఎన్నో. కానీ పాట కోసం సందర్భం సృష్టించడం మాత్రం దాసరివారి సిన్మాల్లో ప్రత్యేకత. ఇదిగో ఈ "***చూషాక***" పాట అలాంటిదే. ఇలాంటి పాటే "బుచ్చిబాబు" సినిమాల్లో కూడా వుంది. "***ఉత్తరాల తోటలో***" అన్న పాట కోసం కూడా ఓ ఉత్తరం చింపి చదివే సందర్భం సృష్టించబడుతుంది. అన్నిటికన్నా క్లాసిక్ ఏంటంటే "ఏడంతస్తుల మేడ" సిన్మాలో "***అరటిపండు వలిచి పెడితే తినలేని చిన్నది***" అంటూ హీరో చిందేయడానికి హీరోయిన్ చేత అరటిపండు తినలేనని అనిపించడం అద్భుత సృజనాత్మక సృష్టి. నాకు మాత్రం దాసరి సినిమాల్లో పాటలు భలే ఇష్టం.

పాటల గురించి చెప్పడం మొదలెట్టానంటే నా రాత దారి తప్పి ఎటో పోతుంది. సరిసరి! ఇప్పటికీ పాట మాటకొస్తే సముద్రపొడ్డున, సరివి తోటల్లో కృష్ణుడేఎన్నారు, జేసుధ జోరుగా-హుషారుగా చేసిన డాన్సు నాకు భలే నచ్చింది. అన్నట్టు రెండో చరణం ముందు కాసేపు పరిగెట్టాక ఒక చిన్న కొలను లాంటి దాని ముందు స్టెప్పులేస్తారు ఏఎన్నారూ, హీరోయిన్నూ. ఆ కొలనో, ఆ కొలను తాలూకు కవల-కొలనో నేనింతకు ముందు చూసిన "స్వయవరం", "రాగదీపం" సినిమాల్లో కూడా వున్నట్టూ, చూసినట్టూ గుర్తు. అది దాసరి వారికి నచ్చొచ్చి అచ్చొచ్చిన చెఱువేమో!

పాటవుతూనే జయసుధ పుట్టినరోజు పార్టీ. కృష్ణుడేఎన్నారు ఓ మోటర్‌సైకిలేసుకుని, వంటిమీద ఓ జెర్కినేసుకుని, నోట్లో సిగరెట్టెట్టుకుని ఎరైవలు. మళ్ళీ బోల్డు మంది అమ్మాయిల కంట ఆయన పడి, ఆయన వెంట అమ్మాయిలు పడి ఓ పెద్ద హడావిడి. ఓ మంచి డిజైనర్ చీర కట్టుకుని, చెవులో ఓ పసుప్పచ్చ పువ్వెట్టుకుని జయసుధ బావుంది కానీ ఆ పువ్వు చెవులో కాకుండా జళ్ళో వుంటే నాకింకా నచ్చేది.

సరే! బర్త్‌డే బేబీ జయసుధ డేడీ ప్రభాకర్రెడ్డికి కృష్ణుడేఎన్నారుని పరిచయం చేస్తుంది ఏదో పెద్ద బిజినెస్ వుంది ఈ కృష్ణకీ అని. ఇంతలో పార్టీ కొచ్చిన ఇంకెవరో కృష్ణుడేన్నారుని చూసి రాముడేఎన్నారనుకుని "బాబూ1 నువ్వు కాకినాట్లో వుండే బహదూర్ అప్పారావుగారి అబ్బాయివి కాదూ?" అంటూ పలకరిస్తారు. ఈ ఎదురుకోళ్ళు, పలకరింతలూ, పరామర్శలూ జరుగుతున్నంత సెపూ కృష్ణుడేన్నారు చేతిలో సిగరెట్టు ఊదుతూ, ఊపుతూనే వుంటాడు.

ఈలోగా జయసుధ ఫ్రెండ్స్ మెడ మోయలేనంత దండలేసి దండిస్తారు. పుట్టినరోజు పాటలు పాడతారు. ఈలోగా కృష్ణుడేన్నారు ఏం చేస్తాడంటే అంతకు ముందు పలకరించిన పెద్దాయన దగ్గరికెళ్ళి తెలివిగా కాకినాడప్పారావుగారి ఎడ్రెసూ అదీ కనుక్కుంటాడు.

తర్వాతి సీనులో రాముడేఎన్నారు ఓ కారు కింద పడి దెబ్బ తగిలించుకుంటే కృష్ణుడేఎన్నారు తీసుకొచ్చి హాస్పిటల్లో చేరుస్తాడు. స్పృహలోకొచ్చి కళ్ళు తెరిచిన రాముడితో కృష్ణుడు "నువ్వూ నేనూ ఒకేలా వున్నామూ, నాకు తండ్రి లేడు, నీకు తల్లి లేదు, సో మనిద్దరం మన అమ్మానాన్నలకి పుట్టిన అన్నదమ్ములం" అని భలే చిక్కుముడి విప్పేస్తాడు సిగరెట్టూదేస్తూ. రాముణ్ణి తీసుకెళ్ళి తల్లి సుకుమారికి సిగరెట్టూదుతూనే చూపించి ఆవిడకి గతం గుర్తు చేస్తాడు. నాకేమో భలే భయమేసింది. అసలే ఏడుస్తున్న సుకుమారికి తెగ ఊదేస్తూ, ఊపేస్తున్న సిగరెట్టు వాత పడి ఇంకా ఏడ్చేస్తుందేమో అని. అలాంటివేమీ జరగలేదులెండి.

ఇంతకీ సుకుమారి ఫ్లాష్‌బాక్ సారాంశం ఏంటీ అంటే "తుఫానులో పొలం, పంటా పోగొట్టుకున్నామూ, నీ సాయం కావాలీ" అని అత్తా-భర్తా సహిత-సత్తెన్నారాయణ సహోదరి రాస్సులోచన అన్నగారింట చేరుతుంది. వాళ్ళు రాగానే అన్నప్పారావు (సత్యనారాయణ) పెట్టె సర్దుకుని హైద్రాబాదు వెళ్తాడు. ఈలోగా చంబల్లోయ నుంచి పారిపోయి వచ్చినవాడిలా వున్న, ఓ తుపాకీ గుండు తగిలిన బావ సుకుమారి దగ్గరికొచ్చి కట్టు కట్టించుకుని, అన్నం ముద్దలు పెట్టించుకుని వెళ్ళిపోతాడు. సత్యనారాయణ ఇంటికి రాగానే ఆ చంబల్ లోయ బావ గురించి చెప్పి సుకుమారిని ఇంటినుంచి వెళ్ళగొట్టిస్తారు రాస్సులోచన ఎండ్ కో.

ఆమెకి పుట్టిన ఇద్దరు మగపిల్లల్నీ ఆమెతో పంపించమూ అని చెప్పి చూలింత సుకుమారిని ఇంట్లోంచి పంపించేస్తే, ఆవిడకి ఆ తర్వాత పుట్టినవాడే ఈ ఖుషీ-కృష్ణుడేఎన్నారు. తన తల్లి కథ వినగానే రాముడేఎన్నారు ఆవిడని పంపించేసినట్లే అభాండాలు వేసి తన వదిన జయంతిని కూడా ఇంట్లోంచి పంపించేశారు అని చెప్తాడు.

అది వినగానే కృష్ణుడేఎన్నారు కృష్ణుడి-ఎడ్వాంటేజెస్, రాముడి-డిజెడ్వాంటేజెస్ మీద ఓ పెద్ద లెక్చరిచ్చి "రాముడు దెబ్బ తిన్నాడు, కృష్ణుడు దెబ్బ తీస్తాడు" అన్న స్లోగన్‌తో బయల్దేరి అమ్మ-సుకుమారిని తీసుకుని నాన్నప్పారావు ఇంటికి వెళ్తాడు.

ఇహిక్కణ్ణించీ...చివరాఖరి గంటా... గబగబా చెప్పేస్తానంటా..

నాన్నప్పారావు తనకు రావల్సిన ఆస్తిని అప్పుల పాల్జేశాడని కోర్టులో కేసేస్తానని కేకలేస్తున్న కృష్ణుడిని రావుగోపాల్రావు మంచి చేసుకోవడానికి ప్రయత్నించడం...
రావుగోపాల్రావు ఎత్తులకి కృష్ణుడు పైయ్యెత్తులు వేయడం...
రోడ్డు పక్కన బూట్‌పాలిష్ చేస్తున్న జయంతి కొడుకులు కృష్ణుడేఎన్నారుని చూసి రాముడేఎన్నారు అనుకుని వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళడం...
జయంతినీ, పిల్లల్నీ తీసుకుని కృష్ణుడేఎన్నారు తన ఇంట్లో వున్న రాముడేఎన్నారు దగ్గరికి చేర్చడం...
ఈలోగా సత్యన్నారాయణ తనని రావుగోపాల్రావు బంధించిన ఇంట్లోంచి బయటపడడం...
రాముడేఎన్నారు సితార్ హుషారుగా వాయించకుండా లాగడం, అది చూసి కృష్ణుడేఎన్నారు నీ బాధేంటని అడగడం...
రోడ్డు మీద కారెక్కబోతున్న కృష్ణుడేఎన్నారుని చూసి రాముడనుకుని రాధిక వాళ్ళ నాన్న రాధిక ఎక్కడుందో చెప్పడం...
కృష్ణుడు రాధికని కూడా తీసుకెళ్ళి తనింట్లో రాముడూ, జయంతి దగ్గర చేర్చడం...
రాముడేఎన్నారుకీ, రాధికకీ పెళ్ళి చేయాలనుకోవడం...
వాళ్ళిద్దరూ కలిసి "**అందమంతా అరగదీసి...వంటి నిండా పూసి పూసి... కన్ను మూసి తెరిచి చూస్తే... పిల్ల జిల్లుమన్నాదిరో...ఓ....ఓ....ఓ....వళ్ళు జల్లుమన్నాదిరో**" అనే భజన-పరసకి తాళమేసి చిందెయ్యడం...
ఔరా! హుషారుగా "***నవ్వింది మల్లెచెండూ***" అని పాడుతున్న చిరంజీవితో సమానంగా స్టెప్పులేసిన లండనమ్మాయి అభిలాష-రాధిక ఈ ఏఎన్నార్హీరోయిన్నూ రాధిక ఒకరే?! అని నా ముక్కున వేలేసుకుని నే హాచ్చెర్యపోవడం....
ఆ తర్వాత రాముడు-రాధికల పెళ్ళిలో భోంచెయ్యడానికి ఆకలేస్తున్న బీద-బహదూర్ అప్పారావు రావడం...
తన వాళ్ళందర్నీ కలుసుకోవడం...అందరూ ఎవరి ఫ్లాష్‌బాకులు వాళ్ళు చెప్పేసుకోవడం...
కృష్ణుడూ-జయసుధా, ప్రభాకర్రెడ్డి నాటకమాడి రావుగోపాల్రావుకి పిచ్చెక్కేలా చేసి సత్యన్నారాయణ ఆస్తి వెనక్కొచ్చేలా చేయడం...
అన్నట్టు మర్చిపోయా...కృష్ణుడేఎన్నారు-జయసుధ కలిసి "***తల నిండా పూలు పెట్టుకుని***" అంటూ ఏదో పాట పాడేస్కుని ఆడేస్కోవడం...
మధ్యలో కొన్ని పాత్రలెగిరిపోవడం (రాధిక చెల్లెలూ, తమ్ముడూ ఎక్కడ తప్పిపోయారో ఏమో పాపం!)
మొత్తానికి దాసరి వారి స్క్రిప్టులో ట్రిక్కులతో, ట్విస్టులతో నా హెడ్డు గిరగిరా టర్నైపోవడం...

నేనిది రాసేయడం...
ఓపికున్న వాళ్ళు చదివేయడం...
లేనివాళ్ళు ఓ సారి పైనుంచి కిందకి చూసి ఒదిలెయ్యడం...

***"ఒక లైలా కోసం" - డేంగ్...డేంగ్...***
***అయ్యాను శాక్రిఫైసం - డేంగ్...డేంగ్...***

*అది చూశా...ఇది రాశా...*

*రాసి... రాసి...అలిసిపోయా...*

## "ప్రేమాభిషేకం".

డీఎన్నారు సినిమాల్లో థియేటర్లో చూసినట్లుగా గుర్తున్నదీ, నాకెంతో నచ్చినదీ ***ప్రేమాభిషేకం***. ఇందులో అన్ని పాటలూ బావుంటాయి. ఆ పాటలకి ఏఎన్నారూ, శ్రీదేవీ, జయసుధా ఆడిన ఆటలూ బావుంటాయి. వాళ్ళ ముగ్గురికీ దాసరి రాసిన మాటలూ బావుంటాయి. మళ్ళీ ఇన్నేళ్ళకి చూసినా అంతే బాగా నచ్చేసిందీ ఈ సిన్మా. నా వరకు ***ప్రేమాభిషేకం*** రెసిపీ కొంచెం మారినా ఎంచక్కగా కుదిరిన ఓ మంచి ఇంగువ పోపేసిన వంటకం. గతకాలంలో ఇంత మంచి శతదినోత్సవ చిత్రం తీసిన డీఎన్నారు గారి కోసం ఓ సిన్మతీ గిద్యం:

బెంగాలీ దేవదాసుని మించు ఈ తెలుగోరి దేవీదాసు
పార్వతి దేవి ఆయె, చంద్రముఖి జయంతి లాగాయె
గ్లాసు పట్టి వలపు-నటసామ్రాట్టాయె ఏఎన్నారు
ప్రేక్షక నాడి పట్టి గెలుపు-హిట్టు గొట్టె డీఎన్నారు సిన్మతీ

నా మటుక్కి నాకు ఈ ప్రేమాభిషేకానికి ఇన్స్పిరేషన్ వేదాంతం వారి "దేవదాసు" అన్నట్లే అనిపించింది. కాకపోతే దేవదాసుకి ప్రేమ విఫలమై తాగి జబ్బు పడ్డాడు. "ప్రేమాభిషేకం" లోని దేవీదాసు జబ్బు పడి ఫలించిన ప్రేమని అందుకోలేక తాగాడు.

**<u>ప్రేమాభిషేకంలో తడిపి తరింపజేసినవాళ్ళు:</u>**

ప్రేమాభిషేకం చేయించుకున్న దేవిగా శ్రీదేవి.
అమ్మానాన్నలు లేని శ్రీదేవికి అన్నా-బామ్మలుగా మోహన్‌బాబు, నిర్మలమ్మ. తమ్ముడుగా హరీష్.
డాక్టర్ మోహన్‌బాబుకి మెడికల్ రిప్రెజెంటేటివ్ స్నేహితుడిగా మురళీమోహన్.
దేవికి ప్రేమ పూజారి, దేవీదాసు రాజేష్‌గా ఏఎన్నారు.
రాజేష్ అమ్మా-నాన్నలు పుష్పలతా-ప్రభాకర్రెడ్డిలు.
రాజేష్‌కి డాక్టర్‌గా గుమ్మడి.
సినిమాలో చాలా సేపే వున్నా "స్పెషల్ అప్పియరెన్స్" గా కార్డ్ వేయించుకున్న జయంతిగా జయసుధ.

ఇంకా ఎవరున్నారంటే... బాంబే నుంచొచ్చిన టున్‌టున్ (ఈ సిన్మాలో టుమ్ టుమ్ అయింది), ఓ రెండో మూడో సీన్లలో కనపడి చెప్పాపెట్టకుండా మాయమైపోయిన మాడా.

జయసుధ కేశాలంకరణకి కమల లేదు. అక్కినేని-శ్రీదేవిల దుస్తుల దర్జీ బాంబే కచ్చిన్స్. అసోసియేట్ డైరెక్టర్ డిమిట్రావ్. నృత్యాలు సలీం. సంగీతం కృష్ణ-చక్ర సహిత చక్రవర్తి.

క. స్క్రీ. మా. పా. ద...దా. నా. రా., SIFDA.

సినిమా మొదలవుతూనే తెర మీద రెండు కార్లు – ఒహ తెల్లది, ఇంకొహ ఎఱ్ఱది. ముందు వెళ్ళే తెల్ల దాంట్లో శ్రీదేవితో పాటు ఇంకొకావిడ. వెనకాలొచ్చే ఎఱ్ఱ దాంట్లో ఓ చేత స్టీరింగు, ఇంకో చేత సిగరెట్టు పట్టుకున్న సవ్యసాచిలా ఏఎన్నారు.

శ్రీదేవేమో ఎయిర్‌హోస్టెస్ అట. ఆవిడెక్కొచ్చిన తెల్ల ఎంబాసడర్ కార్ "ఆర్" ఎగిరిపోయిన ఇండియన్ "ఎయి" లైన్స్ వారిది. కారు దిగిన శ్రీదేవి అక్కడ కనిపించిన తన అన్న స్నేహితుడైన మురళీమోహన్‌కి తను బాంబే వెళ్తున్నానని చెప్పి, తన అన్నకివ్వమని ఇంటి తాళాలిస్తుంది. అచ్చొసి నాగేశ్వర్రావ్ మురళీమోహన్ తనక్కూడా ఫ్రెండే కాబట్టి అతన్ని శ్రీదేవి గురించి వివరాలూ, విశేషాలూ అడిగి తెలుసుకుంటాడు. ఆ తర్వాత శ్రీదేవి బాంబే నుంచి తిరిగి వచ్చే రోజేదో తెలుసుకుని ఆమెని రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకి వెళ్తాడు ఏఎన్నార్. తానెప్పుడూ వెళ్ళే వేన్ వుందని చెప్పి ఏఎన్నార్‌తో రానని చెప్తుంది శ్రీదేవి.

శ్రీదేవితో పాటు వేన్‌లో టున్ టున్ కాక ఇంకో నలుగురు ఎయిర్ హోస్టెస్సులు వుంటారు. శ్రీదేవి తప్ప మిగిలిన ఐదుగురూ ఎయిర్ హోస్టెస్సుల్లా కాక మాట్నీ సినిమా చూసి, ఆ తర్వాత కూరలు కొనుక్కొద్దామని హేండుబేగ్గులు తగిలించుకొచ్చిన వాళ్ళలా వుంటారు. వాళ్ళెలా వుంటే ఏం గానీ...నాదీ, ఏఎన్నారుదీ ఆసక్తి శ్రీదేవి పైన. ఎక్స్ట్రార్డినరీ శ్రీదేవి ముందు ఇంకెవరూ ఎలాగూ ఆనరు. కాబట్టి ఆట్టే పట్టించుకోవక్కర్లేదు. డీఏన్నారుదీ అదే అభిప్రాయమేమో! అందుకే ఎక్స్ట్రా హోస్టెస్సుల ఆహార్యాలు ఆర్డినరీగా వదిలేశాడు.

శ్రీదేవీ బృందం ఎక్కిన వేన్ దార్లో ఆగిపోతే ఆ వేన్‌నే వెంబడించి వస్తున్న ఏఎన్నార్ కార్లో ఎక్కి, తమ ఇళ్ళు ఎక్కడో ఏఎన్నారుకి తెలీకూడదని మధ్యలోనే దిగిపోయి వేరే టేక్సీ ఎక్కుతారు శ్రీదేవి, టున్ టున్. టేక్సీలో వెళ్తున్నప్పుడు టున్‌టున్‌కి మరసటి రోజు తన పుట్టినరోజు అని చెప్తుంది శ్రీదేవి. తన ఇంటి దగ్గర టేక్సీ ఆగగానే టేక్సీ డ్రైవర్‌కి డబ్బులిచ్చి ఇంట్లోకి వెళ్ళిపోతుంది శ్రీదేవి. శ్రీదేవి చూస్కోదు కానీ సిన్మా చూస్తున్నవాళ్ళకి ఆ టేక్సీ డ్రైవర్ ఏఎన్నార్ అని తెలుస్తుంది. అదెలా? అనడక్కూడదు. ***ఎందెందు వలసిన అందందే వుండగలడు – అక్కినేని సర్వోపగతుండు దాసరి సినిమాల్లో!***

సరే! ఏఎన్నారుకి శ్రీదేవి ఇల్లెక్కడో తెలిసింది. పైగా పుట్టినరోజని కూడా తెల్సిపోయింది. ఓ పూల బొకే పెట్టుకుని సరాసరి శ్రీదేవి ఇంటికి వచ్చేసి ఆమె తమ్ముడు హరీష్‌తో, బామ్మ నిర్మలమ్మతో కుశలప్రశ్నలు వేసి, వరసలు కలిపేసి స్నేహం పెంచేసుకుంటాడు. పుట్టినరోజున సాయంత్రం శ్రీదేవి అమ్మవారి గుడికి వెళ్తుందని బామ్మ చెప్పింది గుర్తు పెట్టుకుని సరిగ్గా శ్రీదేవి గుడికొచ్చే టైంకి పరమభక్తుళ్ళా పంచె కట్టుకుని, రెండు చెవుల్లో పూలు పెట్టుకుని గుళ్ళో పాట పాడుతూ వుంటాడు ఏఎన్నారు. "***దేవీ మౌనమా? శ్రీదేవీ మౌనమా? నీకై జపించి జపించి తపించి తపించు భక్తునిపై...***" అంటూ. పాట పాడుతూ పార్కులో అందాల శ్రీదేవితో ఓ అందమైన కల కూడా కనేస్తాడు. ఈ పాటలో శ్రీదేవి వేసుకున్న కచ్చిన్స్ వారి స్కర్టులు, ఏఎన్నారు తొడుక్కున ఆ దర్జీ వారివే షర్టులు, వాళ్ళిద్దరూ వేసిన స్టెప్పులు నాకు చాలా నచ్చేశాయి.

శ్రీదేవి అన్న మోహన్‌బాబు తన ఫ్రెండైన మురళీమోహన్‌తో ఏఎన్నార్ శ్రీదేవి పుట్టినరోజుకి తన ఇంటికి రావడం ఏమీ బాగాలేదూ, అలా రావొద్దని ఏఎన్నారుకి చెప్పమని చెప్తాడు. మురళీమోహన్ ఆ పని తన కూడా తిరుగుతున్న మాడాకి అప్పజెప్తాడు.

మురళీమోహన్‌తో "ఓ యెస్సు" అని చెప్పి వెళ్ళిన మాడా తీరా ఏఎన్నారు దగ్గరికి వెళ్ళేటప్పటికి మాట మార్చేసి దేవి అన్నగారికి తెలీకుండా దేవిని ప్రేమించి, తనని ప్రేమించేలా చేసుకోమని ఏఎన్నారుకి సలహా ఇస్తాడు. పైగా ఏఎన్నారు వేరే అమ్మాయితో కనిపిస్తే ఆ అసూయతో దేవి వెంటనే ఏఎన్నారుకి దగ్గరౌతుందని చెప్తాడు. ఇదంతా జరగడానికి తన పుట్టినరోజని చెప్పి మాడా అందరినీ వనభోజనాలకి పిలుస్తాడు. అక్కడకి ఏఎన్నారుతో డాన్స్ చెయ్యడానికి జయంతి అనబడే జయసుధని తీసుకొస్తాడు.

కళ్ళజోడు పెట్టుకున్న ఏఎన్నారు, ఒంటిజడ వేసుకున్న జయసుధ "***కోటప్ప కొండకి వస్తానని మొక్కుకున్నా!***" అంటూ భలే హుషారుగా ఆడి పాడేస్తారు. ఈ పాటలో దాసరి మార్కు వేదాంతం "***పొమ్మని రమ్మంటే అది స్వర్గం, రమ్మని పొమ్మంటే అది నరకం***" అన్న వాక్యాల్లో భలే తళుక్కుమంది. వాళ్ళ ఆటా-పాటా చూసిన శ్రీదేవికి బాగా కోపమొచ్చి నోట మాట లేక, ఆ పూటకి ఊట (కన్నడలో "ఊట" అంటే భోజనం) కూడా వద్దని అన్నదమ్ములతో కలిసి ఇంటికెళ్ళిపోతుంది. అది చూసి కంగారు పడుతున్న ఏఎన్నారుతో బహుమతులు అవీ ఇచ్చి దేవి తమ్ముణ్ణి, బామ్మని మంచి చేసుకోమని సలహా ఇస్తాడు మాడా.

ఈలోపులో ఏమవుతుందంటే మురళీమోహన్ దేవి వాళ్ళ బామ్మ నిర్మలమ్మ దగ్గరకొచ్చి దేవిని తనతో పెళ్ళికి ఒప్పించమని అడుగుతుంటే అది ఆవిడకి అంత ఇష్టం లేనట్లుగా సమాధానాలు ఇస్తూ వుంటుంది. ఇంతలో పళ్ళబుట్ట పట్టుకుని ఏఎన్నారు అక్కడికి వస్తాడు. ఈ సీన్లో ఏఎన్నారు వేసుకున్న తెల్ల పేంటు, నల్లచొక్కా, నల్లకళ్ళజోడు కాంబినేషన్ బహు కను-నీయం. వచ్చిన ఏఎన్నారు బామ్మగారికి ఎప్పుడో చేసిన జలుబు తగ్గడం కోసం ఇంపోర్టెడ్ ఇన్‌హేలర్, శ్రీదేవి కోసం సింగపూర్ నుంచి షూస్ పట్టుకొస్తాడు. శ్రీదేవి ఏఎన్నారుతో 'ఏదో వంక పెట్టుకుని అస్తమానూ ఇలా తన ఇంటికి రావడం బాగాలేదు, ఇంకెప్పుడూ ఇంటికి రావద్ద'ని గట్టిగా చెప్తుంది. అలా అంటుందే కానీ శ్రీదేవికి ఏఎన్నారు అంటే ఇష్టమే. కాకపోతే బయటకి చెప్పదు.

ఇంకో పక్క శ్రీదేవి ఇంటికి ఏఎన్నారు రావడం గురించి బాధ పడుతున్న మురళీమోహన్‌కి మాడా శ్రీదేవి ఏఎన్నారుని కాక మురళీమోహన్నే ప్రేమిస్తోందని చెప్తూ వుంటాడు. అలా చెప్పి అటు ఏఎన్నారు దగ్గర డబ్బులు తీసుకుంటున్నట్లే ఇటు మురళీమోహన్ దగ్గర కూడా కొట్టేస్తూ వుంటాడు మాడా.

ఇంకిక్కడ శ్రీదేవి ఇంట్లో బామ్మ నిర్మలమ్మ ఫ్రెండు మురళీమోహన్ కిచ్చి శ్రీదేవి పెళ్ళి చేద్దామనుకుంటున్న మోహన్ బాబుతో మురళీమోహన్ కన్నా ఏఎన్నారు స్థితిపరుడనీ, పైగా ఒక్కగానొక్క కొడుకనీ, అతన్ని చేసుకుంటేనే శ్రీదేవి సుఖపడుతుందనీ చెప్తుంది. బామ్మ, మోహన్‌బాబు కలిసి అస్సలు శ్రీదేవికి ఎవరిష్టమో కనుక్కుందామనుకుంటారు.

ఓ రోజు తన ఫ్రెండు బేబీ (టున్ టున్) కోసం వెయిట్ చేస్తున్న శ్రీదేవి దగ్గరికి మంచి రంగురంగుల గళ్ళ చొక్కా వేసుకున్న ఏఎన్నారు వచ్చి తనతో సాయంత్రం డిన్నర్‌కి రమ్మని అడిగితే శ్రీదేవి "నే రానూ, ఎగ్జిబిషన్‌కి వెళ్తున్నాను" అని చెప్తుంది. ఆ రోజు సాయంత్రం శ్రీదేవిని కలవడానికి ఎగ్జిబిషన్‌కి వెళ్ళి అక్కడ కాలు జారి పడతాడు ఏఎన్నారు. ఈ లోగా ఎవరో శ్రీదేవికి ఫోన్ చేసి ఏఎన్నారు కాలు విరిగి హాస్పిటల్లో వున్నాడని చెప్తారు. కంగారుగా పరిగెట్టుకెళ్లిన శ్రీదేవితో ఆమె నవ్వు కోసం ఇంకో కాలు విర్గొట్టుకోవడానికి కూడా రెడీ అని చెప్పి ఆమెతో "ఐలవ్యూ" అనిపించుకుంటాడు ఏఎన్నారు. శ్రీదేవి అటు వెళ్ళగానే ఏఎన్నారు ఫ్రెండ్స్ పద్మనాభం, ఈశ్వర్రావు, ఇంకో ఇద్దరు ఏఎన్నార్ దగ్గర కొచ్చి తమకి పార్టీ ఇస్తే ఇప్పుడే మొదలైన శ్రీదేవితో ప్రేమని పెళ్ళి దాకా తీసుకెళ్ళడానికి సహాయం చేస్తామంటారు. మీ సహాయం నాకేమీ అక్కర్లేదన్న ఏఎన్నార్‌తో శ్రీదేవికి నువ్వాడిన నాటకం చెప్పి నీ మీద ప్రేమ పోయేలా చేస్తామని బెదిరించి వెళ్ళిపోతారు ఫ్రెండ్స్. అన్నట్టుగానే శ్రీదేవి దగ్గరకెళ్ళి ఏఎన్నార్ కాలు నిజంగా విరగలేదని, అది శ్రీదేవిని తన దగ్గరికి రప్పించుకోవడానికి ఆడిన నాటకమనీ చెప్తారు పద్మనాభం ఎండ్ కో. దాంతో శ్రీదేవి ఏఎన్నార్‌ని అబద్ధం చెప్పాడని కోపం తెచ్చుకుని తిట్టి వెళ్ళిపోతుంది.

ఇక ఏఎన్నార్ ఇంట్లో ఏం జరుగుతూ వుంటుంది అంటే అమ్మ పుష్పలత వచ్చి పసుపుగళ్ళ చొక్కా వేసుకున్న ఏఎన్నార్‌తో పెళ్ళి చూపులకి వెళ్తున్నామని చెప్తుంది. తనకి శ్రీదేవి అంటే ఇష్టమని చెప్పి పెళ్ళిచూపులకి రానంటాడు ఏఎన్నార్. పెళ్ళి చూపులకి వస్తామని మాటిచ్చాం కాబట్టి అన్నట్టుగానే వెళ్ళి జాతకాలు కుదరలేదని చెప్పి తప్పించుకుందామంటుంది తల్లి. సరే నని పెళ్ళిచూపులకి వెళ్తాడు ఏఎన్నారు.

తీరా అక్కడికెళ్ళాక ఎదురుగా కూర్చున్న కవిత శ్రీదేవిలా కనబడి ఆమెని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటాడు ఏఎన్నార్. అసలు కవిత శ్రీదేవిలా కనబడిన మేజిక్కేంటో? అలా కనిపించడడం వెనకాల లాజిక్కేంటో? ఆ ప్రశ్నలలా వదిలేస్తే ఈ సీన్లో పుష్పలత కట్టుకున్న నారింజరంగు పట్టుచీర, నీలంరంగు అంచుది నాకు నచ్చింది.

పెళ్ళిచూపులు జరిగిన మరసటి రోజు కాబోయే పెళ్ళికూతురు కవిత ఓ పూలబొకే పట్టుకుని ఏఎన్నార్ ఇంటికి వస్తుంది. అంతకు ముందు జరిగిన నాలుగు పెళ్ళిచూపులు తప్పిపోవడంతో ఈసారి కూడా అలాగే జరిగితే చచ్చిపోదామనుకున్న తనకి ప్రాణం పోశారని పుష్పలత కాళ్లకి దండం పెడుతుంది. హమ్మయ్య! దాసరి సినిమాలో పెళ్ళి కోసం అమ్మాయిలు తహతహలాడే ఆనవాయితీ నిలబెట్టింది కవిత. సరే! పుష్పలతకి దండం పెట్టాక ఆ బొకే పట్టుకుని ఏఎన్నార్ గది లోకి వెళ్తుంది కవిత.

అలా వచ్చిన కవితని గుర్తు పట్టడు ఏఎన్నార్. పైగా పెళ్ళిచూపుల్లో అమెలో తను శ్రీదేవినే చూశానని అంటాడు. అది వినగానే తెచ్చిన బొకే ఏఎన్నారుకి ఇవ్వకుండానే వెనక్కి వెళ్ళిపోబోతుంది కవిత. అప్పుడు ఏఎన్నారు కవితని ఆపి ఆమె పెళ్ళి అయితేనే కానీ తను పెళ్ళి చేసుకోనని చెప్తాడు. వెంటనే కవిత పూలబొకేని ఏఎన్నారు కాళ్ళ దగ్గర పెట్టి వెళ్ళిపోతుంది. ఈ సీన్లో కూడా కచ్చిన్స్ వారు ఏఎన్నారుకి కుట్టిన నలుపు మీద తెలుపు పోల్కా-చుక్కల చొక్కా మిలమిల్లాడింది.

అనుకోకుండా ఈ మధ్యలో ఓ చిన్న సీను. శ్రీదేవితో పెళ్ళి కుదురుస్తానని మురళీమోహన్‌కి, వాళ్ళ అమ్మానాన్నలకి మోహన్‌బాబు చెప్తే వాళ్ళు అసలు ముందు శ్రీదేవి ఉద్దేశ్యం ఏంటో కనుక్కోమంటారు. శ్రీదేవితో పాటు గుడికెళ్ళిన మురళీమోహనూ, శ్రీదేవీ మధ్య ఏవో తలా-తోకా లేని డైలాగులు. సిన్మా రెండున్నర గంటలు రావాలనేమో?!

ఈ లోగా కవిత పెళ్ళి కుదిరిందని శుభలేఖ ఇవ్వడానికి ఏఎన్నార్ ఇంటికి వస్తుంది. అక్కణ్ణించి శ్రీదేవి ఇంటిక్కూడా వెళ్తుంది పెళ్ళికి పిలవడానికి. అప్పుడే నాకర్థమయ్యింది కవిత శ్రీదేవి ఫ్రెండని. అదేంటో! ఇంతకు ముందు ఏఎన్నారు దేవిని ప్రేమిస్తున్నానని చెప్పినప్పుడు ఆ దేవి తన ఫ్రెండు దేవి ఒకళ్ళేనేమోనని కవితకి అనిపించలేదెందుకో?!

సరే! కవితకి రాజాతో పెళ్ళవుతుంది. రిసెప్షన్ జరుగుతూ వుంటుంది. దానికి ఏఎన్నారు అమ్మానాన్నలతో వస్తాడు. కవిత పక్కనే వున్న శ్రీదేవికి "హాయ్" చెప్తాడు. పెళ్ళికి బహుమతిగా "***తారలు దిగి వచ్చిన వేళా, మల్లెలు నడిచొచ్చిన వేళా***" అంటూ అద్భుతమైన పాట పాడతాడు.

ఆ పాట, పాటలో ప్రతీ మాటా, పాటకి చక్రవర్తిగారి సంగీతం, పాటలో వయ్యారాలు పోయిన ఎస్పీబీ గొంతు, పాటలో కదలకుండా ఏఎన్నార్ చూపించిన సటిల్ ఎక్స్‌ప్రెషన్స్, శ్రీదేవి కట్టుకున్న సిందూరపు చీర, పెట్టుకున్న మువ్వల నెక్లెస్సు, చెవి బుట్టలు, చెంపసరాలు, కవిత మెళ్ళో గులాపూవ్వల దండ, పుష్పలత కట్టుకున్న కనకాంబరం అంచున్న ఆకుపచ్చ పట్టుచీర, దానికి మేచింగుగా ఆవిడ తల్లో పెట్టుకున్న కనకాంబరాల మాల, ఆవిడ నుదుటన పెట్టుకున్న ఎఱ్ఱటి బొట్టు, ఆకాశం నుంచి కోసుకొచ్చేసి వరసగా గుచ్చి భూమ్మీద వేళ్ళాడదీసిన నక్షత్రాల్లా మెరిసే సీరియల్ లైట్లు – ఇవన్నీ ఈ పాటలో నాకు ఇష్టమైనవి.

పాటవుతూనే శ్రీదేవి ఏఎన్నార్ మీద గా...ఠిగా అరిచి ప్రైవేటు చెప్పేస్తుంది – "హన్నా! ఇలా నా వెంట ఎందుకు పడుతున్నారం"టూ. అలా అరిచిన శ్రీదేవికి కవిత "ఆయ్! నిన్నతను ఎంత ప్రేమిస్తున్నాడో తెలుసా?" అని ప్రైవేటు చెప్తుంది. ఇంట్లో ఏఎన్నారుకి నాన్న ప్రభాకరరెడ్డి "ఆ పిల్ల కన్నా

నీకింకెవ్వరూ దొరకలేదా" అని ప్రైవేటు. కవితతో ప్రైవేటు చెప్పించుకుని "రాజేష్" అంటూ ఏఎన్నారు ఇంటికొచ్చిన శ్రీదేవికి మళ్ళీ అమ్మ పుష్పలత చేతిలో "మా అబ్బాయిని హన్నా అంటావా?" అంటూ ఇంకో పెద్ద ప్రైవేటు. ఇన్ని ప్రైవేట్లు అయ్యాక శ్రీదేవి ఏడుస్తూ కారేసుకుని వెళ్ళిపోయి ఓ పెద్ద బిల్డింగ్ చివరి అంతస్తు పైన మేడ మీద సిగరెట్టు కాల్చుకుంటున్న ఏఎన్నారు కాళ్ళ మీద పడి కన్నీటితో ప్రేమాభిషేకం చేసేస్తుంది.

వెంటనే ఇంకో భలే మంచి పాట. "***నా కళ్ళు చెబుతున్నాయి నిను ప్రేమించానని***" అంటూ. అసలీ సినిమాలో పాటలన్నీ మొదటిసారి చూసినప్పుడే నాకు నోటికొచ్చేశాయి. ఇప్పుడు మళ్ళీ వింటుంటే కూడా అంతే బావున్నాయి ఇన్నేళ్ళ తర్వాత కూడా!

అన్నిట్లోకీ ఈ పాటంటే నాకు మరీ ఇష్టం. ఎందుకంటే ఈ సినిమా చూసీ చూడగానే మా అమ్మ మాకు బట్టలు కుట్టే టైలర్ని ఈ సిన్మా చూడమని, ఈ పాటలో శ్రీదేవి వేసుకున్న స్కర్టు, ఫుల్ స్లీవ్స్ షర్టు లాంటివి నాకు కుట్టాలని చెప్పింది. పాపం! మా టైలర్ నాగేశ్వర్రావ్ కూడా ఎందుకొచ్చిన బాధ అనుకోకుండా కచ్చిన్స్ వారి స్ఫూర్తితో అచ్చు అలాగే కుట్టిపెట్టాడు. నాకిప్పటికీ అప్పుడు మా అమ్మ నాకు కుట్టించిన రెండు డ్రెస్సులు చాలా చాలా ఇష్టం. ఒకటి మస్టర్డ్ కలర్ మీద బ్రౌన్ చెక్స్ వున్న పేంట్ క్లాత్‌తో కుట్టిన స్కర్ట్, దాని మీదకి చిన్నచిన్న చెక్స్ వున్న రెడ్ కలర్ ఫుల్ స్లీవ్స్ షర్టు. ఇంకోటి బ్రౌన్ కలర్ స్కర్ట్ మీదకి బ్రౌన్ ఎండ్ వైట్ చెక్స్ షర్ట్. ఆ రోజుల్లో మా స్కూల్లో అల్లాంటి డ్రెస్సులు నాకొక్క దానికే వుండేవి. పైగా ఆ మస్టర్డు-రెడ్డు కాంబినేషన్‌కి నేను కలిపిన పర్పుల్ స్కార్ఫ్ స్టైలు ముందు కచ్చిన్స్ కూడా నిలవలేరు.

ఈ "***నా కళ్ళు చెబుతున్నాయి***" పాటలో మొదటి చరణం "***నింగీ నేలా తెలపాలీ నీకూ నాకూ ప్రేమనీ***" అన్న దగ్గర ఓ కాలు, చెయ్యీ ఊపుకుంటూ ఏఎన్నారూ, శ్రీదేవీ వేసిన ఓ స్టెప్పు తమాషాగా వుటుంది. అదే స్టెప్పు రెండో చరణంలో కూడా రిపీట్ అవుతుంది. మొత్తానికి ఈ పాటకి డాన్స్ సరదాగా వుంటుంది. అన్నట్టు ఈ పాటలో ఏఎన్నారుకి షూ వేసి, శ్రీదేవికి చెప్పులు కూడా వెయ్యలేదని తెగ బాధ పడిపోయాన్నేను, అప్పుడూ, ఇప్పుడూ కూడా.

అలా పాట పాడేసుకున్న తర్వాత ఏఎన్నార్ నాన్న ప్రభాకర్రెడ్డి తోనూ, శ్రీదేవి తన అన్న మోహన్‌బాబు తోనూ వాదించి తమ పెళ్ళికి ఒప్పుకునేట్లు చేస్తారు. ధూళిపాళ ఆధ్వర్యంలో నిశ్చయతాంబూలాలు కూడా తీసుకుంటారు. ఇక ఏఎన్నారు చాలా సంతోషంగా తన ఫ్రెండ్స్ అందరి దగ్గరికి వెళ్ళి "దేవితో నా పెళ్ళి కుదిరింది" అని చెప్పగానే వాళ్ళూ సంతోషిస్తారు. అంతలో ఏఎన్నారుకి పొట్టలో నొప్పొచ్చి నోట్లోంచి రక్తం వస్తుంది, పాపం! డాక్టర్ గుమ్మడేమో కంగారు పడాల్సిందేమీ లేదు. స్పెషలిస్ట్ రిపోర్ట్స్ వచ్చాక ట్రీట్‌మెంట్ మొదలు పెడదామంటాడు.

ఈ లోగా ఏఎన్నార్, శ్రీదేవి కలిసి స్నేహితులందరికీ తమ పెళ్ళి శుభలేఖలు పంచి పెడతారు. అందరితో పాటే మురళీమోహన్‌కీ ఇద్దామని వెళ్తే అతను కేంప్‌కి వెళ్ళాడని, సరిగ్గా పెళ్ళి రోజుకి తిరిగొస్తాడని తెలుస్తుంది.

ఇప్పుడు మళ్ళీ ఇంకో పాట. "***ఒక దేవుడి గుడిలో, ఒక దేవత ఒడిలో***" అంటూ మొదలు పెట్టి "***ప్రేమాభిషేకం ప్రేమకు పట్టాభిషేకం***" అంటూ సాగే టైటిల్ సాంగ్. ఇది కూడా ఓ అందమైన పాట. పాటకి వేసిన సెట్టింగు, శ్రీదేవి చీరలు, వాటికి సరిపోయేలా ఏఎన్నార్ చొక్కాలు, శ్రీదేవి పొడుగాటి జడ, జడగంటలు, వడ్డాణం, పాపిడిబొట్టు, "***అమృతాభిషేకం***" అన్న చోట మంచుదిమ్మ మీంచి తీసి శ్రీదేవి ఏఎన్నార్ మీద చల్లిన నీళ్ళు – ఇవి కూడా మొదటిసారి చూసినప్పుడెలా చూశానో ఇప్పటికీ అలాగే కళ్ళు విప్పార్చుకుని చూశాను.

పాటైపోగానే ఏఎన్నార్, శ్రీదేవి శుభలేఖ పట్టుకుని కవిత దగ్గరికి వెళ్తే కవిత భర్తకి పెళ్ళికి ముందే ఏదో జబ్బు వుందని, అతను పోయాడని తెలుస్తుంది. ఇక్కణ్ణించి సినిమా కొంచెం బరువుగా సాగుతుంది.

అప్పుడే గుమ్మడి దగ్గరున్న మోహన్‌బాబుకి గుమ్మడి చూస్తున్న లంగ్ కేన్సర్ రిపోర్ట్స్ ఏఎన్నారువని తెలుస్తుంది. వెంటనే మోహన్‌బాబు పెళ్ళికి ముహూర్తం పెట్టిన ధూళిపాళ దగ్గరికి వెళ్ళి పెళ్ళి ఓ ఆరు నెలలు వాయిదా పడేలా చూడమంటాడు. అతనడిగినట్లే ధూళిపాళ ప్రభాకర్రెడ్డితో పాట పంచాంగం చూసి తప్పు ముహూర్తం పెట్టానని, పెళ్ళికి ఇంకో ఆర్నెల్ల దాకా మంచి ముహూర్తాలు లేవని చెప్పి ముహూర్తం మార్చడానికి ఒప్పిస్తాడు.

పెళ్ళి ముహూర్తం వాయిదా పడింది అని తెలియగానే ఏఎన్నార్, శ్రీదేవి అది తమ పెళ్ళంటే ఇష్టం లేని మోహన్‌బాబు చేయించిన పని అని అనుమాన పడతారు. ధూళిపాళని అడిగి తమ అనుమానం నిజమే అని తెల్సుకుంటారు. అందుకని అదే ముహూర్తానికి ఎవరికీ తెలియనీకుండా గుళ్ళో పెళ్ళి చేసుకుందామని అనుకుంటారు. పెళ్ళి చేసుకుందాం అనుకున్న రోజున శ్రీదేవి గుడికి వస్తుంది. అక్కడికే బయల్దేరిన ఏఎన్నారుకి మళ్ళీ పొట్టలో నొప్పి వస్తుంది. వెంటనే డాక్టర్ దగ్గరికి వెళ్తాడు. వెళ్ళి అక్కడ డాక్టర్ ఆఫీసులో సిగరెట్టు కాలుస్తూ వుంటాడు. ఎంత ఏఎన్నారైతే మాత్రం డీఎన్నారు అలా సమయం, సందర్భం, స్థలం చూసుకోకుండా సిగరెట్లు కాల్చనివ్వడమేంటో?! సరే! నా అనుమానాలు పక్కన పెట్టి సినిమా చూస్తే గుమ్మడి దగ్గర పని చేసే ఇంకో డాక్టర్ ఏఎన్నారుకి "మీకు లంగ్ కేన్సర్" అని చెప్తాడు. అది తెలియగానే ఏఎన్నార్ ఇంక గుడికి వెళ్ళడు. తను వెళ్ళి శ్రీదేవిని పెళ్ళి చేసుకుంటే ఆమె కూడా కవితలా కష్ట పడుతుందని. ఇదేమీ తెలియని శ్రీదేవి చాలా సేపు గుళ్ళో ఎదురు చూసి ఏఎన్నారు రాలేదని బాధతో ఇంటికి వెళ్ళిపోతుంది.

**ఇంకిక్కణ్ణుంచి మిగిలిన గంటా...**

ఏఎన్నారు శ్రీదేవిని పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకోవడం...

ఈలోగా వాళ్ళ పెళ్ళి శుభలేఖ చూసిన మురళీమోహన్ నిద్రమాత్రలు మింగి హాస్పిటల్లో చేరడం...

ఏఎన్నారు పద్మనాభం వాళ్ళని పిలిచి దేవికి తను అమ్మాయిలతో తిరుగుతున్నాడని అబద్ధం చెప్పి తన పెళ్ళి చెడగొట్టమని అడగడం, ఒప్పుకోని వాళ్ళకి తన కేన్సర్ గురించి చెప్పడం...

ఏఎన్నార్ శ్రీదేవికి తన తండ్రి ఫోన్ చేసినట్లు ప్రభాకర్రెడ్డి గొంతుతో మాట్లాడి తన కొడుకుని పెళ్ళి చేసుకోవద్దని చెప్పడం...

అది చూసి ఎందుకలా చెప్పావని అడిగిన ప్రభాకర్రెడ్డికి ఏఎన్నార్ అసలు దేవికి మురళీమోహన్ అంటేనే ఇష్టమని చెప్పి, దేవితో ఆడే నాటకంలో తనకి సహకరించమని అడగడం...

ఏఎన్నార్ శ్రీదేవికి దగ్గర కావడానికి ఎవరితోనైతే డాన్స్ చేశాడో అదే జయసుధ ఇంట్లో చేరి తాగి ఆమెతో డాన్స్ చేస్తున్నట్లు నటిస్తూ "వందనం అభివందనం" పాట పాడడం...

పాట పాడుతూ రక్తం కక్కుకున్న ఏఎన్నార్ కోసం జయసుధ డాక్టర్ గుమ్మడిని తీసుకురావడం...

ఆయన్నించి ఏఎన్నార్‌కి కేన్సర్ అని తెలుసుకోవడం...

స్పృహ వచ్చిన ఏఎన్నార్ జయసుధ వద్దన్నా వినకుండా తన ఇంటికి వచ్చేయడం...

అదే సమయానికి స్నేహితుడైన ప్రభాకర్రెడ్డి ఇంటికి వచ్చిన గుమ్మడికి ఏఎన్నార్ ప్రభాకర్రెడ్డి కొడుకని తెలియడం...

ఏఎన్నార్ గుమ్మడిని గది లోకి తీసుకెళ్ళి తన జబ్బు సంగతి తన తలిదండ్రులకి చెప్పొద్దని అనడం...

ఈ లోగా ఏఎన్నార్ కోసం జయసుధ దగ్గరకొచ్చిన శ్రీదేవి అక్కడ జయసుధ, ఏఎన్నార్లు మాట్లాడిన తీరు చూసి కోపంతో ఇంటికెళ్ళి మురళీమోహన్‌తో పెళ్ళి కొప్పుకోవడం...

కొద్ది రోజుల్లో చనిపోబోతున్న ఏఎన్నార్‌కి జయసుధ తను అతని భార్య కావాలని కోరుకోవడం...

గుమ్మడి వెళ్ళి ఏఎన్నార్ విషయం ప్రభాకర్రెడ్డికి చెప్పడం...

మురళీమోహన్‌ని పెళ్ళి చేసుకున్న శ్రీదేవికి ఏఎన్నార్ విషయం తెలియడం...

ఈలోగా ఏఎన్నార్ "***ఆగదు ఏ నిముషము నీ కోసము***" అంటూ పాడడం...

పాటయ్యే సమయానికి గుమ్మడి, ప్రభాకర్రెడ్డి, పుష్పలత, మోహన్‌బాబు, మురళీమోహన్, శ్రీదేవి, హరీష్, నిర్మలమ్మ పద్మనాభం, ఈశ్వర్రావ్, మాడా – ఇలా అందరూ జయసుధ ఇంటికి చేరుకోవడం...

వాళ్ళందరూ రాగానే సినిమా క్లైమాక్స్‌కి చేరుకోవడం...

**మొత్తానికి ప్రేమాభిషేకం సినిమా:**

ఏఎన్నార్, జయసుధల నటనాభిషేకం...
శ్రీదేవి సౌందర్యాభిషేకం...
మిగిలిన నటనటీమణుల పాత్రాభిషేకం
చక్రవర్తి సంగీతాభిషేకం
సలీం నృత్యాభిషేకం
ఎస్పీబీ, సుశీలల గాత్రాభిషేకం
– వెరసి దర్శకరత్న డీఎన్నార్ స్వప్నఫలాభిషేకం!

ఇందులో "***వందనం అభివందనం***" పాట గురించే బోల్డంత రాయొచ్చు. జయసుధని "***నిన్నకు రేపుకు సంధిగ నిలిచిన సుందరీ!***" అనడంలో అర్థం అంతకు ముందు శ్రీదేవికి ప్రేమ కలిగించడం కోసం, ఇప్పుడు మళ్ళీ అదే శ్రీదేవితో పెళ్ళి తప్పించుకోవడానికి సహాయం చేస్తోందనేమో! ఇందులో "***తలపుల తలుపుకు నడుమిచ్చి వలపుల గడపకు నడుమిచ్చి, ఎదురు చూసిన సారికా! అభిసారికా!***" అన్న దాసరి వారి లైన్లు వేటూరి వారి వరసలో వున్నాయి. ఆశ్చర్యం! అలాగే రెండో చరణంలో "***అభినయ మేనకా!***" అని అనడం తనతో ఆడుతున్న జయసుధ "నటిస్తోంది" అన్న అర్థంలో వాడడం, అసలింత గూఢార్థంతో డీఎన్నారు రాసిన పాట రాయడం వినడం నేనిదే మొదటి సారి. "***నీ అందమే ఒక నందనం***" అన్న చోట అందాన్ని దేవలోకపు పూల తోటైన నందనంతో పోల్చడం లోని భావుకత సాటి లేనిది. ఏ స్ఫూర్తితో డీఎన్నార్ ఈ పాట రాశారో కానీ ఆ స్ఫూర్తికి "***వందనం, అభివందనం!***"

# అన్నీ కాకపోయినా కొన్ని సరిలేని-దాసరి వారి సినిమాలు

All good things must come to an end అన్నది ఆంగ్ల నానుడి. సాగుతున్న కబుర్లు సరదాగా వుండగా ఆపుట మేలు – అన్నది నాకనిపించిన నుడి.

ఈ మాసపు దాసరివారి చిత్ర విచిత్ర చలనచిత్ర విశేషాలు రాయబోయే ముందు ఆనవాయితీగా ఒక సిన్మతీ గిద్యం:

నేననగనగాయంచు సిన్మా కథ చెప్పుచుండ
నేన్రాయగ మీరా కథ చదువుచుండ
నే జెప్పు దాసరి కథలు సరదాగ సాగుచుండ
నేనాపుటే ఉత్తమం మీకును నాకును సిన్మతీ!

నా బ్లాగు పుస్తకం "బోల్డన్ని కబుర్లు" చదివిన కిరణ్ప్రభ గారు నాకు ఫోన్ చేసి మాట్లాడి మా "కౌముది"కి మీరేమన్నా రాయాలి అని అడిగినప్పుడు అసలు నేను ఏం రాయగలనూ అన్న ఆలోచనే లేకుండా "తప్పకుండానండి" అని మాటిచ్చేశాను. అది ఆగష్టు 2018 లో జరిగిన విశేషం.

ఆ తర్వాత కాంతి గారితో కూడా మాట్లాడినప్పుడు కూడా అంతే ధీమాగా "కౌముది"కి ఏవైనా సినిమా కబుర్లు రాస్తానని చెప్పాను. అలా రాస్తా, రాస్తానని ఒప్పేసుకున్నాను కానీ ఎంత ఆలోచించినా దేని గురించి రాయాలో ఓ పట్టాన తట్టలేదు. ఈలోగా డిసెంబర్ రానే వచ్చింది. "కౌముది"లో రాబోయే కొత్త ఏడాదిలో జనవరి నుంచి మొదలుబెట్టబోయే కొత్త శీర్షికల గురించి డిసెంబర్లో ప్రకటించడం ఓ ఆనవాయితీ. దాని గురించి మాట్లాడుతూ కిరణ్ప్రభ గారు "ఎలాగూ సినిమా కబుర్లు రాస్తానని అన్నారు కదా! మీర్రాయబోయేవి 'సరదా సినిమా కబుర్లూ అని ప్రకటిద్దాం" అన్నారు, అలాగే ప్రకటించారు.

అప్పుడు నాకింకో సమస్య – సినిమా కబుర్లు అంటే ఎలా రాయాలీ? ఏం రాయాలీ? నా వరకు నాకు సినిమా అంటే ఓ మూడు గంటల కాలక్షేపం. అందులో వున్న టెక్నికాలిటీస్ నాకస్సలు తెలీవు. నిజం చెప్పాలంటే మండుటెండల్లో లెదర్ జాకెట్లు వేసుకుని వుడికిపోయే హీరోలు, మంచుకొండల్లో స్లీవ్‌లెస్ జాకెట్లు తొడుక్కుని ఒణికిపోయే హీరోయిన్లని చూస్తూ వాళ్ళెంత కష్టపడ్డారో తలుచుకుని జాలిపడి నే సినిమాలు చూసిన సందర్భాలు కూడా వున్నాయి.

వినదగ్గ పాటలుండి, చూస్తున్న వాళ్ళెవర్నీ నొప్పించని హాస్యముండి, చూడడం అయ్యాక చూసిందాన్ని గుర్తుంచుకుని ఇంకొకరికి చూడమని చెప్తే వాళ్ళు నన్ను తిట్టుకోకుండా చూడగలిగితే అది మంచి సినిమా నాకు.

సరే! అలా అంటే అలాంటి సినిమాలు బోల్డుంటాయి. ఏదో ఒక విషయాన్ని ఎంచుకుని రాయకపోతే నా శీర్షికలో నేనేం చెప్పదలుచుకున్నానో ఎవరికీ అర్థం కాక నా రాత ***లంక మేత, గోదారి ఈత*** అవుతుందనిపించింది.

అలా నేనేం రాయాలా అని నేనాలోచిస్తుండగా, డగా, డగా... అప్పుడు తట్టింది దాసరి నారాయణరావు సినిమాల గురించి. చిన్నప్పట్నుంచి దాసరి సినిమాలు ఆట్టే నాకు చూపబడలేదు, నేను చూడలేదు. కానీ నాకు దాసరి సినిమాల్లో పాటలన్నీ చాలా ఇష్టం. అందులోనూ నాకెంతో ఇష్టకవులైన దేవులపల్లి, వేటూరి రాసినవి చాలా ఇష్టం.

ఇవే కాకుండా దాసరి రాసినవైతే మరీ ఇష్టాతి-ఇష్టం. ఎందుకంటే... తనకు తట్టిన మాటలు పేర్చుకుంటూ, అన్న మాటనే అంటూ, తనన్న మాటకర్థం ఏంటంటూ విన్నవాళ్ళు తన్నుకుంటూ, తలలు బద్దలు కొట్టుకుంటూ వుంటూ కూడా తలలూపుకుంటూ వింటూ వుంటారంటే దాసరి పాటెంత పాటిదో నేను మాటల్లో వేరే చెప్పాలా! ఒక్కోసారి ఒక్కో పాట వింటూ వున్నప్పుడల్లా అసలా పాట రాసేటప్పుడు దాసరి ఆలోచన ఏమైవుంటుందా అని నాకొకటే ఆలోచన.

అన్నిటికన్నా ముఖ్యంగా నేను దాసరి సినిమాల గురించి రాయడానికి ప్రేరణనిచ్చిన ***"ప్రేమ అన్నది ఒక కల... కల... కల..."*** అన్న ఓ పాట గురించి చెప్పాలి. ఆ పాట '**బ్రహ్మముడి**' అనే సిన్మాలోనిదట. 'లోనిదట' అని అనడమెందుకటా అంటే ఆ సినిమా నే చూడ సాహసించనందుకట.

ప్రేమ అన్నది ఒక కల... కల... కల...
చిక్కుకుంటే అది వల... వల... వల...
మొదట సాగుతుంది నావలా...
పరుగు పెడుతుంది లేడిలా...
పిదప ఎగిరిపోతుంది కాకిలా...
కడకు విడిచి పోతుంది ఏకాకిలా... ఏకాకిలా...

చిన్నప్పట్నుంచీ ఈ పాట ఎప్పుడు విన్నా నా చెవులు "*పిదప ఎగిరిపోతుంది కాకిలా*" అన్న వాక్యం వచ్చేదాకా భలే ఆత్రంగా ఎదురు చూస్తున్నట్లనిపించేది. అది వినీ వినగానే భళ్ళుమని ఓ అట్టహాసం పెటిల్లని నా పక్కనున్నవాళ్ళని దడిపించేది – ఇప్పటికీ దడిపిస్తూనే వుంది – ఇక ముందు కూడా దడిపిస్తుందని నాదీ హామీ!

అసలా పల్లవి ఒక క్లాసిక్ – దాని ప్రకారం ప్రేమ అనే ఓ క్రాపు-పదార్థం (మరి పాట మగగొంతులో వుంది కాబట్టి – అదే ఏ పీసుశీల్లాంటి గాయకమ్మో పాడుంటే జడ-పదార్థమయ్యేది) పడవలా నీళ్ల మీద ఊక్కుంటూ వచ్చి, జింకలా రోడ్డు మీద పరిగెట్టేసి, చివరికి కాకిలా గాల్లోకి ఎగిరిపోతుందట. అందులోనూ ఆ ప్రేమ కలలా మొదలెట్టి వలలా చుట్టేసిందని ఆ పాటలో ఏకాకిలా నడుస్తున్న అబ్బాయి మొహం వలవలా ఏడ్చేస్తున్నట్లుండడం పాటకి మరింత తగినట్లుందండోయ్!

అదుగో... ఆ పాటే కాదు ఇంకోటి కూడా వుంది "***నడక సాగితే రాదారి, పడవ సాగితే గోదారి***"అంటూ. అందులో "***మైలు మైలుకీ రాళ్ళుంటాయి రాదారిలో, అడుగు అడుగుకీ నీళ్ళుంటాయి గోదారిలో***" అన్న లైన్లు నాకు విన్నవి విన్నట్టు నాగ్గుర్తున్నాయో, లేకపోతే అవి అలాగే వుంటాయని నేనే ఊహించుకున్నానో నాకెప్పటికైనా అంతు పట్టాలంటే అసలా పాట ఏ సిన్మాలోదో తెలియాలి, నాకది దొరకాలి, నేను వినాలి.

సరే! చిన్నప్పట్నుంచీ ఇన్ని సర-దా-సరి-స్వరాలు విన్నప్పట్నుంచీ నాకెప్పటికైనా వీటన్నిటిమీదా ఓ రీసెర్చ్ లాంటిది చేయాలనిపించేది. ఎప్పుడైతే కిరణ్ ప్రభ గారు "కౌముది"కో సరదా శీర్షికోటి రాయమన్నారో నాకు వెంటనే దాసరి సినిమాల గురించి రాస్తే ***ఒక రాతకి రెండు చేతలు*** అన్నట్లవుతుందనిపించిందే తడవు కిరణ్ ప్రభ గారికి ఫోన్ చేసి దాసరి సినిమాల గురించి రాస్తానని చెప్పాను. అది వినగానే ఆయన "అది కొంచెం కాంట్రొవర్సీ అవుతుందేమోనండి" అన్నారు. నేనప్పుడాయనకి నా రచనలో హాస్యమే తప్ప అపహాస్యం వుండదు అని హామీ ఇచ్చి, నా శీర్షికకి "సరదా సిన్మాయణం" అన్న పేరు కూడా నేనే పెట్టేసుకుని మొదటగా 2019 జనవరి సంచికకి "స్వయంవరం" సినిమా కథ రాసి పంపించాను. ఫిబ్రవరి నెలకి "రాగదీపం" రాశాను. అది కూడా ఎలాగంటే టికెట్టు కొనుక్కుని సినిమా చూస్తున్నప్పుడు ఓ సాధారణ ప్రేక్షకుడిగా నాకొచ్చే న-సాధారణ ఆలోచనల సహితంగా ఒక ప్రత్యక్ష వ్యాఖ్యానం లాగా రాశాను. తీరా మూడవ సినిమా ఏం రాద్దామా అని వెతుక్కుంటూ వుంటే ఏ సినిమా నచ్చుతున్నట్టు

అనిపించలేదు. పైగా "రాగదీపం" దెబ్బకి దాసరి సినిమాలంటే దడుపు జ్వరం లాంటిదేదో వచ్చింది నా మనసుకి. అందుకని కొంచెం దాసరి వారి సినిమాల దారి మళ్ళించి హిందీ సినిమా "ధనక్" రాశాను.

దానికి నేనిచ్చుకున్న వివరణ నా మాటల్లోనే...

*"ఆ... తొండి... దాసరి సినిమా కథ అన్నావ్, ఇంకేదో చెప్తున్నావ్!"*
*"మరే! ఒట్టి కనకాంబరం పూలు మాల కడితే బావుంటుందా?'*
*"బానేవుంటుందనుకో..."*
*"మరందులో మరువం, దవనం కలిపితే ఎలా వుంటుంది?"*
*"బహు బాగుంటుంది...ఘుమ్మంటుంది!"*
*"అందుకే మరి... దాసరి వారి కథలని ఓ వారకి పెట్టి, ఈ సారికి 'ధనక్' కథ విను మరి!"*

ఆ రకంగా మార్చ్ నెల దాసరి వారి బారిన పడకుండా తప్పించుకున్నా మళ్ళీ ఏప్రిల్ నెలకి నా దారి దాసరి వారి దారే. ఇక చేసేదేముంది దాసరి సినిమాలు రాస్తానని కమిట్ అయి ఆ సినిమాలకే భయపడితే ఎలా? హన్నా! అని నాకు నేనే చీవాట్లేట్టేసుకుని మళ్ళీ ఎక్కడ మొదలుపెట్టానో ఆ దారి చేరి కొనసాగించా.

అలా మళ్ళీ మొదలైన "సరదా సిన్మాయణం"లో రాసినవేంటంటే మేఘసందేశం(ఏప్రిల్), అద్దాలమేడ(మే), యువరాజు(జూన్), శ్రీవారి ముచ్చట్లు(జులై), లంకేశ్వరుడు(ఆగష్టు), బుచ్చిబాబు(సెప్టెంబర్), రాముడు కాదు కృష్ణుడు(అక్టోబర్), ప్రేమాభిషేకం(నవంబర్).

వీటన్నిటి వెనకాల ఒకటే ఉమ్మడి లక్షణం. అంతటా, అన్నిటా దాసరే కావడం. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం అన్నీ దానారానే. అదొక్కటే కాకుండా ఈ సినిమాల గురించే రాయడానికి ముఖ్య కారణం పాటలు.

చిన్నప్పట్నుంచీ ఎన్నో పాటలు విజయవాడ వివిధభారతి-జనరంజనిలో వింటూ, నోటికొచ్చినట్టు అంటూ, నాకు తోచినట్టు పాడుకుంటూ పాడింది పాటగా-వినుకున్న చెవిపోటుగా పెరిగానేమో... ఈ యూట్యూబ్ రోజుల్లో ఆ పాటలు వినడమే కాకుండా కనడమూ కుదిరాక వాటి గురించి ఏదో ఒకటి అనుకోకుండానూ, అనుకున్నది ఎవరికో ఒకరికి వినిపించకుండానూ వుండలేకపోయాను. అలా నే విని పాడుకుటూ, నవ్వుకుంటూ, కామెంటుకున్న పాటల్లో సింహభాగం దానారా విరచితం. ఎలాగూ అంతకు ముందు నుంచే నాకు దాసరి సినిమాలు అంటే కొంత ఆసక్తి, ఇంకొంత కుతూహలం. వెరసి నా సిన్మాయణానికి అంకురారోపణం.

ఇక నా సిన్మాయణ నామ పారాయణ మాని దానారా దర్శకత్వంలో నేను చూసిన, చూడకపోయినా చూచాయగా కథ తెలిసిన సినిమాల గురించి కొన్ని కబుర్లు చెప్తాను.

1972 నుంచి 2014 వరకూ వందకి పైగా సినిమాలు డీఎన్నారు దర్శకత్వంలో వచ్చాయి. నేను ఈ "సరదా సిన్మాయణం" రాయడం మొదలు పెట్టిన దగ్గర్నుంచీ ప్రతీ నెలా రెండో మూడో సినిమాలు చూసేదాన్ని. అలా చూసిన వాటిల్లో నేను ఎంచుకున్న సిన్మాలకి నేను పెట్టుకున్న నిబంధనలేంటంటే కథ, మాటలు దాసరివారివి మాత్రమే అయ్యుండాలి అని. అలా అయితేనే సరదాలు విరివిగా పండును. నాకో నాల్గు నవ్వులు కిట్టింపవ్వును. అందుకే ***బలిపీఠం***, ***గోరింటాకు***, ***కళ్యాణి*** (యద్దనపూడి సులోచనా రాణి నవల - రాగమయి) లాంటి నవలాచిత్రాల జోలికి వెళ్ళలేదు.

అలాగే నాకు పొలిటికల్ సెటైర్స్ అంతగా నచ్చవు. అందుకే "ఎమ్మెల్యే ఏడుకొండలు" సినిమా అంతటా కనిపిస్తూ డీఎన్నారు వున్నా కూడా దాని గురించి రాయలేదు. కాకపోతే ఈ సిన్మాలో ఒక పాట నాకు భలే ఇష్టం. "*అందగాడు సంత కెళితే సందమామ సంకనెక్కే...ఎత్తుకోవాలా? దింపిపోవాలా? ఊరుకోవాలా? పారిపోవాలా?"* అంటూ ఎస్పీబీ, పీసుశీల పాడిన పాట. ఎస్పీబీ నోట్లో గోళీలు పెట్టుకుని పాడినట్లుండడం వల్ల కళ్ళు మూసుకుని వింటే ఇది ఏఎన్నారు పాటేమో అనిపిస్తుంది, కానీ తీరా కళ్ళు తెరిచి చూస్తే ఈ పాటకి ఆడేది రౌడీ వేషాలేసే బాలాజీ. అన్నట్టు ఈ పాట రెండో చరణంలో బాలాజీ పక్కన ఆడుతూ కనిపించిందెవరో తెలుసా? ఆర్టు సినిమాల అర్చన.

జయప్రద వుంది కదా అని ఆశగా చూసిన ఇంకో సినిమా "పాలు-నీళ్ళు". పెద్ద ఎస్టేటు ఓనర్ కూతురైన జయప్రద "డాన్సు, డాన్సు" అని కలవరిస్తుంటే వాళ్ళ నాన్న "పెళ్ళి చేసుకో, పెళ్ళి చేసుకో" అని పలవరిస్తే దానికి "చేసుకోను, చేసుకోను" అనేది కూతురు జయప్రద సమాధానం. తన కూతురు 22 ఏళ్ళు వచ్చే లోగా పెళ్ళి చేసుకోకపోతే ఆస్తంతా అనాథ శరణాలయానికి చెందేలా విల్లు రాసి చనిపోతాడు జయప్రద తండ్రి. జయప్రదేమో మెకానిక్కైన మోహన్‌బాబుని తనకేదో సాయం చేశాడని పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. ఆ మోహన్‌బాబుకి తన ఆస్తి ఇష్టం లేదని తన 22వ పుట్టినరోజు అయ్యేదాకా ఆగి తన తండ్రి రాసిన విల్లు ప్రకారం ఆస్తి సేవాసదన్ పాలయ్యాక మోహన్‌బాబుని పెళ్ళి చేసుకుంటుంది జయప్రద. పెళ్ళయ్యి, పిల్లాడు పుట్టాక డాన్సు నేర్చుకోవడం మొదలుపెడ్తుంది. పిల్లాడు పాక్కుంటూ వెళ్ళి పడిపోతున్నా పట్టించుకోలేనంతగా డాన్సులో మునిగిపోతుంది. ఇక ఇంట్లో గొడవలు. విడిపోవడాలు. జయప్రద హీరోయిన్నవడాలు. మధ్యలో బోల్డన్ని అపార్థాలు. కోర్టులో వాదనలు. మళ్ళీ చివరికి కలవడాలు. వెరసి ***పాలు-నీళ్ళు***.

ఇందులో ఏవో పాటలున్నాయి కానీ ఆశ భోస్లే ముద్దుముద్దుగా పాడిన ఓ పాట గురించి మాత్రమే చెప్తాను. అదేంటంటే "***ఇది మౌన గీతం...ఒక మూగ రాగం***" అంటూ మొదలయ్యే పాట. అందులో వున్న రెండు చరణాల్లో కొన్ని లైన్లు ఇలా వుంటాయి. (ఈ పాటలో జయప్రద కట్టుకున్న పసుప్పచ్చ బెనారెస్ చీర జిగేల్ జిగేల్, మెళ్ళో వేసుకున్న పొడుగాటి గొలుసు మిల మిలా.)

దొరకక దొరకక దొరికిన రోజు
దొరికీ దొరకక దొరకని రోజు
ఒకే ఒక్క రోజు – తిరిగి రాని రోజు

మిగలక మిగలక మిగిలిన రోజు
మిగిలీ మిగలక మిగలని రోజు
ఒకే ఒక్క రోజు – తిరిగి రాని రోజు

ఈ పాట ఇప్పటికి ఎన్నిసార్లు విన్నా...

పాడక పాడక పాడిన పాట
పాడే పాడక పాడని పాట
ఒకే ఒక్క పాట – అర్థమవని పాట

– అనుకోవడమే తప్పు ఈ పాట వెనక దాసరివారి కవిహృదయం పట్టలేకపోయా...

దానారా సినిమాల్లో నేను చూడాలనుకుని చూడలేకపోయిన సినిమా ఒకటుంది. అది "**కన్యాకుమారి**". అందులో ఒక మంచి పాటుంది. "***ఇది తొలిపాట...ఒక చెలి పాట... వినిపించనా ఈ పూట... ఆ పాట...***" ఆ పాట కోసం మాత్రమే చూడాలనుకున్నాను, ఆ పాట గురించే సిన్మా గురించి రాయాలనుకున్నాను కూడా. కానీ దొరకలేదు. ప్చ్!

నేను చూడాలనుకోకపోయినా చూసిన ఇంకో సినిమా "**సంగీత**". ఇందులో ఆర్. నారాయణ మూర్తి హీరో కాని హీరో. సినిమా ఆద్యంతమూ హీరోయిన్‌కి సిన్మా కష్టాలే వుండే ఈ సినిమాలో ఓ రెండు మంచి పాటలున్నాయి. ఒకటి "***ఆకాశానికి రవికిరణం ఆరని హారతి***" అనే పాట. ఇంకోటి "***ఎవరో నాతో అన్న మాట***" అంటూ కొడుకుల్ని కాయలు కాసే కొబ్బరి చెట్లతోనూ, ఆకుల్ని మేసే ఆవులతోనూ పోలుస్తూ రాసిన ఓ జావాలో స్విచ్-స్టేట్ మెంటులాంటి పాట.

బిడ్డను నమ్మితే ఏముంది?
చెట్టుని నమ్మితే ఎంతుందో...
కొబ్బరి చెట్టుని నమ్మితే ఎంతుందో!
తాగేందుకు నీరిస్తుందీ...
తినడానికి కాయిస్తుందీ...
వుండేందుకు నీడిస్తుందీ...
పోతే మోసేందుకు చాపిస్తుందీ...
మనిషిని కాల్చేందుకు కట్టెలనిస్తుందీ...
కన్నబిడ్డ ఏమిస్తాడూ...కన్నీళ్ళూ, కోపాలూ, తాపాలు తప్ప...

బిడ్డను నమ్మితే ఏముంది?
గోవును నమ్మితే ఎంతుందో...
గంగి గోవును నమ్మితే ఎంతుందో!
తాగేందుకు పాలిస్తుందీ...
పండేందుకు ఎరువిస్తుందీ...
శకునానికి ఎదురొస్తుందీ...
కసాయిలకు బలియౌతుందీ...
తాను చచ్చి మన కాళ్ళకు రక్షణనిస్తుందీ...
కన్నబిడ్డ ఏమిస్తాడూ...కన్నీళ్ళూ, కోపాలూ, తాపాలు తప్ప...

పై పాట విన్నాక రాయకుండా వుండలేక

రాయక రాయక రాసిన పాట
రాసీ రాయక రాయని పాట
ఒకే ఒక్క పాట...రాయలేని పాట...

అనుకుంటూ నే రాసీ రాయని పాట కాని పాట...(ఇందులో ఆట్టే అర్థాలు వెతక్కండి మరీ!)

బుక్కుని చదివితే ఏముంది?
సినిమాని చూస్తే ఎంతుందో...
డీవిన్నారు సినిమాని చూస్తే ఎంతుందో!
పాడేందుకు పాటుంటుందీ...
చూసేందుకు ఆటుంటుందీ...
చెప్పేందుకు డైలాగుంటుందీ...
పీక్కునేందుకు జుట్టుంటుందీ...
కోపమొచ్చి చింపేందుకు టిక్కెట్టుంటుందీ...
బుక్కు మనకేమిస్తుందీ...పేజీలూ, వాక్యాలూ, అక్షరాలు తప్ప...

ఇవే కాకుండా నాకు పాటలెంత నచ్చినా చూడలనుకోక చూడని సినిమాలు కృష్ణంరాజువి. ***కటకటాల రుద్రయ్య, సీతారాములు, గోల్కొండ అబ్బులు*** వగైరా. చూద్దామని మొదలుపెట్టి పూర్తి చెయ్యలేకపోయినవి ఎన్‌టీఆర్ సినిమాలు ***విశ్వరూపం, సర్దార్ పాపారాయుడు, బొబ్బిలిపులి***.

జయప్రద ఎంతో అందంగా వున్నా, పాటలెంత బావున్నా, నే పూర్తిగా చూసినా నే రాయలేకపోయిన ఓ దాసరి సినిమా "దీపారాధన". దీపం లాంటి జయప్రద చివర్లో కొండెక్కిపోయే ఆ సిన్మాకి అసలు "దీపారాధన" అన్న పేరు పెట్టడమేంటో అస్సలు నచ్చలేదు నాకు. చెప్పుకోవాల్సిన ఒకే ఒక్క విషయం కొత్త పెళ్ళి కూతురుగా మెరిసిన జయప్రద అందం, "ఆకాశం ఎందుకో పచ్చబడ్డదీ" అన్న పాట. ఆ పాట నచ్చిందీ అంటే అర్థం నాకర్థమయిందీ అని కాదు, వినసొంపుగా వుందీ అని మాత్రమే.

"కోరికలే గుర్రాలైతే" సిన్మా మొత్తం చూడలేదు కానీ అందులో నాక్కావల్సిన కవల-పాటని పట్టుకున్నా. "***ఏమి వేషం, ఏమి రూపం***" అన్న మోహన్‌బాబు-రమాప్రభల పాట ఎక్కడిదో తెలుసా? హిందీ "జూలీ" కి రాజేష్ రోషన్ చేసిన "***భూల్ గయా సబ్ కుఛ్...యాద్ నహీ అబ్ కుఛ్***"కి తెలుగు-కవల.

అన్నట్టు "జయసుధ" అన్న ఒక సినిమాలో వింతేంటంటే కథ, మాటలూ, పాటలూ, స్క్రీన్‌ప్లే, నిర్మాతా, నటనా అన్నీ దానారానే, దర్శకత్వం తప్ప. దర్శకుడు కె, వి. నందనరావు. ఇందులోనూ పాటలో రెండు బావుంటాయి – రమేష్ నాయుడిగారి పుణ్యమా అని. అవి "కనురెప్ప పాడిందీ కనుసైగ పాట" అనేదోటి. ఇంకోటేమో మురళీ మోహన్ గోడెక్కి వుండగా జయసుధ గ్రౌండు మీదుండి పాడే "గోరువెచ్చని సూరీడమ్మో" అనే పాట. ఈ పాటలో జయసుధ, మురళీమోహన్ కట్టుకునే మేచింగు తెలుపూ, పసుపూ చీరలు, పేంటూ-షర్టులూ బట్టలు బహు బాగు.

"కనురెప్ప పాడిందీ" పాటలో జయసుధ కట్టుకున్నవి రంగులు మారినా ప్రింటులు మారని చీరలు. అన్నట్టు ఈ పాటలో మురళీమోహన్‌కి గొంతునిచ్చింది జయచంద్రన్. నేను చాలా రోజులు జేసుదాస్ అనుకునేదాన్ని.

డీఎన్నారు-ఏఎన్నారు సినిమాల వరసలో చూడలేక చూసినా రాద్దామని పదిసార్లు అనుకున్నా రాయలేకపోయిన సినిమా ప్రేమమందిరం. ఇందులో బామ్మ నిర్మలమ్మ, సిన్మా అత్తగారు సుర్యకాంతం, సిన్మా రాధ రాజసులోచన, సిన్మా సీత జయప్రద – రాజరంజని, ఆంగ్లరంజని, సభారంజని, మధురరంజని అంటూ నాలుగు తరాల జనరంజకులుగా ఉండడం, అక్కినేని వారు మహా అమాయకుల్లాగా ఒక పాత్రలో, వయసుమళ్ళిన పిల్ల జమిందారుగా ఇంకో పాత్రలోనూ జీవించడం – చూడడంతో నా డీఎన్నారు సినిమాల సరదా తీరిపోయింది.

ఈలోగా ఇదిగో...ఇలా డిసెంబరూ వచ్చింది. నా డీఎన్నారు-చిత్ర వీక్షణా జనిత సరదా భరిత సితారా వ్రతం నేటితో ముగిసింది.

తన సినిమాలు బావుంటాయని అంటారే కానీ తన మాటలు, పాటలు ఎవరూ ప్రత్యేకంగా పట్టించుకోరు అని ఓ ఇంటర్వ్యూలో వాపోయిన డీఎన్నారుకి తన మాటలూ, పాటలు కోసమే నేనీ సినిమాలు చూశానని తెలిసే అవకాశమే లేదు కానీ...ఇక్కడ నేనో మాట చెప్పాలి. "అబ్బా! ఎలాంటి సినిమాలు చూస్తున్నావ్రా బాబూ!" అని నాలో నేను ఎంత విసుక్కుంటూ చూసినా ఒకే మూసలో ఎన్నో సినిమాలు తీసినా అంత సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కావడం సామాన్యమైన విషయం కాదు. అందుకే అంటున్నా... జయహో డీఎన్నార్! జయ జయహో దాసరీ!

ఈ సిన్మా సరదాకి ఆరంభమే కానీ అంతమనేది లేదు. ఇప్పటికి డీఎన్నారు. ఈ పాటి నవ్వు కాని నవ్వు నవ్వించే సినిమాలు తీసిన దర్శకులెందరో వున్నారు. మళ్ళీ కుదిరినప్పుడు ఇంకెవరివో కబుర్లు మోసుకుంటూ ఇట్టే వస్తా...ఇటే వస్తా...

ఈలోగా నలుగురు కూడి నవ్వేవేళల నా సరదా సిన్మాయణాన్ని ఓ సారి తలుచుకుని ఇంకొక్క నవ్వు ఎక్కువ నవ్వుకుంటారని అనుకుంటూ...నా ఈ సరదా కబుర్లకి ఊతమిచ్చిన దాసరి వారికి జేజేలు తెలుపుకుంటూ...

నా ఈ సరదాని "కౌముది" పాఠకులతో పంచుకునే అవకాశమిచ్చిన కిరణ్ ప్రభగారికి, కాంతిగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ...

ఇప్పటికి సెలవ్!

ఐఐఐ